**UNIVERSITY OF HYDERABAD**
**LIBRARY**
HYDERABAD (A. P.)

*Cl. No.* TL 81D R145 *Acc No.* 735

**DATE DUE**

DURATION OF LOAN-Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

24 OCT

14 MAY 88

SEP 2003

# తొలి పలుకు

(మొదటి కూర్పు)

అప్పుడప్పుడు పత్రికలలో (1942 మరియు 1954 సంవత్సరముల మధ్యన) వ్రాసిన వ్యాసాల సంపుటీకరణ మీ పుస్తకము.

ఈ వ్యాసాలను యేరికూర్చి పుస్తక రూపమున ప్రకటించవలెనని అభిప్రాయ పడిన మిత్రులు శ్రీ పులిజాల హనుమంతరావు, శ్రీ గడియారము రామకృష్ణశర్మగారలు. ఈ వ్యాసాలను సేకరించి వీనికి ఈ పుస్తకరూపమిచ్చిన శ్రమను పూర్తిగా శ్రీ గడియారము రామకృష్ణ శర్మగారు వహించిరి. ఈ పుస్తక ప్రకటనమును హర్షించి ఆదరముతో పీఠిక వ్రాసిన అప్పుడు గోలకొండ పత్రిక సంపాదకులు, ప్రస్తుతము ఆంధ్రసారస్వత పరిషదధ్యక్షులునగు శ్రీ నూకల నరోత్తమ రెడ్డిగారు.

ఈ మిత్ర త్రయమునకు నాయందుగల ప్రేమకు అంకురమైన మధుర చిహ్నము యీ గ్రంథము.

హైద్రాబాదు
మన్మథ వసంతము

దేవులపల్లి రామానుజరావు

# పీఠిక

## (మొదటి కూర్పు)

శ్రీ దేవులపల్లి రామనుజరావుగారు తెనుగు పాఠక లోకమున కందించుచున్న మరొక వ్యాస సంపుటియైన "సారస్వత నవనీతము"ను గురించి పరిచయము చేయుటకు పూర్వము వారిని గురించి ఒకటిరెండు మాటలు చెప్పుట అవసరము. హైదరాబాదు స్టేటులో తెనుగు కవులకు సంస్కృతాంధ్ర పండితులకు కొదువలేదు. చక్కని కవిత్వము చెప్పగలవారు పలువురున్నారు. కాని ఏదేని విషయముపై సరళ వచనములో వ్యాసములు వ్రాసి తాము చెప్ప నుద్దేశించిన విషయము చదుపరులకు సులభగ్రాహ్యము చేయగల వారి సంఖ్య చాల తక్కువయనిచెప్పక తప్పదు. ఈ లోటును పూర్తి చేయుగల కొద్దిమంది సమర్థులలో శ్రీరామానుజరావుగారు చేరియున్నారు. విద్యార్థిగా నున్నప్పుడును అటు తరువాత వారు పద్యరచన గావించినను ప్రస్తుత మావ్యవసాయము నితరులకు వదలి వేసి వ్యాసరచనయందు ప్రత్యేక కృషిసలిపి సఫలులైనారు. తెలంగాణా మండలి విమర్శకులలో వీరికి ప్రత్యేక గౌరవస్థానమున్నది. వీరివ్యాసములను ప్రచురింపని తెనుగు పత్రికలసంఖ్య అతిస్వల్పము.

"సారస్వత నవనీతము" లో శ్రీ రామానుజరావుగారు తామప్పుడప్పుడు యావదాంధ్రమండలి వివిధ పత్రికలలో ప్రచురించిన కొన్ని వ్యాసములను, సమీక్షలను, వ్యక్తి చిత్రణములను, కొన్ని సమావేశములలో చదివిన ఉపన్యాసములను చేర్చినారు.

"సారస్వత నవనీతము" శ్రీ రామానుజరావుగారి ప్రథమ ప్రయత్నము కాదు. ఇదివరకు వెలువడినవారి ప్రచురణలవలెనే "సారస్వత నవనీతము" కూడ ప్రజాదరణను బడయ గలదనుట నిస్సందేహము.

5-3-55

నూకల నరోత్తమరెడ్డి.

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | జానపద గేయములు | ... | 1 |
| 2. | స్త్రీల పాటలలోని కవిత్వము | ... | 11 |
| 3. | శృంగారకవి పోతన | ... | 20 |
| 4. | క్షేత్రయ్య శృంగారము | ... | 26 |
| 5. | క్షేత్రయ్య నాయికలు | ... | 32 |
| 6. | సూరన కళాపూర్ణోదయము | ... | 38 |
| 7. | ముద్దుపళని - రాధిక | ... | 45 |
| 8. | నవ్యసాహిత్యమున వీరకావ్యములు | ... | 50 |
| 9. | వేయిపడగలు | ... | 58 |
| 10. | మునిమాణిక్యంవారి కాంతం | ... | 69 |
| 11. | దీక్షితులుగారి వటీరావు | ... | 76 |
| 12. | శ్రీ రాయప్రోలు సుబ్బారావు | ... | 87 |
| 13. | తృణకంకణము | ... | 96 |
| 14. | నవ్యకవితా నీరాజనము | ... | 102 |
| | ,, | ... | 112 |
| | ,, | ... | 126 |
| | ,, | ... | 148 |
| 15. | చిలకమర్తివారి రచనలు | ... | 161 |
| 16. | ప్రకాశంగారి స్వీయచరిత్ర | ... | 166 |
| 17. | స్వర్గీయ సురవరము ప్రతాపరెడ్డి | ... | 175 |
| 18. | గురుదేవుడు రవీంద్రుడు *i* | ... | 181 |
| 19. | గురుదేవుడు రవీంద్రుడు *ii* | ... | 185 |
| 20. | కవయిత్రి తోరూదత్ | ... | 191 |
| 21. | లాలా లజపత్ రాయ్ | ... | 195 |

22. మౌలానా అబుల్ కలాం ఆజాద్ ... 201
23. కళ ... 204
24. మన కళాసంపద-సాహిత్యము ... 210
25. వాఙ్మయము - జాతీయోద్యమ ప్రభావము ... 217
26. ఆంధ్రదేశములోని రైతు - సాంస్కృతిక జీవనము ... 228
27. గ్రామాలలోని వేడుకలు - క్రీడావినోదాలు ... 234
28. జానపదనృత్య సంగీతాలు ... 243
29. గాలిబ్ గీతాలు ... 248

# జానపద గేయములు

వ్రాతపూతలెరుంగని సామాన్య జనులు రసోద్రిక్తులై ఆలపించు మధుర భావగేయములు జానపద గీతములు. ఈ గేయములు సాధారణముగా ఖండకావ్యములవలె పరిమిత పరిమాణముకలవి. ఇందలి భాష వ్యాకరణ బద్ధమైనది కాదు. కృత్రిమరహితములై మిక్కిలి సహజములగు నీ గేయములందు వేదాంత వాసనగాని, తాత్వికవిభూతిగాని, అంతగా కానరాదు. వివాహవేళలు, వరికోతల సమయాలు, వెన్నెల రాత్రులు, పర్వదినోత్సవములీ జానపద గేయములకు జనన కాలములని చెప్పవచ్చును. పల్లెపట్టులలో, అనాగరక గృహాము లందలి కృత్రిమరహిత, నిష్కల్మష, వాతావరణమునకు ప్రతిబింబములీగేయములు. వీని యందు ఒక అనిర్వచనీయమగు ఆనందము, రామణీయకత, గోచరించును. పదములలో సహజమగు ఉద్రేకము, ఆనందదాయకమగు సరళత, ఉట్టిపడుచుండును.

సంస్కృతి, నాగరికత, అభివృద్ధినంది పల్లెలు పట్టణములుగా మారినవి. ఈ మార్పువలన జానపద గేయములందును కొంత మార్పు కలిగినది. వాని భాష ఎక్కువ సలక్షణమై, వ్యాకరణ బద్ధమై యొప్పినది; అందలి యితివృత్తములుగూడ ఉన్నతకుటుంబములకు, ధనిక వర్గములకు సంబంధించినవై యొప్పినవి. మనము అనుదినము మాట్లాడుకొను భాషలో వ్యక్తీకరింపబడిన యీ చిన్న గేయములందు అవ్యక్తమగు నొక రామణీయత గలదు. కొన్ని కొంత అసభ్యముగ నుండి, అసహ్యము కలిగించినప్పటికిని, విముఖులను మాత్రము చేయవు. ఇందుకు కారణమేమి? సాహిత్యశిల్పమా? కాదు. ఉదాత్తమగు ఇతివృత్తమా? కాదు. సాధారణముగా ఇవి మిక్కిలి చిన్నవై అకస్మాత్తుగా ముగియుచు, కొంతజాగ్రత్తగా పరిశీలించినచో, మన మెంత విద్యావంతుల మైనను, మనమెంత విజ్ఞానము నార్జించినను,

కలదు. వివాహ సందర్భమున వధూవరులకు మధ్యనున్న పరదా తొలగింపగా ప్రప్రథమమున వధూవరులొండొరులను జూచుకొను నప్పుడు పాడుపాటలు మధురభావోపేతములు. శోభనపుగదిలోనికి వధూవరులను పంపునపుడు సుందరాంగులు మందహాసముతో పాడుపాటలు రసోన్మత్తత కలిగించునవిగా నుండి ఆ పడుచు స్త్రీల మధ్య నొంటరిగా నున్న ఆ వరుని పరిస్థితిని వ్యక్తీకరించుచున్నవి.

"ఓనల్లనికాకి ! ఈ మంచి ముత్యమును నీవెట్లు సాధించితివి ?" అని అన్యాపదేశముగా వరుని పరిహాసించి నవ్వించు నీ పాటలకు, తలుపు దగ్గరి పాటలకును దగ్గరి చుట్టరికము కలదు. శోభనము రెండవ నాడో, మూడవనాడో వధువు గదిలో ప్రవేశించి తలుపు దగ్గరవైచుకొనగా వరుడువచ్చు సన్నివేశము యీ పాటలకు మూలాధారము.

> తలుపుతీయవె భామా–నే ద్వారక ధాముడనే భామా
> జాజిపువ్వుల సరములుతెచ్చితి – గొజ్జగిపువ్వుల గుత్తులు దెచ్చితి
> జాజిపువ్వులవి సత్యకు కావలె–గొజ్జగి పూలవి కోరును రుక్మిణి
> ద్వారక కేయుడ దారులు లేవోయీ.

అనునది ఒక మచ్చు తునక.

"నిలువజాలని జాళిని తూలుచు, కలికిరో నిను కలియవచ్చితిని, పలుకులను పన్నీరుచుక్కలుచిలుక పలుకగదవే, పచ్చితేనెలు పొంగి, వరదలుపారు నీ చిగురాకువాతెఱ, వెచ్చవెచ్చగ ద్రాగినది నావిరహ దాహము తీరు టెటులో ?" అనునది మరొక యుదాహరణము. ఇందులో కొన్ని ప్రకృతి పురుషుల లీలావిలాస పరముగా వేదాంత తత్వమును వివరించునవి. కాని వీనిలో యెక్కువ ప్రణయ సాగరము నీదుపడుచు జంటల శృంగార విలాసమునకు సంబంధించినవే. ఈ శృంగార సంబంధములగు పాటలు వివిధములుగా నున్నవి. "ఓరోరి బండివాడ, ఒంటెద్దు బండివాడ, నిలుపు నీబండి, ఆపు నీబండి."

వలవల నడవగ, జానకి వణకసాగెను, రామచంద్రా
తలుపు దగ్గర, సీత గుండెలు, తటతట సుడిదిరుగా
సిగ్గు చెండాడగా, స్రుగ్గిమగ్గిసలయి- భయపడె, రామచంద్రా
అంగుళిగల, రత్నవుటుంగరమటు, దొంగలించి
అంగనవో, నాయుంగరమదే, అందింతువె యనె రామచంద్రా,"

సరళములు, సభ్యములు, స్వభావ సుందరములు నగు నీపంక్తులు వినువారిని పులకాంకిత గాత్రులను గావించి మరల నొక్కమారు శోభనపు పెండ్లికొడుకులనుగా జేసితీరును. కళా సౌందర్యము ప్రతిఫలించు నీ ఘట్టమును ప్రబంధకవుల శోభన వర్ణనతో పోల్చినప్పుడు లాక్షణికుల యాజ్ఞా ప్రకారము చి[illegible]న ఆ పటముకన్న యీ చిత్రము యెంత మనోజ్ఞతరము సహ[illegible]మున్నై యున్నదో గోచరించితీరును. ప్రబంధముల యందలి [illegible]నాస కృత్రిమములై, పాడినదే పాటగా, కొంతవరకు [illegible] భావనీయగా, కూడ నుండును. కాని యీ పాటల యందలి [illegible]లకించినా వర్ణనలు మనల నానందడోలికల యందు ఉయ్యాల లూగించుచున్నవి.

ధర్మరాజు జూదము, ఈ పెద్దపాటలలో పేర్కొనదగినది. జూదమునొక కళగా మన పూర్వులు భావించిరి. ఈ ధర్మరాజు జూదమునందు జేష్టాదేవికిని, లక్ష్మిదేవికిని మధ్య జరిగిన సంభాషణ కొంత వింతగాను అస్వాభావికము గాను కానుపించుచున్నది. కొన్ని పనులు జేయుట వలన ప్రజలను లక్ష్మిదేవి వదలిపెట్టి తన అక్కగారి యేలుబడి కప్పగించవలెనని జ్యేష్టాదేవి తన చెల్లెలిని అర్థించి సమ్మతింప జేయుట కొంత వింతగానే యున్నది.

ఈ పనులు జేయుటవలననే ధర్మరాజు కూడ ఓడిపోయినట్లు తెలియుచున్నది.

''చేటలోపల పండ్లు చెరిపిన్న నాడు, మంచంబు ఓరగా పెట్టినా, నాడు,
అరికాలునిండుగా తడువనీనాడు, నాడు నిను కొలువనని పలికితీ నేను''
''అలికి విడిచిన గడప దాటడేరాజు, దివ్వెలేసి గృహాన తిరగడే'' అతడు
నీరాడలేనింట నిలుపడే తల్లి, ఆడి మిగిలిన జలము లాడడేరాజు
కట్టి విడిచినగుడ్డ కట్టడేరాజు, జంటగా పెండ్లిండ్లుశాయడేరాజు
ఒడిలోన పువ్వులు కోయడే అతడు,''

అని దారిద్ర్యకారణములు వివరింప బడినవి.

(1946)

—: ♦ :—

# స్త్రీల పాటలలోని కవిత్వము

"ఏడువకు యేడువకు వెఱ్ఱినాగన్న, ఏడిస్తె నీకండ్లు నీలాలుగారు
నీలాలుగారుతే నే జూడలేను, పాలైనగారవే బంగారుకండ్లు."

అని యే చల్లనితల్లి, తీయని యెలుగున, యెప్పుడు, తొలిసారిగా యుయ్యాల నూచినదో కాని, ఆ రమణీయ గేయము వినినప్పుడెల్ల యేదో యొక యనిర్వచనీయమైన రసానుభూతి కలిగి ముగ్ధులమై మరియొక్కమారా గేయమును విన నువ్విళూరుచుందుము.

## సంగీత సాహిత్యములు

సంగీత సాహిత్యములు శారదాదేవికి స్తనద్వయమని వర్ణించుట మన సాహితీ సంప్రదాయము. శారద సమస్తవిద్యా ప్రదాయినియే కాదు. సకల కళాస్వరూపిణికూడ; సూరనార్యుడు సరస్వతీ చతుర్ముఖ విలాస వర్ణనావసరమున, భారతీదేవి, గళస్వనమున నపురూప మాధుర్యము నొలికించినాడు.

మున్నెన్నడు కనివిని యెఱుంగని యా కోమల గళస్వ నాలకించి "మరియొక్కమారు", మరియొక్క మారని చతురాస్య ఇది కొసరి. కొసరి యామెను ప్రార్థించినాడు. ఎన్నది

కమల సంభవుడు ఆ గళస్వనమాధుర్యమునకు కాబోలు, చక్కెరబోడుల కంఠములందు మ్రదనము కావుననే సంగీత మెలనాగల స్వత్వ మిక్కిలి రమ్యములు. వీనిలో

సంగీతమే యననే పణాచాతుర్యము స్తవనీయము. నాయిక పణా చాతుర్యము ంచియుండ నాయకు డామెను ప్రసన్న నొన ములు వారి వే యువర్తనము సమర్థించుకొనుయత్న మాపాటలకు తెనుగు నిక్క జిలుగు బంగరు చీరలు, రత్నములు దాపిన రవికెలు, యున్నది మరువము మున్నగు విలాసవస్తువులు లంచమునిచ్చి, ఆమె

యనుగ్రహము నపేక్షించును. కాని యామెమాత్రమిది వేళగాదని కచ్చితముగా పలుకుచున్నది, చూడుడు :-

"జిలుగు బంగరుచీరెలు దెచ్చితిని సమ్మతిపడవే భామా"
"జిలుగు బంగరుచీరెలు దెచ్చితె వేళగాదు పోవోయి."
"సత్యభామ. నీచక్కని జడలకు జాజులైన ముడిచేనే, విరజాజులైన
ముడిచేనే"
"జాజులుముడిచే సకియలుమాకు చాలగలరుపోవోయి"
"వనితరో వినవె సత్యభామ నీపాదములకు మ్రొక్కెనే"
"అవతలి వీధిన రుక్మిణియున్నది ఆయుష్మంతుడవోయి.
దీర్ఘాయుష్మంతుడవోయి."

తుదకు ఎట్లో తలుపు తెరచి లోనికి రానిచ్చినది. సఖుని సందర్శనమైనంతనే సకియకు సందేహములెక్కువైనవి. ప్రత్యక్షముగ గన్పట్టు రతిచిహ్నములను గాంచి యూరకుండలేక పోయినది. అప్పుడు వారి సంభాషణ:-

"గోవిందుడ నీచక్కని గోటికొనలు కందెనేమోయి"
"గోవర్ధనగిరి పర్వతమెత్తితె గోళ్ళుకందెనె భామా"
"సరసిజాక్షు నీ అధరము నొక్కిన సారసాక్షి ఎవరోయి ?
ఆ సారసాక్షి ఎవరోయి ?"
"తరుణీరో అది యొక ఫలమని చిలుకలు తగిలిపొడిచెనే భామా"
"వరదుడ నీ చెక్కుల నెలవంకలున్న వేమోయి ?"
నెలవంకలున్న వేమోయి ?"
"గోరువంకలు పట్టుకరాగా, గీరికెనె యవి ముద్దులగుమ్మా"
"సారసాక్షు నీ మేన తెల్లని చందనమెక్కడిదోయి ?"
"పూలతోటలో విహరింపగ పుప్పొడిరాలెనె తరుణీ,
ఆ పుప్పొడిరాలెనె తరుణీ"
"పూలతోటలో విహరించుటకు పోయిన కారణమేమోయి ?"
ఆ పోయిన కారణమేమోయి ?"
పావురము దప్పించుకపోగా పట్టబోతినే చెలియా,
పట్టబోతినే చెలియా !"

"దేవదేవ నీ బుగ్గను, కాటుక దిద్దిన సఖి, ఎవతోయీ !
ఆ దిద్దిన సఖి యెవతోయీ ?"
"గ్రక్కున చెమటకు గారిన కస్తురి చుక్కబొట్టు, వో మగువా !
అది చుక్కబొట్టు వో మగువా !

ఈ సుకుమార శృంగార చిత్రము ముందు ప్రబంధాదుల యందలి వర్ణనలు నిస్తేజములుగదా ! గోరువంకలు పట్టుట, పావురములతో నాడుట, చిలుకల పలుకులు వినుట, రసికుల కాహ్లాదకరములగు క్రీడలు గాబోలు! అన్యదేశీయ దాస్యముచే చైతన్యముడిగిన మనకు కుక్కలను బెంచుట, వాసనహీనములగు కాగితపు పూలను, ముడిచి కొనుటయే నాగకరికతా లక్షణమగుట ఎట్టి విపరీతము, దౌర్భాగ్యము!

## కుమార్తెపై గారాబము

చిన్ననాట నుండియు మిగుల గారాబముతో బెంచిన ప్రియ కుమారిక నత్తవారింటికంపు సందర్భమున కన్నీళ్ళతో :-

"ఎన్నడు నినువిడిచి యెడబాయనైతి,
కన్నతల్లిరో నేను గడతేరు టెట్లు ?
బొమ్మరిండ్లనుగట్టి పొలతులా బిలిచి
అమ్మరో యెవరింక ఆటలాడుదురు ?
వేడ్వేరు బొమ్మల పెండ్లిండ్లు జేసి
చిట్టిబొట్టు నోములా చేడెల గూడి
ఎవ్వార లికను మా యింట నోచెదరు ?
నెయ్యగత్తెలగూడి నిండు వేడుకను
ఉయ్యాల లెవ్వార లూగుదురింక"

అని మాతృప్రేమ ముట్టిపడునట్లు వచియించు సన్నివేశమెంత రసస్ఫోరకము ?

## చెలికత్తెల పరిహాస వాక్యములు

వీరి పాటలలో మంగళహారతులకు మేలుకొలుపులకు ముఖ్య స్థానము కలదు. పురాణగాథలు—అందుముఖ్యముగా రామాయణ కథను మన స్త్రీలెన్నియో విధముల తనవిదీర పాడుకొందురు. సీతమ్మ వారికి ఇలవేలుపు. ఆమె కల్యాణ సందర్భమున పేరంటాండ్రు తమలో తామాడుకొను పలుకుల నొకమూ రాలకింపుడు :-

"పడతి నీకందమే పట్టంచుచీరె.
మణివతక మొక్కటి మగువ మాయవె
ఎక్కడిదె యీచీర, యింతిరో నీకు
మ్రొక్కగా, నావిభుడు మొన్న దెప్పించె
ఎలనాగ యెక్కడిదె, యీ బన్నసరము
వెలబెట్టి చేయించె. వెలది నా విభుడు
ఓ సెమ్మ, నీకింత యొయ్యార మటనె
చూచిన నెవరైన, సోరిది నవ్వేదరు
పయ్యెద జారెను, పద్మాయతాక్షి
చయ్యన పతివచ్చె సవరించుకోనవె."

అను సహజాపాతరమణీయోక్తులు శ్రోత్రరసాయనములు కదా !

కల్యాణసందర్భమున సీతమ్మకు జేసిన యలంకారము కనుల గట్టునట్లు వర్ణింపబడిన దీ పాటలయందు.

## రూపవర్ణనా చాతుర్యము

ఈ పాటలలో రూపవర్ణనాచాతుర్యము మిక్కిలి ప్రశంసనీయము.

"చేమంతి రేకులే చెలియచెక్కిళ్ళు
దానిమ్మగింజలే తరుణి పల్వరుస"

అనునదొక చిన్నయుదాహరణము. తన చెల్లెండ్రతో శాంతా సమేతయైన సీతమ్మను రామచంద్రుడు కొంతదూరమునుండిచూచి శత్రుఘ్నునితో:

"చుక్కలలో బాలచంద్రుడున్నట్లు
కొలువయి కూర్చున్న మన యక్క జూడు
అందరి లోపల సుందరి ననుచు
అష్టవంకర్లతో మీ వదినె జూడు"

అని పల్క, నా యనుజన్మడు.

"ఆదిలక్ష్మి సీత ఆ లోకమాత" అని వదినగారిని ప్రశంసించును. సీతమ్మ యాంధ్ర సుందరుల పాలిటి యమృతావతారము, కాననే యెన్నడో! పాపరాజు :-

"జననీ! నీవు మహాపతివ్రతవు. నీ సౌశీల్య మిల్లాంధ్ర కెల్లను మేల్బంతి" యని ముక్తకంఠముతో కీర్తించినాడు.

ఆ లక్ష్మణుడన్నగారితో వనవాసమొనరించిన పదునాలుగేండ్లును, పాపము సాధ్వీమణి ఊర్మిళాదేవి అన్నపానములు వర్జించి సుషుప్త్యవస్థలో నుండెనట. తిరిగి సౌమిత్రి అయోధ్యానగరమునకు వచ్చినది కూడ ఆమెకు స్మృతియే లేదు. ఆ యవస్థలో లక్ష్మణుడు భార్యకడకేగి ప్రక్కనకూర్చుండగా, నామె :-

"అయ్యో మీ రెవరయ్యా మీరింత
యాగడంబుల కొస్తిరి.
సందుగొందులు వెదుకుచూ మీ రింత
జంకులేకట కొస్తిరి,
ఎవ్వరును లేనివేళ మీరిప్పుడేకాంతముల కొస్తిరా?
మా తండ్రి జనకరాజు వింటె మిము నిప్పుడాజ్ఞ సేయగా మానరూ
మాయక్క బావవిన్నా. మీకిపుడు ప్రాణాలకే హానివచ్చు
మాయక్క మరిది వింటె, మిమ్మిపుడు బ్రతుకనివ్వరు జగతిలో
హెచ్చయిన వంశానికి, అపకీర్తివచ్చె నేనేమి సేతూ"

అని దుఃఖ పౌరుషములతో, క్షత్రియాంగన కావున, రోష కషాయితాక్షియై వచించెనట.

శాంతమ్మ యచ్చముగా నాంధ్రులయింటి ఆడుబిడ్డ. ఆమెకు మరదంద్రతో పరిహాసమాడుటయన్న మిక్కిలి ముచ్చట కావున, యూర్మిళను గూర్చి యామెయక్క చెల్లెండ్లతో—శాంతమ్మ :

"పసిడిపానుపున సొలసియుండే
ఉండె నొక పదునాలు గేండ్లు పడతి
కుందనపు ప్రతిమ కళలు
ఈ కళలు యెందుండి దాగున్నవో,
దృష్టి తగులకుండా నీలాల
నివ్వాళు లివ్వరమ్మా"

అని మందహాస మొనరించినది. అపుడు సీతమ్మ చెల్లెలి పక్షమున శాంతకు :

"ఇంద్రాది చంద్రులను వలపించేటి
చంద్రులూ మీ తమ్ములూ
దృష్టితగులకుండా, నీలాల
నివ్వాళు లివ్వరమ్మా"

అని వదినెగారు గావున, వినయ సహితమగు ప్రత్యుత్తర మిచ్చినది. అయితే శాంతమ్మ యంతతో మిన్నకొనలేదు.

"అక్క చెల్లెంద్రు మీరూ
మిక్కిలీ సౌందర్య శాలులమ్మా
మా తమ్ములను వలపించేటి
జాణలకు దృష్టితగులూ"—

అని మాటకు మాట వచించినది.

సీత కల్యాణ సందర్భమున వడ్డించిన భక్ష్యవిశేషములు శాక పాకములు నోరూరజేయును. పట్టాభిషేక కాలమున శాంతమ్మ ముద్దులమరదలగు నూర్మిళతో పరిహాసమాడకుండ నుండలేక పోయినది.

"నిద్రబోయిన పదునాలుగేండ్ల మధ్యలో
భుజియింపకున్నట్టి భూమిశుదేవి
చాలనేపాయసము, మేలయిన పిండివంటలు
సంతుష్టిగా గుడిచి, సరయూనదీ నీళ్ళు
వాంఛతో తాగవే, వచ్చె లక్ష్మణుడు
నిర్విచారము, లేదు నిద్ర, యీ రాత్రి
సరసమాడావలెను సౌమిత్రితోడ"

అని చిరునవ్వును చిలుకరించినది.

(1940)

# శృంగార కవి పోతన

శ్రీనాధ పోతనలు బావ మరదులనియు, సమకాలికులనియు ప్రతీతి. ఆ వరుసతో మనకేమి: అందలి సత్యము చారిత్రకు తెరుంగుదురు; ఈ ఉభయులలో శ్రీనాధుని కవిత్వము శృంగార రసపూర్ణమైనదనియు, బమ్మెర పోతన కవిత్వము భక్తిరస పూరితమైనదనియు సాధారణముగా లోకులవాడుక. కాని నిజమారసినచో యీ వాడుక మాత్రము సంపూర్ణమైన సత్యము కాదని స్పష్టమగు చున్నది. శ్రీనాధుని భీమేశ్వర పురాణము, కాశీఖండము భక్తి సంపన్నములు. పోతనామాత్యుని భాగవతములో భక్తితోపాటు శృంగారరసము వెల్లివిరియు చున్నది. అక్కచెల్లెండ్ల వంటి యీ రెండు రసములను సమానముగా ఆదరించి పోషించిన ఆంధ్ర కవులలో బమ్మెర పోతన ప్రముఖుడని భాగవతము నందలి ప్రతిస్కంధము ఋజువుచేయుచున్నది. వాస్తవము విచారించినచో సుకుమారమైన శృంగార చిత్రణము నందు పోతనతో సమానుడైన తెలుగు కవి మరొక్కరులేరని తోచుచున్నది.

ఏ కొంచెము అవకాశము కలిగినప్పటికిని, శృంగార రస పోషణమునకు పోతన కలము ముందుకు దుముకు చుండును. గాఢమైన భక్తిచే ఆవేశము పొందిన సందర్భాలలో కూడ పోతన హృదయము శృంగార భావములతో ఉప్పొంగిపోయిన ఉదాహరణల నెన్నియైన చూపించ వచ్చును. ఒక్క మాటలో చెప్పవలె నన్నచో పోతన శృంగార మాధుర్యము, వైవిధ్యము ఆంధ్ర భాషలోని మరొక గ్రంథమునందు కనుపించదు. శ్రీనాధుడు మహాకవియే; తెలుగు దేశమును, తెలుగు నదులను, తెలుగు ఆచారములను కవితాదర్పణమున మనోహారముగా ప్రతిబింబింపజేసిన కవిసార్వభౌముడే. ఆయన ఆంధ్రుల యింటి షడ్రసోపేత భోజనమును నోరూర, నోరార వర్ణించిన కవులలో అగ్రగణ్యుడు. కాని శృంగార రసచిత్రణము నందు మాత్రము

పోతనతో శ్రీనాధుడు సమానుడు కాడని నిస్సంశయముగా చెప్ప వచ్చును. అంత మాత్రాన శ్రీనాధ కవీంద్రుని వాసి తగ్గవలసిన ఆవశ్యకత అవంతయులేదు. శ్రీనాధుని శృంగార రచనలను పరిశీలించిన అది సమకాలిక సుందరీమణుల రూపు రేఖలను, కప్పు కొప్పులను, చక చకలను, తళ తళలను, పై మెరుగులను వర్ణించుట వరకే పరిమితమైనట్లు కనుపించుచున్నది. రూపవర్ణనతోడనే శ్రీనాధునిలో భావచ్యుతి జరుగుచుండును. విలాస విభ్రమాలను, శృంగార క్రీడా విశేషాలను, అపూర్వ మధుర సన్నివేశాలను, హృదయము నుండి ఉత్కటముగా దూసికొనివచ్చు ప్రేమ భావాలను చిత్రించుటలో పోతన్నతో శ్రీనాధునకు పోలికయే లేదు. శ్రీనాధుని నైపుణ్య మంతయు ఆకార వర్ణనతోనే ఆగిపోవు చుండును. ఇందుకు యీ ఉభయుల రచనల నుండి యెన్నియైన నిదర్శనాలను పరి చూపించ వచ్చును.

పోతన చిత్రించిన శృంగారము విలక్షణమైనది; మధుర భావోపేతమైనది. అపూర్వమైన శృంగార ఘట్టములను, విలాస భావాలను ప్రదర్శించుట యందు పోతన కలమునకు గల నేర్పు అద్వితీయమైనది. శృంగార చిత్రణకు పోతన కలిగించుకొను అవకాశములు కూడ ఇతర కవీశ్వరులకు తెలియని పరమ రహస్యములు. ఈ దృష్టితో భాగవతములోని ఇష్టదేవతాది ప్రార్థనమునే పరిశీలించి నప్పుడు మొట్ట మొదటి పద్యములే మనము చూపించగల చక్కని మచ్చుతునకలు. పోతనామాత్యుని సరస్వతీదేవి చంచరీకచయసుందర వేణి; సైకతశ్రోణి; తోయజాత భవచిత్త వశీకరణైక వాణి; వామనమూర్తికి మూడడుగుల నేల ధారపోయునప్పుడు; ఆ దానమును గ్రహించు భగవంతుని హస్తము "ఆదిన్ శ్రీసతి కొప్పుపై తనువుపై అంసోత్తరీయంబుపై, పాదాబ్జంబులపై కపోలతటిపై, పాలిండ్లపై నూత్నమర్యాదం జెంది వెలుంగు" కరమని బలిచక్రవర్తి భావించుటలో బమ్మెర పోతన శృంగార హృదయము తొంగి చూచుచున్నది! లావొక్కింతయులేక, ధైర్యము

విలోలమైన గజేంద్రుని రక్షణకు పరుగులెత్తుచున్న పరమేశ్వరుడు వైకుంఠపురము నందలి సౌధములోని రమా వినోదియట; వివాద ప్రోద్ధత శ్రీకుచోపరిచేలాంచలముతోనే ఆయన వెంట వెళ్లు శ్రీదేవి సౌందర్యమును గమనించుడు ! ఆమె తాటంకములు చలించుచున్నవట; ధమ్మిల్లబంధము భుజము మీద నటించుచున్నదట. అదృఢముగా నున్న చంచత్కాంచితో శాటీముక్తకుచముతో ఆ తరుణమున ఆయమ్మ కోటీందు ప్రభతో వెలిగినదట. ఇటువంటి మనోహర దృశ్యములను చిత్రించినవారు ఆంధ్ర కవులలో యెంతమంది కలరు ? శ్రీనాథ రచనలలో ఇటువంటి సన్నివేశము లెక్కడ ?

ఆంధ్రుల అభిమాన నాయికయైన సత్యభామను సహజ పాండిత్యుడు చిత్రించిన నేర్పు అద్వితీయమైనది. తెలుగు సారస్వతములో ఇంతచక్కని చిత్తరువు ఇంకొకటి కనుపించదు. సత్యభామ బహు సుకుమారి; బొమ్మ పెండ్లిండ్లకు పోనొల్లనను బాల; మగవారి గనిన మరుగుజేరెడు ఇంతి, పసిడి యుయ్యెల లెక్క భయపడు భీరువు; సఖుల కోలాహలధ్వనము లోర్వని కన్య, వీణ చక్కగబట్టు వెరవెరుంగని కొమ్మ; మ్రాకున తీగె గూర్పగనేరని లేమ; సరవి ముత్యము గ్రుచ్చజాలని అబల; చిలుకకు పద్యము చెప్పనేరని తన్వి, అయినప్పటికిని హృదయేశ్వరుని సముఖమున వీరనారీమణియై, రాక్షసేశ్వరుని మీద విజృంభించినది. అప్పటి ఆమె సొగసును పోతనయే వర్ణించవలెను. మరొక కవీశ్వరునకది శక్తికి మించినపని; ఆమె సౌవర్ణ కంకణ ఝుణ ఝుణ నినదములు శింజనీరవముతో చెలిమి సేయుచున్నవి. తాటంక మణిగణ ధగధగ దీప్తులు గండ మండల రుచిని కప్పి వేసినవి. ధవళతరాపాంగ ధళధళ రోచులు బాణజాల ప్రభాపటలి నడపుచున్నవి. శరపాత ఘుమఘుమ శబ్దము పరిపంథి సైనిక కలకల స్వనము నడుపుచున్నది. వీరము, శృంగారము, భయము, రౌద్రము, విస్మయము కలిసి ఆకారము దాల్చిన భామినివలె ఆమె మనకు ప్రత్యక్ష మగు

చున్నది.. ఒక వైపున వీరము, ఇంకొక వైపున శృంగారము ఆమె యందు మూర్తీభవించినవి. ఆమె పరుని జూచినప్పుడు ఒక పద్ధతి; వరుని జూచి నప్పుడు మరొక పద్ధతి; ఏకకాలమున "నొంప మరియు నలరింప" ఆమె సమర్థురాలు. ప్రాణేశ్వరుని జూచి నప్పుడు సొంపు, నరకాసురుని జూచినప్పుడు కెంపు ఏకక్షణమున ఆమె కన్నులలో కనుపించుచున్నవి. ఆమెమోము హరికి రాకేందు బింబము; అరికి రవిబింబము, ఆమె చేలాంచలము హరికి కందర్ప కేతువు అరికి ఘన ధూమ కేతువు, ఆమె సందర్శనము హరికి అమృత ప్రవాహము అరికి అనల సందోహము.

కేవల రూపకల్పన యందేకాదు; భావచిత్రణమందును పోతన అద్వితీయుడు; ఆయన చిత్రించినన్ని శృంగార భంగిమలు, క్రీడలు, విలాసభావములు ఇంకొకరు చిత్రించలేదని చెప్పినచో సత్యమునకు తల వంపులు కలుగజాలవు. కుబ్జా కృష్ణుల క్రీడా విశేషము, ఉషానిరుద్ధుల ప్రణయము, రుక్మిణీ కృష్ణుల కేళీవిలాసము మొదలైన ఘట్టములు పోతన్న చిత్రించిన శృంగార వైవిధ్యమునకు చక్కని తార్కాణములు. రుక్మిణీదేవితో శ్రీకృష్ణుని విరసోక్తులు, ఆ విరసోక్తులతో నొప్పి జెందిన ఆమె హృదయము, ఆ హృదయములోని భావాలు ప్రత్యక్షమగుచున్న ఆకారము, పోతన చిత్రించిన అపురూప శృంగార ఘట్టములలో నొకటి. ఇటువంటి సన్నివేశములు ఇంత రమణీయముగా చిత్రించిన తెలుగు కవీశ్వరుడు ఇంకొకరు కనుపించరు. సూరన అయిదు తీరులు శృంగార మును చిత్రించినాడట కాని పోతన అరువది రీతుల శృంగారమును చిత్రించినాడు.

శ్రీకృష్ణుని గోకుల విహారము, గోపికా వస్త్రాపహారణము, రాసక్రీడలు, ఆ సందర్భాలలో మధురమూర్తులైన ఆ గోపికల చిత్త వృత్తులు, సరస సల్లాపములు, అలుకలు అన్యాపదేశములు, అనునయ

ములు, ప్రణయకోపములు ఆంధ్ర శృంగార వాఙ్మయమున అద్వితీయ ఘట్టములు. ఈ భాగములోని ఒక్కొక్క పద్యము ఒక్కొక్క రత్నము. ఇవి సామాన్య మైన రత్నములు కావు. అన్నియును జాతి రత్నములు; సానలదీరిన రత్నములు. నల్లనివాడు, పద్మ నయనంబుల వాడు కృపారసంబుపై జల్లెడువాడు, మౌళిపరిసర్పిత పింఛమువాడైన శ్రీకృష్ణుని గోపికలు ఒకానొక శరద్రాత్రినిచేయు అన్వేషణ, ఆ సందర్భమున విరహాతప్తలైన గోపికల హృదయాలనుండి ఉబికి కొని వచ్చిన ప్రేమభావాలు బహురమ్యముగా చిత్రించినాడు బమ్మెర పోతన. గోపీ కృష్ణుల క్రీడా విశేషాలను కనులకు గట్టినట్లు అతిసుకుమారముగా మనయెదుట ఆయన ప్రదర్శించినాడు. గోపాలకృష్ణుని జాడలు తెలుసుకొనుటలో గోపికలు చూపించు గుర్తులు ఎంతో మనోహరమైనవి ! ఒకచోట ఆయన మోపిన పాదాగ్రము కనపడుచున్నది. అందువలన అక్కడ కొమ్మకు పువ్వులు గోసినట్లు భావన, వెంటనే అడుగులజాడ మాయమైనది. బహుశా సతినెత్తికొని వెళ్ళిన చిహ్నమేమో అది; ఇంకొక చోట కూర్చున్న గుర్తులు కనబడుచున్నవి. ప్రేయసికి ధమ్మిల్లము పెట్టినాడేమో అక్కడ; మరొకచోట యెవరో యొక వెలది నిక్కిన చొప్పు గోచరించుచున్నది. ఆ ధూర్త గోపాలుడు ఆమెకు కెమ్మోని యిచ్చిన చోటిది యని స్పష్టముగా అనుమానము కలుగుచున్నది. కొంతదూరము వెళ్ళిన తరువాత వేరొకచోట నాలుగు చరణాలు ప్రక్కప్రక్కన కనుపించినవి. అందుచేత అది గోపాలకృష్ణుడు యెవరో యొక యెలనాగ చేయూదిన స్థలమని స్ఫురించుచున్నది. మరొకచోట మగజాడ లోపల మగువజాడ కనుపించినది. తప్పక యీ చోట ఆ శృంగార పురుషుడు యెవరో యొక నీలవేణిచే యొదిగి యుండ వచ్చును. ఇంకొకచోట రమణి మ్రొక్కిన చొప్పు కనపడినది. వేరొకచోట అన్యోన్య ముఖములైన అంఘ్రులు ప్రణయ కలాపమును ప్రదర్శించినవి. ఈ విధముగా యీ ఘట్టము

అత్యంత రమణీయముగా, బహు సుకుమారముగా అతి మనోహర ముగా వర్ణితమైనది. శ్రీనాథాదుల రచనలో ఇటువంటి సొగసులు కానరావు. అట్లని చెప్పుటకు దారుకావన విహారాదులు నిదర్శనములు.

తెలుగు భాషలోని శృంగార గ్రంథములను అవలోకించి నప్పుడు, శృంగార కవుల రచనలను పరిశీలించి నప్పుడు పోతన చిత్రించిన శృంగారము ముందు నిలువ దగిన రచనలు యెన్ని గలవు ? అను ప్రశ్న సహజముగా కలుగు చున్నది. శృంగార కవిత్వమునకు ప్రసిద్ధిగాంచిన వారి రచనలు భాగవత శృంగారము ముందు, దివాకరుని యెదుట నున్న దివిటీవలె గోచరించును. వాస్తవముగా తెలుగు కవులలో శృంగార రస చిత్రణము నందు పోతన సర్వవిధాల అగ్రగణ్యుడు. పోతనను శృంగార కవి యనుటలో తప్పేమి కలదు ? శృంగార మని నచో మడిగట్టు కొనవలసిన అవసరమేమి ? భక్తి రసమును యెంత బాగుగా పోషించినాడో , శృంగార రసమును అంత సమర్థతతోనే, పోతన చిత్రించినాడని చెప్పుటకు నిదర్శనాలు భాగవతమున ఎన్నియై నను చూపించ వచ్చును. ఆంధ్ర శృంగార కవులలో పోతనది అగ్ర తాంబూలము; తెలుగు భక్తి కవులలో పోతన మున్నెన్న దగినవాడు.

పోతనను కవిత్వము వలచి వరించినది. దానితో పాటు పాండిత్యము గూడ ఆయనకు సహజముగా అలవడినది. ఆంధ్ర కవులలో సహజ పాండిత్యుడను ప్రత్యేకత పోతన కొక్కనికే కలదు. భాష ఆయన చేతిలోని క్రీడాకందుకము.

(1956)

—(•)—

# క్షేత్రయ్య శృంగారము

తెలుగు కవులలో శృంగార రసపోషణమున క్షేత్రయ్యకు ప్రత్యేకత, విశిష్టత కలవు. ఆయన రచించిన పదాలన్నియును శృంగార రస ప్రధానములే. శృంగారముతప్ప ఇంకొక రసము వంక క్షేత్రయ్య దృష్టి ప్రసరించినటుల కనబడదు. ఈ పదాలకు నాయకుడు దక్షిణ నాయకుడైన శ్రీకృష్ణుడు; నాయిక చాల మట్టుకు స్వీయగా యీ పదాలలో కన్పడుచున్నది. పరకీయ సామాన్య నాయికలుకూడ కొందరు వీరిలో కనిపించుచున్నారు. ఈ నాయికల హృదయస్పందనాలను, నాయకుని హృదయస్పందనాలను క్షేత్రయ్య తన పదాలలో వర్ణించియున్నాడు.

ఈ పదాలలో విశేషముగా విప్రలంభ శృంగారమే ప్రకటిత మగుచున్నది. ప్రాణేశ్వరుడు తన దగ్గర లేనందున, తన దగ్గరకు రానందున, నాయికల హృదయాలలో కలుగు భావాలు యీ పదాలలో అక్షరరూపము పొందియున్నవి. ప్రియావియోగముచే పరితప్తమైన హృదయపు ఉద్వేగము, ఆవేదన యీ పదాలకు ఇతివృత్తము. వీనిలో యెక్కువగా నాయికా విరహము అనగా స్త్రీవిరహమే ప్రకటితమగు చున్నను. కొన్నింటిలో నాయకుని విరహము అనగా పురుష విరహము కూడ ప్రదర్శితమగుచున్నది. మన ఆలంకారికులు తమ లక్షణ గ్రంథాలలో నిర్దేశించిన నాయికలందరును యీ పదాలలో గోచరించు చున్నారు. వీరిలో ముగ్ధలు, మధ్యలు, ధీరలు, అధీరలు, ధీరాధీరలు, జ్యేష్ఠలు, కనిష్ఠలు, స్వాధీన పతికలు మొదలైన అన్ని తరగతుల నాయికలు కలరు. తుదకు బాలెంతరాలైన నాయిక శృంగారమును కూడ చిత్రించక క్షేత్రయ్య వదలి పెట్టలేదు. ఈ పదాలను యేమాత్రము స్థూలముగా పరిశీలించినప్పటికిని వివిధశృంగార నాయికల చిత్తవృత్తులను ప్రదర్శించుటలో క్షేత్రయ్య అద్వితీయమైన నేర్పు చూపించినట్లు స్పష్టము కాగలదు.

క్షేత్రయ్య పదాలలో ప్రతిపంక్తి యందును, ప్రతిపదము నందును శృంగారమే ప్రత్యక్షమగుచున్నది. శృంగార రసమును ఇన్ని తీరుల, ఇంత వైవిధ్యముగా, శృంగార నాయికలను ఇన్ని రకాలుగా ఇంత నిపుణముగా, చిత్రించిన ఆంధ్ర కవీశ్వరుడు మరొక్కడు లేడని చెప్పిన అతిశయోక్తి కాజాలదు.

ఈ పదాలలో నాయకుడైన మువ్వగోపాలుడు మిక్కిలి అందగాడు. అన్నింటియందును నెరజాణ. కొక్కోక శాస్త్రము నందు పారంగతుడైన పండితుడు. ఈడులేని రతులనేలి ప్రియురాలిని మేను మరపించగల రసిక చక్రవర్తి. ఇటువంటి శృంగార నాయకునితో సహవాస భాగ్యమబ్బిన విలాసినులు మాత్రము సామాన్యలా ! వారందరును అందాల రాణులు ; చౌశీతి బంధములలో ప్రవీణలైన నెఱజాణలు. ఆనాడు ననవిల్తు శాస్త్రంబు మినుకులావర్తించుపని వెన్నతోడ బెట్టినది మాకు అని గర్వముగా చెప్పుకొన్న వరూధినికి యీ నాయికలందరును దగ్గరిచుట్టాలని చెప్పవచ్చును. తన యురముననే తప్ప శయ్య మీద పవ్వళింపదనియు, తనతోతప్ప ప్రాణప్రదమైన చెలితో గూడ ముచ్చటలాడదనియు, ఆరూఢరతి కేళిలో తానేకాని నన్నలయనీయ దనియు, నేను అలిగితే తానేవచ్చి వేడుకొనును గాని తన సఖీమణులను రాయబారము పంపదనియు. ఒక సన్నివేశములో ఒక నాయికనుగూర్చి నాయకుడు ఒక పదములో తలపోసి తమ పరస్పర అనుబంధమును, అనురాగమును, నాయిక నేర్పును విశదీకరించి యున్నాడు. ఇంకొక చోట ఒక నాయిక ప్రియుడు తన దగ్గరకువచ్చి, చెంతనిలిచి, కొప్పులో పూవులు సవరించినది మాత్రమే తనకు జ్ఞప్తి యున్నది. కాని చురుకు కెంపు మోవిపై నుంచుట తెలియ నైతినని తన పారవశ్య విభ్రమమును ప్రకటించుకొన్నది. ఇవి మచ్చుతునకలు మాత్రమే. ఈ విధముగా యీ గేయాలలో ఒక్కొక్కటి ఒక్కొక్క విధమైన శృంగార చిత్తవృత్తిని వ్యక్తీకరించుచున్నది.

క్షేత్రయ్య తన పదాలలో చిత్రించిన నాయికలకు ప్రాణేశ్వరుని చిత్తవృత్తిని గ్రహించుటలో ప్రత్యేక ప్రావీణ్యము కలదు. ఒక నాయిక తన ప్రాణేశ్వరుని ఒకమారు బ్రతిమిలాడి పాదాక్రాంత యగును. ఇంకొకమారు కన్నీటి కాలువలో ఆయనను ముంచి తేల్చును. మరొక్కసారి ఘనమైన జడ వ్రేటుతో ఆయనను శిక్షించును. అనగా సామదానభేదదండో పాయములను ఉపయోగించి ప్రియుని తమకు స్వాధీనునిగా జేసి కొనుటలో ఆరితేరిన వారుగా ఈ నాయికలు కన్పట్టుచున్నారు. ఈ నాయికలు పరిపాలించు శృంగార రాజ్యమునకు సర్వవిధముల సాచివ్యము నెరపగల సమర్థులైన సఖీ మణులు ఈ పదాలలో మనకు కన్పడుచున్నారు. చూడుడు ; ఒక నాయికకు తన ప్రియుడు అగపడగానే ఆయన శరీరముమీద రతి చిహ్నముల వంక ఆమెదృష్టి ప్రసరించును. కాని ఆమె ఆగ్రహించక సమయానుకూలముగా వ్యవహరించి ఘాటుగామాట్లాడక అసూయను మాత్రమే ప్రకటించును. ఎత్తిపొడుపుమాటలతో ఆయననుకొంత వేధించునుగాని ఇంటినుండి వెడలి పొమ్మని చెప్పదు. ఇంకొక నాయిక ఇదే సన్నివేశములో ఈమాత్రము అసూయను కూడప్రకటించక గంభీరముగా యేమియు తెలియనట్లు వ్యవహరించును. ఇక సామాన్య నాయికల శృంగార వృత్తాంతము; క్షేత్రయ్య నాయికలలో పరకీయలు సామాన్యలుకూడ నున్నారుకదా ! ఈపరకీయనాయికలలో ఒకతె "నామగడు కత్తికోతకాడు. నాకు నీవు ఆజ్ఞయీయక తప్పదు. నేను అత్తవారింటికి పోక తప్పదు. అయితే అక్కడ మాత్రము నేను ఎల్లప్పుడు ఉండగలనా, అక్కడ నా మగని బంధువులతో జగడమాడి తిరిగి రాగలను. లేక నీవైన ఒకసారి యేతిరునాళ్ళ నెపముతోనో మా ఊరికి రారాదా !'' అని సెలవు తీసికొని వెళ్ళును. సామాన్య నాయికలు ధనాసక్తితో డబ్బు యిమ్మని అడుగుట యీ పదాలలో కనపడును. "అయిదు వరహాలు యీయగలిగితేనేరా !'' అని ఖండితముగా చెప్పినప్పుడు.

కోకోక మెల్ల జదివిన
చక్కని వాడైన రాజ చంద్రుండైనన్
రొక్కమునీయక యెప్పుడు
చిక్కదురా వారకాంత, సిద్ధము సుమతీ.

అన్న సుమతి శతకములోని పద్యము వెంటనే జ్ఞప్తికి వచ్చును. ఈ నాయికలు వారి చెలికత్తెలు సరస సంభాషణము లందు. చమత్కార ప్రసంగములందు ఆరితేరిన ప్రోడలు.

క్షేత్రయ్య నాయికలు ఆపాదమస్తకము శృంగార మూర్తులు. వారి గృహాలు శృంగార నిలయములు. అందులో వారి పడకటిండ్లు అందాల సీమలు. ఇండ్లను పడకటిండ్లను అలంకరించుటలో విలాసవతులైన క్షేత్రయ్య నాయికలకు అసమానమైన చతురత కలదు. సహజముగా సుందరాంగులైన యీ నాయికలు కట్టుబొట్టు తీరులందు ప్రదర్శించు శోభ మిక్కిలి రమణీయము. వస్త్రధారణమందు అలంకారములందు ఈ నాయికలు ప్రత్యేక శ్రద్ధను ప్రదర్శించి మోహన మూర్తులుగా మనకు సాక్షాత్కరించుచున్నారు. వారి వేషాలంకరణములను జూచినచో ప్రియుని ఆకర్షించు విద్యను ఒక ప్రత్యేక కళగా అభ్యసించిన సుందరాంగులు వీరని స్పష్టము కాగలదు. ఆ నాడు తంజావూరులోని విలాసవతుల శృంగారమును ఈనాడు కవితా రూపమున క్షేత్రయ్య మనకు చూపించుచున్నాడు. రకరకాలైన చీరలతో అందుకు తగిన రవికలతో ఈ పదాలలోని నాయికలు మన యెదుట ప్రత్యక్షమగు చున్నారు.

వస్త్రాలంకరణము నందేకాక శిరోజములను దిద్ది తీర్చుకొనుటలో ఈ నాయికలకుగల ప్రావీణ్యము మిక్కిలి గొప్పది. గుత్తపు వన్నెల కీల్జడ ఈ నాయికలకు అత్యంత ప్రేమాస్పదమైనదని ఈ పదాల వలన మనకు తెలియుచున్నది. ఆ రోజులలో పూవులులేని జడలు లేనే లేవు. జాజులు, విరజాజులు, మల్లెలు. మొల్లలు మొదలైనవి ఈ నాయికల

కొప్పులలో నుండి సువాసనలను విరజిమ్ముచున్నవి. ఇందుకుతోడు ఘనసారము, కస్తూరితో మిళితమైన తాంబూలము ఎల్లప్పుడును ఆ నాయికల పుక్కిళ్ళలో పరిమళించుచుండును. ఈ నాయికల జడలలో వదులైనవి మిక్కిలి తక్కువ. ఎందుకనగా కోపము వచ్చినప్పుడు నాయకునిమీద జడ ప్రేటులను వేయననువుగా నల్లుకొనుచుండుట ఆ నాటి వాడుక; క్షేత్రయ్య నివసించిన తంజాపుర రాజుల కాలమున ఒక చోట ఒక పద్యములో నాయిక తన సఖితో.

"సరసురాలవు జబ్బుగ నల్లినావదేమే జడ'' అని ప్రశ్నించినప్పుడు, ఆ విజయరాఘవుని మేను, చిగురాకువంటిదని, చెలికత్తె వెంటనే సమాధానము చెప్పిన సంగతి సుప్రసిద్ధమైనది. ఉంగరాలు, గాజులు, కమ్మలు, మొలనూలు. ముక్కర, నాగసరాలు, చెంపసరాలు. బన్నసరాలు మొదలైన ఆభరణాల మీద ఈ కాంతలకు అమితమైన ప్రేమ - కాళ్ళకు లత్తుక, కన్నులకు కాటుక ఈ కాంతల అలంకారాలలో అనివార్యమైనవి.

ఈ నాయికల పడక గదులు మిక్కిలి ఆకర్షణీయములైనవి. పట్టె మంచము, దానిపైన పరుపు. పరుపు, మీద తెల్లని దుప్పటి, దుప్పటిమీద కమ్మతావులు విరజిమ్ము పూవులు, కొంత దూరములో నిలువుటద్దము, గదిముందు. ముద్దుపలుకులు పలుకు చిలుకలతో గోరువంకలు, ఒకచోట తూగుటూయెలగల ఆ సన్నివేశము ఎంత శృంగారమైనదో ఆలోచింపుడు, పన్నీరు, గంధము, బుక్కా మొదలైన సుగంధద్రవ్యములు ఈ నాయికలు సదా అనుభవించు విలాస సామగ్రి. ఉయ్యాల లూగుట చదరంగమాడుట మొదలైన విలాస క్రీడలలో ఈ నాయికలు అత్యంత ప్రౌఢలు.

ఈ విధముగా క్షేత్రయ్య తన ప్రతి పదము నందును శృంగారమును గుప్పించినాడు. సంగీతము, సాహిత్యము, అభినయము ముప్పిరి

గొనియున్న క్షేత్రయ్య పదాలలో, తంజాపుర రాజుల శృంగార జీవితము ప్రతిబింబితమగు చున్నదని చెప్పవచ్చును. ఆ కాలము నాటి విలాస జీవనమును క్షేత్రయ్య చాల చక్కగా చిత్రించినాడు.

ఈ పదాలకు నాయకుడైన గోపాలుడు మదనమోహనుడైన రసజ్ఞమూర్తి. నాయికలు బంగారపు బొమ్మలైన శృంగార మూర్తులు. వారు నివసించు మందిరములు సౌందర్య దేవతకు నిలయములు. రసికులకు అనుభవయోగ్యమైన విలాస సామగ్రి యంతయు ఆ సుందరాంగుల మందిరములందు సమృద్ధము. వేష భాషల యందు, అలంకారము లందేకాక రుచులు, అభిరుచులందు కూడ ఈ నాయికల శృంగార ప్రీతి ప్రకటితమగు చున్నది.

(1957)

—: :—

# క్షేత్రయ్య నాయికలు

క్షేత్రయ్య తంజావూరు రాజుల కాలమున నివసించిన వాగ్గేయ కారుడు. అనగా సుమారు మూడునూర్ల సంవత్సరాల క్రింద ఆయన రచనలు జరిగినవన్నమాట. అప్పటివరకు మన దేశములో ఇంగ్లీషు రాజ్యవిస్తరణ పూర్తియై పాశ్చాత్యనాగరికత అడుగుపెట్టలేదు. మన వేషభాషలు, అలంకారాలు, ఆచారాలు ఆధునిక నాగరికతా ప్రభావమునకు లోనై, విజాతీయములు కాలేదు. మన జాతిలో సాహసము, శౌర్యము, పరాక్రమము లోపించుట అప్పటికే మొదలైనప్పటికిని శృంగార రక్తి పూర్తిగా సన్నగిల్లని కాలమది. అట్టి కాలమున గల శృంగార నాయికలను క్షేత్రయ్య తన కవితలో చిత్రించినాడు.

క్షేత్రయ్య నాయికలు నెఱజాణలు, ప్రియుని చిత్త మెరిగిన సారసంగ్రాహిణులు, సరసజ్ఞురాండ్రు. వారు ఆట పాటలయందే కాక మరియన్నిట నెఱజాణులు. వారికి సన్న వలువలు ఇష్టము. ఈ నాయికలలో కొందరు "పట్టుపటాని పూలపావడ" "సరిగల బుట్టాల రవశల్లా"తో మనకు సాక్షాత్కరించెదరు. మరికొందరు మేని చందురు కావిపావడా మీద పట్టు చేలము గట్టుకొని ఎడవాలు పైట వేసికొనెదరు. ఇంక కొందరు మేలి పతాణికొంగు జారదీసి జాళువారైకను తొడుగుకొనిన సొగసులాడులు. ఈ నాయికలలో కొందరు పసుపు దుప్పటి వల్లెవాటు వేసికొనగా మరికొందరు చలువ దుప్పటి ముసుగు వేసికొనెదరు. ఒక నాయిక నొసలిపై మిస మిసలాడు తిలకము, మరొక ముద్దులాడి నుదుటపై చక్కని సన్నని కస్తూరి తిలకము. కామకలా ప్రవీణలైన ఈ నాయికలు, ప్రణయకోపము వచ్చినప్పుడు ఘనమైన జడవేటు వేయుటలో ఆరితేరినవారు ఒకానొక నాయిక ఘనమైన జడవేటు వలన ప్రియుని శరీరము కంది పోయినప్పుడు అది కనపడకుండుటకై అలదుకొనిన గందమును, గందముచాటున కందియున్న సొగసును, పరి

శీలించిన చిత్ర మొకటి మనకు ఈ పదాలలో కనబడుచున్నది. అందు చేత నీ నాయికలు గుత్తపువన్నెల కీల్జడను కోరి కోరి వేయించు కొనె దరు. పూవులు లేని కొప్పులుగాని జడలుగాని మనకు కానరావు. అవి ఆ కాలమున లేనేలేవేమో: పూవులన్నియును పరిమళభరితములై యుండుట అవసరము. మల్లెలు, మొల్లలు, సన్నజాజులు విరజాజులు ఈ నాయికల కబరీభరము లందును కీలుజడలందును శోభిల్లుచుండును. కలువపూవులతో ఈ కాంతలు మన్మధపూజ గావించెడివారు. చెక్కిళ్ళ మీద కస్తూరికామకరికలు దిద్దుకొనుట గళముమీద గందము అలదు కొనుట ఈ నాయికలు అనుదినము చేసికొను అలంకార విశేషములు. ఇందుకుతోడు ఎల్లప్పుడు పుక్కిటిలో కప్పురపు తావులతో నొప్పు విడెము-ఘనసారము, జవ్వాది కస్తూరి, ఈ నాయికలకు అత్యవసరమైన విలాస సామగ్రి, వానిని బహువిధముగా వారు ఉపయోగించుకొనె దరు. కస్తూరిపైన తెలుగు వారికి గల ప్రేమను ఆ చంద్రతారా ర్కము గావించిన శ్రీనాధుడు. ఈ సందర్భములో జ్ఞప్తికి వచ్చును. కన్నుల కాటుక, కాళ్ళలత్తుక మరికొన్ని ముఖ్యమైన అలంకారములు. ఈ అలంకారాలతో పాటు తగు సొమ్ములు ధరించి ఈ నాయికలు పూచిన తంగేళ్ళవలె భూషణభూషితలై యున్నారు. ఇరుచెవులకు తాటంకములు వజ్రాల కమ్మలు, రెండుచేతులకు గాజులు, వ్రేలికి ముద్దు టుంగరము. నడుముకు మొలనూలు( కొందరికి ప్రియుడు పంపిన గంటభారి మొలనూలు) ముత్తెముతో శోభిల్లు ముక్కర నాగసరాలు, చెయి సరాలు, బన్నసరాలు మొదలైన ఆభరణాలతో నీ నాయికలు క్షేత్రయ్య సమకాలికుడైన చేమకూర వెంకన్న చిత్రించిన "అతి వినోదము గాగ రతుల దేలించు నేర్పు" గలిగినట్టి ముత్యాలకమ్మల ముద్దులాడులు; నీలంపు ముంగర నీలవేణులు; కెంపులబొగడల కీరవాణులు; పచ్చల కడియాల పద్మగంధులు, గంధము, జగ్గుగుల్కు-బుక్కా, వలపు పొలపు జూపులతో నొప్పు యీ వన్నెలాడులను సదా యెడబాయక యుండు పరిమళ ద్రవ్యములు.

ఈ నాయికలు నివసించు గృహములు, మేడలు, శృంగార సీమలు, అందాల పుట్టలు, తూగుటూయెలలు, చలువచప్పరములు, శృంగారవనములు వీరి గృహాంగణాలలో కనుపించుచున్నవి. కొంచెము లోపలికి వెళ్ళి, సావధానముగా పరిశీలించినచో ఒక చోట పంజరము, అందులో సుద్దులు తెలుపు చిలుక, మనకు కనుపించును. కొన్ని ఇండ్లలో చిలుకలతోపాటు గోరువంకలు కూడ. ఒకగదిలో గిలకల పట్టెమంచము. దాని పైన పానుపు, పాన్పుపై తెల్లని దుప్పటి, దుప్పటిపై మల్లెలు, మొల్లలు; ఒకచోట నిలువుటద్దము: నూరిన గంధ కస్తూరి, పచ్చికస్తూరి, జవ్వాది, కర్పూరము మంచిగంధము, పన్నీరు, మంచునీరు, మొదలైన శృంగార సామాగ్రి అక్కరకొద్ది మక్కువతో సేకరించుకొబడియున్న సన్నివేశములో సంచరించునాయిక మదన శాస్త్రములో మంచి ప్రవీణురాలు. శృంగార వనములో చెలువునితో కూడి చదరంగమాడుట యీ నాయకలు అభిమానించు ఆటలలో ముఖ్యమైనది. సంగీతమును గూర్చి వేరుగా చెప్పవలసిన పనియేలేదు-తంబుర మీటుటలో వీణ వాయించుటలో, సంచుపాటపాడుటలో వీరికిగల ప్రావీణ్యము అసామాన్యము. జంతగాత్రముల రాల్గరగించు విమల గాంధర్వముతోపాటు ననవిల్తు శాస్త్రంపు మినుకులావర్తించుపని వెన్నతోడబెట్టిన విద్యలైనట్టి వరూధిని వీరికి దగ్గర చుట్టము. పద్య రచనా ప్రవీణుడైన నాయకునకు పద్యములోనే సమాధానము ఇచ్చుటలోను, ప్రియుని ముద్దు కవితను చదివి ఆతనిని ఆకర్షించుటలోను వీరు మంచి నేర్పరులు. ఈ నాయికల శ్రేణికి చెందిన ఒకానొక ప్రౌఢ యీ కాలముననే.

"ఏ వనితల్ మముందలప నేమి వనో, తమరాడువారుగా
రో, వలపించు నేర్పెరుగరో, తమ కౌగిట లోన నుండగా
రా, విదియేమిరా, విజయరాఘవ యంచిలుదూరి బిర్నమై
దీవర కత్తెనై ఇటకు తీసుక వచ్చితినా తలోదరి''...అని

రాజపత్నికి వ్రాసి పంపిన పద్య సమాధానము తెలుగు వాఙ్మయములో ప్రసిద్ధమైనది. క్షేత్రయ్య నాయికలను అలంకార శాస్త్ర దృక్పథ ముతో పరిశీలించినచో వీరిలో అన్నిరకాల నాయికలు కన్పట్టు చున్నారు. ఒక్కొక్క పదములో ఒక్కొక్క రకమైన నాయిక కలదు. స్వీయ, పరకీయ సామాన్యనాయిక లిందులో కలరు. వీరిలో గూడ కన్యలు, ముగ్ధలు, మధ్యలు, ప్రౌఢలు, కలహోత్కంఠితలు, ఖండితలు, కలహాంతరితలు, స్వాధీనపతికలు ధీరలు, అధీరలు, ధీరాధీరలు, జ్యేష్ఠలు, కనిష్ఠలు కలరు. ఈ నాయికల చెలికత్తెలైన సఖులు కూడ క్షేత్రయ్య చిత్రించిన స్త్రీలలో కలరు; చూడుడు; ఒకామె స్వీయ (ఖండిత); ప్రియుని శరీరమున రతిచిహ్నములు చూచును. కాని ఘాటుగా మాట్లాడదు; అసూయను మాత్రము ప్రదర్శించును. స్పష్టముగా ఇంటినుండి వెళ్ళిపొమ్మని చెప్పదు. మరొకతె ఎత్తి పొడుపు మాటలతో ప్రియుని యెదుర్కొనును. ఇందులో ప్రౌఢ యైన యొకతె హృదయములోని అసూయను అణచుకొని, పైకి గాంభీర్యము వహించి మాట్లాడును. సాధారణముగా స్వీయలందరు ప్రియుడు రానందుకు విరహముతో అంగలార్చుట ఈ పదాలలో కనబడును. పరకీయలలో విరహోత్కంఠితలు, కలహాంతరితలు అతృప్తలు, తృప్తాతృప్తలు కలరు స్వీయ (కులస్త్రీ) తెల్ల వారకముందె లెమ్మని ప్రియుని కోరును. పరకీయ తెల్లవారునేమో, ఇతరులు చూచిన ప్రమాదము, ఇక నీవు వెళ్ళుమని తొందరచేయును. సామాన్య నాయిక "అయ్యో అప్పుడే తెల్లవారినదే'' ఇంకను ప్రొద్దుండక పోయెనే." యని అతృప్తి వెల్లడించును, సామాన్య నాయికలు సాధించుట, ధనాసక్తితో డబ్బుయిమ్మని జగడమాడుట ఈ పదాలలో కనబడును. అయిదు వరహాలు యీ యగలిగితే రా. చలువచీరెలు, చెంగలువలు యీ యగలిగితేనేరా, అని ఈ నాయికలు సాధించుదురు. స్వాధీనపతికయైన స్వీయతనసఖితో భర్త గుణగణమును వర్ణించును.

ఈ నాయికలకు చెలికత్తెలైన సఖులు నాయికకు హితవు చెప్పెదరు. ఓపికపట్టుమని కోరెదరు. చమత్కారముగా మాట్లాడుదురు. 'చక్కెర బొమ్మా మీ యిద్దరి మనసు చల్లనాయెనా ? యని సరసముగా ప్రశ్నింతురు. క్షేత్రయ్య ఒక్కొక్క పదము' ఒక్కొకవిధమైన నాయిక భావ ప్రకటనమే.

తెలుగు దేశములోని ఆనాటి రసిక జీవనము క్షేత్రయ్య రచనలలో చక్కగా ప్రతిఫలించుచున్నది. తెలుగు పలుకుబళ్ళలోని చక్కదనమును, తీపిని ఇంత ముద్దుగా మనకందజేసిన కవులు మిక్కిలి తక్కువ. "కన్నీరు కావేరి కాలువ, పొంద వద్దని గట్టిగ వక్కలాకు లిచ్చెను, చెలియ పెట్టినమందు తలకెక్కెనో, నా సొగసెప్పుడు జూచెదరే, మీరేమైన ఆర్చెదరో, దృష్టి దాకించిరో నొసటి వ్రాత తప్పదాయె, ఈనిన పులివంటి కోపము, లక్క వంటి, మనసురాయె, దాదు ఫిర్యాదేది ధరణిలో లేదాయె, కలిబోసిన ఉట్టి వంక జూచినట్లు ఆడపుట్టువు పుట్టలేదా ఒట్టుపెట్టి చెప్పెదను. ఊడిపడ్డట్లు వచ్చె." మొదలైన చక్కని తెలుగు నానుడులు, లోకోక్తులు ఈ గేయాలలో కొల్లలు. అవియన్నియు ఆంధ్ర సుందరులు అనుదినము తమ సంభాషణలో ఉపయోగించునవి- "మొప్పెవగలు, అసురసురన్నది. నాలిముచ్చు గయ్యాళి, దబ్బున, అదుకొనుట వాలాయము, సరిప్రొద్దు, తియ్యబెల్లిమాటలు, చలపాదికోపము ఆగడము మీసము దువ్వుట, ఆముకొన్న ప్రేమ, మోముచిన్న జేసుకొనుట," మొదలైన మాటలు యీ పదాలు నూటికి నూరుపాళ్ళు తెలుగుదనము కలిగియున్నవని తెలుపుచున్నవి. క్షేత్రయ్య పదములలోని సన్నివేశములు, నాయికల వర్ణన, శైలీభాషలు తంజాపురాంధ్ర రాజుల కాలమున నివసించి రచనలు గావించిన చేమకూర వెంకన్న, ముద్దుపళని కావ్యాలలోని సన్నివేశములను వర్ణనలను శైలీ,భాషలను పోలియున్నవి.

ఈ రేయి ననుగూడితే ఇన్నూరు ఘట్లు'' ఇచ్చెద నన్నాడు, ఒకచోట క్షేత్రయ్య - ఘట్లు ఒక విధమైన నాణెము లేమో! సావకాశముగా పరిశీలించినచో ఈ పదాలలో ఇట్టి విశేషాలు ఇంకను పెక్కులు కనుపించవచ్చును.

(1958)

—: :—

# సూరన కళాపూర్ణోదయము

"విరిసిన నొక్కయొప్పు, అరవీడిన వేరొక యొప్పు, చిక్కుపా టొరసిన నొక్కయొప్పు, నది యూడ్చిన వేరొక యొప్పు, వేణి భావ రచన నొక్క యొప్పు, ముడివైచిన వేరొక యొప్పు, కొప్పుగా బర గిన నొక్కయొప్పు, కనుపట్టకమానదు నీ కచంబులన్."

అని యొకానొక నీలవేణి కుటిల కుంతల శోభను పింగళి సూరన ప్రశంసించినాడు. ఆ సొగసులాడిని మనము చూడలేదు- కాని ఆశోభ యేమో, సూరన శృంగారమునందు, ప్రస్ఫుటముగా గోచరించు చున్నది. జగదేక సుందరియైన చిగురుబోడి శిరోజ సౌభాగ్యమువలెనే సూరన కవిత్వము శోభిల్లుచున్నది. అదియేరీతిగ అల్లినప్పటికిని, అందులో యేదోయొక ప్రత్యేకమైన రామణీయకత గోచరించు చుండును.

ఆంధ్ర శృంగార కవులలో సూరనది అద్వితీయ సానము. తెలుగు భాషలో శృంగార కవులని ప్రత్యేకముగా ప్రఖ్యాతి ాంచిన వారు కలరు. ఆద్యంతము శృంగార మొలుకునట్లుగా రచన గావించ వలెనను అభినివేశముతో కలముల నాడించిన కవీశ్వరులు కలరు. వీరం దరి మధ్య, చుక్కలలో సూర్యునివలె, సూరనార్యుడు శోభిల్లు చున్నాడు. కళాపూర్ణోదయమను గ్రంథ నామకరణమే, ఆయన ప్రతి భను అభిరుచి ప్రాశస్త్యమును వెల్లడి చేయుచున్నది.

స్వర్గమర్త్యలోకములను ఒక్కముడితో బిగించినాడని కాళిదాస కవీంద్రునిగూర్చి ఒక సుప్రసిద్ధ విమర్శకుడు చెప్పిన మాటలను కళా పూర్ణోదయము జ్ఞప్తికి దెచ్చుచున్నది. సూరన్న కూడ శృంగార బంధ ములో మర్త్యలోక స్వర్గలోక సత్యలోకములను ఒకచోట ముడివేసి నాడు. కళాపూర్ణోదయములోని కథకు యీ మూడులోకాలు ముఖ్య

రంగస్థలాలు. వీనితో వైకుంఠమునకు గూడ సూరనార్యుడు బాంధవ్యము కలిపినాడు.

సుకుమార శృంగారచిత్రమునందు సూరనకు కాళిదాసుతో చాల దగ్గరి చుట్టరికము కలదు. కొన్ని విషయాలలో షేక్స్పియర్ కు కూడ యీయన సమీప బంధువు. శృంగార రసపోషణమున నిగ్రహమును సభ్యతను పాటించిన కవులలో సూరన కాళిదాసు తరగతికిచెందిన వాడు. తన కథలోని నాయికానాయకులను నిర్ణయించు కొనుటలోనే ఆయన ప్రత్యేక ప్రతిభ ప్రదర్శితమగు చున్నది. తాను చిత్రించదలచిన శృంగార వైవిధ్యమునకు అనుగుణముగా ఆయన తన పాత్రలను ఎన్నుకొనినాడు. కొంచెము పరిశీలించినచో అందలి సత్యము స్పష్టము కాగలదు.

శల్యాసురుడు, రాక్షసులకోవకు చెందినవాడు. చూపుతోడనే వానికి వలపు కలిగినది; ఆ వలపు తత్క్షణమే అనుభవమునకు ప్రేరేపించినది. అట్లు తాను కాంక్షించిన కాంతామణిని, అనుభవించు ప్రయత్నమున, తన శక్తులను జంతుజాలము మీద వ్యర్థము గావించినాడు. కాని ఇష్టపడనందున ఆమెను బలాత్కరించలేదు; ఆమెకు అపాయము చేయుటకు యత్నించ లేదు; తుట్టతుదకు తానే మోసపోయి, హతుడైనాడు. శల్యాసురుడు మానవత్వమునకన్న క్రింది దశలో నివసించు ప్రాణి. తరువాత మన దృష్టి మానవలోకము మీద ప్రసరించుచున్నది. ఈ రంగమున మనకు కనుపించు జంటలు మూడు. సుగాత్రీ శాలీనులు, కలభాషిణీ మణికంధరులు, మధురలాలసా కళాపూర్ణులు.

శాలీనుడు మర్త్యలోకము నందలి సామాన్య సంసారి. ఆయన రుచులు కూడ సహజమైనవి. సహజమైన సొంపులేగాని కృత్రిమమైన భూషణాలు ఇంపుగాక పోవుట శాలీనుని విశిష్టత. పడకటింటిలో ఆభరణ భూషితాంగియైన భార్యామణి కన్న, తోటలో తనతోపాటు కష్ట

పడి పని జేయు అర్ధాంగియే ఆయనకు ప్రేమాస్పదురాలు. శాలీనుని దొక విధమైన జానపద చిత్తవృత్తి. శాలీనునికి తగినట్టిది సుగాత్రి; పాపము; పతిని ప్రాణముగా భావించుకొను సాధ్వి, స్నేహితు రాండ్రు, తల్లి, ఎంత నూరిపోసి నప్పటికిని, మౌగ్ధ్యమును వదల జాలని ముద్దరాలు. భర్తతనను ఒల్లనందుకు ఆమె ఆగ్రహించలేదు; మౌనముగా ఆయనసేవలో నిమగ్నయైనది; తన మీద మనసు లగ్న మైన తరుణమున స్వాధీనురాలైనది. భర్త చిత్తవృత్తిని అనుసరించి మెలగు స్వభావము ఆమెది. పరస్పర సంబంధాలలో ఈదంపతులకుఎరువు తెచ్చుకొనిన కృత్రిమత్వము యేమియును లేదు. చల్లగా శాంతముగా అన్యోన్యముగా సాగిపోవు సంసారము వారిది.

కలభాషిణీ మణికంధరులు సామాన్య సంసారులవంటి వారు కారు. మణికంధరుడు కవీశ్వరుడు. గాన కళోపాసకుడు, అందాతనికి నారదునితో సమానమైన ప్రావీణ్యము. ఆ కలహాభోజనుని సేవలో నున్నప్పుడే ఆయన చిత్తము కలభాషిణి మీదికి పోయినది. కాని వారి దాంపత్యము పొసగలేదు; సంసారి యగుటకు బదులుగా ఆయన సన్యాసియైనాడు. తీర్థయాత్రలు, తపస్సు, రంభాసమాగము, మాయా నలకూబరవేషము క్రమ క్రమముగా ఆయనకు తటస్థించినవి. కల భాషిణి స్వైరవిహార ధీరయైన వేశ్యాంగన. కూకటి వేణితో కురులు గూడక మున్న ఆమె కోసము ద్వారకా నగర విటావళి ఉవ్విళ్ళూరి నది. చక్కదనము, వన్నెలాడితనము, కలికితనము ఆమె యందు ముప్పిరి గొన్నవి. ఎలప్రాయమునసే ఆ కోమలాంగి చిత్తము సంగీత సాహిత్యాల కారణాన మణికంధరుని మీదను, ఇతర కారణాల నలకూబ రుని మీదను లగ్నమైనది; దానితోపాటు నాకమృగీ నేత్రలమీద కయ్య మునకు కాలుచాచు అసూయకూడ అంకురించినది. నలకూబరుని స్వాధీ నుని గావించుకొను ఉద్దేశమునుమనసులో నుంచుకొని, మరొక నెపము మీద, తనకు యిష్టము వచ్చిన స్త్రీ రూపము ధరించువరము సుర

మౌనికడ సంపాదించినదాయెలనాగ. తరుణము దొరికినంతనే వేషము మార్చి మాయారంభయైనది. ఆ వేషములో ఆమె జూపిన చాతుర్యము, మాటకుమాట బదులు చెప్పు నేర్పు, ప్రతిభావంతమైనది. రంభవంటి ప్రౌఢ నారీమణివి తనవచోవిలాసముచేత, నటనా కౌశల్యముచేత సతమతము గావించిన జగజంత కలభాషిణి; సవతి వేషము బహు చక్కగావేసి, రంభకన్న యేడాకులు యెక్కువగా జదివిన నెరజాణగా తనను నిరూపించుకొనినదా యెమ్మెలాడి, మధుర లాలసా కళాపూర్ణులు రాజవంశీకులు; ఆ సంప్రదాయాలు, ఆ లాంఛనాలు వారియందు పరిపూర్ణముగా ప్రతిబింబితమగుచున్నవి. నిగ్రహములేక, యోగాభ్యాసముచేసి భ్రష్టుడైన వాని శృంగారము సిద్ధునిది.

స్వర్గమునందలి శృంగార మిథునము రంభా నలకూబరులు; వారు నిరంతర రతి క్రీడాపరాయణులు. రంభ సర్వకాల సర్వావస్థలయందు తనసొత్తుగా నుండుటకు వీలులేదని తెలిసికూడ ఆమెనువలచి, వరించి, విధేయుడై నాడు నలకూబరుడు, స్వర్గములోరంభ కొరకు వచ్చువారనేకులు; యుద్ధములో మరణించిన వీరులు; యజ్ఞయాగాదులు గావించిన సోమయాజులు; వీరందరిని రంజింపజేయవలసినది రంభ. ఇందుకు తోడు దేవేంద్రుడు మరియు దేవతలు. దేవతల కొరకు దేవేంద్రుని పనుపున జేయ వలసిన తపోవిఘ్నాది కార్యక్రమాలు కూడ ఆమెకు మెండు. అయినప్పటికిని అవకాశము దొరికినంతనే కుబేర నందనుని కడ రెక్కలు గట్టుకొని వ్రాలుచుండును. ఈ రంభ జగదేక సుందరి; తన కన్న చక్కనివారు లేరను అభిమానము కలది; నరభామల పొడుముల గూర్చి ఆమెకు యేమంత గొప్ప అభిప్రాయము లేదు. స్వయముగా బహురుచులు తెలిసిన ఆ భామామణి, తన మట్టుకు మాత్రముసవతి యూహాయైనను సహించలేదు. శరీర మెక్కడ నున్నప్పటికిని ఆమెహృదయము మాత్రము నలకూబరుని యందే లగ్నమైయుండును. నలకూబర సహా

వాసములోనే ఆమె యందలి శృంగార చేష్టావిశేషాలు. విలాస విభ్రమాలు పలుకీతుల ప్రత్యక్షమగు చున్నవి. ఏ యెడ యెవ్వరు యెన్నడు కనని, వినని యింపులు బహుకోమలముగా తనగళస్వనాదులందు సాక్షాత్కరింప జేసి, నలకూబరుని స్వాధీనుని గావించుకొన్న దామె. ఇతరుల సాంగత్యము నందుకూడ ఆమె భావించువాడు నలకూబరుడే. ఆ మోటు తపసి, కళ లంటిచొక్కింప చేసినప్పుడు కూడ "నలకూబర. విడు విడు, రా" యని, యే ఆమె అలపించినది. కామ కళా కౌశలమున ఆరితేరిన ప్రౌఢయామె కామము వేడి, యౌవనము పొంగు, రంభా నలకూబరుల సహవాస మున స్పష్టముగా కనుపించుచుండును.

సరస్వతీ చతుర్ముఖులు సత్యలోకాధినాథులు. ఇది ఘరోక విశిష్టమైన జంట. శారద సంగీత సాహిత్యములను స్తన ద్వయముగా కలిగి, సకల విద్యలకు, కళలకు రాణియైన రమణిమణి, చతుర్ముఖుడు స్వయముగా సృష్టికర్త, కామము పొంగు, యౌవ్వనము వేడి, శాంతించి నిగ్గులు దీరిన ప్రణయ ప్రకోపము వీరి విలాసము, ప్రణయ కోపము, అనునయము, శృంగారచేష్టలు, మధురవాక్యసంపదాభిరామమైన సరస సల్లాపములు వీరి కేళీవిలాసము. ఇందులోని శ్లేషయందు ప్రకృతి సుకుమారముగా ప్రతిబింబించు చున్నది.

వీరందరికిని శిఖరాయమానముముగా విరాజిల్లువాడు వైకుంఠ ములోని రమావినోది మరియు గాన లోలుడైన శ్రీమహా విష్ణువు. చతుర్ముఖ జనకుడైన ఈయనను వేంకట నాథునిగా, రంగనాయకునిగా ఇతర దేవతా స్వరూపిగా సూరన పలుమారు కీర్తించి యున్నాడు. ఆ ప్రశంసలన్నింటి యందును ఆకృతిదాల్చిన శృంగారముగా ఆయన కనుపించుచున్నాడు. వైకుంఠమున శ్రీమహాలక్ష్మీసమేతుడై సర్వే శ్వరుడు యేకాంతమునసంగీతము నాలకించుచు ఆనందించు సందర్భ మున, రంభను జూచి అసూయ జెందిన కలభాషిణివలె, తుంబురుని

జూచి ఈర్ష్యపడినాడు నారదుడు. ఆ ఈర్ష్యపోటికి కారణమైనదది. తాను తుంబురునితో సమానుడ ననిపించు కొనవలెను— ఈ హృదయ శల్యమును తీసివేసికొనుటకై, ఆ కలహాభోజనుడు శృంగారమూర్తి, దక్షిణ నాయకుడు, పదారువేలనూటెనిమిదిమంది భార్యలతో పరిపూర్ణ రతోత్సవములందు తేలియాడువాడును అగు శ్రీకృష్ణమూర్తి శిక్షణను ఆశ్రయించినాడు. తన హృదయ శల్యమును తొలగించుకొను కార్యక్రమమున కలభాషిణికిని రంభకును పోటీపెట్టి, వారిద్దరికిని హృదయ శల్యములను సిద్ధము గావించినాడు.

ఈ విధముగా సకలలోకములందలి శృంగార లీలా విలాసము
లను అతికోమలముగా చిత్రించినదీ కళాపూర్ణోద[illegible] దసవంతమైన్ధ
యీ కావ్యము "శ్రీ వాణీ గిరిజాశ్చిరాయదధతో, [illegible] రస్లది, కవితా
యే, లోకానాంస్థితి మావహా స్త్వవిహతాం, [illegible] నెరవేర్చినది.
వాం" అను నన్నయ స్తోత్రమును జ్ఞప్తికి దెచ్చి[illegible] వితసమరమున
గారవము కెక్కిన దృష్టాం
మును ప్రతిపాదించు చున్నది.
కవివకృతమూర్తియగు

సౌందర్యమును వర్ణించుటలో చాల చ వ్ము మేచున్నది. వాడి
నాడీ కవీశ్వరుడు. నారద మునీంద్రునికి సుసాక్ష్య [illegible] ప్టించిన మంత్రిమణి
ఉన్నవాడున్నట్లుగా ఎదురుగావచ్చు శ్రీకృష్ణు [illegible] జన్యునకు స్వాతంత్ర్య
హారమైనది.సహజసౌందర్యమును, సాలంక [illegible] మయయములందు అయు
సౌందర్యమునుకూడ సూరనచాలనాజూకు [illegible] కవులలో గలరు.
ధ్వనులు అభినవాంధ్ర కవుల రచనయం [illegible]
కంపితమైన భామిని సొగసును రతి [illegible] కర్తలని యొక రన్నారు.
మును అద్దములో జూపించినట్లు వర్ణి [illegible] gislators of the world),
[illegible] ంఘమును సక్రమపద్ధతిని నడి
ప్రేయసీ ప్రియుల సరస [illegible] గల శక్తి అసామాన్యమైనది.
లను పోషించుటలో సూరన ప్రతి [illegible]

కళాపూర్ణోదయము నందలి ఘట్టములు ఇందుకు ఉదాహరణములు. రక్తికిని. భక్తికిని సమానముగా ఉద్దీపకమైన కళ సంగీతమను సత్యము యీ గ్రంథమున చక్కగా వ్యక్తీకరణ జరిగినది. కళాపూర్ణోదయ మను నామము సర్వవిధాల యీ గ్రంథమునకు సార్థకమైనది.

(1957)

—:•:—

విశిష్టమైన జంట.
కలిగి, సకల విద్యలకు
స్వయముగా సృష్టిక
శాంతించి నిగ్గులు దీరిన
కోపము,అనునయము,శృ
సరస సల్లాపములు వీరి కే
సుకుమారముగా ప్రతిబింబి

వీరందరికిని శిఖరాయః
ములోని రమావినోది మరియు
చతుర్ముఖ జనకుడైన ఈయనను
ఇతర దేవతా స్వరూపిగా సూరన
ఆ ప్రశంసలన్నింటి యందును అక్క
కనుపించుచున్నాడు. వై కుంఠము
శ్వరుడు యేకాంతమునసంగీతము న
మున, రంభను జూచి అసూయ చెంది

# ముద్దుపళని - రాధిక

తెనుగు తోటలో పాదులుదీసి తీగెలు బారించిన భామామణు లలో ముద్దుపళని ముఖ్యురాలు. ఆంధ్ర భారతిని మొల్ల, వెంకమ్మ వంటి కవయిత్రులు మేలిసొమ్ముల నలంకరించిరి. కానివారు త్రొక్కినత్రోవ వేరు; పళని నడిచిన బాటవేరు. ఆంధ్రకవయిత్రుల లోనే కాక, పెద్దన, తిమ్మన, సూరనలను ముగ్గురిని విడిచిపెట్టినచో, ఆంధ్ర ప్రబంధకర్త లందరిలోను ముద్దుపళని అద్వితీయ. ప్రౌఢయైన రాధికను, ముగ్ధయైన ఇళను చిత్రించుటలో ఆమె జూపిన నేర్పు అస మానమైనది. తెలుగు భాషలోని శృంగార సాహిత్యమున రాధికా సాంత్వనము విశిష్టస్థానము కలది.

పళని ప్రతాపసింహుని ప్రేమకు పాత్రురాలై ...కలది. కవితా త్వములందు ప్రావీణ్యము గడించిన కళావంతురాలై ... నెరవేర్చినది. ...రామమైన ఆమె హృదయమునుండి వెలువడిన శృంగార ...వితసమరమున రాధికా సాంత్వనము. మన్మధమన్మధుడు శృంగారవము ...కెక్కిన దృష్టాం శ్రీకృష్ణునికి అంకితమగు యీ కావ్యమునకు కవివర్ణితమూర్తియగు శ్రీకృష్ణుడే. ఆ దక్షిణ నాయకుని వలచి వ... ...చున్నది. వాడి యీ కావ్యమునకు నాయికలు. రాధ నెఱజాణ ...ృష్టించిన మంత్రిమణి జాణ. ఈ జాణ లిరువురి హృదయాలు య... ...జన్యునకు స్వాతంత్ర్య బించు చున్నవి. ఈ నాయికల చిత్రణలో ...విషయములందు ఆయు ణ్యము, స్త్రీ హృదయము ప్రతిబింబించు... కవులలో గలరు. కొద్దియో గొప్పయో స్వానుభవము కు...

...కర్తలని యొక రన్నారు.

బాలికయైన ఇళ చిన్నప్పటినుం... ...gislators of the world), గినది. ఈడురాని లేత వయసునందే ... ...సంఘమును సక్రమపద్ధతిని నడి భావాలు మొలకెత్తినవి. రాధ ఆవే... గల శక్తి అసామాన్యమైనది. పోషించినది. అంతేకాదు, ఆమెను...ని

యించుకొనినది. అయితే సవతియైన తరువాత హృదయములో చెల రేగు ఈర్ష్యాగ్ని మాత్రము ఆమె మొట్టమొదలు ఊహించి యుండ లేదు. రాధా కృష్ణుల శృంగార చేష్టలను అనుదినము అతి శ్రద్ధతో గమనించుచుండిన ఇళ యౌవనము రాకముందే మాధవుని స్వాధీనుని చేసికొనుటలో రాధతో పోటీపడినది. "హరినిగని రాధ అల యాట లాడుదాము" అని పడకటింటికి పిలువగా నేనుకూడ వచ్చెద నని ఇళ పిలువని పేరంటముగా ముందంజవేయును. అంతేకాదు పని గట్టుకొని పలుమారు ఆ జగజంత శ్రీకృష్ణునితో సయ్యాటలకు సంసిద్ధ మగును. దాగిలి మూతల నెపముతో మదన గోపాలునికి పదే పదే యెదురు వచ్చుట, గుజ గుజరేకులాటలలో కదిసి నిలుచుట, వెన్నెల కుప్పలాటల్లో చుబుకము మూయించుకొనుట, గుజ్జెనగూళ్ళ ఆటలో విశిష్టశక్తిన జంటచుట మొదలైనవి వగలాడియైన ఆ బాలిక శృంగార కలిగి, సకల విద్యలన్నింటికి రాధ సంపూర్ణ ఆమోదము ప్రోత్సా స్వయముగా సృష్టి. ఎప్పుడీ యేమ్మెలాడికి ఈడు వచ్చునోయని ఆమె కాంతించి నిగ్గులు దేరు చూచినది. ఇళకు ఒమ్మెగా దిమ్మెతై రొమ్మె కోపము, అనునయములదేవతలను కోరి కొలచినది; ఆమెకు మెఱుగెక్కి సరస సల్లాపములు వీరి దినమొకతైలము తెచ్చి యంటినది; కన్నెరి సుకుమారముగా ప్రతిబింబ వద్దనుండి తీసికొనిన మందులను యిచ్చినది.

ఈడు వచ్చుటకొరకు రాధ ఎన్నియో దోహద

వీరందరికిని శిఖరాయి చెలి సొగసు చూచి "నీవు నా సవతి వౌదువు ములోని రమావినోది మరియ యము కొరకు ఉవ్విళు లూరినది.

చతుర్ముఖ జనకుడైన ఈయనన

ఇతర దేవతా స్వరూపిగా సూర, యీ వాతావరణమున పెరిగిన ఇళ, ఆ ప్రశంసలన్నింటి యందును ఆక పుష్పించినది. ఆ శుభమును ముద్దుప కనుపించుచున్నాడు. వైకుంఠమ వర్ణించినది. వెంటనే యశోదమ్మకు శ్వరుడు యేకాంతమునసంగీతము ద్దు వైన రోహిణీ దేవిని పిలిచి అవి మున, రంభను జూచి అసూయ జెంది తెలుసుకొన్నది; చుట్టుప్రక్కాలకు

శుభపత్రికలు వ్రాసినది; దినశుద్ధి లగ్నము నిరూపించినది; అంటు గలిగిన వారిని అంటుకో నియమించినది. ఈ వర్ణనలో అడుగడుగున స్త్రీ హృదయము ప్రత్యక్షమగుచున్నది. ఈ సందర్భమున ఆమె ప్రయోగించిన పదజాల మంతయు పడతుల పెదవులమీద ప్రతిదినము తాండవించునట్టిదే. మొత్తముమీద ఒకనాటి శుభ ముహూర్తమున ఆఒయ్యారికి రాధ శోభనము చేయించినది. సంపెంగ తైలము అంటి స్నానము ఆడించి, చెంగావి పావడ కొసలు బిగియించి, కుంకుమ పువ్వంచు కోక గట్టి, రవిక తొడగించి, సొమ్ములలంకరించి శోభనమందిరమునకు పంపినది. ఇది రసవంతమైన ఘట్టము. ఈ సందర్భమున అధిక సుకుమారమూర్తి రసికశిఖావతంసుడైన దక్షిణనాయకుని యీ బాలయెట్లు మెప్పించగలదోయను సందేహము రాధకు కలిగిన[illegible]చేత అనంగవ్యాపారము గూర్చి కావలసిన సలహాలు, సూచనలు సవివరమైనది, కవితా ఆమె యిచ్చినది. అంతేకాదు. మాధవునితో "ఈమె వట్టి నెరవేర్చినది. వతె నేర్పరికాదు సుమా; అందుచేత ఈమెను యెట్లైతె [illegible]వితసమరమున యని అప్పగించినది. ఈ శోభన ఘట్టమున ప్రతి పదము[illegible]కెక్కిన దృష్టాం మొలికించినది ముద్దుపళని. ఇంత చక్కగా, ఇంతవివ[illegible]వృతమూర్తియగు క్షణముగా ఈ ఘట్టమును వర్ణించిన ఆంధ్ర కవులు [illegible]సుచున్నది. వాడి

ఇళా మాధవులు తలుపులు మూసికొన్న [illegible]ప్టించిన మంత్రిమణి సంతోషము. తరువాత ఆవేదన ప్రారంభమై[illegible]జన్యునకు స్వాతంత్ర్య వచ్చు, సొమ్మొందమియవచ్చు, ఈయరాని[illegible]మయములందు ఆయు తనదు విభునివేరు తరుణిచేతికినిచ్చి, తాళప[illegible] కవులలో గలరు.

అని ఆక్రోశించినది. తాను శ్రీకృష్ణునితో[illegible] కర్తలని యొక రన్నారు. జ్ఞప్తికి దెచ్చుకొన్నది. హృదయములో[illegible]gislators of the world), తన సర్వస్వమును హరించిన ఇళపై కో[illegible]బంధమును సక్రమపద్ధతిని నడి యామె తలుపులుతట్టి, బలవంతముగా[illegible] గల శక్తి అసామాన్యమైనది. మించి తన వాక్కును స్థాపించుకొని

త్కృతి యెట్లబ్బునని శ్రీకృష్ణునిచే మెప్పులొందినది. ఇళా మాధవుల క్రీడలు, ఆమీద రాధా మాధవుల రతి, ముద్దుపళని వర్ణించిరీతిగా మరే ప్రబంధములో మరేకవియును వర్ణించలేదని చెప్పినచో అతిశయోక్తి కాజాలదు. మనిసికాటులు, చిరుగోటి పోటులు, తొడసాములు, వలపు చెమ్మటలు, యెదురొత్తులు, పారావతధ్వనులు మొదలైనవాని ప్రసక్తి ఈ గ్రంథమున బహుళముగా నున్నది.

ఎంతకాలము ఇళా మాదవులు రాధ ఇంటిలో నుండ గలరు? ప్రాణేశ్వరుని కొంగున ముడివేసికొని ఇళ తల్లిగారింటికి పయనమై వెళ్ళినది. రాధకు దుస్సహామైన విరహవేదన సంప్రాప్తించినది. అది స్వయంకృతాపరాధ ఫలితమని భావించినది. ఆ పిమ్మట రాధమ్మ అను [illegible] ంత కాదు. ఆ ఆవేదనను పూసగ్రుచినట్లు వర్ణిం
విశిష్టతన జంట
[illegible]డ ముద్దుపళని ప్రత్యేకత చూపినది. అక్కడ ఇళామాధ
కలిగి, సకల [illegible]
నుభవ వృత్తాంతమును తన దూతికచేత సమగ్రముగా
స్వయముగా స[illegible]
పిదప ఆమె ఆవేదన అతిశయించినది. అప్పుడామె
శాంతించి నిగ్గుల
[illegible]లికిన పలుకులు, మాధవునితో తాను అనుభవించిన కేళీ
కోపము, అనునయ[illegible]
[illegible], నిజముగా ముద్దుపళవి హృదయమునుండి దూసి
సరస సల్లాపములు [illegible]
[illegible]ననిపించును. మరుసాము గమనములకు ఇళా దేవి
సుకుమారముగా ప్రతి
పు పెట్లను సంస్మరించక విడువలేదు రాధమ్మ.

వీరందరికిని శిఖరాు పొందుటయే రాధ యభీష్టము. తుట్టతుదకు ములోని రమావినోది మరినై ఆదక్షిణనాయకుని మరొకమారు తనకు చతుర్ముఖ జనకుడైన ఈయనది. ఈ రాధికాసాంత్వనమును నాలుగా ఇతర దేవతా స్వరూపిగా సూచిహు రమ్యముగా వర్ణించినది. కొన్ని ఆ ప్రశంసలన్నింటి యందును కొంత మేర మీరిన మాట సత్యమే. కాని కనుపించుచున్నాడు. వైకుంఠమైనప్పుడు, యీా విషయమై ఆక్షేపణ శ్వరుడు యేకాంతమునసంగీతము[illegible]. ఈ శృంగార చిత్రణము నందు మున, రంభను జూచి అసూయ జెగమనించవలసి యున్నది. రసైక

దృష్టితో పరిశీలించినప్పుడు మన శృంగార సారస్వతమున ముద్దు పళని గ్రంథము అతి మనోహరమైనదని ఒప్పుకొనక తప్పదు.

ముద్దు పళని శైలి బహు లలితమైనది. సుందరమైన శబ్దములను సుకుమారముగా యేరి కూర్చుటలో ఆమె అత్యంత చతురురాలు. తెలుగువారి నాలుకల మీద తాండవమాడు సామెతల నెన్నింటినో ఆమె తన పద్యాలలో మిక్కిలి సరసముగా ఉపయోగించుకొన్నది. "తాను బెంచిన పొట్టేలు తనదు చేన సన్నబడు సామ్యము" "ముక్కు పచ్చలు ఆరకమునుపె" "వేలువాచిన ఓలంత విరివియైన, ఓలువాచిన నది యెంత బోలుగాదు" "దాని వేలుదీసి దాని కన్ పొడిచిన యటుల" "అరకాల బెట్టి నేలరాచకున్న" "అల్లునక్కు కల్మి వచ్చిన అర్ధరాత్రి గొడుగు తెమ్మన్న కత" కలది, కవితా లోపలనే అన్నన్నా మూరు బేరమగునే" "ఈకతోకలేని నెరవేర్చినది. మాటలు" "తగిలెనా తగులును తప్పెనాతప్పును, నా ,వితసమరమున రాయి" గట్టుచేరినంత బుట్టివానికి బొమ్మ గట్టు సామ్య ,కెక్కిన దృష్టాం వచ్చి ముంతదాచంగనేల" "ఎల్లవారికి శుభములనెల్ల బలి ,ృతమూర్తియగు పాలలో బడిన యట్లు' వంటి చక్కని పలుకుబడుల ,చుచున్నది. వాడి కావ్యమున బహు రమ్యముగా ఉపయోగించు ,ృష్టించిన మంత్రిమణి సంభాషణలలోని సొగసులు యీ గ్రంథమున ,ాజన్యునకు స్వాతంత్ర్య మగు చున్నవి. విదుషీమణి, కళాప్రవీణ, , ,మయములందు ఆయు జాణ సుకుమార రసికహృదయము యీ , కవులలో గలరు. మునందును ప్రదర్శిత మగుచున్నది. శృ అత్యంత ఆహ్లాదకరమైన రచన రాధికా స కర్తలని యొక రన్నారు.

gislators of the world), ,ంఘమును సక్రమపద్ధతిని నడి గల శక్తి అసామాన్యమైనది.

# నవ్యసాహిత్యమున వీరకావ్యములు

కవిత్వమనగా జీవిత విమర్శనమని యొక సుప్రసిద్ధ ఆంగ్ల
విమర్శక శేఖరుడు వచించినాడు. సాహిత్యము సమకాలిక సంఘ జీవిత
మునకు ప్రతిబింబమని మరియొక యభిప్రాయము. ఈ రెండు
సూక్తులు పరస్పరవిరుద్ధములు గాకుండుటయే కాక అన్యోన్య సహా
కార మొనరించుకొను చున్నవి. కవికి సమకాలిక మానవజీవిత విమర్శ
నముకన్న యెక్కువ భావ స్ఫోరకమగు వస్తువు కానరాదు. మానవ
జీవిత విమర్శనము నందు నిమగ్నయగు లేఖినికి సమకాలిక సంఘమే
యాశ్రయ మగుట మిక్కిలి సహజము. పారలౌకికములును, అనుభవ
దూరములునగు విషయములను గురించి భావోదయమై హృదయము
విశిష్టత్మక జం అ...పము కాకపోయినను అసామాన్యము, అసాధార
కలిగి, సకల చెప్పవచ్చును. మానవ జీవితమే సాహితీ సర్వస్వమని
స్వయముగా స...ము నధికారము కాని అభిలాషకాని నాకులేదు. కాని
శాంతించి నిగ్గు..., కవిత్వమునకు అత్యవసరమగు ముఖ్యలక్షణములలో
కోపము, అనునయ నవ జీవిత విమర్శనమను సర్వజనాంగీకారమగు
సరస సల్లాపములు ...త్రమిచట మనవిచేయుట నా విధ్యుక్తధర్మము.
సుకుమారముగా ప్రతి సంబంధించని ప్రకృతి సౌందర్యవర్ణనాదులు
...షమున్నతస్థానము నలంకరింపక పోలేదు. ఋతు

వీరందరికిని శిఖరాము లిందుకు నిదర్శనము. ఋతుసంహారము
ములోని రమావినోది మరస జీవన చిత్రణముకలదు. సమకాలిక సంఘ
చతుర్ముఖ జనకుడైన ఈయ...నులేని యితి వృత్తములు కథావస్తువులుగా
ఇతర దేవతా స్వరూపిగా సూ...దు. సుప్రసిద్ధములగు శాకుంతల, మేఘ
ఆ ప్రశంసలన్నింటి యందును ...రణములు. కాని సూక్ష్మముగా పరిశీ
కనుపించుచున్నాడు. వై కుంఠ...దుని కావ్యములు గూడ మానవ జీవిత
శ్వరుడు యేకాంతమునసంగీతము...ప్పదు; మరియు నవి సమకాలిక జీవి
మున, రంభను జూచి అసూయ...నములు చూపించవచ్చును. మహర్షి

యగు వాల్మీకి కవీంద్రుని కావ్య శిరోరత్నమే, కవిత్వము మానవ జీవిత విమర్శనమని వేనోళ్ల చాటుచున్నది. సారస్వతమునందు మనుష్య జీవితమునకు గల ప్రాముఖ్యమును గుర్తెరింగిన ప్రపంచకవులలో సర్వవిధముల ప్రథమగణ్యుడు వాల్మీకి. కవి చక్రవర్తియగు నాతని యమృతలేఖనియే, దివ్యవాణియే, ఛందో ప్రపంచమునందు ప్రప్రథమమున మానవ జీవితమునకు స్వచ్ఛందవిహారము సమకూర్చినవి.

సాహిత్యము ఒకజాతి నాగరికత ప్రతిబింబించు నద్దము వంటిది. సాహిత్యములేని జాతికి సంస్కృతిలేదు; నాగరికతలేదు; విజ్ఞానములేదు; మరేమియులేదు; సర్వమునుశూన్యము. సాహిత్యమునకు ముఖ్యలక్షణము చైతన్యము; జీవకళ. ఒకజాతి నుద్ధరించుటకు కదన రంగమునకన్నను యెక్కుడు ప్రభావముకలది, కవితారంగము. కత్తి కసాధ్యములగు కార్యములను కలము నెరవేర్చినది. ప్రపంచకవి జీవిత చరిత్రనొక మారవలో కించితిమేని, జీవితసమరమున నారితేరిన జగజెట్టులు సాహిత్యాంగణమునందు సమున్నతికెక్కిన దృష్టాంతములు గోచరించుచున్నవి. ఆంధ్రులపాలిటి యమృతమూర్తియగు తిక్కనార్యుని జీవితమీ విషయముననే వ్యక్తీకరించుచున్నది. వాడియలుగుల కన్నను వేడియగు కావ్యమును సృష్టించిన మంత్రిమణి యాతడు. భాగ్యభోగములను గోల్పోయిన రాజన్యునకు స్వాతంత్ర్య ప్రదానము జేసిన కార్యశూరుడాతడు. అవసర సమయములందు ఆయుధములను ధరించి విజృంభించిన వీరాగ్రేసరులు కవులలో గలరు.

కవులు యెన్నుకొనబడిన శాసన కర్తలని యొక రన్నారు. **(Poets are the unrecognised legislators of the world),** ప్రజాభిప్రాయమును కల్పించుటలో సంఘమును సక్రమపద్ధతిని నడిపించుటలో కవులకు, కావ్యములకు గల శక్తి అసామాన్యమైనది. ఆధునిక నాటక కర్తలలో నొక్కరు.

"ధరణిన్ వాఙ్మయపీఠమెక్కి బహుధా ధర్మంబు శాసించి తత్సరణిన్ దూష భూషణంబులను శిక్షారక్ష లుద్దించుచున్ సరసామోదము గాగ మానవ మనస్సామ్రాజ్య మశ్రాంతమున్ పరిపాలించు కవీశు వైభవము"ను ప్రస్తుతించినారు.

నవరసములందు నాయకరత్నములు శృంగార వీరములని మన యాలంకారికుల నిర్వచనము. కావుననే వారు కావ్యమునందు ప్రధానరసముగానుండదగిన ప్రభావము వానికే కలదని చెప్పిరి. ఇందుకు సంస్కృతమున భవభూతి మహాకవి విరచితమగు నుత్తరరామచరిత్ర మొక యపవాదముగా కన్పట్టుచున్నది. అదియును కరుణరసముగాక విప్రలంభ శృంగారమే ప్రధానముగా గల కావ్యమని రాయిగ్రుద్ది వచించు పండిత ప్రకాండులు కలరు. ఏదియెట్లున్నను ఒకమాట మాత్రము సత్యము. విశ్వసాహిత్యముననే శృంగార వీరరసములు ఇతర రసములకన్న హెచ్చు ప్రాముఖ్యమునొంది కవుల భావనాశక్తికి ఉద్దీపకములై పాఠకలోకము నాకర్షించినవి. భక్తికరుణములు దప్ప ఈ విషయమున వానితో సమానరసములు లేవని తోచుచున్నది.

వీరమును దానవీరము, ధర్మవీరము అని కొన్ని విధముల విభజించినను మన కావ్యములందు ప్రదర్శింపబడిన వీరము ముఖ్యముగా యుద్ధరంగమునకు సంబంధించినది ఆధునిక కావ్యములలో శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారి ధర్మజ్యోతి యను చిన్నకబ్బమునందు ధర్మవీరము ప్రదర్శింప బడినదను విషయ మిట ప్రత్యేక స్మరణీయము.

మన యాంధ్రసాహిత్యమునకు శిరోభూషణమగుటయే కాక మన వీర కావ్యములలో నగ్రగణ్యమగు గ్రంథము మహాభారతము. తిక్కనార్యునకు యుద్ధరంగమనిన యెడ లుప్పొంగును. భారతమును పఠించునప్పుడు పాఠకుడు తాను స్వయముగా కిరీటియై, గాంగేయుడై వడముడియై, యస్త్రగురుడై, సూర్యనందనుడై యాహవకేళి యొన

రించును. అభిమన్యునితోపాటు అతడును పద్మవ్యూహమున ప్రవేశించి వీరవిహారమొనరింప నిచ్ఛగించును. ''తినిన గారెలె తినవలయును, వినిన భారతమే వినవలయు'' నట.

భారతము తరువాత మనవారికి వీర రసమునెడ కొంత వైముఖ్యము కలిగినది. ఏలయన నాటినుండి నేటివరకును పలనాటి వీర చరిత్రమొకటి దప్ప మనసారస్వతమున యెన్నదగిన వీరకావ్యము మరి యొక్కటి రచింపబడలేదు. ఇందుకుకారణమా కాలమునందలి సాంఘిక రాజకీయ పరిస్థితులే యని మన చరిత్ర యుద్ఘోషించు చున్నది. తరువాత మన కాశ్రయమైనది శృంగార రసమొక్కటే. ఈ శృంగార కావ్యములందటనట వీరరసము గోచరించినను, దాని ప్రాశస్త్యము మిక్కిలి తక్కువ.

భారతీయులు స్వాతంత్ర్యము గోలుపోయి పరదేశ పరిపాలనమున కొన్ని శతాబ్దములు గడిపినారు. గత శతాబ్దాంతము నుండి మనవారు తమ యధార్థస్థితిని గ్రహించి యాత్మావలోకన మొనరించికొనినారు. జాతీయవాయువులు మన దేశమున వీచినవి. స్వాతంత్ర్య కాంతులు చెలరేగినవి; త్యాగమహిమ, సేవామహాత్వము మన వారు గుర్తించిరి; నిజధర్మమును గ్రహించిరి. నాయకులు కొందరు తమ సర్వస్వమును మాతృదేవత కర్పించిరి; ప్రజలువారిచేనుద్బోధితులై కర్తవ్యపరాయణులైనారు. విదేశ వ్యామోహము, వైజ్ఞానిక దాస్యము సడలించు ప్రయత్నములు ఫలించి, స్వాతంత్ర్య ప్రాప్తి జరిగినది. జాతీయ విద్యకు ప్రాముఖ్యము లభించినది. మందగించిన మాతృభాషాభిమానము మరల మన వారి హృదయములందు కందళించినది. చరిత్ర పరిశోధనమునందు శ్రద్ధవహించి, గర్వింపదగిన గతము మనకు కలదని తెలిసికొనినాము. ఈ సందర్భమున శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారి ఆంధ్రులచరిత్ర అపారమగు జాగృతి కలిగించి

నది. ఇఁక భాషా సేవకులు మిన్నకుండగలరా ? సాహిత్యము మానవ జాతి విమర్శనమైనచో, సమకాలిక సంఘజీవనముతో సంబంధము కలిగి యున్నచో కవికుమారులు, సారస్వతోపాసకులు స్వాతంత్ర్యోద్య మమున పాల్గొనకుండ నుండగలరా ? వారి రచనలు స్వాతంత్ర్యోద్యమ ప్రభావమునుండి తప్పించుకొనగలవా ? ఇందుకు నిదర్శనముగా మన సారస్వతోపాసకు లనేకులు జాతీయ సమరమున పాల్గొనినారు; త్యాగ మొనరించినారు. సోదర దేశీయులను మేలుకొలిపినారు.

"ప్రపుల్ల పుష్పంబుల నీశ్వరునకు
పూజ సల్పితినో యేను పూర్వమందు
కలదయేని పునర్జన్మ కలుగుగాక
మధుర మధురమైన- తెనుగు మాతృభాష".

అని యుప్పొంగినారు మన కవివరేణ్యులు.

లోకమంతకు కాకవెట్టిన కాకతీసతి కదనపాండితిని దలంచి, సమరమున వెన్నిచ్చి చనుదెంచిన ప్రాణనాథునకు వేడినీళ్ళను తోడిన వీరవనితలను స్మరించి క్షాత్రయుగముల శౌర్య చండిమతోపాటు, రెడ్డి రాజుల, కమ్మసేనాపతుల, వెల్మ వీరులు, వీర విహారములను జ్ఞప్తికి దెచ్చుకొని, జారిన దేశ గౌరవము చక్క దిద్దవలెనని అభిన వాంధ్రకవి శేఖరుడు అర్థించినాడు; వీరగంధము తెచ్చినారము, వీరు లెవ్వరో చెప్పుడీయని మరొకకవీశ్వరుడు ప్రశ్నించినాడు; దువ్వూరికవి కోకిలము రెడ్డికుల ప్రబోధమునందు, నైవేద్యమునందుస్వాతంత్ర్య రథము నందుశౌర్యసౌరభ్యమును వెదజల్లినాడు. విశ్వనాథకవిసమ్రాట్టు ఆంధ్ర దేశ భూపాలకథలను సంగ్రహించి ఖండ కావ్యహార మొక్కటి కల్పించి నాడు; ఎన్నడో యొకనాడు తాను ఆంధ్ర విరోధి కంఠదళన మొనరించిన సైనికుడననియు- యూనాడు :

"తెలుగు నదులెల్ల పొంగెత్తి ప్రళయవారి
కెరలి పడి తెలుగునేల ముగించనిమ్ము
నేటితో నస్వతంత్రతా నియతమైన
యీ బ్రదుకు తెన్గువారు భరించలేరు''-

అనియును చాటినాడు. ఈ కవివర్యులచే ప్రబోధితులై మన నవ్యకవి కుమారులు ఆంధ్రుల యశస్సును కావ్యగాన మొనరించినారు. వేయేల, అనేకులు అవసర సమయములందు కృష్ణజన్మస్థానముల నలంకరించుటకును వెనుదీయలేదు; స్వాతంత్ర్య దేవత వారికి సాక్షాత్కరించినది. ఈ విధముగా నవ్యసాహిత్యమున జాతీయ వాఙ్మయము ప్రభవించి, వీరరస ప్రధానములగు ననేక ఖండకావ్యములు తలయెత్తినవి. ప్రత్యేకముగా చారిత్రకగాథలు కొన్ని, వీర కావ్యరూపములను దాల్చినవి. బోడేపూడి వేంకటరావుగారి- యాంధ్రతేజము; పుట్టపర్తి నారాయణా చార్యులవారి- షాజీ; కొడాలి వెంకట సుబ్బారావుగారి- హంపీక్షేత్రము మున్నగునవి వీరిలో కొన్ని. అముద్రితమైన జాషువా కవీంద్రుని శివాజి ప్రబంధము మన వీరకావ్యాలలో ప్రత్యేకముగా పేర్కొనదగినది. మొత్తమీద పై గ్రంథములన్నియును ఖండ కావ్యములే యని చెప్పవచ్చును. శ్రీమధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారి ఆంధ్రపురాణము, ఆంధ్రదేశ చరిత్ర ఇతి వృత్తముగా కలిగిన మేలి కావ్యము.

ఈ పరిస్థితులలో ప్రొద్దుటూరి పురమున వీరరస ప్రధానములగు రెండు నిండు కావ్యములు జనించి, సారస్వతగగనమున సూర్యచంద్రులట్లు శోభిల్లుచున్నవి. ఇవియే ప్రతాపసింహ శివభారతములు.

ఈ గ్రంథకర్త లిరువురును మిక్కిలి సన్నిహితులగు నంతరంగ మిత్రులు. ఇరువురును అవధానులే. ఇరువురు కవిసింహులే. ఇరువురి కావ్యాదర్శము వీరపూజయే. ఇరువురి శైలియునంతగా నవ్యతావాసనలేని "ప్రబంధముల పక్వతతో గూడిన పురాణ శయ్య"

సహజమై కృత్రిమాలంకార రహితమైనభాష, ఈరెండు గ్రంథములును శ్రీవిశ్వనాథ వారన్నట్లుఅస్వతంత్ర జాతికిస్మృతిగ్రంథములు. మన ధర్మ మునే గాక మన పరిస్థితులనుగూడ చెప్పునవి; వాఙ్మయమున శాశ్వత ముగా నుండదగిన యుత్తమ కావ్యరాజములు.

బాహ్య దృష్టికి కవలబిడ్డలట్లు కన్పించు నీ రెండు కావ్యము లను సూక్ష్మముగా పరిశీలించిన ప్రత్యేక వైలక్షణ్యముతో భాసిల్లు చున్నవి. సంభాషణలు దీర్చుటలో, ప్రకృతివర్ణనా నైపుణ్యమున, పాత్రల హృదయప్రకటనా కౌశల్యమున శివభారతముమిన్న. రణరంగ వర్ణనమందు నిజముగా ప్రతాపుడే కవిగా నవతరించినాడేమోయను భ్రాంతిని కల్పించు రాజశేఖరుని గ్రంథము మేలు. "ఈనిన పులి యట్టు లెరిగిపై వ్రాలెడు" సైనికులు, పిడుగులు గుంపులై పడెడు వీకను, నిప్పులు రాలునట్లు పైబడెడు, తుపాకిగుండ్ల జడవానల పెల్లును ప్రదర్శించు యుద్ధచిత్రణమందు రాణాప్రతాప చరిత్ర శివ భారతముకన్న పైచేయి.

"తల్లి నే గట్టుకొని స్వాతంత్ర్య భవనరాజంబు కన్నీటి వరద మునిగె" మరియు –

> పిల్లలును మేము బయల జీవింపవలసె
> మానవుల కర్హమగు తిండి మరచిపోయి"—.

అను కరుణరస ప్రపూరితములగు ప్రతాపుని వాక్కులు హృద యములను చూర్ణ మొనరించుచున్నవి.

ఇట్టి కరుణ రస ప్రదర్శనము శివభారతమునందును కాననగును. ఉక్తివై చిత్రమీ రెండు కావ్యములందును సమృద్ధము. ఛందోదృష్టితో జూచినప్పుడు, ధారాశుద్ధియందు, యతి ప్రాసములు అప్రయత్నముగా భావము ననుసరించుట యందు ఈ రెండు గ్రంథములును యెన్నదగి నవే. రాణాప్రతాప చరిత్రయందు సీసములకు, గీతములకు ప్రాధాన్య

మెక్కువ. శివభారతమున యెక్కువగా వాడినవి వృత్తములు. చక్కని జాతీయోక్తులీ రెంటియందును కలవు. శివభారతమునకు శాంత రసము స్థాయి. ప్రతాప చరిత్రమున ప్రతి పదమునందున వీరరస ముట్టి పడు చుండును.

ఈ రెండు కావ్యములకుగల వైలక్షణ్యమునకు కారణము తత్కథానాయకుల విశిష్టతయే. ప్రతాపుడు ఆదర్శమునే ప్రధానముగా నెంచుకొని అందుకొరకు సర్వమునుత్యాగ మొనరింప సంసిద్ధుడు. పవిత్రమగు నాదర్శమును పవిత్రమగు సాధన సహాయమున పొందగోరువాడు ప్రతాపుడు. వెనుకముందాలోచించుట ఈతనిప్రకృతికి విరుద్ధము. కాని కార్యార్థియై, లక్ష్యసిద్ధికై సాధనశుద్ధినంతగా సరకు సేయనివాడు శివుడు.

ఈ రెండు గ్రంథములందలి యితివృత్తములును ఆంధ్రదేశమునకు సంబంధించనివి. ఆంధ్రచరిత్ర వీరగాథల కాలవాలము. ఆంధ్రులనేక సామ్రాజ్యముల నిర్మించిరి. వారి వైభవము ప్లినీవంటి చరిత్రకారునకు కన్నులు గుట్టినది; మార్కోపోలోవంటి యాత్రికుని దిగ్భ్రాంతి నొనరించినది. వారికి ప్రత్యేక సంస్కృతి గలదు; ప్రకాశవంతమగు సాహిత్యము కలదు; ఉజ్జ్వలమగు చరిత్రగలదు; ఎన్ని రాజ్యములు, ఎన్నిసామ్రాజ్యములు ఎన్నిఉద్యమాలు ఎన్ని యుద్ధములు, యెంత రాజనీతి నైపుణ్యము ఆంధ్రచరిత్రమున గోచరించునో ఒకమారు పుటలను తెరచిచూడుడు; రక్తాంకితములగు నక్షరములను తిలకింపుడు. ఎంతమంది యాంధ్రకవులీ గాథలను గాన మొనరించినారు ? ఎందర భావనాశక్తికి చరిత్ర దోహద మొసంగినది ?

(1944 సంవత్సరము వరంగలులో జరిగిన సారస్వత పరిషత్తు సమావేశములో చదివిన ఉపన్యాసము)

# వేయిపడగలు

నవ్యాంధ్ర సారస్వత విశేషము నవల, అధునిక సారస్వతమున ముఖ్యశాఖ వచన వాఙ్మయము; తదుపశాఖ నవల, భావకవిత్వమువలె నవలయు కొంతవరకాంగ్ల సాహితీ ప్రభావ చోదితమని చెప్పవచ్చును. కాదంబరీ, కళాపూర్ణోదయాదులందువలె, కథా చమత్కృతి, సంవిధాన చాతుర్యము, పాత్ర పోషణ, నవలా వాఙ్మయమున ముఖ్యములు. నవలలు సాంఘికములు, చారిత్రకములు, అపరాధపరిశోధకములని ముఖ్యముగా మూడు విధములు.

గద్య వాఙ్మయ ప్రచార బాహుళ్యముతోపాటు నవలా సారస్వతము మన తెలుగున వర్థిల్లుచున్నది. సారస్వతానుబంధములు, మాస పత్రికలు, గ్రంథమాలలు వీని యభివృద్ధికి తోడుపడినవి. మన విద్యార్థులకీ నవలలు ఉపవాచకములైనవి. గద్య తిక్కన శ్రీ వీరేశలింగము పంతులుగారి రాజశేఖర చరిత్రము మన భాషలో క్రొత్త యుగమును స్థాపించిన ప్రథమ నవల; మరియు ప్రశస్తమగు నవలలలో నొక్కటి. పంతులవారి సంస్కరణాభిలాష కీ నవల చక్కని అద్దము వంటిది. ఈ మార్గమున విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి కృషి ప్రత్యేక ప్రశంసనీయము. ఉత్తమ నవలలకు బహుమానముల నేర్పరచి, విమలాదేవి, రాయచూరు యుద్ధమువంటి చక్కని నవలలను యీసంస్థ ప్రకటించినది. సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకాగ్రగణ్యులగు వేంకట లక్ష్మణరావుగారి సంపాదకత్వమున వెలువడినవగుటచే గాబోలు యీ నవలలు చారిత్రకములు; తమకు గురుప్రాయులగు వీరేశలింగముగారి అనేక ఇతరోద్యమములకు తోడ్పడినట్లె, నవలా రచన యందును ముందంజ వేసి, ఆంధ్రులకు హేమలత, కర్పూరమంజరి- అహల్యాబాయి సౌందర్యతిలక, గణపతి వంటి యమూల్యములగు నవలల నొసంగిన వారు చిత్రవచనకావ్యరచనా నిపుణులు చిలకమర్తి లక్ష్మీనరసింహము

గారు. వీరి సుధాశరచ్చంద్రము రమేశచంద్రదత్తుని బంగాళీ ఆఖ్యాయికకు మనోహరమగు ననువాదము. చక్కదనమునకు మారుపేరగు వీరి శైలి వీరి నవలల కొక వింత విన్నాణ మొసగుచున్నది. అద్భుత నవలా రచనమున ఆంగ్లమున స్కాటువలె, లక్ష్మీ నరసింహము గారు అద్వితీయులు. ఈ సందర్భమున శ్రీ వేంకట పార్వతీశ్వర కవులను పేర్కొనవలసియుండును. ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల వారు వంగ భాష నుండి (ముఖ్యముగా బంకించంద్రునివి) అనేకములగు నవలల ననువదించి యాంధ్రుల కొసగిరి. శివశంకరశాస్త్రిగారి సంపాదకత్వమున నవలా ప్రకటనము కొరకే యుద్భవించి సేవయొనరించినది, సరస్వతీ గ్రంథ మండలి. ఈ గ్రంథ మండలి వారు ప్రకటించిన కేతవరపు వెంకటశాస్త్రిగారి లక్ష్మీ ప్రసాదము పూర్ణానందము, అగ్రహారము ఆంధ్రులకు సుపరిచితములు; మరియు స్వతంత్రరచనలు. ఇచ్చట పేర్కొనిన రెండు గ్రంథమాలలును అపరాధపరిశోధక నవలనువిరివిగా ప్రకటించినవి. వీరి నవలలలో స్వకపోల కల్పితములు తక్కువ. వంగమహారాష్ట్ర భాషల నుండి పరివర్తనము లధికములు. ఆంధ్రులలో నవలా పఠనమునందు అభిరుచి, ఉత్సాహము కల్పించిన వీగ్రంథమాలలు. నవీనుడగు చక్రపాణియు, విద్వద్వర్యులు పూజ్యులు వేలూరి శివరామ శాస్త్రిగారును శరచ్చంద్రుని నవలలనాంధ్రుల కొసంగినారు.

ఇట్లు క్రమపరిణామము నందినది మన నవలా సారస్వతము. అపరాధ పరిశోధక నవలలలో మనము చెప్పదగిన యభివృద్ధి జేయలేదు. చారిత్రక నవలలలో విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి వారి ప్రకటనములు, లక్ష్మీనరసింహముగారి గ్రంథములు దప్ప మనకు గర్వింపదగినవి లేవు. సాంఘిక నవలా రచనా రంగమున మనము కొంత అభివృద్ధి నొనరించితిమి. ప్రశస్తములగు సాంఘికనవలలు మనకుసంఖ్యలో పరిమితములు; తద్రచయితలును యిద్దరో, ముగ్గురో. ఉత్తమ రచన లెప్పుడును అసంఖ్యాకములు కావుగదా? "గంగి గోవుపాలు గంటెడై

వనుచాలు కడివెడైననేమి ఖరముపాలు" ! ఈ సందర్భమున ఉన్నవ లక్ష్మీనారాయణగారి మాలపల్లెయను మహోత్కృష్టమగు నవలా రాజమును ప్రత్యేకముగా ప్రశంసించవలసియుండును.

ఖండ కావ్యములతోపాటు భాషారంగమున చిన్న కథయు ప్రాముఖ్యము వహించినది. అనేకుల దృష్టి కొంత వరకు నవల నుండి చిన్నకథ వంక మరలినదని చెప్పవచ్చును. అనుచర కవికులముతో కలసి భావగీతముల నాలపించియు నవలా సారస్వతమున కృషి యొనరించిన వారలు కవి సమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు, శ్రీ అడవిబాపిరాజుగారును. నవ్యాంధ్ర కవికుమారులలో వీరిరువురు దప్ప ఉపజ్ఞా సహితములగు నవలలను రచించినవారు లేనే లేరేమో ?

విశ్వనాథ సత్యనారాయణగారి నవలలు విలక్షణమగు వ్యక్తిత్వము గలవి. వానిని పరభాషా నవలలతో పోల్చినప్పుడు తల వంచవలసిన యవసరము లేకపోవుటయేగాక గర్వించుటకు న్యాయమగు కారణములుగలవు. "వీరి వేయిపడగలు ధర్మరక్షణకు కంకణము గట్టుకొనినదన్నారు" ఆచార్య కురుగంటి సీతారామయ్యగారు. సత్యనారాయణగారు కవిసార్వభౌములు, సుకుమారహృదయులు. కావున సంఘమందలి యన్యాయములును, అక్రమములును వీరి హృదయమునకు సమ్మెటపోటయినవి. చచ్చిపోవుచున్న యొక జాతి చివరి మెరపులను జూచి వీరు తమ హృదయావేదన, భావోద్వేగము స్వీయ నవలల యందు వెల్లడించి సంఘమునకు సక్రమమగు దారి చూపినారు. వేయి పడగలు చెలియలికట్ట యిందుకు నిదర్శనములు.

భరత ఖండమున ఆకాలము సంధియుగము. పాశ్చాత్య వ్యామోహగ్రస్తులలో కొందరప్పుడప్పుడే కనులు విప్పినారు. జాతీయ భావములు ప్రబలుచుండెను. నాగరికతయని వ్యామోహపడిన వస్తువు

నిజమగు నాగరికతగాక సంఘ వృక్షమునకు బట్టిన చీడ పురుగని తెలిసి కొనుట జరిగినది. స్వీయ సంస్కృతియననేమో తెలిసికొను ప్రయత్నాలు ప్రారంభమైనవి. కాని ఈ భావపరిణామము మిక్కిలి మెల్లగా జరుగుచుండెను. దోహదము అత్యావసరముగా గన్పట్టినది. రాజకీయ దాస్యము మన ఆర్థిక వైజ్ఞానిక దాస్యములకు మూలకారణమైనది. ఆరోగ్యమునకు మోముువాచి జీవచ్ఛవములై, మన యువకులు చదివిన చదువుచున్న చదువుకు ప్రతిఫలము కడుపునిండ కూడైనను దొరకుట లేదు. కూలినాలి యొనర్చు పెంపేదల రక్తమును శ్రీమంతులు త్రావుట, సంఘమున కట్టుదిట్టముల నొల్లక జనులు స్వచ్ఛంద ప్రవృత్తులగుట, వైవాహిక సంస్థ మీద విశ్వాసము తగ్గుట, స్వైరవిహారము, కామసంతృప్తియే నిజమగు ప్రేమయని భ్రమించుట దేశములో కనుపించిన అవలక్షణాలు. ఈ భావముల ప్రచారమునకు కొంత సాహిత్యముకూడ జనించినది. వీరిలో ముఖ్యుడు గుడిపాటి వెంకటాచలము గారు. ఆయన రచించిన శశిరేఖయను నవలయు, ఇతర గ్రంథములును ఈ సిద్ధాంతములను ప్రతిపాదించినవి. ఈ స్వేచ్ఛ, ఈ భావములు మన యువకుల జీవితములను విషాదాంతములనుగా జేసినవి. భగ్న ప్రణయము భగ్న జీవితములు సామాన్యములైనవి. కావుననే సత్యనారాయణగారు నియమము నాగరికత, నియమము దాటిపోవుట పశువృత్తియని యెలుగెత్తి చాటినారు. చెలియలికట్టలోని నియమము నిలకడ లేని స్వేచ్ఛాజీవియగు రంగని జీవితమిందుకు నిదర్శనము. కామమే ప్రధానము, శరీరసౌఖ్యమే పరమావధియని భావించి విద్యుక్త ధర్మనిర్వహణము విస్మరించుట నాగరికత లక్షణముగాదు.

"సారపు ధర్మము న్విమలసత్యము, పాపముచేత బొంకుచే. పారము జెందలేక, చెడబారిదిగ్గైన, యవస్థ, దక్షులెవ్వారలు పేక సేతు, రదివారల చేటగుగాక, ధర్మనిస్తారకమయ్యు ఫలదాయక

మయ్యును దైవ ముండెడిన్" — అని మహా భారతము చెప్పు చున్నది.

కావుననే సత్యనారాయణగారు పేక్షింపజాలరైరి. ఒక జాతి యౌన్నత్యము, అభివృద్ధి తత్సారస్వతముపై నాధారపడి యుండును. కట్టబట్ట తినగూడును లేక యెన్నియో కోట్ల ప్రజలు మలమల మాడు చుండ, భావిదేశ కల్యాణమునకు బాధ్యులగు ప్రజలు ఇట్టి భావములకు దాసులగుట జూచి సత్యనారాయణ గారికి కలిగిన యావేదనకు మేర లేదు. ఈ స్వేచ్ఛాజీవుల యాంగ్ల వాఙ్మయవు పిచ్చిభాష కోసము తెలుగు ప్రబంధములుచదివినను భావములకొరకాంగ్ల భాషా గ్రంథ ములవశ్య పఠనీయములను నంతవరకు ముదిరినది. చెలియలి కట్టలో రంగడు, తత్సహచరులు: వేయిపడగలలో చక్రవర్తి, రాధాపత్యాదులు ఈ తెగలోనివారు. స్వజాతి, స్వభాషయను నహంకార దర్శనమందని జాతికి పురోభివృద్ధిలేదని కవివాణి పలుకుచున్నది. మన రుచులు; ఆభిరుచులు బాహ్యాదాస్యమునకు ప్రతిబింబములు; జీవితము కృత్రిమ మగు యంత్రమైనది. పండినచోట ధాన్య లక్ష్మి రైళ్ళమీదబడి మరి యెవ్వరికో ఆకలి దీర్చుటకు పరుగెత్తినది. ధనాశాపిశాచ మెల్లయెడల తాండవించినది. ప్రజలామెనేదైవమని భ్రమించి యారాధించినారు. సత్వము చచ్చిన దేశీయ ప్రజలు ధనవ్యయమును లెక్కసేయకున్నారు, గాని జరుగుచున్న యాత్మభ్రంశము తెలుసుకొనుటలేదు. బోగము దానికిచ్చిన డబ్బు మోటారు కొన్నదాని కన్న చెడిపోయినదా? అదియొక పేదజీవి బ్రతుకుటకైన ఉపయోగ పడినది కదా?

అధర్మములను అన్యాయములను జూచి సుకుమార హృదయులు సాధారణ మనుజులకన్న నెక్కుడు క్షోభింతురు. ఆ యావేదన, ఆ యుద్వేగము మహాగ్రంథ రచనగా ప్రత్యక్షమగును. విశ్వసాహిత్యము నొకమారు వీక్షించితిమేని, మహా గ్రంథరచయిత లెల్లరు క్షోభించి

కుమిలి కృశించినవారే ! సమకాలిక సంఘమునందలి యక్రమముల నెదుర్కొనిన వారే ! తత్ఫలితముగా ననేక కష్టముల ననుభవించిన వారే ! మహా రచయితలను సమకాలికులు గుర్తించి గౌరవించలేదు; పూల మాలికల నర్పించుకున్న మానె సంకెళ్ళను దగిలింపక విడువ లేదు, మహా గ్రంథముల కెన్నింటికో రచనారంగములు శ్రీకృష్ణ జన్మస్థానములైనవి.

ఒక మహారచయిత సంఘము నందలి యన్యాయములను అధర్మ ములను ఖండించి యెదురు తిరిగిన ఋంతవ్యుడే. కాని ఒకవ్యక్తి ప్రతిభా విశేషమును గుర్తింపని సమకాలికులు మాత్రము ఋమార్హులు కాజా లరు. సత్యనారాయణగారి గ్రంథములను జదివి పెదవి విరుచు వారీ విషయములను గమనించుట యావశ్యకము; ముఖ్యముగా వారి నవ లలు నొప్పి నొందిన యొక సుకుమార హృదయుని యావేదనయని తెలియనగును.

ఇంతకు శ్రీ సత్యనారాయణగారి యతివాదమును సమర్థించుట లేదు. ఏకీభవించుటయుకాదు. లోపముల కేమి, ఎవరును సర్వజ్ఞులు కారు గదా ? "నలినము శైవలంబున పెనంగొని యుండియు రమ్యమేయ గున్;" వేయేల, అకళంకమే, ఆ మచ్చయే చందమామ యంద చంద ములను ద్విగుణీకృత మొనరించును. చూడుడు---

"వెన్నునికున్న మచ్చ యరవిందము రత్నము భోగిలక్షణం
బెన్నగ నీదుమచ్చ యదియేమో కళంకము నిచ్చకాల నన్
తిన్నగ నిట్లయుండును గదే, గిరికవ్వము దూసి, చన్న, నీయన్నువమచ్చ
నెవ్వరెటు లాడిననున్ మన కేమిలే సఖా"

ప్రాతయాచారములు నశించి శక్తిలేని నూతనత్వము మనల నావ రించన సంధికాలమున, నాగరికత యనబడు నీ నూత్నత్వము నెడల

ప్రబలుచుండిన యసంతృప్తి ఈ నవలకథావిధానమున కాకరము. రామేశ్వరశాస్త్రిగారు వర్ణాశ్రమ ధర్మములన్నియు ముద్ద కట్టిన మూర్తి. ఆర్షేయపౌరుషేయముల కాయన పర్యాయపదము, ఆత్మ గౌరవముగల యాతనికి తగిన జమీన్‌దారుడు కృష్ణమనాయుడు; రంగా జమ్మ ఆయన రాసిక్యమునకు పెన్నిధి; మహోదారగుణ సంపన్న. రుక్మిణమ్మారావుగారు సర్వవిధముల కృష్ణమనాయనికి సహధర్మచారిణి; గోపన్న జమీన్‌దారులకు నమ్మినబంటు; భక్తిప్రపత్తులు, సేవ. భూతదయ ఆయనయందు మూర్తీభవించినవి. రామేశ్వరశాస్త్రి తనకు జేసిన మేలు మరవక నోరుదెరచి యాచింపనేరని ధర్మారావుకు మహోపకార మొనర్చినవాడు, గోపన్న. ఇన్నాళ్ళుగ నెవరి యుప్పుదిని బ్రతికెనో వారికి దూరముగ నెక్కడనో మరణింపక కోటకరుగుదెంచి ఆ "నల్లనివాడు పద్మనయనంబులవాడు" అను పద్యమును కర్ణామృతముగ నాలకించి కాని యసువులు విడువని ఇచ్ఛాశక్తి సమన్వితుడు, గోపన్న. విద్యుల్లతవలె వారి గొప్పదనము ఒకమారు మెరసి వారి భౌతిక కాయములతో పాటు యీ ప్రపంచము నుండి మాయమైనది. పరదేశనాగరికతా ప్రభావము నుండి తప్పించుకొన్న యదృష్ట జీవులు వారు.

క్రమక్రమముగా ప్రాతమర్యాదలు పోవుచుండెను. ఇంగ్లీషు చదువు సుబ్బన్న పేటలోనికి ప్రవేశించినది. దానితోపాటు స్వాతంత్ర్యము, వ్యక్తిగౌరవము సంఘమును వశీకృత మొనరించుకొన్నవి. పూర్వ మర్యాదలు, పూర్వపద్ధతులు నిష్క్రమించినవి. ధనవంతులే గౌరవనీయులను భావములు ప్రబలినవి. రంగారావుగారి పరిపాలన మారంభమైనది. ఆయన చెలియలి కట్టలో రంగని వలెయాంగ్లమానస పుత్రుడు. రైతులను మాడ్చిపీడించిన ధన మాయన వెల్లపనుగు నిమిత్తము. భోగ లాలసత కొరకు వెచ్చించెను. గుమాస్తాలను, సేవకులను తొలంగించి మిగిలించిన ధన మాయన విదేశ వస్తువుల

కొరకు వినియోగించెను. గవర్నరుగారి నజరానాలకు, పెట్రోలుకు కారులకు, రైళ్ళకు వ్యయముజేసిన ధనమునకు లెక్కయే లేదు. రాజాదరణ లేక మన పరిశ్రమలు, మన లలితకళలు, మన ఆయుర్వేదము మన విజ్ఞానము తుదకు మన వ్యవసాయము అంతరించుటకు సర్వసన్నాహములు సంపూర్తియైనవి. పురపాలక సంఘములు, ఎన్నికలు మున్నగువానియందు తగులుకొనిన వారికీ గోలయేల?

ఈ విధముగా కారుమబ్బులు గ్రమ్ముకొని యున్న ఆకసమున మినుకుమినుకుమనుతారకలు ధర్మారావు, అరుంధతి, గిరిక, కేశవరావు మున్నగువారు. తండ్రిగారి కీర్తి ప్రతిష్ఠలకు పాండిత్య పౌరుషములకు, దారిద్ర్యమునకు వారసు ధర్మారావు. సత్యనారాయణగారు ధర్మారావు రూపమున యీ నవలయందు గన్పట్టుచున్నారేమో యను సందేహము కలుగుచున్నది. అరుంధతి ధర్మారావునకు అనురూప గుణ ప్రచురయగు ప్రేయసి. ఆర్థికములగు చిక్కులు వారి యనురాగమున కెట్టి యాటంకము కలిగింపలేదు.

సామాన్య సంసారుల దైనందిన జీవితమును కనులగట్టినట్లు చిత్రించినవారలు విశ్వనాథ, మునిమాణిక్యముగార్లు- అరుంధతి ధర్మారావుల యనురాగప్రసంగములు కాంతం కథలను జ్ఞప్తికి దెచ్చును. సాంసారిక జీవితమున సౌఖ్యమొన గూర్చునవి మేడలు, మోటరులు కావు; మరి నిష్కల్మషమగు ప్రేమ, పూటపూటకు కష్టపడుచుండిన రోజులయందును అరుంధతీ ధర్మారావుల మనస్సులు వారిని యానంద సాగరమున నోలలాడించినవి. అనుభవ వివాహములను, స్వేచ్ఛాప్రేమ సూత్రములను బోధించు కాలమున, వివాహసంస్థను ధిక్కరించు దినములలో సత్యనారాయణగారు చిత్రించిన వైవాహిక జీవితపు సౌందర్యపావిత్ర్యములు మిక్కిలి సరసములుగా నున్నవి.

అరుంధతి మధురమూర్తి. ఆమెవాక్కులకు సహజగుణమగు రసస్ఫోరకత్వము ధర్మారావు సహవాసముచే నిగ్గులు దీరినది. గుణ

గ్రహణ నైపుణ్యమున ఆమెకు ఆమెయేసాటి. ఎన్ని నోముల ఫలమో యరుంధతీగిరికారథంతరుల సరాగము. ఒకరికొకరు ప్రాణమిచ్చు కొందరు. వారి సంభాషణ లెన్ని మారులు చదివినను పాఠకునికి తనివి దీరదు. శశిరేఖ యన్నట్లు వారు ముగ్గురు విచిత్రస్త్రీలు. ఒకరికన్న నొకరు పవిత్రశీలలు, వివేకవతులు. ఒక్కరికిని ఆంగ్లేయ వాసనలేదు. మాటలలో రసస్ఫురణ చాల గలదు. మూడవయామె కన్నులలో దివ్య జ్యోతి. హారప్ప కరడు గట్టిన జాతీయత; ప్రబలుచున్న ప్రాశ్చాత్య పద్ధతులపై తిరుగుబాటు. ఆధునిక నాగరికతపై తిరుగు బాటు నాగమ్మ; పసరిక పైరుపచ్చ. మనకురాజు పోయినను సరే, మరేమి నశించినను సరే, పసరిక యొక్కటియున్న చాలుననును, ధర్మారావు-నాయరు మహోదారుడగువ్యక్తి. ఆనాడు ధర్మారావు, గృహమునకేగి తనకడ మిగిలియున్న రెండు రూపాయలు చేతులో పెట్టినపుడు మహా మేధావియగు ధర్మారావు నాయరు ముందు కుంచించుకొని రేణువై పోయెను. నాయరు గొప్పదనమును, ఎవరి నెత్తురు ద్రావి తాను బలిసెనో ఆ పేదవాని శిరసుపైన యెక్కి సవారి చేయవలెనను ధనికుల చిత్తవృత్తితో పోల్చుడు. "నేను న్యాయముగా సంపాదించుచున్నాను. నాకు చాలినంత దీసి కొందును, లోకములో నిన్ని దొంగతనములు జరుగుచుండినను బాగుపడినదొంగ యెవడు" అని ప్రశ్నించుచున్న అసిరిగాని మాటల చాటునుండి సత్యనారాయణ గారు తొంగిచూచు చున్నారు.

అస్ఖలిత ప్రణయానురక్తి చిరంతనశుద్ధిచే గాని కలుగ బోదు, అనినారు రాయప్రోలు సుబ్బరావుగారు. వేయిపడగలలోని శశిరేఖ ప్రేమయిట్టిదే. కిరీటికామె యంతరంగ శాంతి దేవత, తపః కల్పవల్లి. వారియన్యోన్యప్రేమ కామ ప్రవృత్తికి లొంగిన స్వైర విహారముగాదు. అది నియమబద్ధము, దైవ భక్తికివిధేయము.

సాహిత్యము సమకాలిక జీవితమును విస్మరింప జాలదను సత్యమునకు నిదర్శన మీ గ్రంథము. జాతీయ వాయువు లీపాత్రముస నెల్లెడ వీచుచున్నవి. కేశవరావు ఆంధ్రరత్న గోపాల కృష్ణుని జ్ఞప్తికిదెచ్చుచున్నాడు మనదేశమున దేనికిని నూపులేదు. ఖద్దరుకు మారేమిటి ? అదియెప్పుడును పవిత్రమే, నిర్మలినమే యను ధర్మారావు, హారప్ప, కేశవరావు, మనజాతీయ వాదులే.

భరతవర్షమునకు జీవనాధారము వ్యవసాయము. కాని దురాశ, ధనదేవతలకు మోకరిల్లి వరి పైరునుదప్ప యితరములను పండించుట మానినాడు, మనకర్షకుడు. పశువులకు మేతవేయు విచారమే లేదు, మనరైతుకు. వరిపైరును తప్ప తదితరములకు పరదేశములపై నాధారపడుచున్నాము. మతమును సంఘమును మనోహరముగా జెప్పునది వాఙ్మయమని సత్యనారాయణగారి నిర్వచనము. మన మతమును సంఘమును మనోహరముగా వ్యక్తీకరించినది వేయి పడగలు.

మత్స్యగంధి సమీపమున నన్నయభట్టారకునివలె గిరికా సన్నిధానమున సత్యనారాయణగారు ముగ్ధులైనారు. కావుననే గిరకతో పాటు వారును "అదే నందనందనుండంతర్హితుడయ్యె పాటలీ తరులార పట్టరమ్మ" అని నృత్య మొనరించినారు. చివరకు గిరిక పుణ్యములు పండి స్వామిలో లీనమైనది. అనంతరము శుష్కించి తనచిన్నారి మరదలిని చేర బోయినదరుంధతి. రైతు కృతక భావములకు లోనైనాడు పసరిక పొలాలవంక పరువెత్తినది "మెట్టపొలాలు లేనిచో జాతి త్రాచులము మాబ్రతుకెట్లు ? రైతు మాకు నిలువ నీడలేకుండ జేసెను. నీవు పాశ్చాత్యవ్యామోహ గ్రస్తుడవై మమ్ము చేతులార జంపితివి" అని జాతి పాములా పసరికను పీడిచనెను-తుదకు పాము గరువగా పసరిక ప్రాణము పీడెను.

ఈ విధముగా శక్తి లేనియొక క్రొత్తదనము లోకము నావరించినది. ప్రాతదెల్ల నశించిపోయినది. వేయిపడగల సుబ్రహ్మణ్యేశ్వరస్వామియే రెండు పడగలతో మిగిలినాడు. ధర్మార్థకామ మోక్షహేతువులగు విద్యలు నశించినవి. కేశవరావు గతించెను. స్వర్గమర్త్యములకు లంకె గణాచారి పోయినది. ఇక మిగిలినదొక పతివ్రత; సనాతని ; అధఃపతితమగు భారతజాతి నుద్ధరింపజేయ నామెయే సమర్థురాలు. ఖడ్గతిక్కన భార్య, రుద్రమదేవి మున్నగు వారివలె ఆమె భారతీయులను చైతన్యపూరితులను జేసి జాతిని పునరుద్ధరింప సమర్థురాలు.

అనుకరణము ఆత్మహత్య; పరధర్మము భయావహము. కావున దేశకాల పాత్రముల కనుగుణముగా స్వధర్మమును నవరించుకొని జాత్యభ్యుదయమునకు పాటుపడవలెనని సత్యనారాయణగారు మనకొక దివ్యసందేశ మొసగుచున్నారు. మన కళలు, మన పరిశ్రమలు, మన సంస్కృతి, మన వ్యవసాయములనుద్ధరింప నడుముగట్టుకొని కార్య రంగమున దుముకుట కింతకన్న నుమహాదవకాశము లేదు.

ఉక్తివైచిత్ర్యము కవితాగుణములలో నొక్కటి. మహాకవులగు విశ్వనాథవారి రచనలయందీగుణము సమృద్ధము. వారి వాక్యవిన్యాసమునం దొకవిధమగు చక్కదనము, భావములయందొక నూత్నత్వము, సౌందర్యము, ఉక్తివైచిత్రి, ఔన్నత్యము, గాంభీర్యము గాననగును.

వేయి పడగలు భావప్రేరకమగు నవల, ఉత్తేజకరమగు రచన.

(తెలంగాణదినపత్రికలో)
(1942)

—(•)—

# మునిమాణిక్యంవారి కాంతం

భారత రామాయణాలలోని పాత్రలను విడిచిపెట్టితే ఆంధ్ర సారస్వతంలో సజీవమైన పాత్రలు చాలా తక్కువని ఒప్పుకోక తప్పదు. ప్రబంధాలలోని నాయికానాయకులు భావనా ప్రపంచము లోనివారే. కాని వాస్తవిక ప్రపంచానికి చెందినవారు కారు. ప్రజలలో ఈ పాత్రలకు పలుకుబడి మిక్కిలి తక్కువ ; జీవకళ గూడ తక్కువే. వరూధిని సత్యభామ, కలభాషిణివంటి కొందరిలో మాత్రం చైతన్యమూ, జీవకళా కనుపించుతవి. కాని వీరినైనా సామాన్య ప్రజానీకం అర్థం చేసుకోవడం కష్టం. వరూధిని అప్సరో భామిని ; సత్యభామ రాజ కన్య, కలభాషిణి వేశ్యాంగన. అందుచేత ఈ ముగ్గురూ, సామాన్య ప్రజలలోనివారు కారనే చెప్పవలెను. ప్రబంధాలలో చిత్రించిన స్త్రీ పాత్రలలో ఒక్క నిగమశర్మ అక్కమాత్రం మనం ప్రతిదినం మన కుటుంబాలయందు చూస్తున్న స్త్రీల తరగతిలోనిది.

పూర్వసాహిత్యంలోనే కాకుండా, ఆధునిక సాహిత్యంలో కూడా జీవకళతో విలసిల్లుతున్న పాత్రలు వేళ్ళమీద లెక్కపెట్ట దగినవే. గిరీశం ఆధునికనాగరికతా సంపర్కం, ఆంగ్లభాషా పరిచయం కలిగినవారిని మాత్రమే ఆకర్షించుతున్నాడు. పట్టణాలలోనే గిరీశం కనబడుతాడు. గ్రామప్రాంతాలలోని జన సామాన్యంలో గిరీశం కనబడదు-గిరీశం హాస్యం కొంతవరకు ఆంగ్లభాషా పదాలపైన ఆధారపడి వుంటుంది. పల్లెపట్టులలోని గ్రామీణులకు ముఖ్యంగా తెలంగాణ ప్రాంతాలవారికి గిరీశం హాస్యం అర్థం కావడం కష్టం. బారిష్టర్ పార్వతీశం కూడ పూర్తిగా కాక పోయిన కొంతవరకు ఇట్టివాడే. పార్వతీశం కథ లండను ప్రయాణంతో మొదలవుతుంది. లండనులో పార్వతీశం హ్యాటు సంఘటనలోని హాస్యం అర్థంచేసుకోడానికి ఒక విధమైన వాతావరణ అవసరం. యెంకి జీవితమే ప్రేమాభిరామమని ఒకమాట

చెప్తే చాలు, ఆమెవ్యక్తిత్వం నిరూపించడానికి. కాంతంవీరందరి వంటిది కాదు; ఆమె సామాన్య సంసారి; అచ్చంగా తెలుగింటి ఆడ బిడ్డ; ఆంధ్రదేశంలో యే ప్రాంతంలోని యే గ్రామానికి వెళ్ళినా మనకు కాంతం కనుపించి తీరుతుంది. ఆమె వేషభాషలు సకలాంధ్ర జనులకు అర్థమౌతవి; ఆమె హాస్యం మిక్కిలి సున్నితమైంది.

కాంతం జగదేకసుందరి అని చెప్పడానికి వీలులేదు. ఎందు కంటె-ఆమె పల్లవపాణిగాని, పద్మనయనగాని, రాకేందుబింబానన గాని కాదు. ఫేసుపవుడర్లు, లిప్‌స్టిక్కులు, మున్నగు ఆధునిక సౌందర్య పోషణ పరికరాలను, విలాససామగ్రిని ఉపయోగించడంలో నేర్పు కలిగిన నవనాగరికురాలుకూడ కాదు, కాతం. భర్తమీద కోపంవస్తే "కలస్వనం" తో గాని. "కలకంఠ వధూకల కాకలీధ్వను" లతో గాని, "కాంభోజి మేళ విపంచికా" స్వనంతో గాని యేడ్వగలిగిన సామర్థ్యం కాంతానికి లేదు. కాంతం టెన్నిసు ఆడలేదు; కారు నడపడం చేత గాదు; తుదకు భర్త వెంట సాయంకాలంపూట కొంచెంసేపు వాహ్యాళి కైనా వెళ్ళలేదు. కాని యీ సామర్థ్యాలన్నీ కలిగిన సతీమణుల కంటె, యెక్కువ సమ్మోహనశక్తి ఉన్నది ఆమెకు.

బ్రోచికూడ సరిగ్గా పెట్టుకోడానికి చేతగానిపల్లెటూరు పడుచు కాంతం. ఈనాటి క్రొత్తఫ్యాషన్‌లు కొన్ని ఆమె భర్త వద్దనే నేర్చు కున్నది.

కాంతం అంత పొడిగరీకాదు; పొట్టికాదు; చామన చాయ శరీరము; నవ్వుమొగము; చక్కని నేత్రాలుకలిగిన ఓమోస్తరు అంద గత్తె ఆమె; రూపురేఖలు, అందచందాలు, హావభావాలు, చదువు సంధ్యలు, సిరిసంపదలు, అన్నీ సంసారపక్షమే కాంతానికి. ఆమెకు తెల్ల చీరలమీద ప్రేమ, మల్లెపూలమీద మక్కువ.

తన బాధ్యతలు, కష్టసుఖాలు, బాగా గ్రహించగలిగిన సాధ్వి కాంతం. కాపురానికి వచ్చిన క్రొత్తలో తనను విడిచి, క్షణం ఉండ జాలని భర్తను బుజ్జగించి, కాలేజికి పంపి, పాఠాలు చదివించి, పరీక్షలు ప్యాసుజేయించిన బాధ్యతగలవ్యక్తి ఆమె. కాలేజికి వెళ్ళివచ్చిన తర్వాత పెందలాడే భోజనం పెట్టి ఆమె భర్తను సక్రమంగా చదివించింది. కాపు రానికివచ్చిన క్రొత్తదినాలనుంచే, ఆమెభర్తను అదుపు ఆజ్ఞలోనుంచి కొంగున ముడివేసుకున్నది. తాను గీసినగీటు దాటకుండా భర్తకు శిక్షణ యిచ్చిన ఉపాధ్యాయిని కాంతమ్మ.

కాంతానికి ఇంగ్లీషురాదు. కాని భర్తతో ఆమె "మీరు ఇంగ్లీ షులో మాట్లాడుతుంటే నాకేదో అర్థమైనట్లేవుంటుందండీ" అని అంటుంది. అంటే భర్తమోము చూచి ఆమె ఆయన హృద్గతాభిప్రా యాలను తెలుసుకోగలదన్న మాట.

కాంతానికి భర్త ఇంగ్లీషు చెప్పించాలెనని అనుకున్నాడు. కాని యెంత ప్రయత్నం చేసినా అదిసాధ్యం కాలేదు. ఆమెకు నగల మీద వున్నంత ప్రేమఇంగ్లీషుమీద లేదు. కనీసం ఆమెచేత వార్తాపత్రికనైనా చదివించవలె ననుకుంటే, అదీ నెరవేరలేదు.

కాంతం ఒక విధంగా చాలా అనూయకురాలనీ, ప్రపంచ జ్ఞానం బొత్తిగా లేనిదని చెప్పవచ్చును. "రేపు యుద్ధం ఆపి నవరసులు ఒక గంట సేపు చవుకగా అమ్ముతారని" యెవరో చెప్పితే పాపం ఆమె నమ్ముతుంది. నమ్మడమే కాకుండా, ఆసమయానికిఅక్కడికివెళ్ళి చవుక ధరకు నవరసులు తీసుకొని రానందున భర్తను కోపిస్తుంది. ఒక రోజు పిల్లవాణ్ని ఉపాధ్యాయుడు దెబ్బలుకొడితే,ఆమెభర్తతో "చూడండి, ఆ మాష్టర్ చేతులెట్లా వచ్చినాయో! అనవసరంగా పిల్లవాణ్ని కొట్టాడు. చైనా ఎక్కడున్నదో చెప్పమన్నాడట. వీడు చిన్న వాడాయె, ఎక్కడపెట్టాడో, మరచిపోయినాడు" అని అంటుంది.

కాంతానికి నగలమీద వుండేకోరిక ఇంగ్లీషు చదువుమీద, వార్తా పత్రికలమీద లేదని ఇంతకుముందే చెప్పినాను. లంకాయాగం, కుచేల కథ మొదలయినవి కాంతం బాగా చదువుకున్నది. కుమారి శతకం, నృసింహశతకంగూడ చదువుకున్నది. ప్రహ్లాద చరిత్ర మొదలయినవి అర్థంతెలిసి చదువగలిగేది.

శ్రీరాములు అయోధ్యలో వుండేవాడని ఆమెకు తెలుసు. కాని వైసురాయి యెక్కడవుంటాడో ఆమెకుతెలియదు. శ్రీరాములు దండకారణ్యానికి యే మార్గాన పోయినాడో ఆమెకు తెలుసు, కాని మనం మద్రాసుకు యెట్లా పోవలెనో ఆమెకు తెలియదు. పంచాంగం చూచి తిథి వార నక్షత్రాలు చెప్పగలదు. రైల్వేగైడ్ చూడడం ఆమె చేత గాదు.

అయితే కాంతం మంచి ఊహ తెలివితేటలు గలది. భర్త పిల్లవానిచేత గుర్రాన్ని గూర్చి కాంపోజిషన్ వ్రాయించితే "పిల్లవాడికి గుఱ్ఱాలను గూర్చి గాడిదలను గూర్చి పాఠాలు చెప్పుతారండి!" అని ఆశ్చర్యపడుతుంది. భర్తను వేళాకోళం చేస్తుంది.

కాంతం మంచి పొదుపరి. భర్తజేబులో అవసరానికన్న ఎక్కువ డబ్బు ఉండనీయకుండా జాగ్రత్త పడుతుంది.

ప్రపంచములో సాధారణంగా స్త్రీలకు పుట్టింటిమీద మమకారం యెక్కువ. కాంతం యిందుకు అపవాదం కాదు. తనభర్త పూర్వీకులు తన పూర్వీకులంత గొప్పవాళ్లు కాదని ఆమె అభిప్రాయం. సామాన్యంగా అందరు స్త్రీలవలె భర్త పరాయి స్త్రీవంక కన్నెత్తి చూడడం కూడ, ఎంత మాత్రం యిష్టపడదు. భర్త యెవరో స్త్రీని ముద్దుపెట్టు కున్నట్టు కలవస్తే ఆమె యెంతో ఆదుర్దాపడుతుంది.

కాంతం మంచి మాటకారి. ఆమెమాటల్లో సున్నితమైన హాస్యం, లలితమైన చాతుర్యం, ప్రతిబింబిస్తుంటవి. కాపురానికి వచ్చిన క్రొత్త

లోనే భర్తను స్వాధీనం చేసుకున్న నెరజాణ ఆమె. ఒకనాడు వారిద్దరు అప్తుల యింటికి వెళ్ళిరి. కాంతానికి వదినవరుసగల ఆ యింటి యజమానురాలు యీ క్రొత్త దంపతులను, పేరు చెప్పనిదే గడపదాటిలోపలికి రావద్దని సరసమాడింది. ఆ సందర్భంలో పరిహాసానికి ఆమె భర్త తన భార్య పేరు సుబ్బలక్ష్మి అని అబద్ధమాడెను. తరువాత గడుసరియైన కాంతం, కాఫీ అతని చేతులమీద ఒలకబోసి ఇకముందు ఇట్టి పని చేయవద్దని బుద్ధి చెప్పింది. ఆనాటిరాత్రి భోజనాలవద్ద జరిగిన మరొక మధుర సంఘటన, కాంతం ప్రసంగ కుశలతకు, మాటకుమాట బదులు చెప్పే నేర్పుకు, రసికత్వానికి మంచి నిదర్శనం. కాంతంభర్త ఆమెకన్న తొందరగా భోజనం ముగించి యెవరూ చూడకుండా, పెరుగు చేతిని కాంతం బుగ్గలకు రాసి వెళ్ళిపోతాడు. అప్పుడుఇది కనిపెట్టి వదినెగారు- "ఏమేపిల్ల! అదేమి ఆగడమే, పెరుగు బాగుంటే ఇంకా రెండు ముద్దలు తినాలిగాని, బుగ్గలకు పూసుకుంటారా!" అని హాస్యమాడితే వెంటనే కాంతం - "మీతమ్ముడు సరిగ్గా తినకుండా లేచిపోయినారు, చూశావా వదినా-వారికొరకే కాస్త బుగ్గలకు పూసుకున్నాను" అని బదులుచెప్పి సమయస్ఫూర్తిని ప్రకటించింది.

ఎంత కోపంలోవున్నా నవ్వించగల మాటపొందిక కాంతానికి పెట్టనిసొమ్ము - దెబ్బదగలకుండా హాస్యం ఆడటంలో కాంతానికి పెట్టింది పేరు. ఒకరోజు భర్త-"మీ చెల్లెలు ఒకకోతి, మీ అక్కయ్య మరోకోతి, తోకలు మాత్రం లేవు" అని యెగతాళిచేస్తే, ఆమె యే మాత్రం తడుముకోకుండా, "మీచెల్లెళ్ళకుఆలోటూలేదు"అని జవాబు చెప్పుతుంది.

ఇంకొకసారి జరిగిన సంఘటన యేమనగా- దంపతులిద్దరి మధ్య ప్రణయకలహం వచ్చింది. మూడు రోజులు మాట్లాడుకోలేదు వారు. అయితే యీ పరిస్థితి ఇద్దరికీ దుర్భరంగానే వున్నది. ఈ సందర్భంలో

ఒకరు మేడమీదికిపోతూ, మరొకరు మేడ క్రిందికివస్తూ, వారిద్దరు ఎదురు పడడం తటస్థించింది. మేడమెట్లు మిక్కిలి ఇరుకైనవి. ఒకమారు ఒక్కరే వెళ్ళగలరు. ఆ మెట్లమీద కొంతసేపు ఇద్దరూ అల్లే నిల బడ్డారు. ఒకరు మరొకరు తప్పుకోవలెనని ఆశించుతూ ఎవ్వరూ తప్పుకోలేదు. అప్పుడు కాంతం "కొద్దిగా దారియివ్వండని" అడుగు తుంది. ఆయన "నేను ఫూల్సుకు దారియివ్వ" నంటాడు. వెంటనే ఆమె-"అయితే నేను మాత్రం యిస్తా" నని చెప్పుతూ దారి యిస్తుంది. మరొకమారు భర్త "నేను వొట్టి తెలివి తక్కువ వాడిననా, నీ అను మానం" అంటాడు. "అహఁ, హాఁ, హాఁ, అనుమానమేమిలేదు. గట్టి నమ్మకమే" నంటుంది, మాటల మూటయైన కాంతం. ఇంకోసారి. ఇంటిలోని పాడిగొడ్డు పోట్లమారిదైనందున అమ్మివేస్తానంటాడు భర్త. అప్పుడు కాంతం- "పాడిగొడ్డును అమ్ముకొంటారండీ పోట్లదైనంత మాత్రాన. ఇంతకూ ఆమాటకొస్తే, నేను మిమ్మల్ని పెట్టుకొని కాపు రం చెయ్యలేదండీ యిన్నాళ్ళు" అని అంటుంది. కాంతం మాటకారి తనానికి, ప్రసంగ కుశలతకూ, హాస్యోక్తి చాతుర్యానికి ఇట్టిసంఘటన లెన్నైనా చూపించవచ్చును.

కాంతం జీవితమే ఒక లలిత మధుర శృంగార కావ్యం. కార్యం గాకముందు ఒకనాడు భర్త ఆమెను ఒంటరిగా కలుసుకొని కౌగలించు కుంటే. చెంపమీద మృదువుగా కొట్టి, మందలించిన, మధురమూర్తి కాంతం. ప్రతిదినము రాత్రి భర్త కూర్చున్న కుర్చీకి సరిగ్గా వెనుక నున్న గూట్లో స్నోబాటిల్ వెదికే నెపంతో అతని బుజాల మీదచెయ్యి వేసి, అవసరం లేకపోయినా కొద్దిగానొక్కి, తన వక్షస్థలం అతని చెంపకుతాకించి, భర్తను రంజింపజేసే చతురశృంగారవతి కాంతమ్మ. తన బహుకాల తపఃఫలమని యీమెను జూచి కాంతం విధేయుడైన భర్త మురిసిపోతాడు.

మొదటి రోజుల్లో, ఆమె తన తనుద్యుతి, కుటిలాలకాలు, సుదీర్ఘ నీల శిరోజాలు, ముఖవికాసం చేత భర్తను ఆకర్షించింది. యవ్వనపు పొంగు చల్లారి, పిల్లలతల్లియైన తరువాత ఆమె తన స్వభావం, ప్రవర్తన ప్రేమా, చమత్కార సంభాషణా మొదలయిన గుణాలచే భర్తను వశీకృతుణ్ణి జేసుకున్నది. దాంపత్యంలో ఉండే విలువకు కాంతంజీవితం ఒక మంచి నిదర్శనం.

అసంతృప్తి ఆమె జీవితంలో యెక్కడాలేదు. జీవితం అంతా త్యాగమే ఆమెకు. భర్తకూ, పిల్లలకూ. సేవజేయడంలో తన సౌందర్యమూ, యవ్వనమూ, అన్నీ త్యాగంచేసిన ధన్యజీవి ఆమె.

"చీకటిలో దేవులాడుతున్న నా బ్రతుకుకు ఆమె ధృవతార; హృదయక్షేత్రానికి అమృతవాహిని; నా సహోదరి, భార్యా అన్నీ ఆమెయే" నని భర్త చేత మెప్పులుపొందిన కాంతానికి జీవితంలో తృప్తి లేకపోవడమనే సమస్య యెన్నడూ కలుగలేదు.

గృహామే భూతలస్వర్గముగా ఆమె మార్చింది. ఆదర్శ గృహిణియైన మునిమాణిక్యంవారి కాంతం తెలుగు నాయికలలో మాణిక్యం వంటిది. మన పూర్వులు చెప్పిన— "షట్ధర్మ యుక్తా కులధర్మపత్నీ" అన్న సూక్తి ఆమెయందు అక్షరాల వర్తించుతుంది.

కాంతం భర్తచెప్పినట్లు, యెంతటిహీనుడోకదా, ఆ భగవంతుడు. తాను నిర్మించిన సుందరభవనంలో వుండే అతి సుందరవస్తువునే కూల్చినాడు.

(రేడియో ప్రసంగము 1950)

— : : —

# దీక్షితులుగారి వటీరావు

ఔను; నిజమే! మనలోను ఉన్నారు శ్రీమతి వటీరావు. సందేహం యేమీ లేదు- అందుచేతనే దీక్షితులుగారు తమ పీఠికలో యే ప్రత్యేక వ్యక్తిని గూర్చి యీ చిత్రణ చేయలేదని మొదటే చెప్పినారు. అందువలన యెవరూ ఉలికిపడవలసిన అవసరంలేదు.

చూడండి జాగ్రత్తగా ఒకసారి! కొంచెం పోల్చి పరికించండి! మన సమాజంలో శ్రీమతి వటీరావులు చాలా మంది కనుపిస్తారు. కావుననే ఈ చిత్రణ ఒక ప్రత్యేక సమాజ శ్రేణిని ప్రతిబింబిస్తుంది. అంతేకాని ఇందులో యేవొక వ్యక్తి ప్రస్తావనాలేదు; తరగతి ప్రస్తావన దప్ప.

రచయిత ఎంత కాదన్నప్పటికి సమకాలీన జీవితము ఆయన పుస్తకాలలో ప్రతిబింబించక తప్పదు. అదేవిధంగా ఆధునిక కవులు. కథకులు, నవలారచయితలు తాము ప్రతిరోజు చూస్తున్న సంఘటనలనూ, సమాజంలో తమ కెదురయ్యే వ్యక్తులను తమ రచనలలో చిత్రించడము సహజము. ఇటువంటి చిత్రణకు సంబంధించినవే వటీరావు కథలు.

శ్రీమతి వటీరావును చిత్రించి కొన్ని దశాబ్దాలు గడిచి పోయినప్పటికినీ, యీనాటికి ఆ శ్రేణికి చెంది, లోకంతో మనకేమి పని అని అనుకొనే లోలాకులు, క్లబ్బుల మనస్తత్వంగల,కాంతలు సమాజంలో అత్యధిక సంఖ్యలో కనుపిస్తున్నారు. ఇది యీ నాటి నాగరికత ప్రత్యేకతలలో నొకటి, ఆధునిక సాహిత్యంలోని ఎంకిపల్లెటూళ్ళలో ప్రతిచోట కనిపించితే,కాంతం పట్టణాలలోను, పల్లెటూళ్ళలోను, పాశ్చాత్య నాగరికత ఆకళించుకొనని మధ్యతరగతి కుటుంబాలలోను సర్వత్రా ప్రత్యక్షమైతే, శ్రీమతి వటీరావుమాత్రం పట్టణాలలో ఉన్నత విద్యావంతులై పడమటి సభ్యతను జీర్ణించుకున్న విదుషీమణులలోనే గోచ

రించుతున్నది. విశేషించి క్లబ్బుకు పోకపోతే కాలక్షేపంకాని కాంతామణులలో మనకు వటీరావు కనుపించుతుంది. కాంతం మన మధ్య ప్రతి రోజూ కనుపించే మనిషి, కాని శ్రీమతి వటీరావు మన సమాజంలో ఇముడలేని విదేశీ సరుకు.

అసలు యీ వటీరావు స్వరూపమేమిటి? పేరే చిత్రంగా వుండి కృత్రిమంగా కనుపించుతున్నది. ఈమె అసలు పేరు కళావతి; ఇంగ్లీషులో వ్రాసినప్పుడు యీమె పేరు "కళావటి" అన్నమాట. ఆధునిక పద్ధతిలో భర్త పేరు ప్రక్కన చేరగా యెత్తిన పాశ్చాత్య అవతారం వటీరావు. వటీరావు వేషభాషలు, అభిరుచులు, ఆలోచనలు, ఆశయాలు అన్నీ పాశ్చాత్యమైనవే; పడమటి సీమనుండి బహు ప్రయాసపడి దిగుమతి చేసుకున్న కళలే.

రోజుకు నాలుగు రకాల చీరలు కట్టుకొని, బాహుమూలరుచుల కడ్డురానిరవికలుతొడుక్కొని,ఒక చేతికి రెండు బంగారు గాజులు పెట్టుకొని రెండోచేతికి రిస్టు వాచీ కట్టుకొని. ముఖంమీద సదా పౌడరు వాసన. చెక్కిళ్ళమీద నిరంతరము చెర్రీ సువాసన; కురులలో కిమోనో మల్లెపువ్వుల సగంధము, అన్నివేళలా పరిమళించగా సాయంకాలం కాగానే క్లబ్బుకు బయలుదేరే కల్చర్డులేడి శ్రీమతి వటీరావు.

"పోనీ మవ్వు కల్చర్డు లేడీవిగదా; యమ్మే ప్యాసయినావు; లేడీస్ కల్చరు క్లబ్బులో సభ్యురాలవు; బైస్కిల్ తొక్కగలవు కూడాను-ఈ చీరల; రవికలు ఖర్మం ఏమిటి? స్కర్టు తొడుక్కొని హ్యాట్ పెట్టుకొని యింగ్లీషు స్త్రీలలాగ......" అని ఒక మాటు మిసెస్ వటీరావు సహధర్మచరుడు చమత్కారంగా సరసమాడబోతే ఛళ్ళున గట్టిగా భర్త చెంపమీద కొట్టడానికి వెనుకాడక "మీరు సూటు వేసినప్పుడు నేను కడతాను లెండి స్కర్టు" అంటూ నిప్పులు గ్రక్కిన నెరజాణ శ్రీమతి వటీరావు. కాని ఆమె అంతరాంతరంలో పాశ్చాత్య

వేషధారణమీద మోజులేకపోలేదేమో అని పాఠకులు గమనించక తప్పదు.

లేడీస్ కల్చర్ క్లబ్బులో శ్రీమతి వటీరావు గౌరవ సభ్యురాలు: పెద్ద ఉద్యోగస్థుల భార్యలూ, అధమపక్షం సైకిలైనా తొక్కగలిగిన వాళ్ళూ, తత్తుల్యులైన ఇతర ధనికుల భార్యలూ ఇంట్లో పనిపాటలు చేయవలసిన అవసరంలేని వాళ్ళూ యీ లేడీస్ కల్చరు క్లబ్బులో సభ్యురాండ్రు - టెన్నిస్ ఆడడమూ, స్వెటరు వేసుకోవడమూ సిగరెట్లు పీల్చడము, లిప్‌స్టిక్‌లు రాసుకోవడము, నిరంతరము ఇంగ్లీషులో సంభాషణ సాగించడము రోజు రోజుకూ కొత్త కొత్త ఫ్యాషన్లననుసరించి జుట్టుకట్టులను మార్చుకోవడము, చవుకరకం ఇంగ్లీషు నవలలను పఠించడము. సరదాగా నగ్నదినోత్సవాలు, ఫ్యాన్సీ డ్రెస్ ప్రదర్శనలు జరుపడము మొదలైనవి యీ కల్చరు బాహ్య లక్షణాలలో కొన్ని అని చెప్పవలెను.

శ్రీమతి వటీరావూ ఆమె భర్తా ఉభయులు ఇంట్లో ఇంగ్లీషు భాషలో మాట్లాడుకొంటూ ఇంగ్లీషు దుస్తులు వేసుకొంటూ. ఇంగ్లీషు పత్రికలు చదువుకొంటూ ఇల్లు ఇల్లంతా యీ కల్చరుమయము చేసినారు. కొన్నాళ్ళు - పెళ్ళయిన కొత్తలో వారికిపుట్టే పిల్లలు గూడా పుట్టీ పుట్టడంతోనే ఇంగ్లీషు ఏడ్పుఏడుస్తూ ఇంగ్లీషు నవ్వులు నవ్వుతూ కల్‌చర్‌తోనే పుట్టుతారని వాళ్ళు అనుకున్నారు; కాని వాళ్ళు అనుకున్నట్లుజరుగలేదు-ఈపిల్లలుదేశంలోనిఇతరబాలబాలికలవలెనేఉండేవారు.

సాధారణముగా తన చీరలేమిటో, తన బ్లవుజులేమిటో, తన ఆభరణాలేమిటో, తన అలంకరణలేమిటో, తన క్లబ్బులేమిటో, తప్ప భర్త అనే వాడు ఒకడున్నాడు. రోజుకో పది నిమిషాలు అతని గొడవ పట్టించుకోవలెను అన్న దృష్టి శ్రీమతి వటీరావుకు యెంత మాత్రమూ లేదు. హోటల్నుంచి భోజనం తెప్పించుకొని యిద్దరూ మూగనోము

పట్టి భోజనం చెయ్యడము, తత్క్షణమే ఆవిడ సింగారించుకొని క్లబ్బుకువెళ్ళడము. ఆయన కచేరికి పరుగెత్తడము వాళ్ళ దినచర్య. ఇందువలన రెండుమూడు రోజుల దాకా భార్యతో సంప్రదించడానికి శ్రీమతి వటీరావు భర్తకు వీలుకలిగేది కాదు ! అతనికి పనులతొందర ఆవిడకు క్లబ్బు తొందర, స్నేహితులతో పరిచయాల తొందర !

కాన్వెంట్ స్కూలులో చదువుకొంటున్న పిల్లలు యెప్పుడయినా యింటికి తిరిగివస్తే అతణ్ని ఆమె అసలే మరచి పోయేది! పిల్లలచేత ఇంగ్లీషు పద్యాలు, పాటలూ పాడించడము, ఇంగ్లీషు ఆటలు ఆడించడము, వాళ్ళతోపాటు తను గూడ గంతులెయ్యడం, స్కిప్ చెయ్యడం, డాన్స్ చెయ్యడం, సాయంత్రం వాళ్ళను ఇంగ్లీషు దుస్తులతో అలంకరించి క్లబ్బుకు తీసుకెళ్ళడం ప్రొద్దస్తమానం యివే ఆమె కార్యక్రమాలు.

ఈ అన్ని కారణాల వలన ఉభయుల మధ్య అన్యోన్యం చెడక పోయినా తరచుగా రుసరుసలు, చిర్రుబుర్రులు మాత్రము తారస్థాయిని అందుకొనేవి. అతనికి పూజలూపునస్కారాలమీద అపరిమితమైన రక్తి. అయితే ఆమెకు యింట్లో భావకవులకు టీపార్టీలను యేర్పాటు చేయడంలో అంతులేని ఆసక్తి-భర్తగోడలమీద దేవుళ్ళ విగ్రహాలను ఆవిష్కరిస్తే అవి తీసివేసి ఆ స్థానంలో చవుకరకం ఆర్టు బొమ్మలనూ. సినిమా స్త్రీ పురుష తారల బొమ్మలనూ ఆమె ఆరాధిస్తుంది ! అతను పిల్లలకు బొట్టుపెట్టతే ఆమె సహించలేదు; బొట్టు చెరిపివేసి సబ్బుతో ముఖాలు కడిగి ఫేసు పౌడరు వాళ్ళ ముఖాలమీద రుద్దకుంటే ఆమెకు నిద్ర పట్టదు- లక్షణముగా మొహానికి పసుపురాసుకొమ్మని అతనొకసారి అన్నప్పుడు ఆమె తన అధునికతకు, కల్చర్‌కు అప్రతిహతమైన మహాపరాధం జరిగినట్టు భావించింది. అప్పుడు యిద్దరిమధ్య ప్రపంచ మహాసంగ్రామం జరిగినంత పని అయింది. పాపం హాస్యానికి గూడ శ్రీమతి

వటీరావు భర్త నోచుకోలేదేమో! లేకుంటే ఫేసు పౌడరు బదులు తనూ పిల్లలూ స్వచ్ఛమైన ఐశ్వర్యప్రదమైన విభూతి పూసుకోరాదా అని అతను సరసానికి అంటే అది విరసంగా పరిణమించి అతనికి యింటిలో రెండు రోజులపాటు భోజనం దుర్లభం కావడము జరిగేది!

శ్రీమతి వటీరావు గడుసుదనీ పెంకెదనీ, మాటకారి అనీ, ప్రణయ కలహాల సందర్భాన చేయి చేసుకొనే స్వభావం కలిగినదనీ ఆమె భర్త స్వయంగా స్వానుభవంతో చాటిన సత్యాలు. అయినా కొంత వయస్సు దాటిన తరువాత బుద్ధిపరిణతమై మంచి మార్గము పట్టవచ్చు గదా అని ఆ భర్త ఆశ! గాని ఆమె మాత్రం "కల్చర్డు" లేడీగానే ఉండిపోయింది; ఆమె క్లబ్బు కార్యక్రమాలకు యే అంతరాయమూ సహించలేదు.

కోరికలు జయించిన స్వాములవారి కోరికకు అనుగుణముగా పూర్వాచార పరాయణుడయిన శ్రీమతివటీరావు భర్త ఆ సంవత్సరం ధనుర్మాసంలో తమమట్టుకు తాను యింట్లోనే కూర్చుని ''నగర సంకీర్తన'' చెయ్యాలని ఉబలాటపడినాడు. వంటినిండా విభూతి పూసుకొని రుద్రాక్షలు మెడలో వేసుకొని, త్రినేత్రానికి బదులుగా కుంకుమ బొట్టు పెట్టుకొని, శంఖం చేతిలో పుచ్చుకొని శివరూపం ధరించి "శివోహం" అనుకుంటూ ధనుర్మాసంలో మూడోజామున లేచి ''నగర సంకీర్తనం'' చేస్తే యెంతో బాగుంటుందని అతను ఉత్సాహపడినాడు ఈఉద్దేశ్యాన్ని అతను శ్రీమతివటీరావుకు వివరించి చెప్పినాడు- తన సహధర్మచారిణి గనుక తనతోపాటు వటీరావు పార్వతీ వేషం ధరించవలెనని అతని కోరిక. అతను ఈ కోరికను వెల్లడించడంతోనే ఆమెకు కోపం వచ్చింది. పార్వతి వేషానికి విభూతి పూసుకోనక్కరలేదని కొంచెం పసుపు మొహానికి రాసుకొని కుంకుమబొట్టు పెట్టుకుంటే చాలునని అతను సమజాయించినాడు. మొదట భయపడినట్లు నటిం

చినా చివరకు శ్రీమతి వటీరావు శ్రీవారి శివరూపం ప్రక్కన పార్వతి వేషం ధరించడానికి ఒప్పుకొన్నది. అంతేగాక ఎంతో ఉత్సాహంగా పార్వతి వేషం వేయడానికి ఉబలాట పడుతున్నట్లు కనుపించింది. కల్చర్డులేడీ వటీరావు తన అభిమతానికి అనుకూలంగా మారినందుకు అతని సంతోషానికి హద్దులేదు. నిర్హేతుక జాయమానమైన యీ పరిణామము కొంత ఆశ్చర్యం మాత్రం కలిగించింది.

అనుకున్నట్టుగానే ధనుర్మాసంలో ఒకనాడు తెల్లవారక ముందే శివవేషధారణ ప్రారంభమయినది- అతను చన్నీళ్ళ స్నానంచేసి వంటి నిండా విభూతి పూసుకున్నాడు, భార్య తన కోసం తెచ్చిన పెద్దపులి బగ్గీల బట్ట కట్టుకున్నాడు - నొసట కుంకుమ బొట్టు పెట్టుకున్నాడు. అతను వద్దు వద్దు అంటున్నా వినకుండా, ఆమె స్వయంగా అతనికి అలంకరణ చేయసాగింది. అతని జుట్టు పైకి యెగదీసి ముడివేసి అందులో రేకు చంద్రుణ్ణి దోపింది దారముతో రెండు చేతులకు రెండు రబ్బరు పాములను కట్టింది. ఎముకల హారము ఒకటి అతని మెడలో వేసింది, బుడుబుక్కలవారి దగ్గర తానుకొన్న ఢమరుకాన్ని అతని వ్రేళ్ళకు కట్టింది - పులిచర్మము ఒకటి తీసుకొచ్చి పీటమీదవేసి దాని మీద శివరూపం ధరించిన భర్తను కూర్చోనబెట్టింది - ఇక ఆ సాధ్వి సత్వరంగా పార్వతిగా సాక్షాత్కరించడమే ఆలస్యం! స్వాములవారి సలహా ప్రకారం "నగర సంకీర్తనం" ప్రశస్తంగా ప్రారంభించవచ్చునని శివరూపధారి అయిన అతను ఉవ్విళ్ళూరుతున్నాడు. గంట గడిచింది. అతను "శివోహం" అని గట్టిగా కేకవేసి శంఖం ఊదుతున్నాడు; ఇంతలోనే ఆమె ప్రవేశించింది. అతను ఆశ్చర్యపడ్డాడు. యింకా వటీరావు శ్రీమతి వటీరావు గానే ఉన్నది; పార్వతి వేషం వేసుకోలేదు. ఆమె వెనుకనే మరి అయిదుగురు ఆధునిక నాగరికత అవతారాలు పడమటి సభ్యత ప్రతిమలు గూడ ప్రవేశించినారు - అతనికి సిగ్గయినది. కాని అతనికంటె యెక్కువ-కల్చర్డు లేడీస్ సిగ్గుపడ్డారు. అందులో ఒకామె

దీని పేరేమిటి అని అడిగింది. "ఇది శివ రూపం- ఈయన నా ప్రియ భర్త" అని శ్రీమతి వటీరావు ఇంగ్లీషులో అన్నది. ముసి ముసి నవ్వులతో ఆ అయిదుగురు అతని వేషాన్ని జాగ్రత్తగా అన్ని కోణాల నుండి పరీక్షించినారు. తరువాత పదినిముషాలలో వాళ్ళు కూర్చున్న కారు వెళ్ళిపోతున్న చప్పుడు వినిపించింది.

ఇదంతా అతని కేమీ అర్థంకాలేదు. ఈ అయిదుగురు స్త్రీలు యెందుకు వచ్చినట్లు ? శ్రీమతివటీ పార్వతి వేషం యెందుకు వెయ్యనట్లు ? పురుషుడన్న సందేహం గూడా లేకుండా తనను వాళ్ళంతా అంత పరీక్ష చెయ్యడ మేమిటి ? భక్తిప్రపత్తులతో జరుగవలసిన నగర సంకీర్తనం ఈ విధంగా పరిణమించినందుకు అతనికి బాధ కలిగింది.

తప్పకుండా తనను అవమానించడానికే తనభార్య వటీరావు యీ కుట్ర పన్ని ఉంటుందని అతని అనుమానము. దీనికి శిక్ష యేమిటా అని అతను ఆలోచించ సాగినాడు. అక్కసుతో నిండిన అతని మనసుకు అనేక ఉపాయాలు స్ఫురించినవి. ఇంటికి వచ్చిన తరువాత భార్య గొంతు నులిమివేయవచ్చును, లేదా యింటిలో దూలానికి ఉరితియ్య వచ్చును; లేకుంటే ఒక గదిలో తాళం వేసి తిండి పెట్టకుండా మాడ్చివేయ వచ్చును - ఈ ఊహాల మధ్య శ్రీమతి వటిరావు తటిల్లతవలె రానే వచ్చింది. వచ్చీ రావడమే "మైడియర్ హాబీ", "మైడియర్ పెట్", "మైపిచ్", "మై డార్లింగ్" అంటూ ఆమె భర్త మీద యెన్నడూ లేని అనురాగాన్ని కురిపించసాగింది;. ఆమె సంతోషానికి అవధులు లేవు. ఆ సంతోషాన్ని చూసి తన భార్యకు మతిపోయిందేమో లేక హిస్టీరియా లక్షణాలు సంక్రమించినవేమోనని అతను సందేహించినాడు. కాని అవేమీ కావు. ఆమెకు అతని కారణంగా క్లబ్బులో ఉన్నతమయిన స్థానం లభించినదట ! అతనివలన ఆమెకేదో బహుమానాలు వచ్చినవట ! ఆతనికి గూడ కొన్ని బహుమానాలు లభించినవట !

ఇంతకూ యీబహుమానాలేమిటి ? ఆమె క్లబ్బులో మెంబరు గనుక బహుమానాలు వచ్చి ఉండవచ్చును. కాని క్లబ్బుతో యేమీ సంబంధంలేని తనకు యీ బహుమానాలేమిటి ? ఆ అయిదుగురు స్త్రీలు తనను యెందుకుఅంతగా పరీక్షించినట్లు ? వచ్చిన బహుమానాలు పుచ్చుకొని ఊరుకోక యెందుకీ కుశంకలు అని ఆమె అతన్ని మభ్యపెట్టడానికి ప్రయత్నించింది. కాని అతను ఊరుకోలేదు. కోప్పడనని మాట ఇస్తే చెప్పుతానన్నది. అతను వాగ్దానము చెయ్యనన్నాడు. చివరికి ఆమె చెప్పక తప్పలేదు.

ఒకనాడు లేడీస్ కల్చర్ క్లబ్బులో సభ్యురాండ్రంతా సమావేశ మయినారట. వినోదకాలక్షేపమే క్లబ్బు కార్య క్రమాల పరమావధి. అందువలన ప్రతి సంవత్సరమూ సభ్యురాండ్రలో ఒక్కరికి యిచ్చే బహుమానం ఆయేడు యేవిధముగా యీయవలెనని చర్చ జరిగినది. కొందరు అలంకరణల పందెం బాగుంటుందంటే మరికొందరు ఆటల పందెం బాగుంటుందన్నారు. ఇవేవి గాకుండా మరొక వింత సూచన యేకగ్రీవంగా ఆమోదించబడినది. ఈ వింత సూచనచేసినది. శ్రీమతి వటీరావు తప్ప మరొకరు కాదని ఆమెభర్త అనుమానం. ఈ సూచన సారాంశం యిది.

మగవాడికి వలెనే ఆడదానికి గూడ వ్యక్తి స్వాతంత్ర్యము ఉండవలెను. ఇప్పటివరకు మగవాడు ఆడదాన్ని బానిసగా చూస్తున్నాడు. ఇప్పుడు మగవాడికి బుద్ధిచెప్పవలసిన బాధ్యత ఆడదానిది ; కొట్టిగాని తిట్టిగాని, సాధించిగాని, ఏడ్పించిగాని, తిండిపెట్టకగాని, చాకిరి చేయించుకొనిగాని, వెంట తిప్పుకొనిగాని యీ బుద్ధి చెప్పవచ్చును. అందుచేత యిష్టమున్న సభ్యురాండ్రందరు తమ తమ భర్తల్ని దద్దమ్మలను-ఫూల్స్‌ను-చెయ్యడానికి ప్రయత్నించ వలెనని ఆ నాటి సభలో తీర్మానించబడినది. ఎవరు భర్తను ఫూల్ చేయడంలో ఎక్కువ నేర్పు చూపుతారో వారికి, ఫూలయినవారి భర్తకు ఆ యేటి బహుమానం.

ఇదంతా విన్న వటీరావుభర్తకు ఆపాదమస్తకం కోపం మండిపోయింది. తనవలెనే దద్దమ్మలయిన భర్తలు యెందరో ఉన్నారనుకొని సంతృప్తి పడి అతను కోపాన్ని దిగమ్రింగుకొన్నాడు. అంతకంటే తనుచేసేది గూడ యేమీ లేదు.

యెందుకంటే యీ బహుమానాల బెడద ప్రతియేడు యెదుర వుతున్నదే! క్లబ్బులో భార్యామణికి బహుమానం రావడానికి, కల్చర్డు లేడీలలో శ్రీమతి వటీరావు పేరు ప్రతిష్టలు పెరుగడానికి ఆతను యెంత అప్రమత్తుడై ఉన్నాబలిగాక తప్పలేదు. శ్రీమతి వటీరావు అంతటి గడుసరి.

లేడీస్ కల్చర్ క్లబ్బులో బహుమానాలకొరకు పెట్టే పోటీలు గూడ చిత్రమయినవి!

భర్తచేత వెర్రివేషాలు వేయించి క్లబ్బు సభ్యుల ముందు ఆతన్ని హాస్యాస్పదుణ్ణి చేయడం ఒకసారి-

శీలానికి భంగంరాకుండా ఎవరైతే తమభర్తలో తమ శీలాన్ని గురించి అనుమానం కలిగిస్తారో వారికి బహుమానం మరొక సారి- స్వేచ్ఛగా పర పురుషునితో బహిరంగ ప్రణయ కలాపాలు సాగించి బహుమానం కొట్టివేయడానికి వెనుదీయని సాహసురాలు శ్రీమతి వటీరావు.

ఇంకొకసారి ఫాన్సీడ్రెస్ పోటీలు-భర్త గూడ పోల్చుకోలేని విధంగా, డ్రస్సు ఉందో లేదో అన్నట్టుగా విచిత్ర వేషధారణచేసి బహుమానం పొందిన అతి సాహసి ఆమె!

భర్త ఖర్మకొద్దీ ఒకసారి శ్రీమతి వటీరావు ఆదినారాయణ శాస్త్రిగారి రేడియో ప్రసంగాన్ని వినడం తటస్థించినది! శాస్త్రి గారు పూర్వాచార పరాయణులే; ప్రసంగం శాస్త్రీయమైనదే; అందు చేతనే శ్రీమతి వటీరావు భర్త ఇరకాటంలో పడవలసి వచ్చింది!

శాస్త్రిగారు ప్రాచీన హైందవుల సౌందర్య పోషణ పద్ధతులను గూర్చి శాస్త్రీయమైన ప్రసంగం చేసినారట. వెనుకట పురుషులు స్త్రీలకు స్వయంగా స్వహస్తాలతో అలంకారాలు చేసేవారని గూడా ఆయన శాస్త్రీయమైన ఆ ప్రసంగంలో అన్నారట. అందువలన శాస్త్రంలో ఆవిధంగా చెప్పబడ్డది కాబట్టి మీరు నాకు రోజూ అలంకరణం చెయ్యాలన్న మాట. అని ఆమె అంటుంది. ఫేస్ పౌడర్లు, లిప్ పెయింట్లు టీత్‌పాలిష్, నేల్‌పాలిష్, ఫుట్ డెకొరేషన్, బాడీడెకొరేషన్, వగైరా లన్నీ యీ అలంకరణ కాండలోని అంశాలు. "ఫేస్‌కౌడరు. లిప్ స్టిక్, స్నో, నెయిల్ క్లిప్పర్స్ వగైరా వస్తువులు మీ వద్దనే ఉంచుకొని సరియైన కాలానికి వాటిని నాపట్ల వినియోగిస్తూ ఉండాలి" అని ఆమె ఆజ్ఞ. శ్రీమతి వటీరావు కథలను పరిశీలించి నప్పుడు మనకు ఆధునిక సమాజంలో యిటువంటి సంఘటనలు యెన్నో కనుపించ గలవు.

క్లబ్బు జీవితమే శ్రీమతి వటీరావు నిరంతర ధ్యానం. ఆమె పూర్తి సమయం క్లబ్బు కార్యక్రమాలకే. తోడి మహిళా మణులలో అగ్రస్థానం వహించడానికి, తన ఆధిక్యతను స్థాపించుకొనడానికి ! ఆమె భర్తను కీలు బొమ్మగాచేసి కోతివలె ఆడించుతుంది. ఆమె జీవిత లక్ష్యం ఇంతే-ఒక్కసారి ఆలోచించితే, హాస్యం పేరుతో రచయిత ఆధునిక నాగరికత మీద చేసిన వ్యంగ్య విమర్శ నేమో యీ కథలని మనకు అనిపించుతుంది.

ఇంటబుట్టిన ఆచారాలకూ దిగుమతి అయిన ఆచారాలకు సంఘర్షణ జరిగినప్పుడు రాలే విస్ఫులింగాలే శ్రీమతి వటీరావు కథలని దీక్షితులు గారు స్వయంగా చెప్పినారు. ఇంతకన్న చక్కగా యీ కథలను వర్ణించడం అసాధ్యం.

జాతీయ సంప్రదాయాన్ని వదులుకొని అన్య జాతీయ సంప్రదాయాన్ని అనాలోచితంగా అవలంబించడం యెంత హాస్యాస్పదమో యీ కథలలో గమనించదగ్గ విషయం.

ఈ కథలు వ్రాసి పావు శతాబ్దం గడిచిపోయింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. జాతీయ దృక్పథం అలవడింది. దేశ పరిపాలన మన వారిచేతిలోకి వచ్చి స్వదేశ సముద్ధరణకు ప్రాధాన్యం హెచ్చింది.

అయినా పాశ్చాత్య మనస్తత్వం. దేశానికి యెంత మాత్రము కుదరని ఆచారాలు, అభిప్రాయాలు మన విద్యావంతుల సంఘంలో యింకా రాజ్యం చేస్తూనే వున్నవి.

అందుచేత యీనాటి క్లబ్బులలో యితరత్ర సంసారపు గొడవ పట్టించుకోక క్రీడాభిరామంగా ఇరువై నాలుగు గంటలు విహారించే మహిళామణులలో మనకు శ్రీమతి వటీరావులు పుష్కలంగా కనుపిస్తున్నారు.

(రేడియో ప్రసంగం 1964)

—— : : ——

# రాయప్రోలు సుబ్బారావు

"ఏ ప్రఫుల్ల పుష్పంబుల నీశ్వరునకు
పూజ సలిపితినో యేను పూర్వమందు
కలదయేని పునర్జన్మకలుగు గాక
మధుర మధురమైన తెనుగు మాతృభాష"

అని తమ ఆకాంక్షను తెలుపుకొనిన ఆధునికాంధ్ర కవీశ్వరులు రాయప్రోలు సుబ్బారావుగారు. ఈ దృక్పథముతోనే రమ్యాలోకమునందు 'భాష కంటె నవ్వ్యలకు తపస్సు లేదు' అని చెప్పుట జరిగినది. సుబ్బారావుగారు కవితా రంగమున అడుగుబెట్టిన కాలమున సకల భారతమునందు వలెనే ఆంధ్రదేశమునందు కూడ జాతీయోద్యమము గాఢముగ వ్యాపించి యుండెను. ఆంధ్రోద్యమము కూడ అవతరించి అన్ని పక్షాల ఆమోదమును పొంది యుండెను. ఈ రెండు ఉద్యమాల ప్రేరణతో వీనికి బలమైన అండగా సుబ్బారావుగారి వాణి తెలుగు దేశమును ఉత్సాహ తరంగితము కావించినది. ఆనాడు పెన్నానదీ తీరమున జరిగిన ఆంధ్రసభలలో పెద్దలు అభిప్రాయభేదాలతో ఐకమత్యమును విడనాడగా యువకులైన సుబ్బారావుగారు ఆంధ్ర ప్రబోధపద్యాలు వ్రాసి వానిని చదువుటకు జంకుచుండగా ఆ పద్యాలను తీసికొని ఆంధ్ర రత్న గోపాల కృష్ణుడు ఆ వేదిక నుండి తనసహజ గంభీర ధోరణిలో పఠించగా ఆ సభలోని పెద్దలు, పిన్నలు, అందరు ఒక్కసారి తమ కక్షలను విస్మరించి కర్తవ్య పరాయణులైన ఆ ఉజ్జ్వల ఘట్టము ఆధునికాంధ్ర చరిత్రలో బహు రమణీయమైనది. ఆనాడు పెద్దల ముందు వేదిక మీదినుండి పద్యాలను చదువుటకు జంకిన యువకవియే తరువాత అభినవాంధ్ర కవితా నిర్మాతలైనారు. ఆ పద్యాలే ఆంధ్ర ప్రబోధ వాఙ్మయము నందు ఉత్తమ స్థానమును ఆక్రమించి తరువాత కవుల రచనలకు ఒరవడి యైనవి.

గడచిన నూరు సంవత్సరాల తెలుగు సారస్వతమును సవిమర్శముగా పరిశీలించినపుడు వివిధ వాఙ్మయ వీధులలో నూతనత్వము, ప్రత్యేకత, విశిష్టత స్పష్టముగా గోచరించుచున్నవి. ఆధునికాంధ్ర కవిత్వముమీద ఆధునాతన ముద్రవేసిన వారిలో సుబ్బారావుగారిది అగ్రతాంబూలము. నేటికాలపు కవిత్వమున క్రొత్తపోకడలకు మార్గదర్శకులు రాయప్రోలు వారని చెప్పినచో సత్యమునకు తలవంపులు కలుగజాలవు. వీరేశలింగంగారు ఆంధ్ర కవిత్వమునకు సారళ్యము సమకూర్చినప్పటికిని నవ్యతాముద్ర వేయలేదు. ఈ నవ్యతాముద్రను భావము, భాష మొదలగు సకల విషయములందు స్పష్టముగ ప్రవేశపెట్టినది సుబ్బారావుగారే. ఆంధ్ర సారస్వతమున స్వీయ భావప్రధానమైన ఖండకావ్య రచనకు దేశభక్తి ప్రబోధకమగు కవిత్వమునకు మార్గదర్శకులు రాయప్రోలు నవి. కావ్య కథన పద్ధతిలో, వర్ణనా ధోరణియందు, భావ ప్రకటనావిధానమున సుబ్బారావుగారు క్రొత్త దారులు జూపించినారు ఈ క్రొత్తదారులు అభినవాంధ్ర కవి కుమారులకు అనుసరణీయములైనవి. అమలిన శృంగార సిద్ధాంతమును ప్రతిపాదించి, అందుకు అనుగుణముగా ఒక ఖండకావ్యమును, ఒక లక్షణ గ్రంథమును, ఒక రూపకమును సుబ్బారావుగారు రచించినారు. తెనుగుతోట, జడకుచ్చులు: తృణకంకణము, స్వప్నకుమారము మొదలయిన కావ్య నామకరణములందు కూడ సుబ్బారావుగారు నవ్యతను, సౌందర్యరక్తిని ప్రదర్శించినారు. రచనయందేగాక వేషభాషలందు కూడ సౌందర్య రక్తి వీరియందు అడుగడుగున ప్రత్యక్షమగుచుండును. "ఆ నీలనగరిలో అందాలవాడ—అందాల వాడలో అతి తెల్ల మేడ" అను మాటలను జ్ఞప్తికి తెచ్చు కవిగారి గృహాంగణము సర్వదా సౌందర్య శోభతో కలకలలాడుచుండును.

సుబ్బారావుగారు ప్రకృత్యుపాసకులు. "మామిడికొమ్మమీద కల మంత్ర పరాయణుడైన కోకిలస్వామికి మ్రొక్కి ఈ అభినవ

ధ్వనిధారణ కుద్యమించితిన్'' అని వారు ప్రకృతిని ఇష్టదేవతగా ఉపాసించినారు/ తమ ఇంటిముందు ప్రేమతో పెంచుకొన్న ఆ అందమైన మామిడి చెట్టు ఈ సత్యమునే ఉద్ఘాటించు చున్నది. కావుననే కాబోలును ''ఆ వేద ఋక్కు లన్—ఆ మంత్రవాక్కులన్, అంది అంటక యున్న యజ్ఞపూరుష రేఖ''ను అందుకొను ప్రయత్నమున ''తండ్రి జాడ నెరుంగ తల్లి చల్లని కొంగు'' పట్టినానని ఒక సందర్భములో తమ అభిప్రాయమును వివరించినారు.

తమ ఆంధ్రత్వమును గూర్చి ఉప్పొంగి పోవువారు సుబ్బారావుగారు. నిజానికి ఆంధ్రుల యశోగానము గావించిన కవులందరికి వీరే మార్గదర్శకులు. అంతేగాదు. ఆంధ్ర ప్రాభవమును అతి ఉదాత్తముగ, బహు మనోహరముగ కీర్తించిన నవ్యకవులలో సర్వవిధాల వీరికి ఉత్తమ స్థానము. రాయప్రోలు వారి ఆంధ్రాభిమానము భారత దేశాభ్యుదయమునకు, జగత్కల్యాణమునకు పరిపోషకమైనదే కాని ప్రతిబంధకమైనది కాదు. ఆంధ్రదేశ చరిత్రలోని ఉజ్జ్వల ఘట్టములను, మహాపురుషుల ఉదార చరిత్రలను వీరు భావించి ప్రశంసించినారు. ''చావలేదు చావలేదు ఆంధ్రుల మహోజ్జ్వల చరిత్ర'' యని జ్ఞప్తిదెచ్చినారు. ఒకనాడు ఆంధ్ర సంతతికే మహితాభిమాన దివ్యదీక్షాసుఖ స్ఫూర్తి తీపరించి యుండెనో తిరిగి యీనాడు ఆ మహావేశ మర్థించి యాంధ్రులార! చల్లు డాంధ్రలోకమున అక్షతలు అని ఉద్బోధించినారు. ఈ కవి వాణియే ''వేదశాఖలు పెరిగి నిచ్చట, ఆది కావ్యం బందె నిచట. బాదరాయణ పరమ ఋషులకు పాదు సుమ్మిది చెల్లెలా'' అని తెలిపి ''పొగడరా నీ తల్లి భూమిభారతిని, నిలుపరా నీజాతి నిండు గౌరవ గర్వమును'' అని ఆదేశించినది. వీరు కృష్ణరాయ నాగేశ్వరుల భాషా సేవను ఎంత గాఢముగ ప్రస్తుతించినారో, సరోజినీ రవీంద్రుల వాఙ్మయ సేవను అంత గాఢముగా కీర్తించినారు. వేదాంత వేత్తయైన ఆచార్య రాధాకృష్ణులను ఎంత హృదయ పూర్వకముగా కీర్తించినారో భారత

దేశ ఆత్మయైన జవహర్ లాల్ నెహ్రూను అంతే హృదయ పూర్వక ముగా ప్రశంసించి నారు. కృష్ణా గోదావరి నదుల నెంత ప్రేమతో ఆరాధించినారో గంగామతల్లినిగూడ అంత భక్తితో పూజించినారు. స్వరాష్ట్రాభి మానము, భారత జాతీయతకు ప్రతిబంధకము కాదనియు దానిని భాషోన్మాదముగా భావించుట సహేతుకము కాదనియు, ఆంధ్ర సాహిత్యము, సుబ్బారావుగారి కవిత్వము స్పష్టీకరించు చున్నవి. తన తల్లిని ప్రేమించనేరనివాడు పినతల్లికి ప్రియము గావించుట అసం భవము.

సుబ్బారావుగారికి ఆర్ష సాంప్రదాయము మీద అభిమానము మెండు. ఉదారచరితులయిన ఋషులను వీరు పునఃపునః ప్రస్తుతించి యున్నారు; ఆది కావ్యమును, ఉపనిషత్తులను తలచుకొని ఉప్పొంగి "సూత్రయుగముల శుద్ధవాసన, క్షాత్రయుగముల శౌర్యచండిమ, చిత్రదాస్యముచే చరిత్రల చెఱిగిపోయెనె చెల్లెలా !" అని ప్రబోధించి నారు. అయితే సంఘ సంస్కరణకు కాలానుగుణ్యమైన మార్పులకు కొందరు సనాతనులవలె సుబ్బారావుగారు వ్యతిరేకులుకారు. అంతే కాదు వారు సంఘ సంస్కరణను హర్షించి ఆమోదించిన నిదర్శనాలు స్నేహలత మొదలయిన ఖండకావ్యాలలో కన్పట్టుచున్నవి. కుల, మత, వర్గ విచక్షణలను కూడ వీరు తీవ్రముగ నిరసించి యున్నారు. "కులము దడవక, పొలిమేరగోలపడక, బోయెవలె తల్లి పల్లకి మోయుమాంధ్ర" అనుమాటలు సుబ్బారావుగారి విశాల దృక్పథమునకు ఉజ్జ్వలోదాహ రణలు. అస్పృశ్యతనుకూడ వీరు అసందిగ్ధముగ నిరసించి యున్నారు. తెనుగుతోటలో "ప్రేమ వృత్తికి చండాల భేదమేల, బ్రాహ్మణాగ్ర హారమునందు పవలు రేలు, విసరు పవనుండు కడజాతి వీటియందు, తాకలేక వీచెనే పక్షతంత్ర జడిమ ?" అని తెలిపి యున్నారు. ప్రాచీన సంస్కృతిపైన, ఆర్ష సంప్రదాయముపైన అభిమానము కాలానుగుణ్య మగు దేశాభివృద్ధికి నిరోధకము కాదని కవివాణి స్పష్టీకరించుచున్నది.

సుబ్బారావుగారి కవిత్వమును పరిశీలించినపుడు వారికి తెనుగు సీమమీద, తెనుగుసీమ సొగసుమీద, తెలుగువారి ఇంటి ఆచారాల సొంపుమీద, తెలుగుమీరిన గర్వంపు తీరుల మీద అత్యంత అభిమానమని స్పష్టమగుచున్నది. అందుకే "ఎరుపంచుల పట్టుచీరెలను," "పసుపద్దిన గళ్ళ రవికెలను" ధరించి "అత్తవారంపిన తొలిలాంఛనములతో" వర లక్ష్మి వ్రతముకావించు "క్రొత్తకోడలిని" "పసుపు కుంకుమపూవులు కొసరి చల్లి, చిన్న కర్పూర హారతి చేతపట్టి" పాటపాడు ఆడబిడ్డలను కవిగారు తమ కవితాదర్పణమున సుందరముగా ప్రతిబింబింపజేసినారు. ఆంధ్ర కన్యల అభిమాన క్రీడలయిన కోలాటము మొదలైన వానిని బహుకోమలముగా ప్రదర్శించినారు.

"చిన్ని బంగారు పూసల చెండ్లవంటి
జొన్నకంకులు పండిన సొగసు చేల
ఎక్కడెక్కడి నుండియో చక్కవచ్చి
వ్రాలుచున్నవి పిట్టలు వేలువేలు"

అని చెప్పునపుడు తెలుగుసీమసొగసు కడురమణీయముగ చిత్రితమైనది. "కష్టకమల"లో పల్లెటూరిలోని మధ్యతరగతి తెలుగువారి సంసారసౌంద ర్యము ఎంత మనోహరముగ చిత్రితమైనదో చూడుడు; అదియొక పల్లె టూరు ఆపల్లెటూరిలో ఒకానొకచోట మల్లెపందిరి; మల్లె పందిరికి కొంత దూరాన నున్న నొక తాళదళీ కుటీరము. దానికి చుట్టుప్రక్కల కంది చాపులు, చంద్రకాంతపు మొక్కలు, మరికొంత దూరాన తీగ బచ్చలి పందిరి. దానికి సమీపాన గున్న గోరంట పొదలు, పచ్చచేమంతి మడులు, బంతిపూల కుదురులు, ఇంకొకవైపు చేదుడు నూయి. ఆ నూయి ప్రక్కన పచ్చి పసుపు నూరెడు ఒక బ్రాహ్మణ సాధ్వి — తలంటు కొరకై ఆమె కూతురు "చెవుల కమ్మలు పెట్టని చెలువు కొంత, ముక్కు పుడకలు దీసిన బోసి కొంత, చిన్నబోయిన ఆ కన్నె వన్నె కొంత" తనకు శోభ గూర్పగా జారుముడితోడ వింత సింగార

మొలకగా కనుపించు దృశ్యమెంతో రమణీయ ఘట్టము! అదే సందర్భమున దగ్గరగానున్న చిన్న దానిమ్మ చెట్టుపై కూర్చున్న చిలుక దోరగా పండిన పండు కొరికి మొలక కెంపులవంటి గింజలను రాల్చుట ఎంత మనోహరమైన దృశ్యము? ఈ సందర్భమున ఆ బ్రాహ్మణి మోముమీది పండువంటి బొట్టునుకూడ కవిగారు వర్ణించక విడువ లేదు. ఆడపిల్లలు గోరంటరసమును హస్తములకు అలంకరించుకొనుట, సాయంకాలసమయమందు పురాణ పఠనము కావించుట, ప్రదోషమైనంతనే దానికి స్వస్తిచెప్పుట మొదలయిన ఆచారాలను సుబ్బారావుగారెంతో నసుకుమారముగ చిత్రించినారు. కన్నులకాటుకతో, వేణిలో జడకుప్పెతో, కంఠాన కాసుల దండతో, సుబ్బారావుగారు కథానాయికను అలంకరించి అచ్చమైన తెనుగు కన్నెగా మనకు చూపించినారు. అరగదంచిన సన్న బియ్యపు అన్నము, నేతిపోపుపెట్టిన పొట్లకాయ కూర, పేరబెట్టిన మీగడ పెరుగుతో గూడిన కమ్మని శుద్ధాంధ్ర భోజనమును రాయప్రోలు వారి కమలమ్మ ఆరగించినది. తెలుగు సీమ సౌందర్యమును ఇంత చక్కగా చిత్రించిన అభినవాంధ్ర కవి మరొక్కరు లేరని చెప్పవచ్చును.

భాషా విషయమున కూడ తెలుగు పదాల మీదనే సుబ్బారావు గారికి ఎక్కువమక్కువయైనట్లు స్పష్టమగుచున్నది. "జీవన్నవనీతమౌ తెలుగు పాలసముద్రమును పుక్కిలించిన" తిక్కన్న మీద సుబ్బారావు గారికి అభిమానము "ఆ యగ్ని వేదికన్— ఆ శబ్దఘోషలో — ఆశిష్ట భాషలో — ఉడికింది ఆ చిల్క మిడికింది కదునల్క." అని తెలుగు భాషను ఒక చిల్కగా భావించి అట్లు ఉడికిపోయిన ఆ చిలుకను తిక్కన్న అందుకొనిగారాబముగ పద్యము చెప్పినట్లు కవిగారు భావించినారు. తెలుగు పదాల సొగసు సుబ్బారావుగారి కవిత్వము ప్రత్యేకత. ఈ పదాలను కూర్చుటలో వారి కలమునకు మంచి విన్నాణము కలదు. పదాల కూర్పు చెవికి ఇంపుగా నుండవలెనని రాయప్రోలు కవిం

ద్రుని ఆశయము. శ్రవణ కఠోరమైన పదజాలము వారికి ఇష్టము కాదు. శ్రవణ సౌభాగ్యము కొరకు వ్యాకరణ నియమాలను ఉల్లంఘించిన నిదర్శనాలు, అలంకారశాస్త్రనియమాలను పాటించని ఉదాహరణలుకూడ కొన్ని వారి కవిత్వమునందు కన్పించుచున్నవి. భావోత్తరీయము పరచుట, కవితకు పెండ్లిపందిళ్ళు కప్పించుట- జారు చెమ్మట ముత్యాల జంపుసరులు, దానిమ్మ పువువంటి తరుణి కెమ్మోవి, గుత్తపు కడియాల కరము. కడుపులో తేనెలు గల కన్నె పువ్వు, వెన్నెలన్ పేరని పన్నీటి పువ్వువంటి చక్కని పదజాలము వీరి కవిత్వములో సమృద్ధము. సుబ్బారావుగారికి తమ పినతల్లిమీద మిక్కలిభక్తి. వారిని ఉత్తేజితులను గావించినవారిలో ఆ చల్లని తల్లికి ప్రత్యేక గౌరవ స్థానము కలదు, ఉదాత్తమైన సంస్కృతి కల ఆ సాధ్వి ప్రభావము సుబ్బారావుగారు ఉపయోగించు పదజాలముమీదనే కాక, వారు స్వీకరించిన కథావస్తువుమీద వర్ణనలమీద కన్పట్టుచున్నది.

ప్రకృత్యుపాసకులైన సుబ్బారావుగారు ప్రకృతిని వర్ణించుటలో కూడ ప్రత్యేకతను చూపించినారు. గోరంటలు, బంతిపూలు, మల్లెపూలు, పాడియావులు వారికి ప్రేమాస్పదములైనవి.

> "పచ్చగిల్లిన వసుమతీ భాగ్యసీమ
> నెల్లయెడల కన్పిందుగా నల్ల సిలుచు
> పసుపు పూసిన ముత్తైదువల మొగాల
> ననుకరించి గుమ్మడి పువ్వు లందమయ్యె."

అనునది వారి ప్రకృతి వర్ణనా శక్తికి మచ్చు తునక. ప్రకృతిలోని ఒకానొక సంఘటనను తిలకించి అందుండి ఒక ఉదాత్తమైన భావమును ప్రతిపాదించు నేర్పు సుబ్బారావుగారి ప్రకృతి వర్ణనలో మరొక ప్రత్యేకతగా కన్పించుచున్నది.

"పూల బిడ్డల బ్రీతి నుయ్యాల లూపు
పవను డెరుగడు తొడిమల వదలు ననుచు
తలపులకు విరుద్ధము లగు ఫలితములకు
బాధ్యులెవ్వరో, పుణ్యపాపమ్ము లేవొ ?"

అని కొద్ది మాటలలో గొప్ప అర్థమును వివరించు ఈ పద్యము ఇట్టి వర్ణనల కొక మంచి నిదర్శనము.

సుబ్బారావుగారు శృంగారమును బహు సుకుమారముగ చిత్రించినారు.

"హేమపాత్రల చందన మెండి పోయె
ద్వారములు మోయుచున్నవి, హారములను
సానలందింకె స్నాన కషాయ గంధ
మబల ! యెవని కోసము సగమయి తపింతు ?"
"చెక్కుచెదరని పాపట చిక్కువడియె
వేణి బంధము శిథిలమై పిరుదు లొరసె
కరగి చెరగిన తిలక రేఖలను తుడువ
పలివ ! యెవడాహరించె నీ యార్ద్రహృదిని ?"
"పాలుపొంగిన గతిపొంగు ప్రణయరక్తి
నాపుకొనలేని పడుచు ప్రాయంబువగల
నమ్మి ఎవనికి నీ మనమమ్మికొంటి
పువిద ! యీ మేఘమాస నవోదయముల ?"

అనునది ఆంధ్ర వాఙ్మయ మందలి విరహవర్ణనలలో విశిష్టమైనది; బహు మనోహరమైనది.

సుబ్బారావుగారి కవిత్వములో తెలుగుదనము మూర్తీభవించినది. భారత సంస్కృతియందలి ఉదాత్తత ఈయన రచనా ప్రవాహమున అంతర్వాహినిగ నున్నది. అభినవాంధ్ర కవిత్వమునకు మార్గ

దర్శకులైన సుబ్బారావుగారి రచనల ప్రభావము తరువాత నవ్యకవుల మీద స్పష్టముగా కన్పించుచున్నది. రవీంద్రునిసాన్నిధ్యము, గోపాల కృష్ణునిసాహచర్యము, లక్ష్మణరావుసహవాసము ముప్పిరిగొని సుబ్బా రావుగారి సారస్వత వ్యక్తిత్వమునకు ఒక ప్రత్యేక శోభను సమకూర్చి నది. అక్కడక్కడ, ముఖ్యముగా స్వప్నకూమారమున గూఢత గోచ రించుచున్నది. భావగాంభీర్యముతోపాటు. భాషా సౌకుమార్యము వీరి కవిత్వములో సరసముగా సమ్మేళనమైనది.

(రేడియో ప్రసంగము - 1954)

# తృణ కంకణము

తెనుగుతోటలో నవ్యసాహిత్య ఋతు లక్షణ లక్షితముగా పుష్పించిన తొలికావ్యకుసుమము తృణకంకణము. ఈ కావ్యము అభినవాంధ్ర కవిత్వమునకు ఆదిగ్రంథమని అస్మదాదుల ఆశయమని సభాపతి శ్రీ శివశంకరస్వామి నీరాజనము నిచ్చియున్నారు. ఈ కావ్య విశిష్టతను గుర్తించుటకొరకు ఆనాటి వాఙ్మయ పరిస్థితులను గమనించుట అవసరము. అప్పటి వరకు వీరేశలింగముపంతులుగారు తెలుగు భాషలో ప్రవేశపెట్టిన సరళ గ్రాంథికశైలి, మనోహర వచన రచనలు, ఆధునిక సాహిత్యరీతులలో బహుళ ప్రచారము పొందుట ప్రారంభమైనది. తిరుపతి వేంకటకవుల అవధానాలు సరళసుందరకవిత్వము తెలుగుసీమలో నూతన ఉత్సాహము కలుగజేసి, అనేక యువ రచయితల ప్రతిభకు దోహదము గావించినవి. ఒక్కసారి శారదాదేవి దేశమంతట ఊరూర, వాడవాడల. స్వైరవిహారము చేసినది. గిడుగు పండితుడు వ్యావహారిక భాషావాద గర్జనలతో, గ్రాంథికవాదులైన పండితమండలి మీదచేసిన సవాల్ ఆంధ్రదేశమంతటను ప్రతిధ్వనించినవి. సంఘసేవ, భాషా సంస్కరణ ప్రధాన ఆశయాలుగా గురజాడ కవి తెలుగు సరస్వతిని ముత్యాల సరాలతో అలంకరించిరి. ఈ వాతావరణమున, ఆంధ్రకవితా ప్రపంచమున నిజమైన విప్లవమును తీసికొని వచ్చిన గౌరవము తృణకంకణమునకు దక్కుచున్నది. కావుననే రాయప్రోలు సుబ్బారావుగారిని కవితామార్గ సంస్కర్తయని నవ్యాంధ్ర సాహిత్య వీధుల గ్రంథకర్తలు ఉద్ఘాటించి ప్రశంసించినారు.

రాయప్రోలు సుబ్బారావుగారు అంతకుపూర్వము లలితయను ఖండకావ్యమును రచించి ప్రకటించియుండిరి. లలితలో ఆంగ్ల కావ్య ప్రతిబింబము కొంత కనుపించుచున్నది. లలిత తృణకంకణమువలె ప్రత్యేక విశిష్టతను కలిగిన రచన కాదు. త్వరలో జరుగనుండిన తృణ

కంకణ రచనకు లలిత తొలి పలుకు. లలితలో ప్రబంధవాసనలు పూర్తిగా విడిపోవలేదు. ఈ కావ్యమున కొంతభావపరివర్తనము, భవిష్యత్తులో రానున్న పరిణామము, కనుపించుచున్నప్పటికిని, కవితారథము పూర్వ మార్గముననే నడచినదని చెప్పవలెను.

ఇటువంటి పరిస్థితిలో ఆమూలాగ్రము నవ్యతకు ఆటపట్టయిన తృణకంకణకావ్యము ప్రకటితమై ఆంధ్రసాహితీ లోకమున నవయుగో దయము గావించినది. మొట్టమొదలు కావ్యనామకరణమునందే, కవి విశిష్టదృక్పథము మనకు కనుపించుచున్నది. ఈ వైలక్షణ్యము కావ్యము లోని ప్రతిపద్యమునందును, ప్రతిపాదమునందును గోచరించుచున్నది. శ్లేష కవిత్వము, శబ్దచిత్రము, పరంపరాగతమైన ఇతివృత్తము, అలం కార శాస్త్రపు ఆదేశములకు అనుగుణముగా నిర్వహించిన అష్టాదశ వర్ణనాదులతో కూడుకొనిన ప్రబంధజాలపు ప్రభావముల నుండి పూర్తిగా తప్పించుకొని, తెలుగు కవిత్వమునకు నూతనదృక్పథమును ఇచ్చిన మొదటి కావ్యముగా తృణకంకణము ఆనాటి సాహితీలోకమునకు భాసించి, కవికుమారులకు క్రొత్తత్రోవను జూపించినది. తుట్టతుదకు శ్రీకారముతో కావ్యరచన ప్రారంభించవలెనను నియమముకూడ తృణ కంకణము పాటించలేదు.

తృణకంకణ కావ్యప్రారంభమును పరిశీలించినప్పుడు, అందులో మొట్టమొదలు మనము గమనించునది కృత్యాద్యవస్థయొక్క అభావము. మూడు కంద పద్యాలలో, మృదుగుణులైన భాషాకుమారకుల నుతి యించి, రసైశ్వర్యము నేలు కవిలకు అంజలించి, నీరదసుతకు ప్రణ యార్పణముగా ఈ పద్య శుభాంజలిని అర్పించు ఉద్దేశముతో కవిగ్రంథ రచనను ప్రారంభించినారు. కవిప్రకృత్యుపాసకులు. ఇందుకు తృణ కంకణములోని మూడవ పద్యము చక్కని నిదర్శనము. ఈ ప్రకృతి ఉపాసన, ప్రకృతిప్రేమ ఈ కావ్యమునందేకాక వారి ఇతర రచనల

యందును ప్రస్ఫుటముగా కనుపించుచున్నవి. ఇది గ్రంథకర్త నూతన కవితాదృక్పథమునకు తార్కాణము.

తృణకంకణము కల్పనా ప్రధానమైన కావ్యముకాదు; వర్ణనా ప్రధానమైన కావ్యముకూడ కాదు. భావప్రధానమైన ఖండకావ్యము తృణకంకణము. అందుచేత కథాకథనమునకు ఇందులో ప్రాధాన్యము లేదు. ఉదాత్త లక్ష్య సమన్వితమైన తృణకంకణమునందు, విధివిధానము చేత ప్రేమ విఫలమైనప్పుడు, కర్తవ్య ప్రబోధము చాల సుందరముగా సరసముగా, సమంజసముగా జరిగినది. ప్రేమకు పరిణామముగా వివాహము సంభవించని పరిస్థితిలో జరుగు తొందరపాటులు, భగ్నజీవితాలు, విషాదసంఘటనలు మన అనుభవములో అనేకము కనుపించుచుండును. ఇటువంటి పరిస్థితులకు గురియైన నాయికా నాయకులకు తృణకంకణము ఉదాత్తమైన ప్రేమ సందేశము నిచ్చి సంయమనమును ప్రబోధించి, సత్క్రమమార్గమును జూపుచున్నది. నిగ్రహము నాగరికత యని చెప్పి మరొక ఆధుని కాంధ్రకవివర్యుడు యీ సత్యమునే ప్రతిపాదించియున్నారు. భారతీయ సంస్కృతికి, ధార్మిక దృక్పథమునకు ఇది అనుగుణమైన ఆదేశము, అంతరంగముల నతుకజాలిన ప్రేమ, దాంపత్యఫలము పొందజాలనప్పుడు, విషయ సుఖేచ్ఛలన్ దనియ విహ్వలమైన హృదంతరంబు కల్మషమయి పోవనిక, అకలంకమ్యాదూ కృత సాధనన్ విషమగతిన్ మరల్చునెడు వివేకము అనుసూక్తి యీ కావ్యములోని ధార్మిక దృక్పథమును ప్రతిపాదించుచున్నది. సరస సాంగత్యసుఖవికాసములకన్న దుస్సహవియోగభరమె మధురము; బాధ లేకపోయినచో వ్యసనరుచి బోధపడజాలదు; పరమధర్మార్థమైన దాంపత్యభక్తి, స్తన్యమోహనమైన వాత్సల్య రక్తి, సాక్షిమాత్రసుందరమైన సఖ్యశక్తి, ప్రేమలోనే ముక్తిపొందునని రమణీయముగా ఇందులో నిర్వచితమైనది. ఈ విధముగా కావ్యవస్తువునందు

పూర్వాంధ్ర సాహిత్యమున గోచరించని నవ్యత ఇందులో మనకు కనుపించుచున్నది.

తృణకంకణమున మనకు కనుపించు వ్యక్తులు ఇద్దరే. ఈ ఉభయులే కావ్యమునకు నాయికానాయకులు; సాధారణ కుటుంబమునకు చెందిన యువతీ యువకులు: చిన్ననాటి నెచ్చెలులు, నాయిక పసినిమ్మ పండు చాయల కొసరెడు శరీరము కలిగి, పదియునాలుగు వసంతముల శోభించు లావణ్యవతి; ఆమె యెక్కువగా నగలేమియు ధరించలేదు. కాళిదాసు శకుంతలవలె ఈ బాలిక సహజసౌందర్యమునకు ఆటపట్టు. కుచ్చెళ్ళు చెదరనిరీతిగా జిలుగుపూలకలంకారి చీరగట్టినది. కాలికి కడియాలు, వ్రేలికి ముచ్చటయైన ముద్దుటుంగరము పెట్టుకొనినది. చేతికి పచ్చని పట్టుతోరము గట్టుకొనినది. చెంపకు చేరెడుగానున్న కాటుక కన్నులు, జారుచెమ్మట ముత్యాల జంపుసరులు ఆమెఅందమును ద్విగుణీకృత మొనరించుచున్నవి. గువ్వకుత్తుకతో మాట్లాడు ఆ బాలిక ప్రసన్నశీల; మృదులహృదయ; అనురూప గుణప్రచుర. ఈ ప్రేయసికి సర్వవిధాల తగిన ప్రియుడు ఆ యువకుడు; తేటవలపులు మొలకలెత్తినది మొదలు ఆ బాలిక యందు హృదయము నిలిపిన ఆర్ద్ర హృదయుడు; ఆతనికి పగలు రేలు అనక కనులుమూసినను తెరచినను ఆ బాలిక లావణ్యమే కనుపించుచుండును. అతని చూపులయందు రహోవ్యసననిపీడ కానపడుచున్నను. ఆర్ద్రలాలసహృదయము మాత్రము అకలంకముగా కనుపించుచున్నది. ఈ నాయికానాయకులను నిర్ణయించుకొనుటలో, వీరి గుణ సౌందర్యములను వర్ణించుటలో అందుకు కావలసిన శబ్దసామగ్రిని సేకరించుకొనుటలో తృణకంకణ కావ్యకర్త చూపిన నేర్పులో అంతకు పూర్వము ఆంధ్ర వాఙ్మయమున పరిచితముగాని నవ్యత, గోచరించుచున్నది.

రసార్ద్రహృదయులై కోమల చిత్త వృత్తి కలిగిన యీ నాయికా నాయకులు చిన్నతనమునందే సరసములైన వావి వరుసలు

కలుపగా, అభేదరాగములు తిరముగా పాదుకొని ప్రణయలీనులై నారు. కాని దైవము అన్యథా తలంచినందున వారి దాంపత్యము సాధ్యము కాలేదు. విధివశమున వచ్చిన కీడధములు కొనియాడి వేగులై విపులభవాంబుధిని మునుగుదురు, మునుంగరు, సధర్ములగు సత్తములు ప్రశాంతి జలుకనై అని భారతము ఉద్ఘాటించుచున్నది. చేసినదానింబడక పోవ శివునకు వశమా? యని భారతములో ఒక ప్రశ్న. ఈ ప్రశ్న యీ నాయికా నాయకులకు కలిగినది. కాని మానవ హృదయాలలోని ప్రేమబంధాలు తెగద్రెంపినప్పటికిని తెగజాలవు కదా; అంతరంగముల నతుకజాలిన నిజమైన ప్రేమకలిగినప్పుడు, వారిని విడదీయుట సాధ్యము కాజాలదు. ఇటువంటి చెలికారముయొక్క పరిణామమమనసుచేత, వాక్కుచేత కర్మముచేత కలుషితమైన వలపులే గాక తపసుచే, తాల్మిచే, ధాన్యధారచేతలీనమై ఐక్యమందజాలిన ప్రేమవలె రూపొందుట సహజము. తృణకంకణమున జరిగినది ఈ సహజ పరిణామమే. ఈఉభయుల దాంపత్యమునకు విధి అనుకూలించనప్పుడు.

"వలపు నశియించియును, ప్రేమనిలువ గలద
యేని కలనైన కలుషముగాని స్నేహ
మృదుమధుర రసానుభూతి బొదలి, మనము
నీడలట్టుల నైక్యమందెదముగాక!

అని నిర్ణయించుకొనుట జరిగినది. ఇన్నాళ్ళు ప్రేయసిగా భావించిన నాయికను నాయకుడు సోదరీయని సంబోధించి, మణిబంధము తన స్మృతి చిహ్నముగా ధరియించుట కొరకు ప్రణయ బాష్పజలాంకితతో వాడిపోనట్లుగా అలంకరింపుమని తృణకంకణమును అర్పించినాడు. నాయికయు సముచితముగా వ్యవహరించినది. విధినియమాలచేత యెడబాటు కలిగియు, ఆ ఉభయుల పెంపుడు మైత్రిప్రేమబంధములు తెగనందుకు హర్షించి, ప్రకృతిమాత వకుళ సుకుమార తరుమల్లికల నుండి ఆజంటమీద పూవులను జలజలరాల్చినది. ప్రక్కనలికి ప్రణయాంజ

లితో ప్రారంభమైన యీ కావ్యములో పర్యవసానమునందు నాయికా నాయకులకై ప్రకృతిసానుభూతి ప్రదర్శితమగుటలో ఔచిత్యము. గమనించదగియున్నది.

తృణకంకణ కావ్యశైలి బహు సుందరమైనది. పదాల కూర్పులో కవి ప్రత్యేకమైన నవ్యతను విలక్షణమైన వ్యక్తిత్వమును ప్రదర్శించి యున్నాడు. తెలుగు పలుకుల సొగసు ప్రతి పద్యమున కనుపించుచున్నది. మాధురీసమన్వితమైన రాయప్రోలుశైలి అభినవాంధ్ర కవితలో ప్రత్యేక రమణీయతకు ఆట పట్టు. తెనుగు తోటలోని సువాసనలు తృణకంకణములోని ప్రతిపద్యమునందునుపరిమళించుచున్నవి. తరువాత ఆధునికాంధ్ర కవులనేకులు తృణకంకణ శైలిని అనుకరించిన నిదర్శనాలు మన యెదుట నున్నవి.

(రేడియో ప్రసంగము 1954)

—:♦:—

# నవ్య కవితా నీరాజనము

# I

## కవి ద్రష్ట

కవిత్వము లలితకళలలో నగ్రగణ్యము. లలితకళలను నామమే వాని రామణీయకమును ప్రస్ఫుట మొనరించుచున్నది. లలితకళలు సౌందర్య ప్రధానములు. వానియనుభవము హృదయాహ్లాదకరము. శ్రావ్యమగు గానము వినినప్పుడు చక్కని చిత్రము చూచి నప్పుడు సరసమగు పద్యము జదివినప్పుడు మనకు కలుగు దివ్యమగు నానందము అనిర్వచనీయము, అనుభవైకవేద్యము.

కళానుభవము మనశ్శాంతికమూల్యమగు సాధనము. మనస్సు కలతపడి చీకాకునొందినప్పుడు తమ యభిమాన కళోపాసనము చేత తాత్కాలికముగా దుఃఖవేదననుండి విముక్తులై తన్మయానంద మొందువారు కలరు. సంతోష సమయమున కళోపాసనము మనయానందమును ద్విగుణీకృత మొనరించును. ఏకాంతముగా నున్నప్పుడు, పనిపాటలు లేనప్పుడు, విశ్రాంతి కాలమున కళోపాసనము మనకాప్తమిత్రము. ముఖ్యముగా కవిత రసిక జనచకోరములకు పూర్ణ చంద్రోదయము. కళాపుష్ప వాటికాంతరమునఁ బ్రవేశించి యందలి యరవిరి మొగ్గలను అరవిచ్చిన సుందర సుమచయమును కోరికదీర గోసికొని వాని సౌందర్య సౌరభ్యముల మనసార ననుభవించి తన్మయులై యానందమున నోలలాడు అనుభవము రసార్ద్ర హృదయులది. కళోపాసకునికి ప్రకృతి యంతయు ప్రేమమయము, సౌందర్య పూర్ణము, ఆనందదాయకము.

రమణీయములగు నర్థములనిచ్చు సుందరపదసముదాయమే కావ్యమని చెప్పనొప్పును. రామణీయకమనగా క్షణక్షణ నవ్యతను జూపి

మనల నానంద పరవశుల జేయుగుణము. నిక్కపు కవిత కిట్టిగుణము సహజసిద్ధము. భాగవతమందలి గోపాలకృష్ణుని బాల్యక్రీడలవర్ణన. గోపికా గీతములు భ్రమర గీతములు మున్నగునవి యిందుకు నిదర్శనములు. ఈ భాగముల నెన్ని మారులు జదివినను తనివి దీరదు. మనము దానిని పఠించు ప్రతి పర్యాయమును అందేదో క్రొత్తదనము గోచరించును. ఈ క్రొత్తదనమే కావ్య రామణీయకమునకు ప్రత్యేక లక్షణము.

ఉద్రేకమే కవితకు ప్రాణాధారమని యొకానొక యభిప్రాయము. ఉద్రేకము లేనిది యే మహాకార్యమును నెరవేరుట దుస్తరము. అనాథల నిమిత్తము తన సర్వస్వము ధారవోయు త్యాగశాలి, దేశ స్వాతంత్ర్య సంపాదనార్థము తనధన మాన ప్రాణములనర్పించు వీరవరేణ్యుడు ఇందుకు దృష్టాంతములు. ఇతర రంగముల నట్లుంచినను సాహిత్యాంగణమున గూడ ఉద్రేకము ప్రముఖపాత్ర ధరించుచున్నది. ఉద్రేక ఫలితములగు మనోవికారములు, భావములు శాంత సమయమున సహజ ప్రతిభాశాలియగు వ్యక్తిచే సంస్మరింపబడి కవితా రూపమున ప్రత్యక్షమగును. భావోద్రేకమన నేమియో యెరుగని శుష్క హృదయులు కవులెన్నటికిని కాజాలరు. ఉద్రేకము యొక్క అభావము కళాసౌందర్యాభావమేయని చెప్పిన అతిశయోక్తి కానేరదు. హృదయము భావప్రపూర్ణమై రసార్ద్రమై విలసిల్లి నప్పుడే కవికుమారుని లేఖినీముఖమున ముత్యాలవర్షము కురిసి సాహితీ క్షేత్రమును సస్యశ్యామలము గావించును. చూడుడు !

చైత్రపల్లవదూతి చక్కిలిగింతలకు, గుత్తరింపగ బాడు కోకిలంబు ;
జలకమాడిన నభోజనసిఘనాలక లారవిప్పిన వేళనాడు నెమలి;
పండువెన్నె బాలు చేపినరేల స్వరజతుల్ వల్లించు
భ్రమర దానిమ్మ పగడాలు కానుపుగనునప్పు నామ
కీర్తనసలుప్షికర్త, ల్క; అట్లే, "ప్రాణిలోకము రసవదిష్టార్థరక్తి
వివశవ ఋ" న్మత్తయగును కవిత.

కవిత్వతత్వ నిరతిశయానంద భావభరితాంతః కరణుండై తిక్కనార్యుడు భారతరచనకు కృత ప్రయత్నుండయ్యెనట. ఆయన యొక దివ్య స్వప్నమున హరిహర నాథునిచే ప్రబోధితుడగుట భవ్యమగు కవితావేశ ప్రభావము. సోమయాజిది గంభీరమగు భావనాశక్తి. ప్రహ్లాద గజేంద్రులలో లీనుడై రస పారవశ్యమున తన్మయుడైన పోతన్నది తన్మయ భావనాశక్తి. ముఖ్యముగా నీ యిరువురి రచనల సౌందర్యమునకు కారణము ఆవేశమేయని తెలియనగును. భావనాశక్తి యేరూపమున ప్రత్యక్షమైనను దానికి ప్రోత్సాహ కారణము ఉద్రేకమే; పరమ పవిత్రమగు వైదికావేశమేకదా నన్నయార్యుని కావ్య మహాత్వమునకు హేతువు.

సహజ ప్రతిభాశాలియగు కవి సృష్టిలోనే వస్తువును దిలకించినను అతని హృదయమున నొకవిధమగు నుత్సాహము జనించి, ఆవేశభరితుడగును. అప్పుడాతని హృదయమున కొన్ని భావములు జనించి రసోదయమగును. ఈ విధముగ భావమునకు రసమునకు జన్యజనక సంబంధము గలదు. కవితయందు భావ ప్రాధాన్యమును, ఉద్రేక ప్రాముఖ్యమును స్పష్టీకరించుటకొరకే నవ్యకవితకు భావకవిత్వమను నామాంతర మొసంగినారు ఆధునికులు. ఎవ్వాని హృదయము అపూర్వములగు భావములకు నిలయమో అదియే రసమునకు నిధానము; రామణీయకమునకు పట్టుగొమ్మ. అట్టి

వానిడెందంబు సోపోవని తలపులు
వాని కనుసన్న తలలు వంపనియుపమలు
వాని కలమున కులుకు జూపని పదనులు

యీ ప్రపంచమున గానరావు. చూడు 'లెంతరాతైన యొక పల్లెటూరి పడుచునుగాంచి ఆధునికపదసముద్రశేఖరుడేమని ప్రశ్నించుచున్నాడో !

అత్యంత సుకుమారివైనట్లు గనుపింతు
వేలాగు నడిచితో యీ దూరపథమెల్ల
ఏ లీల గడచితో యీ ముండ్ల పొదలెల్ల
ఆకు పచ్చని నిగ్గు లసియాడు నీమేన
ఏ భంగి మోసితో యీ పాలభాండంబు
ఏ చాయ మూసితో యీ బాల భాగ్యంబు

అప్పుడు

కూర్చుండు మొక్కింత చేర్చుక్క చెమటార
సోలేవు లేకున్న సురపొన్న సుమమట్లు
వ్రాలేవు లేకున్న పసితమల్లాకట్లు
గులకఱాబాటలన్ మొలక పూదోటలా
గేచాయ మార్చితో యీ మెత్తని పదాల
యే తల్లి నేర్పెనో యీయింద్రజాలంబు

అని ఆశ్చర్యమొంది

ఎవరియింటివి ఆలు ఎవరు పిండిరి పాలు
చిన్నారిలేగలన్ కన్నెతీగలగట్టి
కన్నారికడకీట్లు మున్నెవచ్చితివెట్లు
పాలూరునీపల్కు బాలెంతపసిచిల్కు
పాలీయ వచ్చితే పడరానిపాట్లోర్చి
పాలమ్ము వ్రతమంత భాగవతోక్తంబో ?

అని యర్థాంతరన్యాసమున ముగించు నప్పుడు భావము భాష యను నిరువురు బాలకులు "నేను ముందు నేను ముంద"ని పందెము వైచుకొని రససముద్రము నీదుచున్నారోయను సందేహాము కల్గుచున్నది.

కవి సృష్టికర్త, ఆనంద సౌందర్యము లీ సృష్టికి ప్రత్యేక లక్షణములు.

"తమ్మిచూలుకేలు దమ్మినిగల నేర్పు
కవికలంబునందు గలదుగాన
నీశ్వరత్వమతనికే చలామణియయ్యె"

కవి నిర్మితజగత్తు మన దైనందిన వ్యవహార ప్రపంచమునకు శుష్క నీరసానుకరణముగాదు; అతి ప్రతిభావంతమగు స్వతంత్ర నిర్మాణము. కవి ప్రకృతిని తన కవితా దర్పణమున ప్రతిఫలింప జేయవచ్చును. కాని తత్కార్య నిర్వహణమందు గూడ నాతడొక విధమగు నవ్యత, స్వీయ ప్రతిభ ప్రదర్శించుచున్నాడు. జుగుప్సాదులను ధూమకలుషిత దుర్గంధములను తిరస్కరించి ఆహ్లాదరమణీయములను, సౌందర్య మాధుర్యములను గ్రహించును. "ప్రకృతి యందు రమ్యము గాని వస్తుతతిని చిత్రకళలు రమ్యముగ దీర్చెడిని". అంతియేకాని కవి యంధుడై ప్రకృతిని నీరసముగా ననుకరింపడు. రమ్యముగా దీర్చుటలో కవి స్వీయభావనా మహిమను, నిర్మాణకౌశలమును ప్రదర్శించి రవిగాననిది కూడ కవిగాంచునని తెలియజేయుచున్నాడు.

నీరుతీసిపోయిన తటినీ తటాల
పొరలుపడ్డయిసుక మడపులనుచూచి
పానుపునువీడిలేచు భామానితంబ
గళిత సిత దుకూలాంచలముల

స్మరించుట కవి ప్రతిభకు నిదర్శనము.

స్వీయ నిర్మాణ జగమునందు కవి సర్వ సమర్థుఁడు. అందా తనికి దుస్సాధ్యమగు కార్యమేలేదు. దైనిక ప్రపంచమున దైవ సంకల్పమువలె కావ్యజగత్తునందు కవి కుమారుని సంకల్పమమోఘము.

భావములను వ్యక్తీకరించు సాధనము భాష. కావ్యసంసారమున శబ్దార్థములకు గల సంబంధము మానవ ప్రపంచమునందలి దాంపత్యమును బోలును. వీనిలో నొకటి లేక యింకొకటి శోభిల్లదు. రెండింటి

సంయోగమే ఫలప్రదము. భావమున కానందమెంత ప్రధానమో శైలికి సౌందర్యమంత ముఖ్యము. కవిత ఆనంద సౌందర్యములచే విలసిల్లునది కదా! ఆనందము భావమున; సౌందర్యము శైలిలో ఈ యానంద సౌందర్యముల సమ్మేళనమే రామణీయకము ఏ విధముగ దుఃఖము, కరుణ మున్నగు రసముల ననుభవించుటలో ఆనందము కలదో, అదేవిధముగా క్రోధాదులను వర్ణించు రీతులయందు సౌంద ర్యము కలదు. సందర్భములనుబట్టి శైలియు భేదించును. ఏ భావ మునకు యే శైలియేవృత్తము అనుగుణ్యామో అది చక్కగా తెలిసి వ్రాసిన మహాకవి తిక్కన. కవుల చోద్యప్రయోగ కౌశలము అమృత శబ్దావతారము దాల్చి, పాఠకులను శిరీష కుసుమపేశల సుధామ యోక్తులతో చిరునవ్వు పెదవుల కందళింపఁ బలుకరించును. కావ్య శైలీ మాధుర్యమునకు ప్రమాణము శ్రవణ సుఖము. పరభాషా పద ములను స్వీయభాషాసంప్రదాయమున కనుకూలముగ అవసరము గలిగి నపుడు పోషించి స్వీయ భావప్రబోధము జేయువారే నిక్కంపు కవులు.

కవులు నిరంకుశులు. వారికి "ఇదివలయును, ఇదికూడ" దని యాజ్ఞాపించుట యసమంజసము. రసానుభవమే మనవిధి; అన్యములు మనకనవసరములు. భోజ్యములు రుచికరములుగా నున్నవియా యని పరిశీలించుటయే మనవిధి. కాని ప్రత్యేక పరిమాణయుక్తముగ లవ ణాదులను వాడవలయుననుట భావ్యముకాదు. ఇట నలంకారములు వాడవలెను, ఇటకూడదు అనియు, పాత్రములు ప్రత్యేక లక్షణములతో నొప్పారవలె ననియును విధించుట సహృదయ లక్షణముగాదు. కావ్య రచనకు కావలసినది సహజ ప్రతిభకాని, కేవలము ఛందశ్శాస్త్ర పాండి త్యము, వ్యాకరణ వేతృత్వముకాదు. కావ్యము సహృదయుల కానందము గూర్చగలదా యను ప్రశ్నయే ముఖ్యము; ఇతరము లసంభావ్యములు.

కావ్యములు నీతిబోధకముగా నుండవలయునని యొక మతము; ఉండిన నుండవచ్చును. కాని కావ్య ప్రధానోద్దేశము నీతిబోధనము మాత్రముకాదు. నీతిని బోధింపక పోయినంత మాత్రమున నొక కావ్యమును రసప్రపంచము నుండి బహిష్కరించుట రసికసమ్మతముగాదు. కావ్య ప్రధానోద్దేశమగు రసస్ఫోరకత్వమునకు నీతిబోధము విధేయమై యుండ వలయును; కాని నీతివాదులయొక్కయు తాత్వికులయొక్కయు అడుగులకు మడుగులొత్తుచు వారికి చరణాశ్రిత దాసియై కవితాకాంత యూడిగ మొనరింపజాలదు.

కవికి తాత్వికునకు కయ్యంబె సాగెను
బహుదినాలు వాక్ప్రపంచమందు
రాగ రక్తుడొకడు, రాగముక్తుడొకడు
సుగుణ నిర్గుణముల సఖ్యమెట్లు ?

మార్పుజగల్లక్షణము. మానవ ప్రపంచముననిది స్పష్టము. ఆది నుండియు మానవుడెన్నియోమార్పుల నందినాడు. సమస్త వ్యవహారము లందీ మార్పు సుస్పష్టము. సాహిత్య మీ సామాన్య సూత్రమున కపవాదము కాజాలదు. ఇంతయేల ? సాహిత్యమునకు మార్పే. నవ్యతయే శోభ గూర్చుననుట పరమసత్యము.

"కాలధర్మానుగతమై జగత్ప్రవృత్తి,
మారునపుడు వాఙ్మయమును మారునిజము"

ఒక జాతి సారస్వతము ఆ జాతి జాతీయ జీవనము కద్దము వంటిది. కావున వాఙ్మయము ఒక పురుషాంతరము నుండి మరియొక పురుషాంతరము వరకు క్రమక్రమాభివృద్ధి నొందుచుండును. ఈ సందర్భమున రాయప్రోలు సుబ్బారావుగారివాక్యములు ఉదాహరణ యోగ్యములు"కవికర్మయే కావ్యము; అయితే కవులన నెవరు ? మంత్రద్రష్టలై ఛందస్సుల నవతరింపజేసిన వైదికర్షులు కవులు; విజ్ఞాన పారంగతులై యుపనిషత్తుల నుపపాదించిన బ్రహ్మవాదులుకవులు; ఆనందోపాసకులై

మానవజీవిత మాధుర్యమును సంకీర్తన మొనరించిన కాళిదాసాదులు కవులు. అయితే యీ కవుల కందరకు ఏకాదర్శమే గోచరింపదు. లక్ష్య లక్షణముల రెంటను అంతర మగపడుచున్నది.'' ఆంగ్ల సాహిత్యమున గూడ నీ మార్పు విస్పష్టము. ఛాసరు షేక్స్పియరుల, మిల్టను కీట్సుల కావ్యము లిందుకు నిదర్శనములు. నన్నయ, తిక్కనలు, ఎఱ్ఱన సోమనలు, శ్రీనాథ పోతనలు, పెద్దనసూరనలు, తెలుగు వాఙ్మయమున మార్పునకు త్రోవజూపినవారు. లక్ష్యలక్షణముల రెంటియందును ఈ కవులలో నంతర మగపడుచున్నది.

సంఘ జీవితమునకు సాహిత్యమునకు వీడరాని సంబంధము కలదు. ఒక కాలమునందలి నాగరికత ప్రత్యేక స్వరూపమును దాల్చుటకు కారణములు, ఆ నాగరికత పైనగల యితర ప్రభావములు (*influences*) ఆ జాతి సాహిత్యమునందును స్పష్టముగా గన్పట్టును. అసాధారణ ప్రతిభాశాలియగు రచయిత స్వీయ వాఙ్మయమునందు నూతన శక మారంభించి సమకాలిక సాహిత్యమునకు క్రొత్తరుచులను గల్పించుటయు గలదు. కాని యెంతటి శేముషీ సింధువైనను సమకాలిక సంస్కృతి, విజ్ఞానము, ఆదర్శములు, నైతిక మానసిక విప్లవ శక్తులు మున్నగువాని ప్రభావమునుండి తప్పించుకొనజాలడు. కవి వ్యక్తిత్వము తత్కాలమునందలి యాదర్శములు, వీని పరస్పర ప్రభావ పరిణామ ఫలితము సాహితీ చరిత్రమున నొక విలక్షణమగు రసవదధ్యాయమును ప్రారంభింపజేయును. ఇందుకు మన యాధునిక కవి కుమారుల ఖండ కావ్యములు ఉజ్జ్వలోదాహరణములు.

అదియేమిచిత్రమో కాని ప్రపంచమున ప్రతి సారస్వతమునకును ఆరంభము పద్య రచనయే. పూర్వకాలమున నేటివలె విజ్ఞానము ఎక్కువగా నభివృద్ధినొందక, ఉన్నది కొంచెము సరిగా ప్రబలక యుండుట వలన, మానవుల హృదయశక్తి బలవత్తరమై యుండెను. ఆనాడు వారి

మెదడుకన్న హృదయమే గొప్పది. కావుననే కాబోలు గద్య రచన కన్న పద్య వాఙ్మయము, కవిత్వము ఆనాడు యెక్కువగా నభివృద్ధి నొందినది. ఆదికవులందరు పురాణములకే ప్రాముఖ్యమొసంగిరి; కావ్యములు, నాటకములు తరువాతవి. జనులకు మానవాతీతములగు విషయములందు రక్తియు, దేవతలమహిమయందు భక్తియు నిందుకు కారణమైయుండనోపును. కవులు తమ కృతులు జనాదరణకు పాత్రములు కావలెనను తలంపుతో రచించుటచే ఆ నాడు పురాణములు ప్రబలి యుండును. ఆ కాలమున మతమునకు ప్రజాజీవితమునకు అవినాభావ సంబంధమే యుండెను. మతమునకు సంఘమునకుగల మహనీయ ప్రాముఖ్యము, మానవుల నావేశ భరితులనుగా జేయుటలో దానిసామర్థ్యము, పురాణ రచనా కారణములలో నొక్కటియై యుండనోపును. కాలక్రమమున జనులరుచి భేదమే సాహితియందలి మార్పునకు కారణమయ్యెను.

ఆంధ్రమున నన్నయాదులు స్వతంత్ర కావ్యరచనా శక్తికి జాలిన వారయ్యును పురాణముల నాంధ్రీకరించుట తోడనే సంతృప్తిని.ది యుండుటకు కారణములు దేశాకాల పాత్రములే యనుట సత్యము. వైదికావేశమున సాంస్కృతిక బహుళంబగు శైలిని భారతరచన గావించిన మహాత్ముడునన్నపార్యుడు. రాజనీతిరహస్యములెరింగి తీసిగొలుపు తెనుంగున భారతరచన సాగించిప్రబంధావళికి బీజముల నాటినవాఙ్మయ ధురంధరుడు తిక్కన సోమయాజి, నన్నయ తిక్కనల విలక్షణ వ్యక్తిత్వముల సమన్వయించిన దక్షుడు శంభుదాసుడు, సోమన శబ్ద చిత్రమునకు ప్రాధాన్యమిచ్చినాడు. పాల్కురికి కవిజాను తెనుంగున తన రచనలను విలసిల్లజేసి స్వీయభావ ప్రచారము నిరాఘాటముగా సాగించినాడు. శ్రీనాథ పోతనలు సమకాలికులు. అక్కచెల్లెండ్రనదగు భక్తి శృంగారములు వీరిరచనలయందు అల్లిబిల్లిగా నల్లుకొన్న రెండు తీగెల వలె నొప్పు చున్నవి. సానలదీరిన జాతిరత్నములను సాహితీసుందరికి

కాన్క యొసంగినవారు పెద్దన రామరాజభూషణులు. కల్పనాచాతుర్యము సూరనన్నది. వర్ణనా నైపుణ్యము రామకృష్ణునిది. ఇట్లాంధ్ర సారస్వతమున గణనీయుడగు ప్రతివ్యక్తియు స్వీయాభిప్రాయములను, ఆత్మవ్యక్తిత్వమును ప్రకటించుచు స్వతంత్రములగు దారులను ద్రొక్కి మార్పు వాఙ్మయ లక్షణమని చెప్పక చెప్పినారు.

నీరసానుకరణములుబింబప్రతిబింబ సదృశ్యములగు ప్రబంధములు మన సారస్వతమున కొన్ని జన్మించినవి. పరంపరా గతములగు భావములే, పూర్వ ప్రబంధముల పోకడలే వానికి ముఖ్య లక్షణములు.

"శివుడు తాండవమాడనాడవె, పిశాచీ భూత భేతాళముల్ ?"

శతక వాఙ్మయ మొక్కటే యీ కాలమున సాహిత్యమని చెప్పదగినది; అట్లుండ వచన వాఙ్మయమునకు పునాది వేసినవాడు చిన్నయసూరి. కాని తెలుగువచనము చక్కదనముతో ముద్దులొల్కినది వీరేశలింగయుగమున. వీరేశలింగము గద్య తిక్కన; అపరనన్నయ, మన వాఙ్మయమును సర్వాంగశోభితను జేసినది వీరేశలింగముపంతులు. ఆయన "ఆంధ్రసాహితీ పునరుద్దరణ ప్రభావు"డనుట నిక్కువము.

(తెలంగాణ దినపత్రిక 1941-42)

—: :—

# నవ్య కవితా నీరాజనము

## II

## నవ యుగోదయము

శ్రీ వీరేశలింగ యుగమున సాహిత్యలక్ష్మి నూత్న శోభలతో విలసిల్లినది. ప్రబంధ కవిత్వాది శృంఖలా విమోచనము వలన కళ కళ లాడు నెమ్మోముతో పెంపెసలారినది. నిడుదలగు సమాసములపై మక్కువ మాయమైనది. చదివినను వినినను జనుల కర్థమగు శైలి కలిగి అల్పపద పరికరముతో అల్పార్థమును వ్యక్తీకరించుచు గ్రంథ సముదాయముపై ప్రీతి హెచ్చినది. రాజుల ఇష్టానిష్టముల ననుసరించి వారి కనుకూలమగు రచనలు సాగించు కాలమంతరించినది. సామాన్య ప్రజల జీవితమునకు ప్రాముఖ్యము హెచ్చినది, ఉద్రేకము కవితా రంగమున ప్రముఖ స్థానము నాక్రమించినది. జీవకళతో సాహిత్యము తేజోవంతమైనది.

సారస్వత ప్రపంచమున వీరేశలింగము త్రొక్కని త్రోవలేదు. ఆయన బహుముఖ సారస్వత సేవకు ముఖ్యకారణము ఆంగ్లవాఙ్మయ సంపర్కము. ఆ కాలమున విశ్వవిద్యాలయము లందాంగ్లేయ విద్య నభ్య సించిన విద్యార్థికులు ఆంగ్లేయ భాషాభిరుచులను గలిగి ఆ మార్గమున జేసిన రచనలను ప్రోత్సహించిరి; శ్రీ వీరేశలింగముగారిచే స్థాపిత మైన యీ నవీన సారస్వతోద్యమమున పాల్గొని భాషాయోషను మేలి సొమ్ములతో నలంకరించిరి. తెనుగున ఆధునిక పద్ధతి నాటక రచనకు పునాదులు వేసి గురుజాడ అప్పారావుగారికి మార్గదర్శియైనది. శ్రీ వీరేశలింగముగారి యమృతలేఖినియే. ఆంగ్లవాఙ్మయ సంపర్కము వలన నాంధ్రమున విషాదాంత నాటకము ఉద్భవించినది. రామకృష్ణా చార్యులవారి విషాద సారంగధర మిటప్రత్యేక స్మరణీయము. సాంఘిక దురాచారములను ఈ కాలమున ప్రకటించు నాటకములీ నవీనోద్యమ

ఫలితములే. చారిత్రక, సాంఘిక, అద్భుత కథా ప్రధానములగు నవలలు మన సారస్వత నికుంజమున మొగ్గ దొడిగినవి. రాజశేఖర చరిత్రను, చిలకమర్తివారి నవలలు, మాలపల్లి, ఇటీవల అడవి బాపిరాజు, విశ్వనాధ సత్యనారాయణగార్ల రచన లిందుకు నిదర్శనములు. కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి. వేంకట లక్ష్మణరావు, పానుగంటి లక్ష్మీనరసింహారావు మున్నగువారు వ్యాసరచనలో ఆత్మప్రతిభా సూచకమగు వివిధ మార్గములను జూపినారు.

దేశచరిత్రము, శాసన పరిశోధనయందు విద్వాంసులు శ్రద్ధ వహించినారు. కవితా విమర్శనము పూర్వ పద్ధతులను విడిచి నూతన మార్గముల నడిచినది. సంవత్సరాది సంచికలలో విద్యాధికుల వ్యాసములు, గ్రంథాలయ సర్వస్వమునందలి రాయప్రోలు సాహిత్య విమర్శనములు. దువ్వూరి బసవరాజుల వ్యాసములిందుకు నిదర్శనములు. కవిత్వ తత్వవిచారము, అనంత కృష్ణశర్మగారి వ్యాసములు సాహితీ విమర్శనమున కొత్త పద్ధతులను ప్రవేశపెట్టినవి. ఆంగ్లభాష యందువలె వసంత లేఖలు శారద లేఖలు పత్రికల నలంకరించినవి. కవి జీవితము. వ్యక్తి చరిత్రలు మన భాషయందు కూడ ప్రభవించినవి. ఈ నవీనోద్యమమునకు ప్రాణాధారము పత్రికా వాఙ్మయము. ఆంధ్ర కృష్ణాపత్రికాధిపతులొనరించిన సేవ తెనుగు వాఙ్మయమున స్వర్ణాక్షరాలతో లిఖింపదగినది. ముట్నూరి కృష్ణారావుగారి సంపాదకీయములు తెనుగున నొక క్రొత్త శైలిని కళా ప్రపంచమున క్రొత్తరుచులను ప్రబలజేసినవి. భారతి, శారద, సాహితి, సుజాత. ప్రతిభ, ఉదయిని. మున్నగు మాసపత్రిక లొనరించిన సేవ గణనీయము. ౮

ఆనాడు సంఘసంస్కరణోద్యమ ఫలితముగా ఆంధ్రమున నెంతయో సాహిత్య ముద్భవించినది. వీరేశలింగము బ్రహ్మమతావలంబుడు, సంఘ సంస్కారి, దక్షిణదేశ విద్యాసాగరుడు, ఆయన తన భావములను రచనల మూలకముగా నాంధ్రావనిలో ప్రచార మొనరించి

ఆంధ్రులను మేలుకొలిపి నవయుగోదయ మొనరించినాడు. ఈనవయుగ ప్రభాతమున వీరేశలింగమునకించుమించు సైదోడులగు వైతాళికులు, వేంకట లక్ష్మణరావు, వేంకటరాయశాస్త్రి, వీరభద్రరావు, వడ్డాది, వావిలికొలనులు, జయంతి గిడుగులు, తిరుపతి వేంకటకవులు, నాగేశ్వరరావు మున్నగువారు.

లక్ష్మణరావుగారు వివిధ విజ్ఞాన శాఖలయందు ప్రవీణులు. బహుభాషా కోవిదులు. విజ్ఞాన సర్వస్వ సంపాదకులై, విజ్ఞానచంద్రికా గ్రంథ మండలి స్థాపించి ఆంధ్రులకు విజ్ఞాన భిక్షపెట్టిన విజ్ఞాని లక్ష్మణరావు. వేంకటరాయశాస్త్రి సంస్కృతాంధ్రములయందు మహా పండితులు. ప్రతాపరుద్రీయము ఆయన కళావేతృత్వమునకు, స్వతంత్ర నాటక రచనాశక్తికి నిదర్శనము; సాహిత్య దర్పణాది గ్రంథ ములను రచించి నైషధ ఆముక్తమాల్యదలకు వ్యాఖ్యాన మొన రించిన యాతడు నిజముగా జంకు కళంకులేని కవిచంద్రుడు; తోషిత కోవిదేంద్రుడు. ఇరువదియవ శతాబ్దారంభమున ఆంధ్రమహా పండితు లలో ప్రత్యేక వ్యక్తిత్వము గలిగి, చారిత్రాత్మకములగు నిర్ణయములకు కారకులు జయంతి రామయ్య, గిడుగు రామమూర్తిగారలు. ఆంధ్ర మహా పురుషులలో వీరిరువురకు ఉత్కృష్టస్థానములు గలవు. ఇరువురును ఉద్దండ పండితులు, విజ్ఞాననిధులు. ఇరువురు కళా ప్రపూర్ణులే. ఇరువురి జీవితా పరమావధి భాషాసేవయే. ఇరువురు తదాదర్శ నిర్వహణార్థము తమ సర్వస్వము ధారపోసినారు. ఇట్టి ఏకాశయ బద్ధులయ్యు వారు భిన్నమార్గానుయాయులు. వ్యావహారికభాషను గ్రంథముల కెక్కించి వానిని జనసామాన్యములో వ్యాప్తికి దేవలెనని గిడుగువారి సంకల్పము. భాషను చక్కగా సంస్కరించి, సరళమగు శైలిని పుస్తకములను ప్రక టించి, విజ్ఞానము ప్రజలకు పంచిపెట్టవలెనని జయంతివారి ఆశయము. ఇట్టి వాదములతో నీ పండిత సింహము లొండొరుల డీకొనినవి. జయాభిలాషులై పోరాటము సాగించినారు. భావ సంఘర్షణము

ప్రస్ఫుటమై యాంధ్రలోకమున నిరుకతులు బయలుదేరినవి. గురుజాడ వారు *Social reform and spoken Telugu* తో గిడుగువారి కండయై నిలిచినారు. పానుగంటివారు, రామయ్యగారి వాదమును బలపరచి నారు. ఆంధ్రుల యశోవంతమగు చరిత్రను గ్రంథస్థ మొనరించి, వారిని భాస్వంతమగు భవిష్యత్తును నిర్మింప ప్రబోధించిన మహానీయులు చిలుకూరి వీరభద్రరావుగారు; తిరుపతి వేంకటకవులు కవితకు స్వేచ్ఛావిహార మొసంగి ప్రజలలో వాఙ్మయాభిరుచిని పునరుజ్జీవింపజేసినారు. సారస్వతోద్యానవనమున వీరు కల్పించిన క్రొత్త పాదులనుండి యుద్భవించిన నూతన కవిత్వవల్లి నవప్రసవములను విరబూచినది. ఆధునికాంధ్ర కవులలో వీరికి శిష్యులో, ప్రశిష్యులో, ఏకలవ్య శిష్యులో కానివారు లేరనుట అతిశయోక్తి కానేరదు. ఆంధ్రావనిలో పద్యరచనకు బహుళ ప్రచారము కల్పించినవారు తిరుపతి వేంకటకవులు. గంగా ప్రవాహము నను బోలు వీరి కవితావాహినియందు స్నానమాడి సాహితీ దేవాలయమున ఖండకావ్య కుసుమములతో ప్రవేశించినవారు నవ్యాంధ్ర కవికుమారులు. వీరినిగురించి "వానలో దడియని వారు మధ్గుర వధానమ్మృదూక్తి మరంద ధారలో గడుగని వారు మాకెచట కానగ రారిల తెల్గునాడునన్" అని వచించి నాడొక యాధునిక కవికుమారుడు. ఇంకొక కవిమిత్రులు "ఎన్నడు బెండు పల్కొదవదెవ్వని నాల్కకు రే యుదార భావోన్నతునిన్ రసార్ద్ర హృదయున్ వరియించుట మన్ననగాంచె నాంధ్రి" అని ప్రశంసించి తమ సౌందరనందమును "నీవిడినట్టి భిక్ష యిదె నీకె యొసంగెదమని" కళాభరణముగా నర్పించి నారు; తిక్కన కేతనల యనంతర మిట్టిరమణీయ దృశ్యము ఆంధ్ర సాహితీ చరిత్రమున వేరొక్కటి గానరాదు. సుప్రసిద్ధుడగు నింకొక కవిశేఖరుడు.

ఇలుదాటి నీవు రావలెగాని
  నీ పదంబులు నమస్కృతులలో మునిగి తేలు

మతినెంచి నీవు సమ్మతి జూపవలె గాని
బిరుదాళి నీ రొమ్ము తురగలించు
చేసాచి నీవు యాచింపంగవలె గాని
మణులతో నీ కొంగు తొణకి పోవు
తల వూని నీవు చే కలమందవలె గాని
సిసలైన కవనంబు చెంగలించు

అని సముచితముగా ప్రశంసించినాడు.

ఈ విధముగా నాంధ్రులు మేలుకొని నూత్న ప్రభాతము నాహ్వానించినారు. ఆ సమయమున దేశీయ మహాసభ ఆంధ్రుల హృదయ క్షేత్రముల స్వాతంత్ర్య బీజముల నాటి వారిని వీరపూజాతత్పరులనుగా నొనర్చినది. ప్రకాశము, పట్టాభి, సాంబమూర్తి, నాగేశ్వరరావులవంటి యాంధ్ర మహానాయకు లుద్భవించి జాతీయోత్సాహము నినుమడింప జేసినారు. ప్రజలలో స్వతంత్ర భావములు ప్రజ్వరిల్లినవి; జాతీయ వాఙ్మయము జనించినది. ఆంధ్రమహాసభ ఆంధ్రత్వము ప్రబోధించినది. ఆంధ్రరాష్ట్ర సమస్య ప్రాముఖ్యము నందినది. రాష్ట్ర సంపాదనార్థము ప్రబోధ వాఙ్మయము పెరిగినది. శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారి రాష్ట్రగాన మిట ప్రత్యేక స్మరణీయము. గాంధీయుగ మారంభమై 'సత్యము' 'అహింస' 'విశ్వమానవ కల్యాణము' మున్నగు ఉన్నతాదర్శములు ప్రజల నాకర్షించినవి. ఆత్మకథ సౌందరనందము వంటి కావ్యములు వాఙ్మయమునకు మేలి సొమ్ములై విలసిల్లినవి.

వంగసాహితీ ప్రభావమిట ప్రసక్తము. శాంతినికేతనమున రవీంద్రుని సాహచర్యమునంది వచ్చినాడు, నవ్యాంధ్ర చైత్ర శుభోత్సవ విభాతమును చిగురింపజేసిన ఆచార్య రాయప్రోలు సుబ్బారావు గారు, సాహితీ సమితి సభాపతియై, నవ్యాంధ్ర సాహిత్య ప్రవక్తయై, ఆంగ్ల ఫ్రెంచి వంగభాషలయందు సంస్కృతాంధ్రములతోపాటు ప్రవీణులైన శివశంకరశాస్త్రిగారు వంగభాషలోని పోకడలను కొన్ని తెనుగున

ప్రవేశపెట్టినారు. వెంకట పార్వతీశ్వర కవులు వంగనవలల నాంధ్రుల కొసంగినారు. ఈ కాలముననే కవిసార్వభౌముడగు రవీంద్రనాథుని కవితామహిమ, ఆధ్యాత్మిక శక్తియుక్తములగు నాతని రచనలు ప్రపంచమును దిగ్భ్రాంత మొనరించినవి. ఆయన ప్రబోధించిన విశ్వ మానవ సౌభ్రాతృత్వము జగత్కల్యాణము, జాతిభేదరాహిత్యము ఆంధ్రుల నాకర్షించినవి.

*"A commonwealth of nations and a federation of worlds"*

అను నాదర్శములు మన కవి కుమారులను ముగ్ధులనుగా నొనర్చినవి.

చూడు మును మును మేటి వారలమాట
లనియెడి మంత్ర మహిమను జాతిబంధము
లన్న గొలుసులుజారి సంపదలబ్బెడున్,

ఎల్లలోకము నొక్క యిల్లమి
వర్ణభేదము వెల్లకిల్లయి
వేలనెరుగని ప్రేమబంధము
వేడుకలు గురియ
మతములన్నియు మాసిపోవును
జ్ఞానమొక్కటి నిలిచి పోవును
అంత స్వర్గసుఖంబులన్నవి
యవని విలసిల్లున్.

అని గురుజాడ వాక్కులవంటివి ఇతర ప్రముఖుల రచనల యందును కాననగును. వంగ వైష్ణవ గీతములందలి రక్తి, ప్రేమ, ప్రకృతి పురుషుల లీలా విలాస వర్ణనము వేంకట పార్వతీశ్వర కవుల ఏకాంత సేవయందు కాననగును. బ్రహ్మసమాజ ప్రాబల్యము కృష్ణ శాస్త్రిగారియందు గోచరము. వైష్ణవ సంప్రదాయమందలి ప్రేమయే కాబోలు సవ్యకవుల రచనలయందు గోపాలకృష్ణుడు, వేణుగానము, రాధ మిక్కిలి ప్రాముఖ్యముగలిగి రసికుల హృదయములకాహ్లాదము గలి

గించుట. రాధాకృష్ణుల మధుర ప్రణయమును శ్రీ విశ్వనాథ సత్య నారాయణగారు శృంగార వీధిలో చిత్రించినారు. పోతనామాత్యుని భ్రమరగీతాదులు మన భావ కవికుమారుల రాధాకృష్ణుల ప్రణయ సంకీర్తనమునకు కొంతవరకు ప్రోత్సాహ కారణమేమొ ?

ఈ ప్రోద్బలములన్నింటిలో ఎన్నదగినది ఆంగ్లసారస్వత ప్రోద్బలము. భిన్న నాగరికతాసంపర్కము భిన్నసారస్వత సంబంధము ప్రతి సాహిత్యము నందును విప్లవము కలుగజేసి తీరును. ఈనాటి తెనుగు సారస్వత వాహిని సంస్కృతాంగ్లేయ వాఙ్మయ వాహినులతో సంగమించి త్రివేణి సంగమ సౌందర్యమును ధిక్కరించుచున్నది. ఆంగ్లభాషా వ్యాసంగము ఆంధ్రభావకవికుమారులను స్వేచ్ఛానురక్తులుగను ఆశయ పూరితులుగను జేసి సహజ భావనా మహిమకు దోహదమొసంగి ఉజ్వల భావ పూరితములగు రచనలనుద్దీపింప జేసినది. ఆంగ్లసహాయమున విశ్వ సాహిత్యముతో సంపర్కము గలిగి ఆంధ్ర సాహితీ దృష్టి విశాలమైనది. నవ్యాంధ్ర కవితకు ముఖ్యాంగ్లసాహితీ ప్రోద్బలములు వర్డ్సువర్తు షెల్లీ కీట్సు రచనలని చెప్పవచ్చును. (*Wordsworth*) వర్డ్సువర్తు ప్రకృతిప్రేమ, ప్రకృత్యుపాసన కీట్సు భావ సౌందర్యము, భాషా మాధుర్యము షెల్లీ స్వాతంత్ర్య దాహము. ఆధ్యాత్మిక తృష్ణ, అస్పష్టతా మాధుర్యము అభినవాంధ్ర కవి కుమారులయందు పుష్కలముగా లభించును. ఈ ముగ్గురు కవుల కావ్యరీతులందలి శ్రావ్యమగు సంగీతధ్వని మన యాధునికాంధ్ర కవుల రచనలయందు గానవచ్చును. పైన బేర్కొనబడిన యాంగ్ల కవి కుమారులయందు నీతికన్న రస పోషణకే యగ్రతాంబూలము. పరాసు విప్లవమునకు ఆంగ్ల వాఙ్మయమునకు గల సంబంధము వంటిదే గాంధీ తత్వమునకు మన నవ్య కవి కుమారుల స్వాతంత్ర్య భావములకు గల సంబంధము. ప్లేటో తత్వము ఆంగ్లభావకవికుమారుల నేవిధముగా నాకర్షించి వారి ప్రతిభకు దోహద మొనరించినదో అదే విధముగా వైష్ణవ గీతముల భక్తి ప్రేమలు మన కవుల భావనా శక్తిని విజృంభింప జేసినవి.

కాని నవ్యకవుల రచనలు ఆంగ్లభాషా దాస్యపరిణామములు, తదనుకరణానుసరణములని చెప్పుట తప్పు. వీరి రచనలు సహజ ప్రతిభకాలవాలములును, ఉజ్వల భావనా మహిమచే ప్రదీప్తములును, అని తెలియనగును. ఈ రచనలలో తెనుగుదనము మూర్తీభవించి యుండును. స్వీయభావ ప్రధానము లగుటచేత వీనియందు విలక్షణ వ్యక్తిత్వము ప్రస్ఫుటము. ఈ భావ వైలక్షణ్యమేకాక శైలీ ప్రత్యేకత ఆధునిక రచనల విశేష గుణము. ఆంగ్లభాషా వ్యాసంగము కొంత వరకు వీరి కవితా శక్తికి దోహద మొనరించినది. అంతే—

అంతమాత్రమున తెనుగు సరస్వతీ సౌందర్యము స్వీయ ప్రత్యేకత కోలుపోదు. తెనుగుదనము భావకవికుమారులు మిక్కిలిగా ప్రేమించి పోషించుకొను గుణము. కావున వారు భాషా వధూటి కొసంగు భూషణములు ఎరువు సొమ్ములుకావు. విశిష్టమగు భావనా శక్తిచే సుద్దీపింపబడి భవ్యమగు నావేశ ఫలితములగు వీరి రచనలు గంభీర భావ శోభితములై సౌందర్య విలసితములై తద్రచయితల సహజ సామర్థ్యము వ్యక్తీకరించుచున్నవి.

ఆధునిక కవితయందు కవి హృదయము ప్రతిబింబించును. కవి ఆశయములే, సామాజికములగు పలువిషయములను గురించిన యాతని భావములే నవ్యకవితయందు గోచరించును. పరోక్షముగా నేదోయొక సందర్భమును కలిగించుకొని కాక ప్రత్యక్షముగా పాఠకుల నుద్దేశించుట నవ్య కవుల యలవాటు.

"నవ్వివోదురుగాక నాకేటి సిగ్గు
నాయిచ్ఛయేగాక నాకేటి వెరపు"

అని పలికిన భావ కవి

"నావలెనె యాతడున్మత్త భావశాలి
ఆగి కోలేదు రేగునూహాలనొకింత
ఇంత చిఱుగీతి నెద వేగిరించునేని"

పాడుకొనును, తాండవనృత్య మాడుకొనును, అనువాక్కులిట నుదాహరణ యోగ్యములు. భావకవితలో కవిభావములకే ప్రాధాన్యము.

"నాకనుల యెట్ట యెదుటన నా జనకుని
జనని కుత్తుకలను గోసి ననునడిగె నతండు
నే దయాంబుధిని గాదా యటంచు
ఓ ప్రభూ! నీవయంటి నే నొదిగియుండి;"
"నా కనుల యెట్టయెదుటన నా లతాంగి
ప్రాణములు నిల్వునం దీసిననునడిగె నతండు
నే దయాంబుధినిగాదా యటంచు
ఓ ప్రభూ! నీవయంటి నే నొదిగి యొదిగి;"
"నా కనులయెట్ట యెదుటన నా యనుంగు
తనుజు కుత్తుకనులిమి తానను నడిగె న
తండు నే దయాంబుధినిగాదా యటంచు
ఓ ప్రభూ! నీవయంటి నే నొదిగిపోయి:"

అని యా దయాంబుధి పాద పంకజముల కడ మోకరిల్లిన శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు.

'నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి రూప రేఖా కమనీయ వైఖరులగాంచి భళీ భళి యన్నవాడె, మీదే కులమన్న ప్రశ్న వెలయించి చివుక్కున లేచిపోవుచో, బాకున గ్రుమ్మినట్లగును పార్థివ చంద్ర వచింప సిగ్గగున్'.

అని హృదయా వేదనను వెలిబుచ్చిన జాషువా కవీశ్వరుడు యీ విషయము నిరూపించుచున్నాడు. ఈ కవులు ఆవేశపూరితులు గాక, వారి హృదయములందు రసోదయము గలుగక కవితారచన కుపక్రమింపరు. గాననే వారి రచనలలో భావములంత యుత్కటముగా హృదయమునుండి దూసికొని వచ్చునవిగా నుండును. చూడుడు.

"ప్రకృతిని తనలోన నాకు గన్పడగనీక
దాచుకొన్న దసూయచేతమ మదీయ
హృదయ రాజ్యాధినాథుని విదితయశుని;
ఏను భరియింపగాజాలనీ దురంత
కుటిల దారుణకార్య సంఘటనమింక
ఎవ్వరని ప్రకృతినన్ను ఊహింతు వీవు
అంధకారము నల్దెసలావరింప
కంపిత నిశీధి మేఘ సంఘములు గ్రమ్మి
భయదమాలిక చేత సర్వ ప్రపంచ
రాజ దండము ధరియించి ప్రతిభతోడ
మేరుభూధర శిఖర సామీప్యభాగ
పీఠకను గొల్వుదీరినభీతి దవిలి
తరమహార్ణవ ఘోషయే శృతిగజేసి
సర్వ పైశాచగణము సంస్తవము సేయ
చంద్రనివ్వుల కనుల శాసనము వ్రాసి
కడగి బంధింతు సర్వలోకాల నేను
సకల మతశాస్త్ర సారవిస్తార కలిత
నిజమనోరథ భగ్న కంఠీరవుడను
వదల నాతని జూపించి కదలిపొమ్ము
మన్నిశిత వీక్షణ నిపాత మార్గణముల
గెరలి యెవ్వడుబోడు ప్రకృతి నిజంబు
ఈవు నాస్వామి జూపింపవేని వినుము
అగ్ని కణములు రాలు నేత్రాలతోడ
వేడి నిశ్వాసములను కెంబెదవులదర
తనువు ఆపాద మస్తకంబును మహోగ్ర
గతిని గంపించి పోవ దుర్మతివిగాన
నీదు వైభవము నిన్ను బూదిగాగ
నిపుడె భీషణగతి శపియింతు నేను"

ఉత్సాహము, ఆవేశము, ఉద్రేకము, నవ్యకవితకు ముఖ్య లక్షణములు. ఆవేశ సాగరమును నిగ్రహ సహాయమున నీదువాడు కావ్య

కర్త. ఏ సహాయమున లేక ఆవేశ మేమైపున నీడ్చిన ఆవైపునకు దిరుగువాడు భావకవి. కావున కథాచమత్కారము, వర్ణనా నైపుణ్యము, పాత్రపోషణ నవ్యకావ్యములందంతగా గానరావు. రసానుభవమును నార్ద్రహృదయుడైన కవి కుమారుని లేఖినీ విన్యాసమే నవ్యకవితా విలాసము.

ఆంగ్లేయ కవులతో నవ్యాంధ్ర కవులకు కొన్ని పోలికలు గన్పట్టుచున్నవి. ఆంగ్ల వాఙ్మయమున వలె తెలుగునందును స్మృతి కావ్యములు గోచరించుచున్నవి. దువ్వూరి రామిరెడ్డిగారి "భగ్న హృదయము" విశ్వనాథవారి "వరలక్ష్మీ త్రిశతి" యీనాటి స్మృతి కావ్యములలో నగ్రగణ్యములు. స్పెన్సరు, మిల్టను, షెల్లీ, ఆర్నాల్డు మున్నగువారి చేతులయందు నిగ్గులు దీరిన గోప కావ్య (*Pastoral*) ప్రభావము రామిరెడ్డిగారి "వనకుమారి" యందు కాననగును. మర్మ కవుల (*Mystic poets*) యస్పష్టతా మాధుర్యము శ్రీ రాయప్రోలు వారి కృతులయందు కన్పట్టును. ఆంగ్లేయ కవులవలె నవ్యాంధ్ర కవులు గూడ సౌందర్యారాధకులు. జీవితమునందలి సామాన్య విషయము లందు గూడ వీరు కవితా కన్య సౌందర్యమును దర్శింతురు "ఆర్ద్రి పురుగు" "గిజిగాడు" మున్నగు మనోహర ఖండకావ్యము లిందుకు నిదర్శనములు.

"సరస చైతన్య రంజిత జగతియందు
కవి గ్రహింపగ రాని వస్తువులు గలవె ?
రాళ్ల నేడ్పించు పచ్చి విరహులభాతి
పళ్లచే జోలపాడించు తల్లు లట్లు"

ఆంగ్ల కవులవలె మనవారికి పూర్వఛందో రచనలయందు కొంత యసంతృప్తి కన్పించుచున్నది. ద్విపద, ఆటవెలది, తేట గీతులకు తెనుగులో గలిగిన ప్రచార బాహుళ్యము, గురుజాడ వారి 'ముత్యాల సరములు.' అబ్బూరి రామకృష్ణారావుగారి నూతన ఛందో బద్ధములగు

రచనలు యీ విషయమునకు దృష్టాంతములు. ఆంగ్ల భావ కవితా యుగమున తత్సాహితీ విమర్శనమందు గూడ చారిత్రాత్మకములగు మార్పులు కలిగినవి. శబ్ద విచారములతో సంతృప్తినొంది, సాంకేతిక ములును, పాండిత్య ప్రదర్శనములును ఆగు జాన్సను, పోపుల విమర్శన లంతరించి షెల్లీవంటి రస హృదయుల సరసవిమర్శలు ఆంగ్లభాష నలంక రించినవి. తెలుగు విమర్శనా సాహిత్యమున గూడ నిట్టి మార్పు విస్పష్టము. ప్రకృత్యుపాసనా ఫలితముగ_నాంగ్ల సారస్వతమున పరంపరా గతములు, సాంకేతికములునగు బంధనములు విడిపోయి మానవ జీవితము యొక్క నిష్కాపట్యము, సరళత, అమాయకత కవితా రంగమున ప్రధాన పాత్ర నభినయించినవి. బ్లేకు, వర్డ్సువర్తు వంటి కవులు శైశవము నారాధించిరి. *Coleridge, simple unsophisticated nature* ను కవితాగాన మొనరించెను. కాపు కవియగు **Burns** ను యిట్టి వాడే. దీనులయెడ దయ, పేదలయెడ కరుణ బర్న్సు కవితలో ప్రధా నములు. ఈ కవులయందు పాండిత్య శౌండీర్యమునకన్న, సరస సాహిత్యమే అధికము. పై విషయము లన్నిటియందును ఆంధ్రాంగ్ల కవులకు సామ్యముకలదు. సమకాలీనములగు నవీన భావములు, సామ్య వాదము, హరిజన సమస్య, ఖద్దరు, వైరాగ్య రాహిత్యము, రాజ సగుణ ప్రాధాన్యము [ముఖ్యముగా ఉమరుఖయ్యాం ప్రభావము] నవ్య కవితా లక్షణములలో కొన్ని.

భావరంగముననే కాక క్రియాంగణమందు గూడ స్వాతంత్ర్య కాములు నవ్యకవులు. ఈ మార్గమున భవభూతి వీరికి మార్గదర్శి.

"ఈ వినూతన భావముల్ తావిలేని
పువ్వులని యంధలోకమ్ము నవ్వనిమ్ము
ఈ దిగంత ప్రణయ రేఖ పాదులైన
మధువు లూరించుటో నాదు హృదయమందు."

భావిభారత ప్రత్యూషమును గాంచి యుప్పొంగగల యుత్సాహ శీలురు వీరు. ఆంధ్రుల మహోజ్వల చరిత్రము "చావలేదు. చావ లేదు." అని డంకాగొట్టి వచింపగల యాత్మ విశ్వాసము వీరికి గలదు. "సభ్యతామిషమునన్ దేశంబునందెల్ల నింతకు ధర్మంబులు గాగ నెన్న బడు నన్యాయంబు లీనాటితో వికలంబై చనుగాకయంచు కరుణా వేశంబు దీపింప" బలికెడు స్వాతంత్ర్యదేవి వీరి కారాధ్యదేవత. కావుననే వీరి దృష్టిలో పూవులు గూడ.

"పేదల రక్తమాంసముల పెంపువహించి దయారసామృత స్వాద దరిద్రులైన ధనవంతుల పెద్దరికమ్ముకై, మతోన్మాదము పెంచు దేవునికి మారుగ నిల్చిన రాతిబొమ్మల" పూజనుగాని, "లలనాజన తాకబరీభరైక భూషాకలన" గాని కాంక్షింపక "మాతృదేశ సేవా చరణమ్మునందసువు లర్పణ సేయగజాలు పార్థివ శ్రీ చెలువారుచోట" రాలిపోవకోరును. మాతృదేశము, మాతృభాష వీరికి పూజనీయములు.

"పొగడరా నీతల్లి భూమిభారతిని
నిలుపరా నీజాతి నిండుగర్వంబు;
లేదురా యిటువంటి భూదేవి యెందు
లేరురా మనవంటి పౌరులింకెందు;
ఏపూర్వ పుణ్యమో ఏ యోగబలమో
జనియించినాడ వీస్వర్గ ఖండమున
ఏమంచి పూవులఁ బ్రేమించినావో
నిను మోచె నీతల్లి కనకగర్భమున"

అనియు

"కలదయేని పునర్జన్మ కలుగుగాక
మధుర మధురమైన తెనుగు మాతృభాష"

అనియు పొంగి పోదురు. ప్రకృతి శోభా విలాస లాలసులగు నీకవులు, వసంత వికాసము, శేష చైత్రము: జలదాంగన కంకణము,

మందారశిశువు, చందమామ, గరిక మొదలగు వానిని గూర్చి రమణీయ ములగు భావములను ప్రకటించిరి. గొల్లవాని గొడవలు, కాపువాని జీవితము, బ్రాహ్మణ సంసారము, జానపదుల సరససల్లాపములు, పేదల కష్టములు, యీనాటి కవుల కావ్య విషయములుగా నున్నవి.)

నవ్యుల శృంగారము అతి లలితము. మిగుల సున్నితము, కచ కుచాది వర్ణనలకందు తావులేదు. ప్రియురాలి శాంతమనోజ్ఞ రూపము, తిలక పాటల ఫాలమండల దీప్తిజాలము. కాంచనహార విలసత్కంఠ దేశము ఇవియే వీరు వర్ణించి చిత్రించునవి. వీరి ప్రేమ సిద్ధాంతములు సంభోగ శృంగారము నాశ్రయించునవి కావు. ప్రేమ యంతరంగముల నతికింప జాలినది. కాయ సాయుజ్యము అంత ముఖ్యముగాదు. ఆధునికుల వర్ణనా ఫక్కియు నూతనము. చెదరిన సౌందర్యము. సహజ సౌందర్యము వీరికి ప్రియములు. అంగవర్ణనమేగాక గుణవర్ణనయు వీరియందు గనుపించును. ఆధునికులు స్త్రీని ప్రణయినీ భావముతో కాక తల్లిగను సోదరిగను ప్రేమించి యారాధింతురు.

వీరి శైలియు క్రొంగొత్త సొబగులచే విలసిల్లును. శ్రవణ సుఖము నొసంగు మృదుల సరళాక్షరముల సమ్మేళనము వారి శైలికి విలక్షణ గుణము.

శైలిలో మృదుత్వము సాధించుకొరకు సంధులు విసంధులైనను సంస్కృతములు దేశ్యములతోడ సమసించినను, వారు సరకుసేయరు. అందు నిమిత్తము వారు ఇతర దేశీయములను గూడ మనభాషా సంప్రదాయముల ననుసరించి వాడుట కలదు.

(తెలంగాణ దినపత్రిక)
(1941-42)

# నవ్య కవితా నీరాజనము

# III

## ఖండ కావ్యములు

ఆంధ్ర సారస్వతమున ఖండకావ్య మహోదయము రాయప్రోలు సుబ్బారావు గారి రచనలతో తొలకరించినది. గురుజాడ అప్పారావుగారి "ముత్యాల సరముల" కూర్పుతో సారస్వత ప్రపంచమున కలిగిన సంచలమునకు సుబ్బారావుగారి రచనలు దోహద మొనర్చినవి. సుబ్బారావుగారు పాయలు పాయలుగా విడిపోయిన తెలుగు కన్నియ ముంగురులకు వేణీ యోగ్యాభరణముగా జడకుచ్చులల్లి యిచ్చినారు. ఆమె మణి బంధమందు తృణకంకణము భక్తితో నమర్చినారు. మరికొన్ని కావ్య కుసుమములను మాలికగా గూర్చి యామె కంఠమున వేసినారు.

సుబ్బారావుగారు ప్రకృత్యుపాసకులు గావున గ్రంధారంభమున కృత్యాద్యవస్థల ననుభవింపక, ప్రకృతిని పులకాంకిత గాత్రులై ఉత్సాహాపూరిత హృదయముతో నేవిధముగా స్తుతి యించినారో తిలకింపుడు.

"మామిడి కొమ్మమీద కల మంత్ర
పరాయణుడైన కోకిల
స్వామికి మ్రొక్కి యీ యభినవ
ధ్వని ధారణకుద్యమించితిన్"
"శశివికసించిన శ్రావణ
నిశీధమున గానబడిన నీరదసుతకున్
ప్రశమిత మతినై యీ ప
ద్యకుసుమాంజలి నొసంగితి ప్రణయార్పణమనుచున్"

అంతేకాదు.

"అణువునజాండమునేక స
రణి నిండారిన మనోహరపు వాగర్థ
ప్రణయము గీర్తించెడి మృదు
గుణుల భాషాకుమారకులనుతియింతున్"

శాశ్వత నవ్యస్ఫురణల
నశ్వరలావణ్యమై యెనయు కావ్యకళా
విశ్వమునందానందర
సైశ్వర్యము లేలు కవిత కంజలి యిత్తున్.

అని కరయుగమును బంధించి కావ్యరచనను ప్రారంభించుట భవ్యభావానుభవమున తన హృదయము ఆర్ద్రమై రసోదయ మగుటయే కారణము. తెనుగు సాహిత్యమున తామవలబించిన నూత్న మార్గమును గురించి వారు యీ విధముగా వచించి యున్నారు. "హ్లాదైకమయగు కావ్యమువలన నర్థింపదగిన పరమ ప్రయోజనము ఆనందము, ఆ ఆనందోపాసన గావించువాడే భావకవి. వస్తు సంవరణము నందు భావకవికి తన స్వానుభవమే యధికరణము. భావ కవిత్వమున స్త్రీ మాతృ పీఠమునం దాసీనురాలగును........అతి విశాలమగు నాత్మదేశమునందు తనయనంతమాతృభావమును మూర్తీభవింప జేయును. ఆ అనాది పితతో వికల్పజగన్మయుడైన తానెట్లు మెలగ వలయునో [కవికి] బోధపడుటలేదు. కావున తండ్రిని సాక్షిగానే వదలి తల్లిని ప్రత్యక్షదైవముగా సమీపించుచున్నాడు. తనకు యిష్ట దైవము దేశము; ఆమెకు అప్తపుత్రుడు తాను."

అంతస్స్పన రసస్పందముగాక కవితాదర్శనము గాదని సుబ్బా రావుగారి మతము. వీరి కావ్యములిందుకు మేలి నిదర్శనములు. ఈ విషయముననాంగ్ల భావకవులు షెల్లీకీట్సులతో వీరు తులదూగుదురు. వారొనరించిన ఆంధ్రులయశోగాన మీ విషయమును వ్యక్తీకరించు చున్నది. ఆ కావ్యగానమున ఉత్సాహమే. ఆవేశమే ప్రత్యక్షరమందును

ప్రత్యక్షమగు చుండును. "చావలేదు, చావలేదు ఆంధ్రుల మహోజ్వల చరిత్ర అస్మదార్ద్రమనోవీధినావహింపజ్ఞప్తి కెలయించుచున్నాడనని పలికి" "ఆంధ్రసంతతికే మహితాభిమాన దివ్యదీక్షాసుఖస్ఫూర్తి తీవరించె ఆ మహావేశ మర్దించి యాంధ్రులార చల్లుడాంధ్ర లోకమున నక్షతలు నేడు" అని నిద్రాముద్రితులైన సోదరాంధ్రులను ప్రబోధించినారు.

"మన పితామహమాతామహోపనిధుల శౌర్యప్రసక్తి" "రసవ శంకర నాగరరాగరక్తి, దూరదేశమందలి అన్యజాతుల నుద్ధరింపజాలిన వారి ప్రతిభా విశేషము, నిజాంధ్ర జాతి తంతు విచ్ఛేదము. సలుపజాలునని వారు ఘంటాపథముగా వచించుచున్నారు. "సంగీత సాహిత్య కళల"ను ఉగ్గుపాలతో ద్రావియుమిసిన యాంధ్రులను జగన్మోహనాస్త్రము లక్ష్యసింప సందేహమేలయని వారు ప్రశ్నించుచున్నారు. విమల సాహస సౌకుమార్యములను దిఙ్మతంబముల చిత్రించిన ఖడ్గతిక్కన భార్య రుద్రమదేవి మున్నగు తెలుగు పడచుల చరిత్రము జాతి చైతన్యము కొరకు పఠింపవలయునని శాసించుచున్నారు. విజయ కన్యకు వీర గోరజముబూసిన బలభద్రులు మనపూర్వులు; పులికడుపున చలిచీమపుట్టనగునె ? ఒకనాడు మనయింటి పడుచుజతలు చిలుక సరస్సులో శృంగార నౌకలు నడిపిరి. నిత్యకళ్యాణము పచ్చతోరణముగ సాంగగీతకల్యాణ శాఖక్రింద ఆనందదేవత నుపాసించిన ఆంధ్రుల మహౌన్నత్యము కవి భూషణులు నోరూర నోరార కీర్తించి ఆంధ్రుల చెవులలో ఉత్సాహ మంత్రమునూదినారు. కులము దడువక పొలిమేరగోలబడక "నాజాతి, నాదేశము, నాభాష" యను అహంకార దర్శనమందుమని ప్రభోదించినారు. సుబ్బారావుగారు సౌందర్యోపాసకులు. అపూర్వములగు వీరి సౌందర్యవర్ణనలు నవ్యాంధ్ర సారస్వతమునకు భూషణప్రాయములు.

కృత్రిమాలంకారశోభితముగాని సహజ సౌందర్యవైభవమే, నూరనార్యుని శాలినునికివలె, వీరికి ప్రియతమము. వీరి సౌందర్యము

విరిసిన నొక్క యొప్పు అరవీడిన వేరొకయొప్పు కొప్పుగా బరగిన నొక్క యొప్పు వేణిభావరచన నొక్క యొప్పు అను సూరనార్యుని పద్యమును జ్ఞప్తికిదెచ్చును. జిలుగు "పూల కలంకారి చీరజార" "జారు చెమ్మట ముత్యాల జంపుసరులతో నరుగుచున్న తృణకంకణ నాయికా సౌందర్యము స్వభావ" రమ్యము.

(శ్రీ) సుబ్బారావుగారి కావ్యవాతావరణము శుద్ధముగా ఆంధ్రము లది. ఆ భావములు అచ్చముగా తెనుగువారివి: అందలి నుడికారపు సొంపు తీయని తెనుగుబాసది. సూక్ష్మాతి సూక్ష్మములగు విషయము లను గురించి గంభీరతమములగు భావములను ప్రకటించుటలో కవిభూష ణునకుగల చాతుర్యము ప్రశంసనీయము. స్వప్నకుమారములోని

"కారుచీకట్లు లోకమున్గ ప్పెననుచు
నేలనిందించెదవు మేఘజాలములను"
"పూలబిడ్డల ప్రీతినుయ్యాలలూపు
పవను డెరుగడు తొడిమలు వదలుననుచు"

అను పద్యములలోని భావగాంభీర్యము మిక్కిలి శ్లాఘనీయము.

సుబ్బారావుగారి తృణకంకణ స్వప్నకుమారములు జతగా పఠింపవలసిన గ్రంథములు.

స్వప్నకుమారమున (స్త్రీ) కాముక భావములో తన్ను సమీపించిన కవి కుమారునకు పుత్ర భావము నుపదేశించును.

"పిలిచి బ్రతిమాలి పాలీయగలనుగాని, పాలుగొనుటకు నే యోగ్యురాలగాను" అనువాక్యము స్వప్న కుమారమునకు సంక్షేప రూపము. ఇంత మాత్రమున నాయిక అభిప్రాయము ప్రేమకూడదని కాదు; కాని యది ప్రదర్శింపవలసిన విధానము వేరు అని మాత్రమే. కావుననే యీ దయావళి.

"తుమ్మెదలు గ్రక్కుననుచు మధువుం ద్యజించు
భావము విరక్తికాబోదు పడుచువాడ"
"కోమల ప్రేమ సంపూర్ణ కుసుమ దళల
నలరు నప్పుడె దుఃఖ రజస్సు స్ఖలన మగును
వర్ష ధారల గడుగంగ బడిన పొలమె
ఆర్ద్రమై పచ్చబడునంచు నరయలేదె''

అని పలికి,

"అనుభవింపుము ప్రేమోచ్ఛిష్టము కుమార
అంటులేదని నీయాప్తులంపినారు.''

అని ప్రబోధించు దృశ్యము రమణీయము.

త్రృణకంకణ నాయికా నాయకులు ప్రేమ తపస్వినులు; చిన్న నాటి నెచ్చెలులు.

మన సంఘ జీవితమున అటనట యరాజకము ప్రబలు చున్నది. విద్యార్థికులు కొందరు ప్రేమకు శారీరక సౌఖ్యమని యర్థము చెప్పు చున్నారు. ఒకరి నొకరు వీక్షించినంత మాత్రమున హృదయము లుద్రిక్తములగుచున్నవి. క్రొత్తదనమొకింత మాసిన యంతనే వైవాహికజీవితము దుర్భరమగు చున్నది. కొందరి రచనలు యీమార్గమునే యనుసరించుచు విపరీత సిద్ధాంతములు ప్రతిపాదించుచున్నవి. వీరికి సుబ్బారావు గారు 'తృణకంకణమున' దివ్యసందేశ మొసంగియున్నారు

తెనుఁగుతోటతో నిత్య వర్చస్వినియగు వీరి లేఖిని స్వచ్ఛంద గగన తోరణములక్రింద, సహృదయానంద కల్యాణ విహృతికొలకు, లలిత సారస్వత నికుంజవలయమున తెనుఁగు మీరిన గరువపు తీరులలో భావపదము పాడినది. ఆ సమయమున తెనుఁగుతల్లి సమక్షమున భవిష్య దాంధ్రశోభను అవలోకించి నారు కవి భూషణులు.

విమర్శనాశక్తి, కావ్యరచనాశక్తి, రెండును ఒకే వ్యక్తియందు సమముగా విజృంభించుట యరుదు. సుబ్బారావుగారియందు నిర్మాణ విమర్శనాశక్తులు రెండును సమముగా విజృంభించిన వనుటకు వారి కావ్యములు, 'రమ్యాలోకము'ను తార్కాణములు.)

నవ్య సారస్వతోద్యాన వనమున కవితారసాల శాఖారూఢయై ఒకనాటి వసంతకాలమున నెల్లూరుప్రాంతములో "దువ్వూరికవికోకిలము" శ్రావ్యముగగూసి రసికాంధ్ర ప్రీతి గావించినది. దువ్వూరి రామిరెడ్డి గారుఫారసికన్న శ్రావ్యమై పల్లవకోమలమగు తెనుఁగున "పానశాలా" ప్రతిష్ఠలు గావించినారు. "నలజారమ్మ అగ్ని ప్రవేశము"చే మనహృద యముల గరగించినారు. "వనకుమారి" యందలి మౌగ్ధ్యముచే మన మనముల నాకర్షించినారు. "జలదాంగన" యందు భావనా మహిమను ప్రకటించినారు. "నక్షత్రమాల" యందు ఖండకావ్య తారాగణము దివ్యదీప్తులతో ప్రకాశించుచున్నది. ఇక నైవేద్యము"న ప్రొద్దుపొడు పున దేవి పాదపూజ కొరకు దోసిట గన్నేరుబూలతో దెచ్చి అర్పించిన హృదయపు సుగంధ ద్వీపము" జ్వలించుచున్నది.

సంస్కృతాంధ్రాంగ్లఫారసీక వాఙ్మయములతో చక్కని పరి చయముగల వీరికలము నవనవానందభావసుందర లతాంతములతో నవ నవలాడు చుండును. క్రొత్తపాతల కూర్మికలయికయే ఈయన కావ్య ములకు వన్నె పెట్టుచున్నది. ఈతని కవిత్వమున రాయప్రోలు సుబ్బా రావుగారి రచనలయందువలె యుత్సాహ మెల్లయెడల దీపించు చుండును. విశ్వసౌందర్యము సర్వమానవ సమానత్వము నీకవివర్యుడు కాంక్షించును.

రెడ్డిగారువీరకులప్రభూతులు. వీరిభావములు శూరజనోచితములు. కత్తులకూపము గాంచినంతనే వీరిచిత్తమున రోషాగ్ని ప్రజ్వరిల్లును.

కొండవీటియందు రెడ్డివీరులనెత్తురు శౌర్య సౌరభ్యముల వెద జల్లుటం గాంచి పరవశులైనారు. నాటి రెడ్డిరాజుల శౌర్యము వారికి జ్ఞప్తికి వచ్చినది. ఒక్కమారు వారినందరిని స్మరించినారు. ఇకనేమి, యావేశపూరితులై శౌర్యలక్ష్మి సాహిత్య రక్తి ఉదారాశయము "హోమధూమాగ్ని వృతంబగు నగ్నిహోత్రమటుల, మనకడపటి నెత్తురు బొట్టువరకు చావలేదు, చావలేదు" అని వీరాలాపము లాడినారు.

గాంధీమహాత్ముడు రాట్నమే మనకు స్వరాజ్యము దెచ్చునని వచించెను. అందలి సత్యమును గ్రహించినాడు రామిరెడ్డి. ఈ కవి రాట్నము దేశచక్రము త్రిప్పును. విజయకేతనము విప్పును. ఈయన 'స్వాతంత్ర్య రథము'న నిజప్రభావ దుర్వార పవిత్రమూర్తియగు స్వాతంత్ర్య దేవతను సాక్షాత్కరింపజేసినాడు. ఆదేవి "ధర్మజీవనా కారమో శాంతిబింబమో అకల్మష సత్యనికేతనంబో సంసారఫల స్వరూపమో ప్రజాహృదయంబో యన కనులపండువు సేయుచు, 'సభ్యతా మిషమునన్ దేశంబులందెల్ల నింతకు ధర్మంబులుగాగనెన్నబడు నన్యాయంబులీ నాటితో వికలంబై చనుగాక యంచు కరుణావేశంబు దీపింప' పలికినది.

రెడ్డిగారి హృదయము మిక్కిలి సుకుమారము, సుమకోమలము అతి సున్నితము. పూలుకోయుటయె యీ కళోపాసకునకు కష్టము. ఏలయన పువ్వులనుండి మంచుబొట్లు కాల్వలంగట్టెడు నశ్రుబిందువులట్లు గారుచుండును. ఇది సహింపలేక ప్రకృతిచిత్తము నెత్తురులొలుకజేయ నేనెన్నెడు బూనలేననుకొన్నాడు. నిజమే, పూబిన్నల హత్యజేయ తల పెట్టుట దోషముకదా! ప్రకృతి రామణీయకమును పాడుజేసి దైవ పూజకు దిగుట పాపముకాదా! ఆవేదవేద్యుని బూజింప నాత్మకుసుమ సమర్పణమే యుత్తమము.

కళోపాసకునకు ప్రపంచమందలి ప్రతి వస్తువు రమణీయ ప్రతి పాదకమే ! ఈయన గరికను జూచి సంతోషముతో నుప్పొంగుటయే యిందుకు నిదర్శనము. మొన్నగా గురిసిన ముత్యాల వానకు మురి పాలగుబురై పెరుగుచున్న గరికను గాంచి ముగ్ధుడై దైవసృష్టిని దానికి తావొండు గలదని గ్రహించు కొనుచున్నాడు.

రామిరెడ్డి స్వాతంత్ర్యకామి, కృత్రిమ బంధముల పాటించుట ఆయన ప్రకృతికి విరుద్ధము. "కాలమనంతము; ఇలవిశాల; భావలోకము క్రమముగా బడయు మార్పు" అని భవభూతివలె తనమనస్సును స్వాతంత్ర్య సీమనుజరింపజేసినాడుభావలోకమునందే కాదు; దైనిక జీవితమునందు కూడ స్వాతంత్ర్య మీయనకు ప్రియతమము. కావుననే,

"కూలిజూపి నాకు కూడుపెట్టు;
తిరిపమెత్తి తిన్న దీరు నాయాకలి"

అనియొక బీదముసలమ్మచే పలికించినాడు.

రామిరెడ్డి కాపుబిడ్డ; కర్షకులపై నీతనికి గాఢమగు ప్రీతి. కావుననే కృషీవలుని జీవిత విషయముల గానము జేసినాడు. ఈయన కృషీవలునికి పల్లెయే సర్వప్రపంచము; అందు ప్రేయసి యొక్కతయే రమణీయ విగ్రహము; అతనికిగల భాగ్యనిధులు బంగరుపంట పొలములు మాత్రమే; ఇకమతమన్ననో అనుదిన పరిశ్రమము; విలంబమనునది యీతని వాఙ్మయమున లేనేలేదు. రాయప్రోలు సుబ్బారావు 'కష్టకమల' యందు బ్రాహ్మణ జీవితమునెంత రమ్యముగా చిత్రించినారో దువ్వూరి రామిరెడ్డి గారు 'కృషీవలు'ని యందు కర్షక జీవితమునంత సుందరముగా స్వీయకవితా మాలయందు గ్రుచ్చినారు.

రామిరెడ్డి మనస్సు విశ్వముతో లయాన్వితమై నటించును. ఈతని హృదయమునందు విశ్వజనానుభూతి యెల్లప్పుడు విరియుచుండును.

వంగ భాషా ప్రౌఢ్యలము, వైష్ణవ గీతములభక్తి ప్రపత్తులు, వేంకట పార్వతీశ్వర కవుల రచనలయందు గోచరించును. ఒక భావమునే పలువిధముల జెప్పుట వీరి ప్రత్యేకత, వీరు రచించిన తేటగీతములలో, మంజరులలో ప్రత్యేకమగు కోమలత్వముగలదు. తీయని పదములను కూర్చుటలో వీరు ప్రోడలు. వీరి రచనలు ముఖ్యముగ 'ఏకాంతసేవ' భక్తి రసభరితమై ప్రకృతి పురుషులలీలా విలాసమును చక్కగా చిత్రించును. వీరి రచనలు పఠించునపుడు రవీంద్రనాధుని కావ్యకన్యక మన యెదుట నిలుచుండును.

అబ్బూరి రామకృష్ణారావుగారి రచనలు లావణ్య ప్రధానములు. మాతృదేశభక్తి ప్రబోధకములు. వీనియందు భావనాశక్తి భవ్యమగు నావేశము సమృద్ధము. వీరి నూతన ఛందోబద్ధములగు రచనలు, నవ్య కవితా లతాంగికి క్రొత్త శోభను చేకూర్చునని. మందార శిశువువంటి ఖండ కావ్యములు, వీరి కవితా రామణీయతకు నిదర్శనములు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు స్వైరవిహార ధీరులు; తమ యానందము కొరకే వ్రాయువారిలో నగ్రగణ్యులు.

"నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు
నాయిచ్ఛయే గాక నాకేటి వెఱవు...
...మాయ మయ్యేదను నామధురగానమున"

అని చెప్పుకొన్న స్వేచ్ఛా జీవులు. వీరి పద్యములను. నాయని సుబ్బారావుగారి రచనలను పఠించునప్పుడు దుఃఖించుటయే వీరిస్వభావ మనిపించును.

దుఃఖావేశప్రపూర్ణములగు షెల్లీ రచనలతో నాయని, కృష్ణశాస్త్రిగార్ల ఖండకావ్యములను పోల్చవచ్చును. 'శూన్యమున ఒకడనే పడిపోదును' అని కృష్ణశాస్త్రిగారు ఆక్రోశించునప్పుడు, "ఏడ్పు గూడ ప్రియంబుగాదేమిపుత్ర" అను రాయప్రోలువారి వాక్యము

జ్ఞప్తికి వచ్చును. తన సొగసుచూచి యేడ్చు సుందరివోలె, తమ కవితా ప్రాగల్భ్యమును చూచి దుఃఖించుచున్నట్లు కనిపించుచున్నారు, కృష్ణశాస్త్రిగారు. నాయనిబసవరాజులు లిరిక్ కవిత్వమును తెనుగులో సమగ్రముగా ప్రతిష్ఠించినారు. ప్రేమ విప్లవమును తెనుగులో కావ్యగానము జేసినారు నాయని, కృష్ణశాస్త్రిగార్లు, 'ప్రేయసీ ప్రేయసీ' యను కృష్ణశాస్త్రిగారి గీతములో నేదోయొక విధమైన అనిర్వచనీయమగు ఆవేదన గోచరించును. వియోగ వేదనా భరముచే హృదయము నొప్పినొంద, ప్రియురాలిని గూర్చి తమ యావేదనను ప్రకటించుచు, నొక నిండుకావ్యము వ్రాసికొనిన శివశంకరశాస్త్రిగారి రచనయందలి మాధుర్యము, సౌందర్యరక్తి, భవ్యానురాగము కృష్ణ శాస్త్రిగారియందు గానరాదు; దుస్సహవేదనాభర మొకటిదప్ప. కృష్ణ శాస్త్రిగారి యావేదనలోనొక విధమగు భయంకరత్వము గోచరించును. అగమ్యతమస్విని గర్భకుహరాల వెడలిపోయిన వీరి ప్రేయసి. వీరిని నీరంధ్ర భయదాంధకార జీమూతాళిలో, అఖాతంపు టేకాంతములో విడిచిపెట్టినది. శూన్య హృదయముతో కవిగారు.'ఓచెలీ. ఓచెలీ,' యని క్రందిగి కృశించినారు. ప్రేయసికొరకు యెదురుచూచి వియోగావస్థలో –

> "ఆపలేని నా కోరిక
> కారుచూపు చొరగచీలి
> కాలికుములు చీకటిలో
> క్రాగి క్రాగి నీ కొరకై
> కరవులోననే నశింతునో."

అనియు,

> "ఈ వియోగ నిరాశా
> క్షణ క్షణ ప్రతీక్ష చెదరి
> ఎగసి ఎగసి పగిలిపోదునో."

అనియు,

"కాలాంతమునకు కాచి యుందునా
ఆపలేని ఆసకు ప్రాణాంతమేని, వేచియుందునా,
చివురింపదో చైత్రశుభోత్సవ వసంత
మీ దరిద్ర హేమంతమున."

అనియు నాక్రోశించినారు. శ్రీకృష్ణుని వేణుగానము విని.

"మ్రోయింపకోయి మురళి
మ్రోయింపకోయి కృష్ణ
తియ్య తేనియ బరువు
మోయలేదీ బ్రతుకు,
మురళిపాటకు రగిలి
మరుగునీ వెన్నెలలు,
సొగయు నా యెద కేల
తగని సౌఖ్యజ్వాల"

అని వీరు భావప్రకటన గావించినారు.

"సౌఖ్యజ్వాల"

యను పదము కృష్ణశాస్త్రిగారి కవితాస్వరూపమునకు తార్కాణము. ఆ చెప్పరాని దుఃఖములో, ఆ యవ్యక్త వేదనలో, కృష్ణశాస్త్రి గారి కేమియానందమో ?

"వెదకి, వేసారి నావెర్రిబ్రతుకెపుడేని తుది రేయికనుమూయునా బేలనై నిదుర బరువుల క్రుంగునా" యని జీవితముతో విసుగొంది.

"వనరుచేద్వగలేను, చచ్చిచావగలేను
కనలేని వెలుగు కొరకై ఎన్నడును
కనరాని దానికొరకై
ఒకక్రొత్త బరువుతో, ఒక క్రొత్తయాసతో
ఒకడనే పడిపోదునూ, శూన్యమున
ఒకడనేకృశియింతునూ."

అనియు,

"యేడ్చివై చితి వినువారు యేరులేక
యేడ్పుసందడి నా లోననే చొరఁగ"

అనియు కృష్ణశాస్త్రిగారు తమ హృదయావేదనను వెలిబుచ్చి యున్నారు. కృష్ణశాస్త్రిగారి పల్లకియను గీతము మిక్కిలి యాహ్లాద కరము. అది చదువు నప్పుడు నాయికతోపాటు మనముకూడ "ప్రణయ పల్లకీ పల్లకీ చక్రవాప వక్రరేఖ పల్లకీ, మధు స్వప్న శాఖ పల్లకీ" అని పలుకుచు పల్లకిలో యూరేగుచుందుము.

తెనుఁగు కవులలో ప్రియురాలిని శివశంకరశాస్త్రి, వేదుల సత్యనారాయణశాస్త్రిగార్ల వలె ఆదరించినవారు మిక్కిలి యరుదు. వీరి దృష్టిలో స్త్రీ పవిత్ర ప్రేమమయ దేవత, ఆమెకు సంఘమున మిక్కిలి పూజ్యస్థానము గలదు. ఆంగ్లేయకవియగు Ottway కూడ నిట్టి భావములనే వెలువరించినాడు. "ఆమె నవనీత హృదయ, నాయంత రంగ శాంతిదేవత...జన్మ జన్మ పుణ్యములు పండి ప్రాప్తమయిన కేళీ పరిత్యాగ లీల, ఆమె పదసన్నిధాన దివ్యస్థలాన భక్తినమ్రుడనై నిలం బడిన యపుడుతలపునకు వచ్చునా పేదతనము నాకు"అని యారాధించిన వేదుల సత్యనారాయణగారును.

"ఇందిరా, నిన్ను నేనిష్టదేవతవోలె, భావించుచున్నాను భక్తితో నిరతంబు, నీ మనోహార పాద నీరేజయుగళమ్ము అర్చింతు ఇందిరా అంతరంగమునందు, నీపాదపద్మాలనిటలమ్ము సోకంగ, వ్రాలిపోవననుజ్ఞ వాంఛించుచున్నాను" అని పలికిన శివశంకరశాస్త్రిగారును, సోదర కళోపాసకులు - దీర్ఘ రమ్య సంస్కృతాభి రామంబులగు ముత్యాల సరముల కూర్పులో శివశంకరశాస్త్రిగారికి ప్రత్యేక ప్రావీణ్యము కలదు.

పండిత కవులై, కవి పండితులై ప్రకాశించు విశ్వనాధ సత్య నారాయణగారు ఆంధ్ర సారస్వతాకాశమున దివ్యతార. కవిత్వము వీరి చేతులందలి క్రీడాకందుకము. ఆంధ్రా వేశము వీరియందు మూర్తీభ

వించినది. ఆంధ్ర పూర్వరాజ్యములు, ఆనాటి సంస్కృతి, నాగరికత తలంచుకొన్నంతనే వీరి హృదయము చలించును. "ఎన్ని జన్మముల నుండియో కదా నాతనువున ఆంధ్రరక్తము ప్రవహించుట" అని వీరు తత్కారణము నూహింతురు. పారతంత్ర్యా పతితులయ్యును, పురా మహాంధ్రమున, స్వతంత్ర పౌరుడనను భ్రమ వీరికి సత్యముగా దోచినది. అపూర్వములగు భావముల కాలవాలము వీరిహృదయము. చిత్రవిచిత్ర భావకాదామినులు వీరిహృదయాకాశమున తళుక్కొత్తుచుండును. "నేను మాయమ్మ యొడిలోన నింతవాడనైన యప్పుడు నాలోననీ యఖిల మిమిడి యుండెనేమొ" యని తలంచి, "పాడుటకు మున్ను, కంఠ గర్భమున నెరుగరాక, యవ్యక్తమై యున్న రాగమట్లు, నిభృత చిక్కణమూర్తులు నీవు నిసువులిన్ని సుఖములు దాగి నారెటుల దేవి" అని ప్రశ్నించుచున్నారు. పరమేశ్వరుడు వీరికెన్ని యాపదలు గలిగించినను దయాస్వరూపుడే. దయాంబుధియను ఖండ కావ్యమిందుకు నిదర్శనము. ఇంకొకయెడ పరమేశ్వరుడు వీరిని పరిగాఢశర్వరీచ్ఛని, దరిద్రతానిధానము, తేజోవిహీనము. అనవరతము బాష్పధారా మిళితమునగు అంగణమున ఉండుమనినాడు. ఎన్నడో యొక్కనాడు మాత్రము ఆ అంధకారమున మెరుపుమెరసినది. ఆనాడు వారి కుటీరమానంద వాయుప్రచార శతసహస్ర కుసుమ పరిమళ వ్యాప్తమైనది. కాని యంతలో తిరిగి చీకటుల క్రమ్మినవి. ఆనాటి మెరుపును స్మరించుకొను చుండినారు కవిగారు. కాని లోకమును దూషింపలేదు. జీవితము హేయము, దేహము శుష్కము అని తలంచి దానికి స్వస్తి చెప్ప నుంకింపలేదు. అట్లయినను పరమేశ్వర హృదయము వారి దృష్టిలో కరుణా సాగరము. ఒకనాడు వారు ప్రభుదర్శనార్థమై దేవాలయమున కేగుచుండ త్రోవలో యెవరో యొకరు ఆయనయే వీరి గృహమునకరిగి నాడని చెప్పిరి. కాని వారే మార్గమునేగిరో ఆయన యేత్రోవ నరుదెంచెనో యొకరి నొకరు కలసికొనరైరి. ఆ పర

మేశ్వరుని దోషమిందు లేశమునులేదు. కావుననే వీరు "నీపథాంచల మంటని మాపథమ్ము.........యెంత దురదృష్ట ముద్రితమ్ము" అని తమ భాగ్య దోషమునే తలంచుకొనినారు 'ఇరుత్రోవ' లో ప్రభువు రథము దీక్షాప్రణీత విధురవేగనుతో పర్వులెత్తుచున్నది. అపుడు కవి గారి శరీరము దానిక్రిందబడి నలిగినలిగి రక్తప్రవాహము లింకినది. ఈ దీను డెవరో ఈ హాహానినాదమునకు కారణ మేమోయనియైన రథము ఆగలేదు; తిరిగి చూడలేదు. తెల్లవారినచో రథచోదకుడు రక్తాంకితము లగు చక్రములను కడగి శుభ్రముచేయును. ఈ సమయమున కవిగారు గాయముచే బాధపడుటలేదు. దేవుని దూరుటలేదు. కాని వారికి కలిగి నది "అచటి బహుజనరక్తములందు నాదియిదని గుర్తేమి కనబడును స్వామి" అను ప్రశ్న యొక్కటియే. అపురూపములగు భావములను అనురూపములగు పద్యములలో వ్యక్తపరచుటయందు జాణలు విశ్వ నాథ కవిగారు. ఉన్నత భావాంబర వీధులందు విహరించు కవిసమ్రాట్టు లయ్యు వీరు సామాన్య జనుల భావములను చక్కగా తెలిసి వ్యక్తీక రింప సమర్థులు. ఎన్నియో దినములనుండి నిరీక్షించిన వర్షమునకు వీరే విధముగా స్వాగత మొసగుచున్నారో చూడుడు.

"మాపొన్నలు పూతవట్టు, నికపొంతపొలాలకు నీరమబ్బెడిన్;
మొన్నటిదాక వానలకు మోములు వాచిరి మాదు కర్షకుల్"

మేఘము నుద్దేశించి 'దుక్కి యెద్దడుగు పెట్టగజాలని మాపొలాలలో నురుపుదశైవపాద కటకోజ్జ్వలనాద మనోహరంబుగా నురిమిన నీకొసంగె దనుపాయనముల్ నవబాష్పబిందువుల్' అనుచున్నారు. ఆవాన యుపయోగము "పొడిపొడియై తలల్ ముదిరి పోయిన యెఱ్ఱనికారు జొన్నలో, పడితిని కొత్తలో పసరు పంటిడిజాగిన యావుదూడలుఁ, తడవడిపోయె, మాయెడద తల్లడిలెన్, తొలివానచిన్కు. పైబడి సుఖ మయ్యె నేటికనపాయతనొందెను మాదు సస్యముల్." "పొలముల వట్టి నీరములు బోదలె నిండవు, నాకు మళ్ళలో చెలమల నీరుతోడి

యరచేతులు బొబ్బలు వొక్క, బోదెలోపలి జలమంచు పిచ్చుకలు పాపము ముక్కులు ముంచుచుండె నీ విలయముదాటి పోయెననిపించెను నీయురుముల్ కృపానిధీ" అని సవిశేషముగా చిత్రించినారు. మూగ నోము ఆచరింప సమకట్టిన ఆంధ్ర యువతి సొగసు నొకమారు తిలకింపుడు.

"నీతెలిపట్టు చీరె మెయి నీడలు సాగి
ముసుంగు సంజక్రొం
బూతల తెల్ల లేమొగిలు పోలిక
వాలిక గాలి దూలిపో
లేత బెండగు కుచ్చెళులు నీ చిరు
కాళుల ముద్దుతోచెనో
లేత పొరాడుపయ్యెద చలించిన
పచ్చని తాళి దోచెనో"

ఆకమ్మని పాలబుగ్గ, పతి కోసము ఇన్ని నోములను కిమ్మనకుండ నోచుచుండుట గాంచి కవిగారు "ఓ పసిదాన భవన్నియమప్రభావ సంధానముచేత నీ పతి సుధామయ మూర్తి సముజ్వలించెడిన్" అని ఆశీర్వదించినాడు.

చక్కని భాషలో తీయనిభావములను పారిజాత కుసుమ సుకుమారములగు పద్యములలో వెల్లడిజేయు నిపుణులు కొడాలి ఆంజనేయులుగారు. తెనుగు భాష చక్కదనమే వీరికవిత. వ్రాసినది స్వల్పముగాని గుణమున ఉత్కృష్టము. వీరి కవితా కన్య నాజూకు రసికుల మనస్సుల నుర్రూతలూగించును. రాధిక నుద్దేశించిన పద్యములు కడు రమణీయములు. సిగ్గులొలికెడు చూపులతో ఇతరులెవ్వరును చూడ నట్లు వేదికపై నాసీనయైన పెండ్లి కూతురు తనప్రియుని వీక్షించుటను జూచి ఆమె నుద్దేశించి వీరు వచించిన యీ క్రింది వాక్కులు సహజాపాత రమణీయములు.

"త్వాదృశ శాలికల్ తలుపు దగ్గర
 శాటలువాడు పెద్ద ము
త్తయిదులు భర్త పేరడగి నప్పుడు
 తీగ యొలుంగు ముగ్ధతన్
పేదవడంగవంతు మన పెండ్లి కు
 మారునిదన్న
నీదు లజ్జాదరహాస చంద్రికలు
 శాశ్వతమై వెదజల్లుగావుతన్."
"పునుగు జవాది తావులు గుబుల్కొను నీ
 పసుపుం బయంటకొం
గునముడివైచి కొంటిగద, కోమలి
 నీ మగడింక నెట్లు చె
ప్పిననటులే వినంగలడు. పెండ్లము గీచిన
 గీటుదాటడం
చున్ వదినల్ నగన్ జురుకు చూపుల
 జూచెడు నీకు సౌఖ్యమౌ."

సలక్షణమగు కవిత్వము వ్రాసి ఆంధ్రరసికలోకము నాకర్షించి నారు జాషువాకవిగారు. వీరి ధారాశుద్ధి మిక్కిలి ప్రశంసనీయము. పద్యములొకటి రెండుపర్యాయములు జదివిన కంఠస్థమై భావము చెవులలో ప్రతిధ్వనించు చుండును. వీరు ప్రయోగించు పదములయందొక విధమగు తీయందనము మెత్తందనము అనిర్వచనీయమగు సౌందర్యము కలవు. ఇందుకు వీరు రచించిన ఖండ కావ్యములు, ముఖ్యముగా 'ఫిరదౌసి' 'గబ్బిలము'లు సాక్షి. 'ఫిరదౌసి'లో ఈకవి కోకిల, కవుల శక్తి సామర్థ్యములను గుఱించియేమని వచింపు చున్నాడో గమనించుడు.

"కవిని గన్నతల్లి గర్భంబు ధన్యంబు;"
"దాటిపోయిన యుగములనాటిచరిత
మరలబుట్టింప గవియ సమర్థుడగును..."

"వసుధశాసింప గలసార్వభౌముడగును
ధీరుడగు భిక్షుకుండగు దీనుడగును
దుఃఖితుండగు నిత్యసంతోషియగును
సత్కవి ధరింపరాని వేషములు గలవె ?"
"తమ్మిచూలి కేలుదమ్మినిగలనేర్పు
కవికలంబునందు గలదుగాన
నీశ్వరత్వమతనికే చలామణియయ్యె."

'ఫిరదౌసి' లోని కవిత్వమును గురించి ముచ్చటింపవలయునన్న, ఫిరదౌసీ కవిత్వమును గురించి కవిగారు వచించిన మాటలనే పునరుద్ఘాటింపవలెను. 'సౌంపుతడియారని' ఈ కావ్యములో "పదముల పొందిక గుట్టుపు కదునునకెన వచ్చు"ను. "రససంపదయు భావశబలతయు"గల ఈ హృద్య రచనలలో శయ్యావిలాసము "దిరిసెనపుంబూవుకరణి ముద్దులు గులుకు"ను ఈ కవిగారొక చోట "మల్లెపూవుట త్తరులొలకించి" వేరొకచోట "విషాదగీతములకే మిగిలిన రసహీనమైన మషీపంకము''తో "సుఖంబుల ప్రొద్దుగ్రుంక'' జేసి''భయంకర ఖేదతమాల వాటిక"లో తాండవింతురు. జాషువాకవిగారి కృతులన్నింటిలో కరుణ రసప్లావితమైన 'ఫిరదౌసి' మేలుబంతి. అపారమైన దేశభక్తి, అఖండమైన స్వభాషానురక్తి, అప్రతిహతమైన జాత్యభిమానము వీరిఖండ కావ్యములందెల్ల యెడల గానుపించును. వీరి "గబ్బిలము"లోని "తెల్గురాజ్యంపు నైలింప శ్రీలకొకానొకప్పుడు కేళిరంగ" మైన హాంపీక్షేత్ర వర్ణనను జదివి కన్నీరువిడువని తెలుగువాడుండడు.

దువ్వూరి, మొదలగు వారివలెనే జాషువాగారికిని, సత్యము అహింస రాట్నము అభిమాన వస్తువులే యైనను అన్నివిధముల నధోగతికి పాల్పడిన హరిజనులపై వీరికి ప్రత్యేకమైన ప్రేమ. వర్ణవ్యత్యాసమువలన అగ్రజన్ములనబడువారు వీరిపై విధియించిన ఘోరఅన్యాయములను నిర్మొగ మాటముగా, నవకాశమున్నపుడెల్ల యధిక్షేపించినారు.

తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారి పద్యములు, ముఖ్యముగా సీసములు, శ్రీనాథుని రచనా గాంభీర్యమును జ్ఞప్తికిదెచ్చును. తెనుగు నుడికారపు సొంపు వీరి శబ్దములందు పూర్ణముగా గన్పట్టుచున్నది. "నాకులమ్మునందువలె కవితలోగూడ కమ్మదనము వెలయింతున"ని వీరన్నది యథార్థము.

మాధవపెద్ది బుచ్చి సుందరరామ శాస్త్రిగారు 'ఉమర్ ఖయాం' 'బృందావనము' 'పంచవటి' మొదలగు చక్కని ఖండకావ్యములను సంతరించిరి.

ఇట్లొకవంక మనభాషలో శృంగారకరుణరస ప్రధానములైన ఖండ కావ్యములు ప్రవర్ధమానమగు చుండ, జాతిని వీర్యవంతముగా చేయజాలు వీరరసప్రధానములగు మహాకావ్యములు కొన్నియుద్భవించినవి. ఈ రచయితలెల్లరును పండితకవులగుట పేర్కొనదగిన విశేషము.

ఈ కావ్యములలో సుప్రసిద్ధములగు రెండు. ప్రొద్దటూరు గ్రామ ఉద్యాన వనమున మొగ్గదొడిగినవి. అవియే రాజశేఖర అవధానిగారి "రాణా ప్రతాప సింహ చరిత్ర" గడియారము వేంకటశేష శాస్త్రిగారి "శివభారతము" అను ఉత్కృష్టములగు కావ్యరత్నములు.

ఉదాత్త కావ్య నిర్మాణము గావించి ప్రచారము నొల్లక కొంత వరకు అజ్ఞాతముగా నున్నవారు కవిరత్న అంబటిపూడి వేంకటరత్నముగారు. ఈయన నివురు గప్పిన నిప్పు. ఈయన కావ్యములలో నగ్రగణ్యమగు 'మైనాదేవి,' 'మొరాన్‌కన్య' పైన పేర్కొనిన గ్రంథములతో పాటు మన వీర కావ్య శ్రేణిలో నగ్రస్థాన మాక్రమించుకొనును; వేంకటరత్నముగారు కవియేకాదు. ఒక సంస్థ; చందూరు ప్రాంతమున 'సాహితీ మేఖల'ను స్థాపించి తెలంగాణములోని యువకకవులలో పేరు వడిసిన ధవళా శ్రీనివాసరావు, పులిజాల హనుమంతరావు, సిరిప్రగడ

భార్గవరావు, మద్దోజ సత్యనారాయణగార్ల వంటి కవి కిశోరములకు భావనా గురువులై, వారిచే రసవంతములగు కృతుల రచింపజేసిన కవి వర్యులు అంబటిపూడివారు.

ఇట్లీ భావకవితా సారస్వతము నొకమారు తిలకించితి మేని వానిలో ముఖ్యములు ఖండకావ్యములని తెలియుచున్నది. మహాకావ్య రచనను ప్రేరేపించు మహారాజులు లేకపోవుటయు అనేకవిషమ సమస్యల కాలవాలమగు నీకాలమున ప్రజలకు దీర్ఘ కావ్యములు పఠింప నుత్సాహము లేకుండుటయు ఆంగ్ల భావ కవికుమారుల రచనలు ఎక్కువగా ఖండకావ్యములే యగుటయు కొంతవరకు సమర్థులగు కవులకు విశేషముగా నవకాశము లేకుండుటయు నిందులకు గారణమని తోచును.

పాశ్చాత్యుల లిరిక్ కవిత్వము, జాతీయోద్యమముల ప్రభావ పరిణామముగా ప్రభవించిన భావకవితా స్రవంతి, ఖండకావ్యములు, గేయములు, అను రెండు పాయలుగ ప్రవహించినది) ఖండకావ్యములతో బాటు తెనుగు బాసలో గేయములు గూడ ప్రజామోదము వడిసి అనేక ఉత్తమ రచనలకు దోహద మొసంగినది.

ఆధునిక సాహిత్యమున గురుజాడ అప్పారావుగారి 'ముత్యాల సరములలో' గేయ సాహితీ కన్యకు ఒక రమణీయ స్వరూప మేర్పడినది. తరువాత ఈ గేయసుందరిని నవ్యాంధ్ర సాహిత్యారామములోని సుందరమందిరములో జేర్చి సర్వాంగ శోభితగా తీర్చిదిద్దినవారిలో ప్రముఖులు బసవరాజు అప్పారావు, విశ్వనాథ సత్యనారాయణ, నండూరి సుబ్బారావు, అడవిబాపిరాజు, నాళము కృష్ణారావు మల్లవరపు విశ్వేశ్వరరావు ప్రభృతులు.

తెనుగుభాష తీయందనమును, సౌందర్యమును వ్యక్త పరుప వలయునన్న జటిలపద సమాసములను, కృతక గ్రాంధిక భాషను పరిత్యజించుటయే కాక, ఈ భాషకు వృత్తములననుకూలములనియు

సరళమైన మాత్రాఛందస్సులే యుక్తమనియు అభిప్రాయపడిన గురుజాడ అప్పారావుగారు గేయ కవిత్వమునకు మార్గదర్శి; ఆదికవి.

"వెనుక చూచిన కార్యమేమోయ్
మంచిగతమున కొంచెమేనోయ్
మందగించక ముందు అడుగేయ్
వెనుకబడితే వెనుకేనోయ్

దేశాభిమానం నాకుకద్దని
వట్టిగొప్పలు చెప్పుకోకోయ్
పూనియేదైనాను ఒకమేల్
కూర్చిజనులకు చూపవోయ్

సొంత లాభం కొంతమానుకు
పొరుగువాడికి తోడుపడవోయ్
దేశమంటె మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్

ఈసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయ్ ?

అని అప్పారావుగారు సోదరాంధ్రులనేకాక భారతీయులందరిని సూటిగా ప్రబోధించినారు. 'దేశమును ప్రేమించుమన్నా' అను ఈ గేయము, రవీంద్రుని, బంకించంద్రుని, ఇక్బాలుని జాతీయ గీతముల మరపించుచున్నది. ఈ గీతముతో అప్పారావుగారి పేరు ఆంధ్రావనిలో చిరస్థాయిగా నుండగలదు.

నండూరి సుబ్బారావుగారి పాటలు మహోన్నత భావ ప్రపూర్ణములై సహృదయాహ్లాదకరములై యొప్పుచుండును. చూపుతో మాటాడి ఊపిరితో తెనిగించు శక్తి వీరికి కలదు కవిత్వము వీరినివలచి వరించినది. ఈ మార్గమున నింకెందరో ప్రయత్నించినను 'యెంకి పాటల' వంటి మనోహర కావ్యము మరియొకటి వెలువడలేదు. ఎవరే

(10)

మన్ననుు 'యెంకి పాటలు' ఆధునికాంధ్ర వాఙ్మయమున కమూల్యాలంకార మనుట నిస్సంశయము.

బసవరాజు అప్పారావుగారి పాటలు మనోహరములు. 'యశోధరా విలాసము,' 'కొల్లాయిగట్టితేనేమి' మున్నగు గేయములు ఆంధ్ర వాఙ్మయమున శాశ్వతముగా నుండదగినవి. వీరి రచనలు ముఖ్యముగా స్వానుభవ భాష్యములు సూటియగు భావప్రకటన వానియందు వ్యక్తమగుచుండును.

విశ్వనాథ సత్యనారాయణగారి 'కిన్నెరసాని పాటలు' 'కోకిలమ్మ పెండ్లి' ఆంధ్రభాషకు మేలిసొమ్ములు 'కిన్నెరసాని' లోని శబ్ద చిత్రము, శైలి, భావ గాంభీర్యము అనితర సాధ్యములు. ఒక రసవత్కావ్యమును నొక మహాకవిచే వ్రాయించుకొని తన అస్తిక్యమునకు శాశ్వతత్వము గడియించుకొనిన ఆ సెలయేటికన్నియ యెంత ధన్యయోకదా !

బొడ్డు బాపిరాజుగారి 'కాత్యాయిని' అడవి బాపిరాజుగారి 'గోధూళి', నాళము కృష్ణారావుగారి 'తేనెచినుకులు' మల్లవరపువారి 'మధుకీల' యిట ప్రత్యేక స్మరణీయములు.

మన దేశమునందలి రాజకీయోద్యమ ప్రచారమునకు గేయవాఙ్మయము చక్కగా అనుకూలించినది. గాంధిమహాత్ముని పిలుపు విని నంతనే ఒక్కమారు ఆంధ్రదేశమంతయు సత్యాగ్రహ సమరమున ముందంజవేసినది. కవికుమారులు సోదరాంధ్రులను ప్రబోధించి యీ తెల్ల దొరతనమునకు స్వస్తి చెప్పవలెనని ఆదేశించినారు. వారికి గేయము అనుకూలమగు సాధనముగా ఉపయోగించినది. ఆ రోజులలో గరిమెళ్ళ సత్యనారాయణగారు కృష్ణాపత్రికయందు పుంఖాను పుంఖముగా రాజకీయోద్యమ ప్రచారకమగు గేయములను ప్రకటించినారు. భరత మాత నుద్దేశించి వ్రాసిన గేయములను ప్రకటించినారు. భరతమాత నుద్దేశించి వ్రాసిన గేయములు సత్యనారాయణగారికి ఆంధ్రసారస్వత

మున నొక విలక్షణమగు స్థానము నొసగుచున్నవి. ఇది ప్రజా యుగము; స్వాతంత్ర్యము ప్రజలజన్మహక్కు. నిరంకుశమగు ప్రభుత్వమును, బూజు పట్టిన రాజరికమును ప్రజలు సహింపజాలరు. ఇట్టి భావములు మనగేయ కవుల రచనలను ప్రేరేపించినవి; పురిపండ అప్పలస్వామిగారు "రాజు గారి కోటలో, రాణిగారితోటలో జిల్లెడు మొలిచింది. పల్లేరుప్రాకింది." అని యెలుగెత్తి చాటుచు విప్లవ పతాకమును ప్రతిష్ఠించినారు. మాదవపెద్ది బుచ్చిసుందర రామశాస్త్రి అంటరాని తనమును నిరసించుచు గేయరచన గావించినారు.

ఈ విధముగా ప్రబంధ కవులవలె భావ కవులుకూడ తెనుగు సాహిత్యములో నొక ప్రత్యేక వాతావరణము సృష్టించినారు. దేశభక్తి ప్రబోధకములగు పద్యములను వారు గానము చేసినారు. ప్రియురాలు వారి కారాధ్యదేవత. వారు స్వేచ్ఛాజీవులు; సౌందర్యమును ఆనందమును ఉపాసించువారు. అరసికులకు రసము నివేదించుట సాధ్యముకాదని వారభిప్రాయపడినారు. కావుననే,

> "సుకవి భోగ్యంబు లిచటి వస్తువులు వీని
> నలిపివేయకుడిటునటుకలచి వైచి"

అని వారు హెచ్చరించినారు. తుషారజలము, నీలంపు జలదంపు నిగ్గు, విరిచేడి చిన్నారిసిగ్గు, వసంత ఋతుశోభ, కోయిల కూతలు, కమ్మతెమ్మెరలు, ఎలదేటి చిరుపాటలు, చిలుజరీయంచుచీర, రుచిరకర సరోజములు, కాంచనహారవిలసత్కంఠదేశము. జారుచెమ్మట ముత్యాల జంపుసరులు మున్నగు మనోహర సామగ్రినివారు సాహిత్యమునందు సమకూర్చినారు. కాని వారు కల్పించిన యీ నిత్యకల్యాణము పచ్చతోరణము యెక్కువ రోజులు కాపురము చేయలేదు. ఆ సుఖస్వప్నములు కొలది కాలమే నిలిచియుండినవి.

(తెలంగాణ దినపత్రిక 1941-42)

# నవ్య కవితా నీరాజనము

## IV

### అభ్యుదయ యుగము

ప్రపంచ మహా యుద్ధానంతరము ప్రజాస్వామికముల బూటకపు పరివర్తనపైనను, యుద్ధకారణమగు పెట్టుబడి విధానముపైనను, శుష్కధర్మ ప్రవచనములపైనను ప్రజలకు యేవగింపు, నిరాశ నిస్పృహ కలిగినవి. తత్ఫలితముగా పూర్వ సంప్రదాయముల నెదిరించి క్రొత్తవానిని యేర్పరచుకొను ప్రయత్నము తీవ్రరూపము దాల్చినది. ఇతర రంగములందువలె సాహిత్య రంగమునగూడ యీ ప్రయత్నము ప్రస్ఫుటమైనది. కవిత్వములో తిరుగుబాటు; పురోభాగిత్వము పొడసూపసాగినవి. పూర్వఛందోనియమములను కావ్య సంప్రదాయములను పాటించక యెవరి యిష్టమువచ్చినట్లు వారు వ్రాయసాగినారు. ఈ క్రొత్త క్రొత్త పోకడలకు, *Dadaism, Sur - Realism, Impressionism* అను కొన్ని పేర్లువ్యాప్తిలోనికి వచ్చినవి. ఈ 'యిజం' లోనే యొకదానికి గూడ సరియైన స్వరూపము యేర్పడక మునుపే మరియొక 'యిజం' బయలుదేరి సాహిత్యరంగమున అరాజకత్వము, అయోమయత్వము ఆవరించినవి.

భావకవుల సుఖస్వప్నములను పడద్రోసి వారు కల్పించిన ప్రశాంత సుందర వాతావరణమున అరాజకత్వపు సుడిగాలి తీవ్రముగా చెలరేగినది. ఇన్నాళ్ళు గేయరచన సాగించుచున్న కొందరు కవులకు యీ అధివాస్తవికతపై ప్రీతి హెచ్చినది.

పల్లె పడుచు, నిర్మల మనస్కయు నగు 'యెంకి' యింట నుండి బయలుదేరి 'కిన్నెరసాని' యింట కళోపాసనము ముగించుకొని 'గోధూళి' వేళ నవ్యసాహిత్య వీధులందు మలయమారుతము సేవించు

చున్న కవితా లతాంగి ఒక్క మారుగా యీ అరాజకత్వపు కారుచీకటు లను యెదుర్కొన వలసి వచ్చినది. ఒకవంక నుండి శ్రీశ్రీ గారు మరియొక వంక నుండి పఠాభిగారు అట్టహాసము గావించుచు ఆమెకు చికాకు కలిగించిరి. ఆయమ తొట్రుపాటును, మంజులగళస్వనమును, కజ్జలాన్విత నేత్రయుగ్మమును అవలోకించి శ్రీశ్రీగారు.

"యిదేమిటీ వింత భయాలు ?
ఇంట్లో చీకటి ?
ఇదేమిటీ అపస్వరాలు ?
తెగింది తీగ !
అదేమిటా రంగులనీడలు ?
చావూ బ్రతుకూ !
ఎక్కడికెళ్లావీ రాత్రి ?"

అని గద్దించి అడిగినారు.

"దుడ్డుకఱ్ఱతో నడుములు విరగదంతా"ను అని పఠాభిగారు అట్టహాసము గావించినారు.

"ఎఱ్ఱశాలువ కప్పుకొని మాయింటికొచ్చిందొక రివాల్వర్" అని భయపెట్టినారు. ఇక పాపమామె భరించుకోలేక పోయినది.

"తురాయికంటె, ఆకురాయికంటె, కీ
చురాయికంటె హిమాంశురాయి గొప్పవాడ" ని

"తెల్ల మబ్బులు, తెనాలి వెళ్ళాను, కుక్క వెంట పాండవులు స్వర్గానికి" అను పద నృత్యములు భావకవితాకన్యను భయాన్వితను గావించినవి.

శ్రీశ్రీ పఠాభిగార్లతోపాటు అధివాస్తవిక రచనలు సాగించి నారు గోరాశాస్త్రి, శ్రీరంగం నారాయణబాబు, సౌరిస్, ఆరుద్ర, దేశరాజు కృష్ణశర్మ మున్నగువారు.

ఈ అధివాస్తవికతా స్వరూపమును నిర్దేశించుట సాధ్యము గాని పని. అట్లు సాధ్యము గాకపోవుటయే అధివాస్తవికత ప్రత్యేకతయని చెప్పవచ్చును. కావుననే వారు,

"జీబ్రాకు, *Algreba* చిహ్నల
లాంకోటు పాంకోళ్లు తొడగి
సాహిత్యం పౌరోహిత్యం చేస్తే
వెఱ్ఱికాదు *Sur-realism* రా, సోదరా!

అని చెప్పియున్నారు

వీరి రచనలను పరిశీలించినప్పుడు యెవరికివారే యమునా తీరే అను సామెత జ్ఞప్తికి వచ్చును. ఒక నిర్ణీతమగు ఆదర్శము లేదు. ఒక విస్పష్టమగు పద్ధతి కానరాదు. గందరగోళము చేయుటకు వీరికి సాహిత్యమొక సాధనము. సౌందర్యమునకు అగ్ని సంస్కారము గావించుటయందే వీరి కానందము కలదు. వీరు ఉపయోగించు పదములకు అర్థములేదు; ఉండవలసిన యవసరములేదు. అర్థమును అధ్వాన్నపు అడవిలో వదలుచున్నారు, ఈ మతమును తెనుగులో ప్రతిష్టించిన పీఠాధి పతులు. ఛందస్సును వీరు అర్థమునకు ముందే పరిత్యజించినారు. పిల్లివలె మ్యావు మ్యావు అని యరచుట యందు వీరికేమో ఆనందము కలదట. ఇంగ్లీషు మాటలు, ఇంగ్లీషు లిపిలో వీరు పుంఖాను పుంఖముగా వాడుచుందురు. తెనుగు లిపిక్రమమును (*Spelling*) వ్యత్యాసము చేయుట వీరిమరియొక ప్రత్యేకత. ఈసందర్భమున పఠాభిని అసహాయ శూరునిగా మనము పేర్కొనవచ్చును. ఒక్కమాటలో, నోటికి వచ్చినది, ఇష్టము వచ్చిన రీతిని వ్రాయుటయే వీరి విశిష్టత.

సాహితీ సమితి కవులమీద పగదీర్చుకొనుటయే వీరి యుద్దేశమైనట్లు వీరి కవితా సామగ్రివలన మనకు స్పష్టమగు చున్నది. చూడుడు.

"పులిచంపిన వేడినెత్తురు, రుద్రాలిక నయన జ్వాలిక, కలకత్తా కాళికనాలుక, రగులుకొనే రాక్షసిబొగ్గు, బుగులుకొనే బుక్కా

గుండా, రాబందుల రెక్కలచప్పుడు" వీరికి కవితా సామాగ్రిల భీభత్సము, *Uglyism* వీరి కవితా ప్రపంచమున వికటాట్టహాసము గావించుచుండును.

1930వ సంవత్సరప్రాంతమున సకల ప్రపంచము ఆర్థిక క్షోభకు ఆలవాలమైనది. చదువుకొన్న వారిని నిరుద్యోగపిశాచము పీడింప సాగినది. విశ్వ విద్యాలయములందు డిగ్రీలను సంపాదించిన యువకుల జీవితములు కష్టభూయిష్టములైనవి. వారికి భవిష్యత్తులో కారుచీకటులు తప్ప మరియేమియును కనుపించలేదు. నిరాశ, అసంతృప్తి. అశాంతి. ఇవియే వారికి యేదిక్కు జూచినను ప్రత్యక్షమైనవి. ఇక వారికి యీ సుందర వాతావరణము, గులాబి గుత్తుల అత్తరులు, పన్నీటిజల్లులు, మల్లెపూలదండలు, దివ్య కుసుమాంగి యీనెలు దీసియిచ్చు తమల పాకుల మడుపులు, సొగసులాడులసౌందర్య సంకీర్తనములు కేవలము కల్పిత ప్రపంచమునకు సంబంధించినవియై యెండ మావులవలె విసుగు కల్గించుటలో ఆశ్చర్యములేదు. ఆకట నకనకలాడు డొక్కలకు ఈ మధుర స్వనములు హాయి కల్పించునా? కావున వారి దృక్పథము ఇంకొక వంక ప్రసరించినది. విద్యార్థికుల భగ్న జీవితములు సారస్వత సలిలప్రవాహమునకు క్రొత్తకాలువలు గట్టినవి. ఇంతుకుముందు సార స్వతోపాసకుల నాకర్షించిన షెల్లీకీట్సుల కావ్యజాలము, మపాసా ఆస్కార్ వైల్డ్‌ల గ్రంథ సముదాయము, త్వరత్వరగా వారి షెల్ఫుల నుండి నిష్క్రమింపసాగినవి. రష్యన్ విప్లవము మనవారిదృష్టి నాకర్షించినది. మార్క్సులెనిన్ రచనలుచదివి ఉత్తేజితులైనారు. గోర్కీ, హ్యూగో, డోస్టోవాస్కి, జోలా రచనలు మనవారి భావనాశక్తికి దోహదములైనవి. కావుననే శ్రీశ్రీ గారు.

"మరోప్రపంచం, మరోప్రపంచం
పదండిపోదాం, వినలేదా

మరో ప్రపంచపు జలపాతం ?
ఉరకండీ, ఉరకండీ, ముందుకు''

అని యుచ్చైస్స్వనముతో హెచ్చరించినారు.

తమకు తమపూర్వులకుగల విభేదాలను 'వ్యత్యాసం' అను గేయములో చక్కగా వ్యక్తీకరించినారు. "వడ్డించిన విస్తరి మీ జీవితము, మంచికీ చెడ్డకీమధ్య కంచుగోడలున్నాయి మీకు" అని ఆయన పూర్వుల నుద్దేశించి పలికినారు.

(1) "బ్రతుకు కాలి, పనికిమాలి
శనిదేవత, రథ చక్రపు
టిరుసులలో బడినలిగిన
కూడులేని గుడ్డలేని
పశులార భిక్షులార
హాహాలై యేడవకండీ

(2) మీ రక్తం కలగి కలగి; మీ నాడులు కదలి కదలి మీ ప్రేగులు కనలి కనలి.

(3) అదివిలయం, అదిసమరం అటో యిటో తెగిపోతుంది, స్వాతంత్రం; సమభావం, సౌభ్రాత్రం, సౌహార్ద్రింపునాదులై.

(4) నేనుసైతం ప్రపంచాబ్జపు తెల్లరేకై పల్లవిస్తాను, నేను సైతం విశ్వవీణకుతంత్రినై మూర్ఛనలుపోతాను"

అని యావేదనతో మన కవికుమారులు ముందుకు వచ్చినారు. జీవితము సంఘర్షణయని యెలుగెత్తి వచింప సాగినారు.

సమకాలిక రాజకీయములందలి మార్పులు కొంతవరకు వీరి రచనలకు ప్రోత్సాహమొసంగినవి. ప్రజాసామాన్యము శ్రేయస్సే, లోక కల్యాణమే తమ ఆదర్శమని వీరు నొక్కి నొక్కి చాటుచున్నారు.

పెట్టుబడివిధానము, జమీందారీ వ్యవస్థపై తిరుగుబాటు, సమాజము నందలి ఆర్థిక వ్యత్యాసములు వాఙ్మయ రంగమునకెక్కినవి. శ్రమ జీవుల చెమటలు, అనాథల అశ్రుకణములు, దారిద్ర్యపిశాచపు ప్రళయ తాండవము వీరి హృదయములపై సమ్మెటపోటులైనవి. వీరి కవితలో ఆనందబాష్పములకన్న అశ్రుకణములే అధికము. పండు వెన్నెలకన్న పరిగాఢతమమే, ఉత్సాహముకన్న నిరుత్సాహమే వీరి రచనలయందు కానుపించును. భావకవులధారాశుద్ధిగలిగిన వృత్తములు, ఆటవెలదులు, తేటగీతులు, ద్విపదలు మున్నగువాని స్థానము గేయము ఆక్రమించినది. శ్రవణ సుఖము, శైలీరమ్యతలకు ప్రాధాన్యము తక్కువైనది. ఆధునిక కవుల శబ్దలావణ్యము వీరి కన్నులకు లంబాడి లంగావలె గోచరించినది.

ఈ విధముగా అభ్యుదయ మార్గము తెనుగు సారస్వతమున ప్రాముఖ్యము వహించినది.

ఆరంభకాలమున రాజకీయాలలోని 'కమ్యూనిజం'కు సార స్వతమునందలి రూపాంతరమీ అభ్యుదయ మార్గమను అభిప్రాయములు వ్యాపించియుండెను. కాని అభ్యుదయ రచయితల సంఘమువారు యీ అభిప్రాయములను నివారించుటకు ప్రయత్నము గావించుట సంతోష ప్రదము.

వీరి సమావేశములందు సుప్రసిద్ధాంధ్ర కవిశేఖరులు పాల్గొనినారు. నన్నయాదులగు పూర్వులను కూడ వీరు అభ్యుదయ వాదులుగనే అంగీకరించినారు. లక్ష్మణరావు, వీరేశలింగము వంటివారి వర్ధంతులను వీరు జరిపినారు. చిలకమర్తివారి 'స్వీయ చరిత్ర'ను వీరు ప్రకటించినారు. న్యాయమూర్తి రాజమన్నారు వంటివారు వీరి సమావేశముల కధ్యక్షత వహించి, తమ యుపన్యాసనములను సమన్వయ పద్ధతినే నడిపించినారు; అన్నియు సమాధాన వాక్యములనే పలికినారు. రచన రచన కొరకుగాక జీవితమును రమణీయము జేయుట కొరకని వీరి వాదన. సమాజము

నందలి కుళ్ళును తీసి వేయవలెను; అభివృద్ధికి దారితీయు అన్ని యుద్యమములకు సహకార మొనరింపవలెను; శాంతి స్వేచ్ఛలను సాధింపవలెను; సాహిత్యము ద్వారా మన సాంఘికజీవితమును పునరుజ్జీవింప జేసికొనవలెను; విప్లవశక్తి యెచ్చట గోచరించినను దానిని బలపరచవలెను; క్రొత్త యుగము నందలి విశిష్టతను ప్రజలకు ప్రబోధింపవలెను. సమస్యను నిర్దేశించి కర్తవ్యమును స్ఫురింప జేయవలెను.

ఇట్టి యున్నతాదర్శములతో మన యువకవులు సారస్వతరంగమున ప్రవేశించి ముఖ్యముగా గేయ రూపమున తమ యావేదనను వ్యక్తీకరింప సాగినారు. మన సమాజము నందలి అన్యాయములను, ఘోరవ్యత్యాసములను వీరు సుస్పష్టముగా ప్రకటించుచున్నారు. ఈ నాడు మనల నెదుర్కొనుచున్న సమస్యలను వీరి గేయములు ప్రజా సముదాయమునకు వ్యక్తీకరించుచున్నవి. స్థాలీపులాక న్యాయముగ యీ యువకవుల రచనలను కొన్నింటిని పరిశీలించినచో వీరిహృదయములందు అగ్ని పర్వతము లేవిధముగా బ్రద్దలగుచున్నవో మనకు బోధపడును.

తాపీ ధర్మారావు గారి వంటి పెద్దలను పండిత ప్రకాండులను కూడ ఈఅభ్యుదయోద్యమము ఆకర్షించినది. శ్రీశ్రీ గారి "మరో ప్రపంచం" తో వారు పులకితులై, అభ్యుదయ గీతముల నాలపించినారు. ఈ ప్రపంచము నందలి వ్యత్యాసములను వారు.

"నెత్తు రేడ్చు కన్నులు వేయి కలగ బట్టెనోయ్
కలిమి తళుకు ఒక ధనికుని కంటనుంటాది.
తిండిలేని నోరులు వేయికలగ బట్టెనోయ్
సావుకార్ల విందొక్కటి సాగుతుంటాది.
కరగి తరగు కండలు వేయి కలగబట్టెనోయ్
పెద్దవారి ఫ్యాక్టరీలు పెరుగుతుంటాయి"

అని యెలుగెత్తి చాటినారు.

ఈ "ప్రపంచమునందలి కోటికులాలకు, లక్షమతాలకు బానిసగా నేను బ్రతుకలేను. సంఘానికి చదువునేర్పు స్వతంత్రుడిగా నేను జన్మిస్తా"నని కుందుర్తి ఆంజనేయులుగారు విప్లవధ్వజము నెత్తినారు. అదియే వారి యభిప్రాయములో నరజాతిముక్తికై వెలసిన నవపతాక.

"ఈ నవపతాకముగాంచి పతిత ప్రజలగుండెలు పరిపుల్లమయ్యె" నని అనిసెట్టి సుబ్బారావుగారు వక్కాణించినారు. ఈ సమధర్మ సంఘ సంస్థాపన జేయువేళయందు, "దిక్కులన్నీ మనకు దివిటీలుపట్టిన"వని వారు స్వాతంత్ర్య యోధులకు జూపెంచినారు. "శ్రామికుల శిరస్సులతో బంతులాడుపాలకులను ప్రగతి చక్రఘట్టనలతో సంహారింపవలె"నని అనిసెట్టి సుబ్బారావుగారు ప్రబోధించినారు. మరొక వంకనుండి నార్ల చిరంజీవిగారు "యుగయుగాలనుండి మనలను బంధించియున్న సంకెళ్ళను తెగద్రెంచవలె"నని ఆదేశించినారు, "క్రాంతిపథమును జూపించి శాంతి జగమును స్థాపించుటయే, వీరి ఆదర్శము. వీరి యభిప్రాయము ప్రకారముమానవ జాతిచిరకాలమునుండి అనుభవించుచున్న దాస్యముపోయి స్వాతంత్రము రానున్నది.

'ఏదేశ చరిత్ర చూచినా యేమున్నది గర్వకారణం...
నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం'

అని శ్రీశ్రీ ఉద్ఘాటించినారు. అభ్యుదయ కవులు ఒకతరము ముందటి కవీశ్వరులవలె, ప్రాచీనాంధ్ర వైభవమును, ప్రశస్తిని కీర్తించి యుండలేదు. అది వారి భావనాశక్తికి దోహద మొసంగి యుండలేదు.

మతకలహములను మరచి ప్రజలందరు ఏక కుటుంబముగా మెలగ వలెనని యీ అభ్యుదయ కవులు ప్రబోధించినారు. కావుననే కొనకళ్ళ వెంకటరత్నంగారు.

"ఉక్కు తలుపుల ఊచలొక్కటైనా విడదు
సంకెళ్ళ బరువింత సడలిపోనే లేదు

కత్తులేర్ఝళిపించుతావా,
  సోదరుల
కుత్తుక తెగనరుకుతావా ?"

అని ఆవేదనతో ప్రశ్నించినారు. కర్షక కార్మికుల జీవితము అభ్యుదయ సాహిత్యమునందు అగ్రస్థానము నాక్రమించుచున్నది. కూలీల రైతుల సుఖదుఃఖముల నీకవులు చక్కగా గానముచేసి యున్నారు. విశ్వనాథ కృష్ణదేవరాయలవంటి యువకులు.

'ఏరువాకను గారవించుట ఏటఏట మరచిపోకోయి
కరువు రాదోయి
దేశాన పరువుపోదోయ్'

యని ఉద్ఘాటించినారు.

ప్రొద్దంతము చెమటయోడ్చి కష్టించి పనిజేయు శ్రమజీవులే మనసంఘమునుండి వైదొలగినచో, మనగతి యేమి కావలెనని యువ కవులలో శ్యమంతకమణివలె తేజరిల్లు పొట్లపల్లి రామారావుగారు ప్రశ్నించినారు.

అన్యాయముగా రాజులకోపాగ్నికి గురియై చెరసాలలో క్రుంగి కృశించుచున్న స్వతంత్ర భావప్రేరితులగు అజ్ఞాత జీవులను, అసహాయ జీవులను, గాంచి వీరెట్టిభావములను వ్యక్తీకరించినారో పరిశీలించుడు. మానవుని రూపములోనున్న దానవులు ఉక్కుగొలుసులు వేసి, ఉరి కొయ్యలు నాటించి, నిలువు గోడలుగట్టి యీ అసహాయజీవిని ఖైదీ గావించినారు. ఇక వారేమో రక్తము పారించి రాజ్య తృష్ణాంధులై దేవతల రూపమున దిరుగుచున్నారు. మరియొకచోట వీరు ప్రజా సముదాయమునుగురించి యెంత సత్యమగు భావములను వెల్లడించినారో తిలకింపుడు. "జనత యొక్క జననము చీకటిలో; మరణము వాకిటిలో, చరిత్ర విస్మృతిలో" "వారు నేర్చినది లేదు, మరచినది లేదు" అట్లయినను

వారియందు నిబిడీకృతమైన శక్తి బలవత్తరమైనది. స్టాలిన్ ఆ శక్తిని జూచి సమ్మోహితుడై నాడు. మహాత్ముడు ఆ శక్తికి ముగ్ధుడైనాడు. నిజముగా ఏవ్యక్తిపై నను పూలుజల్లునది వారే; ధూళి జల్లునది వారే; కరియెక్కించినను వారే; ఉరి యెక్కించినను వారే ; తెరచాటు భాగవతము వారికి సరిపడదు, ఈ విధమగు ప్రజాసముదాయపు ఆధిక్యతను కీర్తించినారు పొట్లపల్లి రామారావుగారు.

కాళోజి నారాయణరావు గారు, కొన్ని మంచి అభ్యుదయ రచనలు గావించినారు. కూరలోని ఉప్పువలె కాళోజి కవితలో రాజకీయము లొప్పుచుండును. రాజకియ స్వాతంత్రములేక మనము యెన్నాళ్ళు అధోగతిలో నుండవలెనని పరితపించినారు కాళోజి. "పోలీసుటండను దౌర్జన్యశక్తులు పోషణ బొందేదెన్నాళ్ళు? బాధలు పెట్టి పలకనీయని పాపుల భయమెన్నాళ్ళు? పగటిదోపిడుల నాపగలేక ప్రజాదరణ గోల్పోయిన ప్రభుత్వమింకెన్నాళ్ళు?" అని యీాయన ఆక్రందించినారు.

"రాజుల పేరిట అరాజకమునకు
జరిగిన పూజలు చాలింక.
బీదల సర్వస్వముతో ధనికులు జేసిన
బేరములుచాలింక" అని యీ వేదన పడినారు.

"అన్నపురాసులు ఒకచోట
ఆకలిమంటలు ఒకచోట
సంపదలన్నీ ఒకచోట
గంపెడుబలగం ఒకచోట
అవకాశమంతయు ఒకచోట
అవసరమెల్లను యింకొకచోట" అని

యీ కవీశ్వరుడు మనకు చూపించినారు. దౌర్జన్యముల యే వేషమును సహింపలేని సుకుమార హృదయుడు మన కవీశ్వరుడు.

అభ్యుదయ కవులలో దాశరథిగారి కొక ప్రత్యేకమగు స్థానము కలదు. వీరు శ్రీశ్రీని అనుసరించి మించి నారను ప్రతీతి కలదు. యువ కవులలో సంస్కృత సమాసముల నుపయోగించుటలో దక్షులు. అభ్యుదయ కవిత్వమునకు మేలి నిదర్శనములు వీరిరచనలు. మార్క్సిస్టు సిద్ధాంతములకు చక్కనిభాష్యములు వీరి గేయములు. "ఆగర్భ శ్రీనాధుడికి అనాధుడికి అనాదిగా సాగుతున్నది అనంత సంగ్రామ" మని వచించినారు. ఆ సంగ్రామము దిగ్విజయమును ఆకాంక్షించినారు. చెమట యోడ్చి కర్షక కార్మికులుఉత్పత్తి జేయు దేశధనమునుజమీందార్లు, శ్రీమంతులు దోపిడి జేయుట వీరికి గిట్టదు.

అంతేకాదు.

"మధనపడే మేధావులు

నిర్మించిన అణుశక్తికి ప్రభుత్వాల కంట్రోళ్ళ"ను వీరుగర్హించినారు.

"సజబుల్వ కోసరమై లజ్జవిడచి
చిరిగిన చీరలతో ముజ్జాలు చిరిగే
పేదల ఎంగిలి మెతకలు దొంగిలించి
బంగారం పొంగించిన ధనికులను
మ్రింగాలని దొంగ చాటుగా కాలం
తొంగి చూచుచన్న"

దని హెచ్చరించినారు.

ఈ అభ్యుదయ రచయితల కవితావ్యాసంగము ముఖ్యముగా గేయరూపముననే లభించుచున్నది. వృత్తములు మున్నగు పూర్వ ఛందస్సులను వీరెవ్వరు [ప్రయాగ కోదండ రామశాస్త్రి, దాశరధి గార్ల వంటి కొందరు తప్ప] తమ సాధనగా స్వీకరింపలేదు; అవి యందుకు, తగినవికావనివీరు స్పష్టముగా వచించియున్నారు.

అభ్యుదయసాహితీపరులగు యువకవుల భాషనుగురించి యొక మాట. దీర్ఘసంస్కృత సమాసములతో నిండియున్న గేయములు ప్రజా సామాన్యము నేవిధముగా రంజించునో తెలియదు. ప్రజలకొరకుద్దేశించిన సాహిత్యమునందు గాఢ గూఢ సమాసములకేమైన తావు కలదాయని యోచింప వలెను.

1. "మహోత్పాతమై, గహనాంతర నిష్యందివలె"
2. "సజీవ జాజ్జ్వల్యమాన విప్లవ శంఖువువిఘాతం"
3. "భుజంగ ప్రయాతం బుభుక్షాభిఘాతం"
4. "ఖడ్గమృగోదగ్రవిరావం, ఝంఝానిలషడ్జధ్వానం"

స్థాలీపులాకన్యాయముగా ఉదాహృతములు. వీరి రచనలు జాను తెనుగుననే విలసిల్లవలెను. సాహిత్యము పరమ ప్రయోజనము లోకకల్యాణమను ప్రాచీనుల యభిప్రాయమునే అభ్యుదయ వాదులు కూడ అంగీకరించుట మిక్కిలి ప్రశంసనీయము. సారస్వతమున నవ్యతకు సర్వదాసుస్వాగతము. క్రొత్తదియున్నంత మాత్రముననే ఎవ్వరును ఉలికిపడవలసిన యవసరములేదు. మార్పు సజీవ సాహిత్యమునకు సహజమగు లక్షణము. పాడిన పాటలనే మరల పాడుట వలన ఎట్టి ప్రయోజనములేదు. ఏదోయొక విలక్షణత యున్నప్పుడే రచనలు శోభించును. అంధానుకరణము అనర్థదాయకము. నిజమైన రచయిత తనరచనలయందు ప్రత్యేక వ్యక్తిత్వమును ప్రతిబింబింప జేయవలెను. అప్పుడే సారస్వతమునకు సార్థకత. కాని యొక విజ్ఞప్తి వాఙ్మయమున సంప్రదాయమును తృణీకరింప రాదు; సంప్రదాయము పవిత్రమైనది. మన సంప్రదాయము పోషించుకొనుచు ఎన్ని మార్పులైనను తేవచ్చును; ఎంతముందుకైన పోవచ్చును. అదియే నిజమైన ప్రగతి.

దేశమనియెడు దొడ్డ వృక్షము
ప్రేమలను పూలెత్తవలెనోయ్.

ఆకులందున అణగిమణగి
కవితకోయిల పలకవలెనోయ్
పలుకులనువిని దేశమందలి
మాలములు మొనకెత్తవలెనోయ్.

అను గురుజాడవారి మాటలు నేటి కవులందరకును ఆదరణీయములు.

అభ్యుదయవాదుల కొకయున్నతమగు ఆదర్శముగలదు; ఉజ్వలమగు భవిష్యత్తుగలదు.

(తెలంగాణదినపత్రిక)
(1941-42)

— : : —

# చిలకమర్తి రచనలు

ఆంధ్ర వచన వాఙ్మయ చరిత్రలో చిలకమర్తి లక్ష్మీనరసింహ కవి గారిది సమున్నత స్థానము. తెలుగు ప్రబంధకవులలో ముక్కు తిమ్మన్న యెట్టివాడో నవ్యాంధ్ర వచన రచయితలలో చిలకమర్తి అట్టివారు. ఆధునిక వచనమునకు జనకుడైన వీరేశలింగము పంతులుగారికి ప్రియశిష్యులు చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు. ఉభయులుకూడ గోదావరి తీరవాసులే.

ఆధునిక అవసరాలకు అనుగుణముగా ఆంధ్ర వచన రచన దిద్ది తీర్చిన యుగకర్త, గద్యతిక్కన వీరేశలింగము పంతులుగారు. వీరేశలింగముగారి ఒరవడిని అనుసరించి, తెలుగువచన రచనకు మెరుగుపెట్టి వచనవాఙ్మయ వీధులన్నింటి యందును స్వైరవిహారము గావించినది, చిలకమర్తి కవి కోకిలము. వీరి వచన శైలి వీరేశలింగముగారి శైలికన్న లలితమైనదని చెప్పవచ్చును. ఆంగ్లభాషలోని గద్యవాఙ్మయ విశేషములను తెలుగున ప్రవేశపెట్టిన వారిలో చిలకమర్తివారికి ప్రత్యేక స్థానము కలదు.

వ్యాసము, ప్రహసనము, చిన్నకథ, నవల, అనువాదము, స్వీయ చరిత్ర, జీవితచరిత్ర, పత్రికారచన అనునవి ఆధునిక వచన వాఙ్మయ విశేషములు. ఈ యన్నిటికిని మార్గదర్శకులు వీరేశలింగముగారే. ఆయన జూపించిన మార్గమున పురోగమించి, రాచబాటను వేసినవారు చిలకమర్తి లక్ష్మీనరసింహము పంతులుగారు. వీరేశలింగముగారివలె చిలకమర్తివారు సంఘ సంస్కర్తలు. ఈ సంఘ సంస్కరణాభిలాష వీరి రచనలలో ప్రతిబింబించుచుండును. తమ రచనలలో చిలకమర్తివారు వీరేశలింగముగారివలె హాస్యమును బహుళముగా ఉపయోగించినారు. కందుకూరి హాస్యముకన్న చిలకమర్తి హాస్యము సున్నితమైనది. కొన్ని

సందర్భాలలో వీరేశలింగముగారి హాస్యము కొంత హేలనముగా నుండును. అటువంటి దోషము లక్ష్మీనరసింహాముగారి రచనలలో కనుపించదు.

వీరేశలింగయుగమున వచనవాఙ్మయాభివృద్ధికి కృషిచేసిన వారిలో ప్రముఖులైన పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారు చిలకమర్తివారి సమకాలికులు. ఆధునిక వచన వాఙ్మయమునకు పానుగంటి చిలకమర్తి కవీశ్వరులు సూర్యచంద్రుల వంటివారు. పానుగంటివారి శైలి సూర్యునివలె తీక్ష్ణమైనది. చిలకమర్తివారి శైలి చంద్రుని వలె చల్లనిది. పానుగంటివారి వచనమును పఠించునప్పుడు ఆరితేరిన యోధుడు అవలీలగా జేయు కత్తిసాము జ్ఞప్తికి వచ్చును. చిలకమర్తి వారి రచనలు చదివినప్పుడు వెన్నెలలో విహారించి నట్లుండును; పన్నీరు చిలికినట్లుండును. పానుగంటివారి హాస్యము కొంతకరకుగానుండి అప్పుడప్పుడు మనస్సుకు నొప్పి కలిగించుచుండును; సభ్యత హద్దులుదాటిన నిదర్శనాలు కూడ పానుగంటి రచనలలో కనుపించుచున్నవి. చిలకమర్తి రచనలలో ఇటువంటి దోషము కనుపించదు. మనస్సుకు నొప్పి కలిగించని మృదువైన హాస్యము చిలకమర్తి సొమ్ము. పూర్వవాఙ్మయమున, కవిత్రయమని ప్రసిద్ధిగాంచిన నన్నయ, తిక్కన శంభుదాసుల కెటువంటి స్థానము కలదో, ఆధునిక వచన వాఙ్మయమున కందుకూరి చిలకమర్తి పానుగంటి కవులకు అటువంటి స్థానములే, కలవని నిస్సంశయముగా చెప్పవచ్చును. పానుగంటివారు సాధించినది వ్యాసము మరియు విమర్శ. చిలకమర్తివారు దిద్దితీర్చినది నవల మరియు జీవితచరిత్ర.

నవలారచనకు చిలకమర్తివారు ఉపక్రమించుటకు పూర్వము కనుపించు తెలుగు నవల రాజశేఖరచరిత్ర యొక్కటే. స్వకపోలకల్పితములగు చిత్ర వచన కావ్యములను అనేకము రచించి, చిలకమర్తివారు తెలుగుదేశమున వచనమునకు బహుళ ప్రచారము కలుగజేసినారు. వీరి నవలలు మూడు తరగతులకు చెందినవి. మొదటి తరగతి నవలలు

చారిత్రక నవలలు. ఈ నవలలలో అహల్యాబాయి, హేమలత మొదలైనవి పేర్కొనదగినవి. రెండవ తరగతికి చెందిన నవలలు సాంఘిక నవలలు, వీనిలో రామచంద్రవిజయము, గణపతి పేర్కొనదగినవి. గణపతి హాస్యరసమునకు ఆలవాలమైన నవల. మూడవ తరగతికి చెందిన సౌందర్యతిలక, కర్పూర మంజరి చిలకమర్తివారి రచనలలో పెద్ద నవలలు. ఇవి అద్భుత కథా సంవిధానమునకు ఆటపట్టులు; సుధాశరచ్చంద్రము రమేశచంద్రదత్తు సాంఘిక నవలకు అనువాదము. ఈ నవలలు ఆధునిక యుగమున ఆంధ్ర పాఠక ప్రపంచమునకు సారస్వతాభి రుచిని, గ్రంథపఠనాసక్తిని కలిగించి, వాఙ్మయ ప్రచారమునకు మిక్కిలిగా తోడ్పడినవి. చిలకమర్తి అడుగు జాడలలో నవలా రచన గావించినవారు ఆంధ్రదేశములో తరువాత మరికొందరు బయలుదేరిరి.

చిలకమర్తి వచనరచనలలో ప్రహసనములు ప్రత్యేకముగా ఒక సంపుటము. ఈ ప్రహసనములలో సంఘసంస్కరణాభిలాష అడుగడుగున కనుపించుచుండును. గడచిన శతాబ్దాంతమున ఆంధ్రదేశములో వ్యాపించి యుండిన సాంఘిక దురాచారములు యీ ప్రహసనములందు ప్రతిబింబించుచున్నవి. హాస్యమును మిక్కిలి సున్నితముగా యీ ప్రహసనాలలో లక్ష్మీనరసింహముగారు పోషించినారు; స్వేచ్ఛగా వ్యావహారిక భాషను ఉపయోగించినారు. లక్ష్మీనరసింహముగారు వ్రాసిన చిన్న కథలు కూడ చాలకలవు. ఈ కథలు అనేక తరగతులకు చెందినవి. ఆంధ్రదేశమున వాడుకలోనున్న అనేక కథలను వీరు సంపుటీకరించి యున్నారు. కొన్ని కథలకు వినోదమే ముఖ్యోద్దేశము. వీరి కథలలో కొన్ని పెద్దవి మరికొన్ని చిన్నవి కూడ కలవు. సమకాలిక సమాజమును దైనందిన సంఘటనలను చిత్రించు నేటి చిన్న కథల వంటివి చిలకమర్తివారి కథలుకావు. కథా కథనమే ప్రధానోద్దేశముగా కలిగినవి చిలకమర్తివారి కథలు. చమత్కారమంజరి, రాజస్థాన కథావళి, వినోదములు మొదలైనవి వీరి కథలలో చెప్పదగినవి.

చిలకమర్తి వచన రచనలలో జీవిత చరిత్రలుకూడ ముఖ్యమైనవి. గౌతమబుద్ధుడు, గురుగోవిందుడు, నానక్ మొదలైన మహాత్ముల చరిత్రలను మనోహరముగా వీరు వ్రాసియున్నారు. గడచిన శతాబ్దమున మనదేశమున ఉదయించి, వివిధ రంగాలలో అనేక ఉద్యమాలకు నాయకత్వము వహించి, దేశాభివృద్ధికి కృషి జేసిన రాజరామమోహనరాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, దేవేంద్రనాథటాగోరు మొదలైన మహానుభావుల జీవితాలను చిలకమర్తి రమణీయమైన శైలిలో చిత్రించినారు. నవభారత నిర్మాతలను గూర్చి వివరముగా తెలుసుకొన కుతూహలపడు ఆంధ్ర పాఠకులకు యీజీవిత చరిత్రలు అత్యంత ఉపయుక్తములు. ఈ రచనలలో చిలకమర్తివారి అభిరుచులు, అభిప్రాయాలు, గాఢ దేశాభిమానము అడుగడుగున మనకు వెల్లడి యగుచుండును.

పత్రికారచనలో ఆ కాలమున చిలకమర్తివారు అందె వేసిన చేయి; స్వయముగా మనోరమ, దేశమాత అను పత్రికలకు సంపాదకత్వము వహించిరి. రాజమహేంద్రవరములోని పత్రికలతో వారికి గాఢమైన సంబంధము. వీరేశలింగముగారు కూడ పత్రికా రచయితలే. కాని చిలకమర్తివారు వీరేశలింగము పంతులుగారివలె పత్రికద్వారా తీవ్రవాదోపవాదములందు పాల్గొని రచ్చకెక్కి రణరంగము గావించలేదు. చిలకమర్తివారి వచన రచనలలో స్వీయచరిత్రము మిక్కిలి ముఖ్యమైనది. తెలుగు భాషలో స్వీయచరిత్రలు వ్రాసికొనిన పెద్దలు విశేషించి, కవి పండితులు మిక్కిలి తక్కువ. ఇట్టివారిలో తిరిగి మొట్టమొదటివారు వీరేశలింగముగారే. చిలకమర్తివారు తమ స్వీయ చరిత్రను మిక్కిలి చక్కని శైలిలో వ్రాసి ఆంధ్రదేశమునకు ఆంధ్రభాషకు గొప్ప ఉపకారము గావించినారు. ఇటీవలి ఆంధ్రదేశ చరిత్రను తెలుసుకొనుటకు భావి చరిత్ర కారునికి ముఖ్యమైన ఆధారముగా చిలకమర్తివారి స్వీయ చరిత్ర ప్రకాశించు చున్నది. ఇందులో వారు సమకాలిక సమాజము, అందలి సంఘటనలు, వారికి సంబంధించిన వ్యక్తులు,

వారి శీలను చక్కగా చిత్రించినారు. వీరేశలింగముగారి స్వీయ చరిత్ర, చిలకమర్తివారి స్వీయ చరిత్ర మరియు చిలకమర్తివారికి అత్యంత ప్రేమాస్పదులైన టంగుటూరి ప్రకాశం పంతులుగారి స్వీయ చరిత్ర అను మూడు గ్రంథాలు ఒకచోట సంపుటీకరించినచో అది గడచిన శతాబ్దముయొక్క రెండవ అర్ధభాగము మరియు యీ శతాబ్దము యొక్క మొదటిభాగమునకు సంబంధించిన ఆంధ్రదేశ చరిత్రకాధారము కాగలదని చెప్పిన అతిశయోక్తి కాజాలదు.

చిలకమర్తివారి శైలికి ప్రత్యేకమైన విన్నాణము సొగసు కలవు. వారు ఉపయోగించు శబ్దజాలము మిక్కిలి సరళమైనది; బహులలితమైనది. చక్కదనమునకు మారు పేరని చెప్పదగిన చిలమర్తివారి వచనశైలి ఆంధ్ర విద్యార్థులకు అవశ్య పఠనీయమైనది. ఆంధ్ర వచనమునకు సారళ్యము సమకూర్చిన వారిలో వీరేశలింగముగారి తరువాత యెన్నదగినవారు చిలక మర్తి లక్ష్మీనరసింహముగారు.

(రేడియో ప్రసంగము-1956)

# ప్రకాశంగారి స్వీయచరిత్ర

ఒకదేశ చరిత్రగాని జాతి చరిత్రగాని తెలుసుకొనవలె నన్నచో ఆ కాలమున నివసించిన మహాపురుషుల జీవిత చరిత్రలను తెలుసు కొనుట అవసరము. మహా పురుషులే చరిత్ర నిర్మాతలు. అందుచేత వారి జీవిత వివరాలు చరిత్రకు అత్యవసరమైన సామగ్రి. ఆ సామగ్రి లేక యే దేశచరిత్రగాని యే జాతి చరిత్రగాని లేదు.

మనదేశమున జీవితచరిత్రలను దేశచరిత్రలను వ్రాయు అలవాటు తక్కువ. విశేషించి పూర్వకాలమున యీ పద్ధతి బొత్తిగా లేకుండెను. ఆధునికకాలమున యీ పద్ధతి మన దేశములో వ్యాప్తికి వచ్చినది. దేశచరిత్ర నిర్మాతలైన మహనీయులు కొందరు ఆత్మకథలను రచించి నారు. తెలుగు దేశమున ఇట్టి మహానీయులలో అయిదుగురు ముఖ్యు లుగా కన్పట్టుచున్నారు. మొదటివారు వీరేశలింగము పంతులుగారు. రెండవవారు చిలకమర్తి లక్ష్మీ నరసింహముగారు. మూడవవారు టంగుటూరి ప్రకాశంగారు. నాలుగవవారు దేశభక్త కొండా వెంక టప్పయ్య పంతులుగారు. అయిదవవారు అయ్యదేవర కాళేశ్వరరావు గారు. నవ్యాంధ్ర నిర్మాతలలో వీరు అగ్రగణ్యులు. అందుచేత గడచిన నూరుసంవత్సరాల ఆంధ్రదేశ చరిత్రకు యీ జీవిత చరిత్రలు ముఖ్యప్రాతిపదికలై యున్నవి. ప్రకాశంగారి ప్రజాహిత జీవనమునకు అరువది సంవత్సరాలకు పైగా వయసు కలదు. ఒక యేబది సంవ త్సరాల ఆంధ్రరాజకీయాలలో ప్రకాశంగారు ప్రధాన పాత్రను నిర్వ హించినారు. ఈ దృష్టితో నవ్యాంధ్రనిర్మాణమును గమనించి నప్పుడు అడుగడుగున ప్రకాశంగారి త్యాగము, పట్టుదల అగుపడు చున్నవి. 19 శతాబ్దములోని మొదటి సగమున ఆంధ్రదేశములో అవతరించిన ఉద్యమాలన్నింటి యందును ప్రకాశంగారు ప్రధాన పాత్రను నిర్వహించి యున్నారు.

మానవ జీవిత మొక యాత్ర. అందు అనేక మజిలీలు ఉన్నవి; అందు కంటక పథములు కలవు, గండ శిలలు కలవు. కొండలను ఎక్కవలసి యుండును; దిగవలసి యుండును; నదులను దాటవలసి యుండును; ఒడుదొడుకులను అధిగమించవలసి యుండును. కష్టసుఖములను అనుభవించవలసియుండును. ఇవన్నియును ప్రకాశంగారి జీవిత చరిత్రలో కనుపించుచున్నవి. అందుచేత యీపుస్తకానికి జీవితయాత్రయను నామకరణము సార్థకముగా నున్నది. పంతులుగారు యీ గ్రంథములో 1872 సంవత్సరము నుండి 1922 సంవత్సరము వరకు అనగా ఒక అర్ధశతాబ్దమున జరిగిన సంఘటనలను సమీక్షించి యున్నారు. ఈ సమీక్షలో ఈ కాలమున ఆంధ్రదేశమున నందలి సాంఘిక రాజకీయ పరిస్థితులు అద్దమునందు మూర్తివలె చక్కగా ప్రతిఫలించుచున్నవి.

ఏమాత్రము శ్రద్ధతో పరిశీలించి నప్పటికిని, ప్రకాశం పంతులుగారి జీవితము బహుముఖమైనదని ప్రస్ఫుటము కాగలదు. ప్రకాశం పంతులుగారు స్వయంకృషిచే పైకివచ్చిన మహావ్యక్తి. ఆయన జన్మించినదొక మధ్యతరగతి కుటుంబము. చిన్నతనముననే ఆయన బీదరికముతో పోరాటము చేయుట జరిగినది. బాల్యమున జరిగిన ఈ పోరాటములో ఆయన ప్రదర్శించిన ధైర్య సాహసములు, పట్టుదల తరువాత ఆయన జీవితములో అడుగడుగున అగుపడు చున్నవి. ఎన్ని కష్టాలు వచ్చినను చలించక ప్రకాశం పంతులుగారు తమ విద్యాభ్యాసమును ముగించి న్యాయవాద వృత్తిని అవలంబించి వేలకు వేలు గడించిరి.

చిన్నతనమున రాజమహేంద్రవరములో ఆయన అనేక నాటక ప్రదర్శనాలలో పాల్గొని అన్ని రకాలైన వ్యక్తులతో సహవాసము చేయుట జరిగినది. ఆ రోజులలో చిలకమర్తి లక్ష్మీనరసింహముగారికి

ప్రకాశంగారి మీద ప్రేమ కుదిరినది. లక్ష్మీనరసింహముగారి నాటకాలలో ప్రకాశం పంతులుగారు వేషాలు వేయుట జరిగినది. ఆనాటి ప్రకాశం పంతులుగారి మూర్తిని చిలకమర్తి వారు.

"ఈగవాలిన గాని వేగ జారెడు నట్లు,
మవ్వంపు కురులను దువ్వినాడు"

అను సీసపద్యములో కనులకు గట్టినట్లుగా వర్ణించి యున్నారు. పంతులుగారి నాటకరంగానుభవము ఆనాటి నాటక ప్రదర్శనాల పరిస్థితిని చక్కగా వర్ణించుచున్నది. కొన్ని సందర్భాలలో బాహు బల ప్రదర్శనాలు, వీరవిహారాలు కూడ అవసరమై యుండెను. పంతులుగారు అందులో ఆరితేరిన జగజెట్టులని వారి జీవిత యాత్ర నిరూపించుచున్నది. వారిది పౌరుష జీవనము. చిన్నప్పుడు "రాజ మండ్రి కోర్టులలో ప్లీడర్లు లాంగుకోట్లు వేసుకొని తిరుగుతూ డబ్బు సంపాదిస్తూంటే" పంతులుగారికి కూడ ప్లీడరీ వృత్తి మీద లాంగ్ కోటు మీద ప్రేమ కుదిరినది. ఈ వృత్తిలో వారు విజయము పొందినారు. ఆరోజులలో రాజ మహేంద్రవరమున న్యాపతి సుబ్బా రావు పంతులు. మోచర్ల రామచంద్రరావు పంతులు గార్లవంటి వారు న్యాయ వాద వృత్తిలో నుండిరి. ఆ పెద్దలతో ప్రకాశం గారికి సంబంధము యేర్పడినది, కాని ఆ పెద్దలత్రోవ వేరు; ప్రకాశంగారి త్రోవ వేరు. వారు మితవాదులు. ప్రకాశంపంతులుగారు స్వభావ సిద్ధముగా అతివాదులు. అందుచేత ఆ పెద్దలతో పంతులుగారికి సంఘ ర్షణ తప్పలేదు. సంఘర్షణలకు జంకుట ప్రకాశంగారి ప్రకృతికి విరు ద్ధము. న్యాయవాద వృత్తితో పాటు మునిసిపల్ రాజకీయాలలో వారు అడుగుపెట్టిరి. వృత్తియందేకాక మునిసిపల్ రాజకీయాలలో కూడ ప్రకాశంగారు స్వతంత్రముగా వ్యవహరించిరి. అవసరమై నప్పుడు అధికారులతో, పెద్దలతో సంఘర్షణలుపడి, ఆ సంఘర్షణలలో తమ పట్టుదలలను నెగ్గించుకొని విజయము పొందిరి. ప్రకాశంగారి

జీవితములో యే ఘట్టమును చూచినను యీ గుణమే ప్రధానముగా కనుపించుచుండును. ఆ రోజులలో సంఘసంస్కరణోద్యమము నందు కూడ ప్రకాశంగారు సానుభూతిని జూపిరి. ఈ ఉద్యమముతో పాటు ప్రకాశం పంతులుగారికి వీరేశలింగముగారితో పరిచయము యేర్పడి క్రమక్రమముగా సన్నిహితత్వము కలిగినది. అయితే ఒకానొక సందర్భములో వీరేశలింగము గారినికూడ ధిక్కరించి వారికి వ్యతిరేకముగా వ్యవహరించిన సంఘటన యొకటి ఈ జీవితయాత్రలో కనుపించు చున్నది. ప్రకాశం పంతులుగారి స్వభావ పరిశీలన గావించిన వారికి ఈ సంఘటన ఆశ్చర్యము కలిగించునది కాదు. అవసరమైనచో ఎంతటి వారి పైనను గూడ తిరుగుబాటు చేయుటకు వెనుకాడని సాహసులు ప్రకాశంపంతులుగారు.

విద్యాధికవృత్తులలో, స్వతంత్ర వృత్తులతో న్యాయవాద వృత్తి ప్రముఖమైనది. అందుచేతనే పంతుగారు ఈ వృత్తివైపు ఆకర్షితులైనారు. కాని పంతులుగారి ప్రజ్ఞా విశేషమునకు రాజమహేంద్రవరానికన్న యెక్కువ విశాల రంగము అవసరమైయుండెను. ఆ రోజులలో బారిష్టర్లకుండిన గణ్యత సాధారణ దేశీయ న్యాయవాదులకు లేకుండెను. ఎవరో ఒకరు ప్రకాశంగారు బారిష్టరు కారని అనినారట. వెంటనే రెక్కలు కట్టుకొని లండన్ వెళ్ళి బారిష్టరు పట్టభద్రులై మద్రాసు నగరములో బల్లగట్టినారు ప్రకాశం పంతులుగారు. అప్పుడు చెన్నపట్టణములోని న్యాయవాదప్రపంచమునకు మైలాపూర్ మేధావులు తలమానికములై యుండిరి. వీరందరును అతిరథ మహారథులు, ఈ అతి రథ మహారథుల మధ్య ప్రవేశించిన ప్రకాశంగారు అతిత్వరలో మద్రాసు న్యాయవాదులలో అగ్రగణ్యులుగా ప్రకాశించిరి. ఆ రోజులలో మద్రాసు నగరమున తెలుగు న్యాయవాదుల సంఖ్య తక్కువ. ప్రకాశంగారు ఆనాటి ఆంధ్ర న్యాయివాదులకు శిరోభూషణముగా భాసించిరి. ఆనాటి మద్రాసు న్యాయవాదులలో టి. వి. శేషగిరి

అయ్యర్, శంకరన్‌నాయర్, సుబ్రహ్మణ్యఅయ్యర్, సుందరఅయ్యర్, భాష్యం అయ్యంగార్, వి. కృష్ణస్వామి అయ్యర్ మొదలైన మేధావులు ఉండిరి. ఆ మేధావులను గూర్చి ప్రకాశంగారు తమ జీవిత యాత్రలో చక్కని వాక్చిత్రాలను రచించినారు. పై పెద్దలతోపాటు శ్రీనివాసయ్యంగార్, అల్లాడి, టి. ఆర్. వేంకటరామశాస్త్రి మొదలైన వారు ఆనాడు ప్రకాశంగారికి సమకాలికులైన యువక న్యాయవాదులు. వీరందరి మధ్య ప్రకాశంగారు ప్రముఖ న్యాయవాదిగా పేరు పొంది లక్షల డబ్బును సంపాదించిరి. ఆనాటి న్యాయవాద ప్రపంచమును గూర్చి అనేక విషయాలను చాల చక్కగా పంతులుగారు తమ జీవిత యాత్రలో వెల్లడించినారు. మన దేశమున న్యాయమూర్తులకు కూడ వాడలుగా నుండిన మిక్కిలి కొద్ది మంది న్యాయవాదులలో ప్రకాశం గారికి ప్రత్యేక స్థానము కలదు. పంతులుగారి జీవితములోని అన్ని రంగాలు ఒక యెత్తు; రాజకీయాలు యింకొక యెత్తు. పంతులు గారి రాజకీయ జీవితము మ్యునిసిపల్ రాజకీయాలతో, కాదు, నాటక రంగ రాజకీయాలతో ప్రారంభమైనదని చెప్పవచ్చును. ఈ రాజకీయాలలో పంతులుగారు తమ వ్యక్తిత్వమును ప్రదర్శించినారని చెప్ప వచ్చును. బారిస్టర్ చదువుకొరకు లండన్ వెళ్ళినసందర్భమున పంతులు గారికి ప్రముఖ కాంగ్రెస్ నాయకులతో పరిచయ మేర్పడినది. పంతులుగారిని బెంగాలులో విప్లవకారులు, పశ్చిమదేశములో తిలక్ మహాశయుడు, ఉత్తర దేశములో లజపతిరాయ్ బాగుగా ఆకర్షించినారు- గోఖలే ప్రభృతులు పంతులుగారిని ఆకర్షించలేదు. ఇందులో కూడ పంతులుగారి ప్రత్యేక వ్యక్తిత్వము ప్రస్ఫుటమగుచున్నది. లండన్‌లో ఉన్నప్పుడు దాదాభాయి నౌరోజీగారి పార్లమెంటు ఎన్నికలో పంతులుగారు పనిజేసిరి; శ్యాంజీ కృష్ణ వర్మతో పరిచయము కలిగించు కొనిరి.

పంతులుగారు తమ రాజకీయ జీవిత ప్రారంభములోని దేశ పరిస్థితులు ఇందులో చక్కగా వివరించిరి. ఆనాటి ఉద్యమాలు, ఆ ఉద్య

మాల నాయకులు, వారి స్వభావాలు పంతులుగారు చక్కగా వివరించి నారు. చూడండి యీ మాటలు. "... ... హనుమంతరావు నాయుడుగారి శుశ్రూష, రాజమహేంద్రవరంలో వీరేశలింగం పంతులు గారి సంస్కరణోద్యమమూ కొంతవరకు నాలో రాజకీయాభిలాషలు రేకెత్తించాయి. అప్పటికి 1857 సంవత్సరంనాటి స్వతంత్ర యుద్ధపు కథలు ఇంకా ప్రచారములోనే ఉన్నాయి. ఏమైనా మహోదాశయాలు ఇదమిత్థమని ఏర్పడకపోయినా, నాలో ఇతర లౌకికాభిలాషలతో పాటు, దేశసేవ చెయ్యాలనే అభిలాషకూడ ఉండేది......వివేకానందస్వామి ఉపన్యాసాలు నాకుకొంత ఉత్తేజము కలిగించాయి......ప్రజలు 1858 విప్లవానంతరం కొంత నిరుత్సాహ పడినా. సక్రమమైన అందోళన సాగుతూ ఉండాలని కూడ గ్రహించారు. దీని ఫలితమే కాంగ్రెస్ సృష్టి అని నా అభిప్రాయము. కొంతమంది ఆంగ్ల మిత్రులు, కేవలం ధర్మబుద్ధితో కాంగ్రెస్ స్థాపనకు ప్రోత్సహించినమాట సత్యమైనను మొత్తంమీద ఆంగ్ల రాజనీతిజ్ఞులు ఈ సక్రమాందోళనా సంస్థని ప్రోత్స హించడంలో కొంత స్వార్థం కూడ లేకపోలేదని నమ్మకం...... నాకు గోఖలే అన్నా ఆయన రాజకీయలన్నా ఒక విధమైన అయిష్టం బయలు దేరింది......కాంగ్రెస్ రాజకీయాలు నన్ను అప్పట్లో ఆకర్షించక పోవ డానికి, గోఖలే ప్రభృతుల నాయకత్వం, ఒక కారణం. ఆనాటి కార్య క్రమంలో గాని నాయకత్వంలోగాని నన్ను ఉత్తేజ పరిచినది ఏమిలేదు" ఈ మాటలు రాజకీయంగా ప్రకాశంగారి మన స్తత్వ నిరూపణకు ఉప యోగ పడుచున్నవి. మితవాదానికి మొదటినుండియు ప్రకాశంగారు వ్యతిరేకులు. స్వభావ సిద్ధముగా వారు అతివాదులని పై మాటలు నిరూపించుచున్నవి.

లక్షలు సంపాదించు కాలమున, న్యాయవాద వృత్తిని అవలీలగా విడిచివేసి, రాజకీయాలలో లంఘించిన త్యాగమూర్తులు ప్రకాశం పంతులుగారు. ఈ జీవిత యాత్రలో 1922 వరకు జరిగిన సంఘటనల

వివరణ మాత్రమే ఉన్నందువలన ప్రకాశం పంతులు తీవ్రరాజకీయ జీవన చిత్రము ఇందులో కనుపించుటలేదు.

మద్రాస్‌లో బిపిన్‌చంద్రపాల్ గారి ఉపన్యాసాల అధ్యక్షతతో పంతులుగారు తీవ్ర రాజకీయాలలోనికి లంఘించిరి. ఆనాడు మద్రాసు లోని హేమాహేమీలు బిపినచంద్రపాల్ ఉపన్యాసాలను అధ్యక్షత వహించుటకు నిరాకరించగా పంతులుగారు అందుకొరకై ముందుకు వచ్చిరి. త్యాగసమయమున అరనిముసముకూడ ఆలోచించు స్వభావము పంతులుగారిది కాదని ఇందువలన స్పష్టమగుచున్నది. తరువాత సూరత్ కాంగ్రెస్‌కు వెళ్ళుటతో, పంతులుగారికి కాంగ్రెస్ రాజకీయా లతో సన్నిహిత సంబంధము యేర్పడినది. బిసెంటమ్మ హోంరూలు ఉద్యమము కూడ పంతులుగారు శ్రద్ధతో పరిశీలించినారు. ఇవన్ని యును పంతులుగారి రాజకీయ నాటకానికి నాందీ ప్రస్తావనలు గావించి నవి. 1916లో గాంధీమహాత్ముడు సత్యాగ్రహ ప్రమాణాలు చేయించి నప్పుడు, పంతులుగారు ప్రమాణపత్రము మీద సంతకము చేసి తమ రాజకీయ జీవిత నాటకములోని మొదటి అంకమును ప్రారం భించినారు. అందుచేత పంతులుగారి తీవ్ర రాజకీయ జీవితానికి గాంధీ మహాత్ముడే ప్రధాన కారకుడని చెప్పవచ్చును. ప్రజాహిత జీవనమున పంతులుగారు అడుగు పెట్టని రంగములేదు. నాటకాలు, సంఘ సంస్కర ణతోపాటు పంతులుగారు పత్రికా రచనారంగమునందు, కూడ కృషిని గావించిరి. దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి పెట్టని కోటగా నుండ వలె నను సంకల్పముతో పంతులుగారు, రాజగోపాలాచారి, డాక్టర్ పట్టాభి సీతారామయ్య, స్వర్గీయ మట్నూరి కృష్ణారావు, స్వర్గీయ కాశీనాథుని నాగేశ్వరరావుగార్ల ప్రోత్సాహముతో స్వరాజ్య అను ఆంగ్ల పత్రికను స్థాపించి నడిపిరి. ఇది సహాయ నిరాకరణోద్యమానికి

బలమైన అండగా నుండెను. అప్పటి వరకే పంతులుగారు, చిత్తరంజన్ దాస్, మోతీలాల్ నెహ్రూలతో పాటు న్యాయవాద వృత్తిని విసర్జించి, రాజకీయ రంగములోనికి లంఘించిరి. ఈ పత్రికను గూర్చి పంతులుగారు "1921వ సంవత్సరంలో కాంగ్రెస్ విధానం పూర్తిగా నిర్వర్తించడానికి కంకణం కట్టుకొని బయలుదేరిన పత్రిక స్వరాజ్య ఒక్కటే సని పైన వ్రాశాను''స్వరాజ్య, అహమదాబాదు కాంగ్రెస్‌లో చేసిన తీర్మానాల ప్రకారం కాంగ్రెస్ వారినీ ప్రజలనీ బ్రహ్మాండంగా ఉద్బోధించింది." ఆ తరువాత కూడ అట్లాగే ప్రబోధిస్తూ వచ్చింది" అని వ్రాసినారు. ఇందువలన పత్రికారచనా ద్వారా కూడ పంతులుగారు దేశానికి అమూల్యమైన సేవ గావించినట్లు స్పష్టమగుచున్నది. నిజానికి ఆ రోజులలో స్వరాజ్య పత్రిక అనేకులకు త్యాగదీక్షాకంకణము గట్టినది.

ఈ జీవిత యాత్రలో పంతులుగారు అన్ని సంగతులు దాపరికము లేక చెప్పినారు. మంచి చెడ్డలు రెండింటిని కూడ గ్రహించుటకు అనువుగా యీ జీవితయాత్ర రచన జరిగినదని చెప్పవచ్చును. పంతులుగారు లండన్‌కు వెళ్ళిన సందర్భంలో "...... ముఖ్యంగా ఈ దేశంలో లండన్‌లో స్త్రీల స్వేచ్ఛని గురించి, తాగుబోతుతనాన్ని గురించి, వ్యాపించివున్న అల్లిబొల్లి కథల వల్లనూ, నా చిన్ననాటి చర్యల వల్లనూ, ఇక్కడ విషయాల్లోనాకు కొంత బలహీనత ఉండిన కారణం వల్లనూ, అందరూ నేను పూర్తిగా పాడైపోతానని అనుకున్నారు. కాని నిజానికి ఆ దేశం జీవితమే నన్ను మానసికంగా కొంత ఆ బలహీనతనించి తప్పించి, మంచి మార్గానికి మళ్ళించింది." అని చెప్పినప్పుడు యథార్థ కథనము విషయములో పంతులుగారు యెట్టి శ్రద్ధ వహించిరో స్పష్టము కాగలదు. పౌరుషానికి పర్యాయపదము ప్రకాశం. పట్టుదలకు మారుపేరు ప్రకాశం. ధైర్యసాహసాలకు రూపాంతరము

ప్రకాశం. మూర్తీభవించిన త్యాగము ప్రకాశం. ఈ విధముగా ప్రకాశం గారు యీ పుటలలో మనకు ప్రత్యక్షమగుచున్నారు.

చాలచక్కని మనోహరమైన శైలితో కూడిన వ్యావహారిక భాషలో ఈ జీవిత యాత్ర రచన జరిగినది. ఇటువంటి రచనలకు ఈ శైలి ఆదర్శప్రాయమైనదని చెప్పవచ్చును. ఈ గ్రంథమును పరిశీలించినప్పుడు ప్రకాశం పంతులుగారికి తెలుగు వచన రచయితలలో ఒక మంచి చోటు కలదని స్పష్టమగుచున్నది.

(రేడియో ప్రసంగము 1956)

# స్వర్గీయ సురవరము ప్రతాపరెడ్డి

ఆయన జన్మస్థానం అలంపురం తాలూకాలో "నీరులేని" ఇటి కాల పాడు అను చిన్న గ్రామము; ఆయనది మధ్యతరగతి రైతు కుటుంబము; ఆయన గడించినది ఆంగ్ల విద్య; బి. యే., బి. యల్ పట్టము లను పొంది న్యాయవాద వృత్తిలో ఆయన అడుగు పెట్టుట కూడ జరిగినది. కాని ఆ వృత్తిలో ఆయన మనస్సు లగ్నము కాలేదు. ఆ కాలమున హైద్రాబాదు నగరము నందలి ప్రముఖులతో ఆయనకు గాఢ మైన పరిచయము ఏర్పడినది. కావలసినచో ఆ పరిచయము వలన యేదైన ఒక ఉన్నతోద్యోగమును సంపాదించుటకు ఆయనకు సంపూర్ణ అవకాశాలు ఉండెను. కాని ఆ అవకాశాలను ఆయన ఉపయోగించు కొనలేదు.

సొంత వృత్తియైన వ్యవసాయము నందు శ్రద్ధ తీసికొనక, అభ్యసించిన న్యాయ విద్యను వృత్తిగా అవలంబించక, ద్రవ్యార్జనపైన దృష్టిని కేంద్రీకరించక, ఉన్నతోద్యోగమునకై ఆశపడక ఆ కాలమున ఆర్థికముగా లాభప్రదము కాని పత్రికా రచనా రంగమునందు అడుగు పెట్టి, ఆ సాధనము ద్వారా దేశసేవకు. భాషా సేవకు నడుము కట్టిన త్యాగమూర్తి స్వర్గీయ సురవరము ప్రతాపరెడ్డి, ఆ కాలమున మధ్య తరగతి కుటుంబీకుడు పత్రికా సంపాదకపదవికి జీవితమును అర్పణ చేయుట చాల సాహసమైన కార్యము. అప్పటి ప్రభుత్వము ప్రాంతీయ భాషలకు ప్రబలవ్యతిరేకి;వాక్స్వాతంత్ర.రచనాస్వాతంత్ర్యములనుసామ, దాన, భేద, దండోపాయాలతో అణచివేయుట అప్పటి ప్రభుత్వము యొక్క నిర్ణీత విధానమైయుండెను. తెలుగు పత్రికలను చదువు అల వాటు ఆనాటి ఆంధ్ర విద్యాధికులకు, అంతగా లేకుండెను. ఎటు జూచి నను ఈ స్థితులు వ్యతిరేకముగనే యున్నప్పటికిని, యెంత మాత్రము జం విధ ప్పటి వరకే, కొంత స్థిరపడిన న్యాయవాద వృత్తికి స్వస్తి

చెప్పి, ఆంధ్రశారదకుసర్వస్వము అర్పించిన విజ్ఞాన ఖని, మేధావి, ఆంధ్ర నాయకమణి స్వర్గీయ సురవరము ప్రతాపరెడ్డి.

హైద్రాబాదు రాష్ట్రము నందలి ఆంధ్రోద్యమముతో ఆయనకు మొదటి నుండి గాఢమైన సంబంధము. మొట్టమొదటి ఆంధ్రమహాసభకు ఆయనయే అధ్యక్షుడు. ఈ విధముగా హైద్రాబాదులో జరిగిన రాజకీయ. సాంస్కృతిక, సాంఘిక కార్యకలాపాలకు నేతృత్వము వహించి, ఇంచుమించుగా అన్ని ఉద్యమాల మొట్టమొదటి సమావేశాలకు ఆయనయే అధ్యక్షత వహించుట జరిగినది. తెలంగాణ ప్రజలకు ఆయన మీద గల గాఢానురాగమునకు ఇది మంచి నిదర్శనము.

ప్రతాపరెడ్డిగారు మితవాదికాదు; నొప్పించక తానొవ్వక, వ్యవహరించు స్వభావము ఆయనది కాదు. రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక సమస్యలను గూర్చి ఆయనకు తీవ్రమైన అభిప్రాయాలు ఉండెను. అభిప్రాయాలను తనలో దాచుకొను వారు కూడ ఆయన కాదు. తనకు తోచిన అభిప్రాయాలను ధైర్యముగా ప్రకటించుటలో తెలంగాణా నాయకులలో మొట్టమొదట ఆయనను చెప్పి, తరువాత ఇతరులను పేర్కొన వలసియున్నది. హరిజనులకు ప్రవేశము యీయని దేవాలయమున ఆయన అడుగు పెట్టలేదు, పర్యటనలో సహచరులైన వారు, అటువంటి దేవాలయములోనికి వెళ్ళినప్పటికి, ఆయనమాత్రము దేవాలయములో ప్రవేశించక, వెలుపలనే కూర్చొని యుండిన సంఘటనలు ఆయన జీవితములో కలవు.

తెలంగాణమునుప్రబుద్ధము గావించుటకు గోలకొండపత్రికచేసిన ప్రబోధము అమోఘమైనది. ఆ పత్రికలో హైద్రాబాదు రాష్ట్ర వ్యవహారాలను గూర్చి నిర్భయముగా అభిప్రాయాలను ప్రకటించి, ప్రజలపక్షమున పోరాడిన మహనీయుడు ప్రతాపరెడ్డి. అనేక న్యాయాలు హోంసెక్రటరీ మొదలైన ఉద్యోగుల వద్దనుండి ఎవి ా

హెచ్చరికలు వచ్చినప్పటికిని, ఆయన వానిని లక్ష్యము చేయక, ప్రజల అభిప్రాయాలకు ప్రాతినిధ్యము వహించుచునే యుండిరి, హైద్రాబాదు రాజకీయ సమస్యలను గూర్చి ఆయన వ్రాసిన సంపాదకీయాలు తెలుగు వాఙ్మయమున శాశ్వతముగా నుండదగినవి. సంపాదకీయాలను ప్రభుత్వము నిషేధించినప్పుడు, ఆ సంపాదకీయాలకు బదులుగా ప్రపంచ సాహిత్యము నుండి, వాక్స్వాతంత్ర రచనా స్వాతంత్రాది ప్రాథమిక స్వత్వములను బలపరచు సూక్తులను సేకరించి వానిని ప్రకటించినప్పుడు అప్పటి ప్రభుత్వమునకు సంపాదకీయాలకన్న ఆ సూక్తులే పదునైన బల్లెములైనవి.

తీవ్ర రాజకీయాభిప్రాయాలు కలిగియున్న ప్రతాపరెడ్డిగారు, రాజకీయ చదరంగాలలో ప్రవీణులు కాకపోయినందువలన, కుట్రలు చేయు స్వభావము లేకపోయినందువలన యథార్థవాదియైనందు వలన, ప్రత్యక్ష రాజకీయాలలో ఇముడలేక, విద్యా వైజ్ఞానిక రంగాలకే యావజ్జీవితమును అంకితము గావించిరి. ప్రతాపరెడ్డిగారి స్వభావము లోని ఈ లోటు వలననే తరువాత ఆయన శాసన సభ్యులైనప్పటికిని, అన్ని విధాల యోగ్యత కలిగి యున్నప్పటికిని, మంత్రి పదవి వంటి పదవు లేమియును ఆయనకు లభ్యము కాలేదు.

పెద్దలైన వారిలో కొందరికి యువకులను ప్రోత్సహించు స్వభావము ఉండదు. తమ పదవి కొరకు, యువకులను, కార్యకర్తలను బలి చేయు పెద్దలు మన వారిలో కనపడుచున్నారు. ప్రతాపరెడ్డిగారు యీ శ్రేణిలో చేరువారు కారు. ప్రతిభ యెక్కడ నున్నప్పటికిని దానిని ప్రోత్సహించి, పెంపొందజేయు స్వభావము ప్రతాపరెడ్డిగారిది; తెలంగాణమున యువ రచయితలకు, యువనాయకులకు ఆయన ప్రోత్సాహ సహకారములు లభించినవి. ఈ విషయమున ప్రతాపరెడ్డిగారిని సర్వ విధముల స్వర్గీయ వేంకట లక్ష్మణరావుగారితో పోల్చవచ్చును.

ప్రతాపరెడ్డిగారి తెలుగు శైలి మిక్కిలి శక్తివంతమైనది. అవసరమైనప్పుడు, వాడి ములుకుల కన్న పదునైన శబ్దజాలమును వారుపయోగించెడివారు. శైలినిబట్టి వారి వ్రాతను పోల్చుకొనుట తెలంగాణములో పెద్దలందరికిని బాగుగ తెలిసిన రహస్యము. ఆంగ్ల విద్యాధికులైన ప్రతాపరెడ్డిగారు. సంస్కృతాంధ్రము లందు, ఉర్దూఫార్సీ భాషలయందు కూలంకషమైన పాండిత్యమును స్వయంకృషిచేత సంపాదించిరి. కళాశాలలోనే కాక సంస్కృత భాషను, ప్రాచీన పద్ధతిని, గురువుల వద్ద తాము అభ్యసించినట్లు ప్రతాపరెడ్డిగారు పలుమారు ఉద్ఘాటించి, ఇతరులకు కూడ ఆ మార్గమునే సూచించెడివారు.

ప్రతాపరెడ్డిగారి కలము వివిధ వాఙ్మయ వీధులలో స్వైర విహారము గావించినది. వారు మంచి కవిత్వము వ్రాసిరి; ఉత్తమ వచన వాఙ్మయమును సృష్టించినారు. మనోహరమైన కథానికలు రచించినారు; చక్కని నాటకములు వ్రాసినారు. వారి సారస్వత ప్రజ్ఞ సర్వతోముఖమైనది. చరిత్ర పరిశోధన వారికి అభిమానమైన విషయము. నిరంతర గ్రంథావలోకనము వారికి ప్రేమాస్పదమైన కార్యక్రమము. ఎంతటి ఉద్గ్రంథమునైనను, అతివేగముగ పఠించి, అందలి సంగతులను, అవలీలగా అవగాహన చేసికొనుట ఆయనకు నల్లేరుపై బండినడక.

ప్రతాపరెడ్డిగారు కొన్నివేల పేజీల వాఙ్మయమును వ్రాసి పెట్టినారు. ఇందులో ముద్రితములు,అముద్రితములు రెండునుకలవు. చరిత్ర పరిశోధనయందు అత్యంత అభిమానము కలిగిన ప్రతాపరెడ్డిగారు ఆంధ్రుల సాంఘిక చరిత్రను వ్రాసి ఆంధ్రదేశానికి, ఆంధ్రభాషకు మహోపకారము గావించి, తెలుగు సరస్వతిని అమూల్యాభరణములతో అలంకరించిరి. కేంద్రసాహిత్య అకాడమీ వారు, యీ పుస్తకమును మనకు స్వాతంత్రము వచ్చిన తరువాత ప్రకటితమైన ఆంధ్ర

గ్రంథాలలో ఉత్తమమైన పుస్తకముగా నిర్ణయించి, వారి కుటుంబా నికి అయిదువేల రూపాయలు బహుమతిని యిచ్చిరి.

ప్రతాపరెడ్డిగారు లోకమునే తమ కుటుంబముగా భావించు కొనిన పరార్థ జీవులు-స్వార్థము కొరకు వారు తమ విజ్ఞానమునుగాని, పలుకుబడినిగాని ఉపయోగించుకొన లేదు. అహోరాత్రములు వారి కొక్కటే చింత. అదియేఆంధ్రభాష అభ్యుదయము; ఆంధ్ర సంస్కృతీ వికాసము; ఆంధ్రదేశము అభివృద్ధి; ఆంధ్ర మహాజనుల ఐకమత్యము, అభ్యున్నతి.

విశాలాంధ్రోద్యమమును ప్రతాపరెడ్డిగారు బలపరిచిరి. పోలీసు చర్య తరువాత విశాలాంధ్రోద్యమ వ్యాప్తి కొరకు తెలంగాణమున కృషి చేయుటకు యేర్పాటు చేయబడిన కార్యకర్తల మొట్టమొదటి సమావేశానికి ప్రతాపరెడ్డిగారు సమావేశ కర్తలలో నొకరై యుండిరి. విశాలాంధ్ర మహా సభకు ఉపాధ్యక్షులుగా వారు పనిజేసి, ఆంధ్ర ప్రదేశ్ యేర్పాటుకు వైతాళికులైనారు.

ప్రతాపరెడ్డిగారు మితభాషి. అయితే ఆ మిత భాషణము గాఢ పరిచయము యేర్పడనంత వరకే. ఒక్కమారు ఆప్తత యేర్ప డినచో, హృదయము విప్పి, ఎంతకాలమైనను సంభాషించి, విజ్ఞానపు విందుల నిచ్చెడి వారు ప్రతాపరెడ్డిగారు. ఆయన మనస్సు నవ్య నవ నీత సమానము; పలుకు మాత్రము అప్పుడప్పుడు దారుణాఖండల శస్త్రతుల్యముగా నుండెడిది. ఇష్టములేని పని దేవుడు వచ్చి బలవంత పెట్టినను ఆయన చేయువారు కారు. అది ఆయన విశిష్టత.

రాజకీయాలతో తన ప్రజాహిత జీవితమును ప్రారంభించిన ప్రతాపరెడ్డిగారు, ఆ రాజకీయాలను మధ్యలోనే వదలి, విజ్ఞాన జగతి యందే నిరంతర నివాసము కల్పించు కొనిరి. బహు భాషా విశార దులైన ప్రతాపరెడ్డి తెలంగాణములోనే కాక యావదాంధ్రము నందును

దేదీప్యముగా వెలిగిన భాషాజ్యోతి; సంచార గ్రంథాలయము; సంభాషించు విజ్ఞానకోశము. ఏ విషయమును గూర్చి తెలుసుకొన దలచినప్పటికిని, ప్రతాపరెడ్డిగారితో సంభాషించినచో, కావలసినంత సామగ్రి లభించి పుస్తక పఠనప్రయాస తప్పి పోయెడిది.

హైద్రాబాదు రాష్ట్రము నందలి అనేక సంస్థల పెంపుసొంపులకు ప్రతాపరెడ్డిగారు ముఖ్య కారకులు. గోలకొండ పత్రిక, రెడ్డి విద్యార్థి వసతి గృహము, ఆంధ్ర మహాసభ, విశాలాంధ్రోద్యమము, లక్ష్మణరాయ పరిశోధక మండలి, ఆంధ్ర సారస్వత పరిషత్తు, విజ్ఞాన వర్ధనీ పరిషత్తు, కృష్ణదేవరాయల గ్రంథాలయము మొదలైన అనేక సంస్థలతో గాఢ సంబంధము కలిగియుండి, వాని అభివృద్ధికి, వికాసమునకు వారు ఎంతయో తోడ్పడి యుండిరి.

ఈ నాటి మహాంధ్ర నిర్మాతలలో ప్రతాపరెడ్డిగారికి ప్రముఖ స్థానము కలదు.

(1957)

# గురుదేవుడు రవీంద్రుడు

# I

ఆగస్టు 15 సకల భారతదేశమునకు పండుగ; ఈ రోజు మన దేశము నూటయేబది సంవత్సరాల ఆంగ్ల పరిపాలననుండి విముక్తి నొందెను. ఈ శుభ సందర్భమున మనము సంస్మరించవలసిన మహనీయు లలో గురుదేవుడు రవీంద్రుడు ముఖ్యుడు. భారత జాతీయ గీతమును రచించిన మహాకవి ఆయన. అందుచేత స్వాతంత్ర్యోత్సవ సందర్భ మున ఆయనను స్మరించుటలో విశిష్టత కలదు. ఆయన పరమపదించినది ఆగస్టు మొదటి వారము. ఇందుచేత కూడ ఆగస్టు నెలలో ఆయన స్మరణకు ప్రత్యేకత గలదు.

రవీంద్రుడు సాహితీ ప్రపంచమున, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప రచయిత, అంతమాత్రమే కాదు, ఆయన మనదేశ సమస్యల యందు ప్రత్యేక శ్రద్ధను తీసుకొనిన త్యాగమూర్తి. ఇల్లు గాలిపోవు నపుడు వీణను చేతబట్టుకొను ప్రబుద్ధుడు రవీంద్రుడుకాడు. మనదేశ నాయకులనేకులకు పూజ్యుడు రవీంద్రుడు. జాతిపితయైన గాంధీమహా త్ముడు ఆయనను గురుదేవుడని సంబోధించెడివాడు. మహాత్ముని పూర్ణ పురుషునిగా గురుదేవుడు సంభావించెడివాడు.

మనదేశ రాజకీయసమస్యలను గూర్చి రవీంద్రుడు సర్వదా ఆలోచించెడివాడు. 1919 సంవత్సరమునకు ముందు ఇంగ్లీషు వారు ఆయనకు సర్ బిరుదమునిచ్చియుండిరి. ఆనాడు మనదేశములో గొప్ప వారికి చాలమందికి యిటువంటి బిరుదులు ఇంగ్లీషు ప్రభుత్వము యిచ్చి యుండెను. 1919 సంవత్సరములో అమృతసర్ పట్టణమున బ్రిటిషు ప్రభుత్వము జన సమూహాము పైన తుపాకులను గాల్చినపుడు అందుకు నిరసనగా రవీంద్రుడు తన సర్ బిరుదమును త్యజించెను. ఆనాడు మన దేశమున సర్ బిరుదాంకితులైన గొప్పవారు మరికొందరు ఉండిరి. కాని

ఇట్టిత్యాగమును, ధైర్యమును. సాహసమును ప్రదర్శించినవాడు రవీంద్రుడేఆనాడురవీంద్రుడుఇండియాపై వ్రాయికి వ్రాసిన లేఖ ప్రపంచలేఖా సాహిత్యములో మహోజ్వలమైనది. జపానుదేశపు సామ్రాజ్యతత్వమును నిరసించుచు జపాను కవీంద్రునికి రవీంద్రుడు వ్రాసినయుత్తరము మరొక మహోజ్వలమైన లేఖ. బహుశః 1940వ సంవత్సరమునకాబోలు భారత జాతీయనాయకులను బ్రిటిషు ప్రభుత్వము చెరసాలలో నుంచినపుడు మిస్. రాత్‌బోన్ అను పాశ్చాత్య యువతి భారతనాయకులను దూషించుచు ఒక ప్రకటనచేసి యుండెను. ఆ ప్రకటనకు రవీంద్రుడిచ్చిన సమాధానము ఆయనకు మన స్వాతంత్ర్యోద్యమము నందుగల గాఢమైన సానుభూతిని జాతీయ నాయకులందుగల అపార గౌరవమును వెల్లడి చేయుచున్నది.

రవీంద్రుడు గాంధీ మహాత్ముడు పరస్పరము పూజ్య భావము కలిగి యుండిరి. వారికి ఒకసారి మాత్రమే అభిప్రాయ భేదము కలిగినది. విదేశవస్తు బహిష్కరణము చేయవలెనని గాంధీ మహాత్ముడు ప్రబోధించి స్వదేశీ ఉద్యమ ప్రచారము గావించునపుడు రవీంద్రుడు ఈ ఉద్యమము ఉపయోగమును, యోగ్యతను, సందేహించుచు గాంధీ మహాత్మునికి ఒక ఉత్తరము వ్రాసెను. దానిని ఉత్తరమనుటకన్న సాహిత్య ఖండమని చెప్పుట సమంజసము, దీనికి సమాధానముగా గాంధీ మహాత్ముడు వ్రాసిన ప్రత్యుత్తరము భావగాంభీర్యము నందును, భాషాసౌందర్యము నందును రవీంద్రుని రచనకు యే మాత్రము తీసిపోని రమణీయమైన ఖండ కావ్యమని చెప్పవచ్చును. రవీంద్రుడు రాజకీయ నాయకుడుగా, గాంధి ఒక మహాకవిగా ఈ ఉత్తర ప్రత్యుత్తరాలలో ప్రత్యక్షమగు చున్నారు. ఇదియే వారి ప్రణయ కలహాములలో మొదటిది. మరియు చివరిది; తరువాత వారికి అభిప్రాయ భేదాలెన్నడును కలుగలేదు. గాంధీ మహాత్ముని ఇష్టమునకు వ్యతిరేకముగా సుభాష చంద్రబోస్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీచేసి నపుడు కొందరు సుభాష చంద్రబోస్ పక్షము వహించ వలసినదని రవీంద్రుని

కోరిరి. కాని ఆయన అందుకు సమ్మతించ లేదు. మహాత్మునికి వ్యతిరేకముగా ఆయన ముందుకు రాలేదు.

జవాహర్ లాల్ నెహ్రూ యందు రవీంద్రుడు, ప్రేమ, అభిమానము, వాత్సల్యము కలిగి యుండెను. జవాహర్ లాల్ నెహ్రూకు మొదటి నుండియు రవీంద్రుని యందు భక్తి. రవీంద్రుని ఉన్నతాదర్శముల చేత జవాహర్ లాల్ ప్రభావితుడైన నిదర్శనాలు కలవు. భారత జాతీయ కాంగ్రెస్ యొక్కయు, భారతదేశ స్వాతంత్ర్యము యొక్కయు విదేశంగ విధానము రూపొంద జేసిన రాజకీయ వేత్త జవాహర్. జవాహర్ విదేశాంగ విధానము మీద రవీంద్రుని ఉన్నతాదర్శాల ప్రభావము కనపడుచున్నది. రవీంద్రుడు జాతి వివక్షణా విధానమునకు వ్యతిరేకి. సామ్రాజ్యతత్వమునకు ప్రతికూలుడు. మానవత్వము నందు విశ్వాసము కలిగిన మహనీయుడు. యుద్ధాలను ఆయుధాలను ప్రతిఘటించిన శాంతి ప్రియుడు, జగత్కల్యాణమునకై పరితపించిన ఋషీశ్వరుడు. రవీంద్రుడు ప్రపంచమునకు ప్రేమ సందేశము నిచ్చిన మహానుభావుడు. ఒక జాతి మరొక జాతి మీద అధికారము వహించు జాతీయాహంకారమును, ఒక మానవుడు మరొక మానవుని బానిసగా జూచు మనస్తత్వమును రవీంద్రుడు సర్వదా వ్యతిరేకించి యుండెను. జవాహర్లాల్ దివ్యవాణి వలె, రవీంద్రుని దివ్యవాణి సకల ప్రపంచమునకు, శాంతి సందేశము నిచ్చునదిగా నుండెను. తన అభిప్రాయాలను రవీంద్రుడు ఉపన్యాసము లందును, రచనల యందును పలుమారు ప్రకటించి యుండెను. స్వతంత్ర భారతదేశము ఆదర్శములు కూడ యిట్లే ఉండవలెనని ఆయన కలలుగనుచుండెను. రవీంద్రుని ఆదర్శాలు, స్వప్నాలు జవాహర్ లాల్ నెహ్రూవిదేశాంగ విధానములో ప్రతిబింబితమైనవి. ఇది రవీంద్రుని విశిష్టత. కావుననే రవీంద్రుడు సకల భారత నాయకులకు గురుదేవుడైనాడు.

ఆధునిక కాలములో భారతదేశ ఆత్మకు చిహ్నములని చెప్పదగిన వారు ముగ్గురు. ఒకరు గాంధీమహాత్ముడు. రెండవవారు రవీం

ద్రుడు. మూడవవారు జవాహర్‌లాల్ నెహ్రూ. జవాహర్ లాల్ శివమునకు అనగా మంగళమునకు, ప్రతినిధి మహాత్ముడు సత్యమునకు ప్రతినిధి. రవీంద్రుడు సౌందర్యమునకు ప్రతినిధి. సత్యము, సౌందర్యము, శివము భారతదేశ సంస్కృతికి మూలకందములు. భారతదేశము ఆత్మకు చిహ్నములు. వీనికి ప్రతినిధులైన యీ ముగ్గురు మహనీయుల వ్యక్తిత్వాల సమన్వయమే భారతదేశ ఆత్మ.

రవీంద్రుడు పరమపదించినప్పుడు, ఆయనకు శ్రద్ధాంజలి సమర్పించుచు రవీంద్రుని రచనలకు అమూల్యమైన వ్యాఖ్యానము వ్రాసి, పాశ్చాత్య ప్రపంచమునకు పరిచయముచేసిన డాక్టర్ రాధాకృష్ణన్ "రవీంద్రుడు వ్యాస, వాల్మీకుల పరగతికి చెందినవాడని" చెప్పిరి. నిజమే! వ్యాస వాల్మీకులవలె రవీంద్రుడు మహర్షియైన కవీంద్రుడు-జాతీయ గీతమును పఠించు ప్రతిసందర్భమున రవీంద్రుని సుందర గంభీర ఆకారము మన కనులయెదుట సాక్షాత్కరించి శాంతి సందేశము నిచ్చుచుండును.

శూరులజన్మము, సురలజన్మము యేరుల జన్మము తెలుసుకొనుట కష్టమని భారత కవి సూక్తి. అదేవిధముగా ఋషీశ్వరుల జన్మమే కాక మృత్యువుగూడ సాధారణులకు తెలుసుకొనుట కష్టమైన కార్యము. రవీంద్రుడు తన మరణమునకు కొన్ని దినములు ముందు మృత్యువును గూర్చి ఒకరచన గావించెను. బహుశా అదియే ఆయన తుది రచన. తన యవసానమునకు కొద్దిరోజులు ముందు మృత్యువునుగూర్చి రచన గావించిన రవీంద్రుడు త్వరలో తనకు స్వర్గలోకమునుండి రానున్న ఆహ్వానమును ఊహించుకొనెనేమో! మహాత్ముల యూహాలు సత్య సామీప్యములు కదా!

(గోలకొండ స్వాతంత్రదిన సంచికకు వ్రాసిన వ్యాసము)

(1957)

# గురుదేవుడు రవీంద్రుడు

# II

గత శతాబ్దమున మనదేశములో వివిధ రంగాల యందు దిగ్గజముల వంటి మహనీయు లనేకులు జన్మించినారు. దేవతా గణమున త్రిమూర్తులవలె వీరిలో ముగ్గురు మహనీయులు ప్రకాశించుచున్నారు. త్రిమూర్తుల యందువలె, యీముగ్గురి యందును ఒక యేకత్వము గోచరించుచున్నది. ఆ యేకత్వమే భారతదేశ ఆత్మ; భారతీయ సంస్కృతిలోని ఉదాత్తత. ఆధునిక కాలము నందలి భారతీయుల ఆశయాలు, మనోరథాలు, వీరి యందు సంపూర్ణముగా మూర్తీభవించి యున్నవి. ఈ ముగ్గురి చరిత్రయే, నవభారత, స్వతంత్ర రత, చరిత్రయని నిస్సందేహముగా చెప్పవచ్చును. ఈ ముగ్గురిలో ఒకరు కవి; ఒకరు ప్రవక్త ఒకరు ధీరోదాత్తుడైన నాయకాగ్రేసరుడు. ఇందులో కవీంద్రుని కడమ యిద్దరు గురుదేవునిగా ంవించినారు. ఆ కవీంద్రుడే రవీంద్రుడు; ఆ ప్రవక్త భరత జాతిపిత గాంధీ మహాత్ముడు; ఆ మహా నాయకమణి జవాహర్లాల్ నెహ్రూ.

గాంధీ మహాత్ముడు , రత రాజకీయ రంగమునకు యేకైక నాయకత్వము వహించి, స్వాతంత్ర్యరథ సారథ్యమునకు పూను కొనుటకుముందుగనే రవీంద్రుడు రచయితగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచి, తరువాత గాంధీ మహాత్ముని రూపమున ఉప్పొంగ నున్న భారత జాతి అంతఃకరణమును ప్రపంచమునకు పరిచయము గావించినట్లు ఆయన రచనలు ఋజువు చేయుచున్నవి. 1901వ సంవత్సరమున శాంతినికేతన స్థాపన. 1913 సంవత్సరమున నోబుల్ బహుమతి, 1915 సంవత్సరమున విశ్వభారతి స్థాపన ఇందుకు ఉదాహరణములు.

రవీంద్రుడు జాతీయకవి; విశ్వకవి. భారతదేశానికి జాతీయ గీతమును ప్రసాదించిన గౌరవము రవీంద్రునికి దక్కినది. ఒక్క జాతీయ గీతమేకాదు. ఆయన రచనల నన్నింటిని సమగ్రముగా పరిశీలించి నపుడు అందులో అడుగడుగున భారత దేశము, భారత సంస్కృతి ప్రతిబింబ ములు కనుపించ గలవు. సకల భారత రచయితలయందు ఇది రవీంద్రుని ప్రత్యేకత. రవీంద్రుడు వంగ వాఙ్మయ రంగమున అడుగు పెట్టుటకు ముందుగనే, వంగ సాహిత్యములో ఆధునిక యుగ నిర్మాతలు కొందరు ఉద్భవించి యుండిరి. సుప్రసిద్ధ విద్వాంసుడైన ఈశ్వరచంద్ర విద్యాసాగరుడు వంగ వాఙ్మయమున అనేక వచన రచనలు గావించి తన సరళ రమ్యశైలినీ వంగరచయిత లందరికిని ఒరవడి గావించి యుండెను. మైకేల్ మధుసూదనదత్తు భావగంభీరమైన కావ్యములను, మనోహరమైన శైలిలో రచించి, ఆధునిక పద్ధతులను వంగ సాహిత్య రంగమున ప్రవేశ పెట్టి యుండెను. మధుసూదన దత్తు వంగసాహిత్యమున ప్రవేశపెట్టిన విప్లవాత్మకమగు మార్పులు ఒక తీవ్ర సంచలనము కలుగజేసినవి. బంకించంద్రచటర్జీ మనోహరమైన నవలలను వ్రాసి వంగ వాఙ్మయమున క్రొత్త మార్గమును చూపించి యుండెను. ఈ రచయితల వరుసలో సాహిత్య రంగమున ప్రవేశించిన రవీంద్రుడు, వీరి నందరిని తన ప్రతిభాసంపదచేత అతిక్రమించి, వంగదేశమున ఆబాల గోపాలము ఆదరణపొంది సకల భారతము, కాదు, సకల ప్రపంచము జోహారుల నందుకొని వంగ వాఙ్మయమున, భారతీయ సాహిత్యమున, అగ్రగణ్యుడై ప్రకాశించినాడు. రవీంద్రుని రచనా ప్రావీణ్యమును గూర్చి ప్రస్తావించుచు నవలగాని, చిన్న కథగాని, నాకన్న బాగుగా వ్రాయ గలిగినవాడు ఒక్క రవిబాబు తప్ప మరెవ్వరును లేరని శరచ్చంద్ర ఛటర్జీ ఒకమారు వ్రాసియున్నాడు.

రవీంద్రుని రచనలలోని వైవిధ్యము ఇతరుల రచనలయందు కానరాదు. రవీంద్రుడు నవలలు వ్రాసినాడు, చిన్న కథలు వ్రాసి

నాడు, ఏకాంకికలు, నాటికలు వ్రాసినాడు. బాలవాఙ్మయమును రచించినాడు; ఉదాత్తమైన కవిత్వము అల్లినాడు, రమణీయమైన పాటలు పాడినాడు, కళాఖండములైన వ్యాసములను లిఖించినాడు. రవీంద్రుడు సాధించక విడిచిన వాఙ్మయ విశేషము లేదు; పట్టిన దానినెల్లను బంగారము గావించక వదలి పెట్టలేదు. ఇటువంటి సర్వతోముఖ ప్రతిభా విశేషమును ప్రదర్శించిన భారతీయ రచయితలు మరెవ్వరు? రవీంద్రుని రచనలలో, అది యే తరగతికి చెందిన రచన యైనను భారత ఆత్మ అంతర్వాహినిగా ప్రవహించు చున్నది. ఇదియే రవీంద్రుని విశిష్టత.

భారతదేశ ఆత్మను, భారత సంస్కృతిని ప్రపంచమునకు వెల్లడి చేయుటకు ప్రయత్నించిన విజ్ఞానులు కొందరు ఆధునిక యుగమున కలరు. వివేకానందుడు భారతీయ వేదాంతమును తన అమోఘమైన ఉపన్యాసాల ద్వారా సకల ప్రపంచానికి పరిచయము గావించి యున్నాడు - రవీంద్రుని గౌరవాదరములకు అత్యధికముగా పాత్రుడైన అరవిందుడు యీ మార్గమున కృషి గావించియున్నాడు. గీతా భాష్యాది ఉద్గ్రంథముల ద్వారా లోకమాన్యతిలక్ భారతీయ వేదాంతమును ప్రతిపాదించు ప్రయత్నము గావించి యున్నాడు. భారత సంస్కృతి తన జీవితములో ప్రతిపదమున ప్రతిబింబింప జేసికొనిన మహాత్ముడు గాంధీజీ. కాని మన మతము, మన వేదాంతము, మన సంస్కృతిలోని విశ్వజనీనమైన విలువలు, శాశ్వత ప్రయోజనాలు సమస్త ప్రపంచమునకు మనోరంజకముగా వివరించుటలో రవీంద్రునిదే అగ్రస్థానము. ఇందుకు కారణము రవీంద్రుడు కవి యగుటయే; రవీంద్రుని రచనలు రసాత్మకములగుటయే; రవీంద్ర వాఙ్మయము కాంతాసమ్మితమగుటయే. భారతీయ జీవిత విమర్శనమునకు ఆటపట్టులై, భారతీయ సంస్కృతి ప్రతి పాదకములైన రవీంద్రుని రచనలు ప్రపంచ సాహిత్యము

నకు శిరోభూషణములు; ఉపనిషత్తులతో పోలికగల రవీంద్రుని రచనలు మానవజాతికి మహోన్నతమైన సందేశము నిచ్చినవి.

ఋషికాని వాడు కవి కాజాలడని ఆర్యోక్తి. కవీశ్వరుడైన రవీంద్రుడు ఋషీశ్వరుడని ఆయన జీవితము నిరూపించు చున్నది. ప్రకృతిలో భగవంతుని అంశమును సందర్శించిన ప్రాచీన భారత మునీంద్రులవలె ఆశ్రమవాసము కల్పించుకొని ప్రకృతికి సన్నిహితుడుగా తన జీవనము గడిపినాడు, ప్రకృతికి కవితా స్వరూపము నిచ్చినాడు. శీతల తరుచ్ఛాయలయందు, పచ్చిక పట్టులమీద, ప్రకృతి దృశ్యముల మధ్య, సంగీత సాహిత్య చిత్ర లేఖనాది కళల ద్వారా, రవీంద్రుడు ఆనందోపాసన గావించినాడు. ప్రకృతిమాత చల్లని యొడిలో ఉపలాలితుడైన ఆయన ప్రపంచానికి ప్రేమ సందేశము నిచ్చినాడు. ఆనాటి వ్యాస వాల్మీకుల రచనలవలె రవీంద్రుని రచనలు గూడ భారత జాతి ఆత్మకు ప్రతిబింబములు, భారత సంస్కృతికి భాష్యములు; భారతదేశ ఆధ్యాత్మిక సంపదకు ఆలవాలములు. వానిలో ప్రతి పదమున, భారతీయ హృదయము స్పందించు చున్నదని చెప్పినచో అతిశయోక్తి కాజాలదు.

మహాకవి రవీంద్రుడు మహాభక్తుడుకూడ. మన ఉపనిషత్తులను, మన వేదాంతమును సంపూర్ణముగా అవగాహన చేసికొని, అందువలన కలిగిన దివ్య అనుభూతితో ఆయన కవిత్వము చెప్పినాడు. గీతాంజలి ఈ విధముగా చెప్పినదే. ఆత్మ అంతరాత్మకు నివేదించుకొనిన గేయ సందోహము గీతాంజలి. ఉపనిషత్తులు, భగవద్గీత మొదలైన వేదాంత గ్రంథాలలోని భావసుధారసము కడుపార గ్రోలిన రవీంద్రనాథుడు, ఆ రసపానమత్తతచే కలిగిన భావనాబలమున సౌందర్యసృష్టి గావించి యున్నాడని వేదాంతవేత్తల అభిప్రాయమై యున్నది. గాంధీజీ వలె భగవంతునియందు పరిపూర్ణవిశ్వాసముగల ఆస్తికుడు రవీంద్రుడు.

భారత సంప్రదాయమునకు ఆటపట్టైన రవీంద్ర వాఙ్మయము, మనదేశములో మధ్యకాలము నుండి వ్యాపించిన సామాజిక దోషములను కులతత్వాలను, అస్పృశ్యతను గాంధీజీ తన హరిజనోద్యమమును ప్రారంభించుటకు చాలముందుగనే సంఘ దురాచారములుగా చిత్రించి, పరిహరించ వలసినదని చెప్పినది. ప్రాతది యెల్లను మంచిదను భావము రవీంద్రునకు లేదు. శాశ్వతమైన ఆధ్యాత్మిక విలువలకు, నైతిక విలువలకు మాత్రమే రవీంద్రుడు ప్రాధాన్యము నిచ్చినాడు. కాలము మార్పును రవీంద్రుని వాణి గమనించినది. చిరకాల దాస్యముచే సర్వవిధముల అధఃపతితులైన భారతీయులకు, నూతన ఆశలను, ఉదాత్త ఆశయాలను, ఆత్మవిశ్వాసమును కలుగజేసినది రవీంద్ర వాఙ్మయము. విశ్వశాంతి, వసుధైక ప్రభుత్వమను ఆదర్శాలను ప్రపంచమునకు ఉపదేశించినది రవీంద్రుని లేఖని. భారతీయుల కష్టసుఖములను, మంచి చెడ్డలను, ఉత్సాహోద్రేకాలను, ఆవేదనానందములను, చిత్రించి భారతీయ హృదయమును, మనోరథములను ప్రపంచమునకు ప్రకటించినాడు రవీంద్రుడు. ఆనాడు రవీంద్రుడు భారతదేశముగా రూపొంది, సకల ప్రపంచముతో సంభాషించినాడని చెప్పవచ్చును.

రవీంద్రునికి భరతజనయిత్రి ఆరాధ్యదేవత. సోదర భారతీయులను మాతృదేశ సేవకు పురికొల్పినది రవీంద్రుని కవిత్వము. విజాతీయ సంస్కృతి, విజాతీయ అభిరుచులు, అనుకరణలు రవీంద్రునికి ఇష్టము కావు. మాతృభాషల ద్వారా విద్యాబోధన జరగవలెనని రవీంద్రుని ఆశయము. ఎంత పాండిత్యము గడించి నప్పటికిని, ఇంగ్లీషుభాషలో సాహిత్య నిర్మాణము గావించుట భారతీయులకు సాధ్యము కాదని రవీంద్రుని అభిప్రాయము. ఇంతమాత్రాన పాశ్చాత్య సంస్కృతిని ద్వేషించువాడు కాడు రవీంద్రుడు. ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతుల లోని ఉత్తమ సంపద యంతయును సమ్మేళనమై విశ్వసంస్కృతిగా

రూపొందవలెనని రవీంద్రుని అభిప్రాయము. జగత్తునంతయును తన కుటుంబముగా భావించు కొనిన ఉదార చరితుడాయన.

భారతదేశము పరమత సహనమునకు ప్రఖ్యాతి వహించినది. అనేక సంస్కృతులమ, అనేక సంప్రదాయాలను ఆకళించుకొని, అనేక మతములకు పుట్టినిల్లైన గౌరవము భారతదేశమునకు కలదు. ఇకముందు గూడ ఇందుకు అనుగుణముగా భారతదేశము అభివృద్ధి పొందవలెనని రవీంద్రుని ఆశయము. ఇంచు మించుగా జవాహర్లాల్ ఆశయము కూడ ఇదియే.

రవీంద్రుని ప్రతిభ సర్వతోముఖమైనది. రవీంద్రుని శక్తి సామర్థ్యాలలో ఎంతయో వైవిధ్యము కలదు. అయినప్పటికిని ఆయన నూటికి నూరుపాళ్లుకవి. ఆయన జీవితములో అడుగడుగునను కనుపించునది కవిత్వము. కవిగా ఆయన యిచ్చిన సందేశము విశ్వజనీనమైనది. అణుబాంబుల మధ్య, కృత్రిమ ఉపగ్రహాల మధ్య యుద్ధ మేఘాల ఛాయలలో రవీంద్రుని వాణి మానవ జాతికి ప్రేమసందేశము నిచ్చుచున్నది.

(1957)

# కవయిత్రి తోరూదత్

"ముదితల్ నేరగరాని విద్య కలదే ముద్దార నేర్పించినన్"
అని చెప్పిన చిలకమర్తి కవి మాటలు అక్షరాల సత్యమైనవి. ఏ రంగములోనైనను, సరియైన, సమానమైన అవకాశాలు లభించినచో పురుషులకు స్త్రీలు ఏ మాత్రము తీసిపోరని ఋజువు చేయుటకు ఎన్ని నిదర్శనాలైనను చూపించవచ్చును. గత శతాబ్దమున వంగరాష్ట్రమున జన్మించి, కీర్తిగాంచిన తోరూదత్ అను యువ కవయిత్రి జీవితము ఇటువంటి నిదర్శనాలలో పేర్కొనదగినది.

తోరూదత్ 1856 సంవత్సరమున కలకత్తాలోని అగ్రవర్ణానికి చెందిన ఒక ఉన్నత కుటుంబమున జన్మించినది. చిన్నప్పటినుండి సిరి సంపదలతో తులతూగినది. అయితే ఈ ఐశ్వర్యము ఆమె జీవితమును ఆనందప్రదము గావించినదని చెప్పుటకు వీలులేదు. శైశవదశలోనే ఆమె సుకుమార హృదయానికి తీవ్రఆఘాతములు కొన్ని తగిలినవి. ఆమెకు పది సంవత్సారాలు నిండీ నిండని వయసులో ఆమె అన్న తన పదు నాలుగవ యేట చనిపోవుట జరిగినది. ఆమెకు ఇంకను మైనారిటీ యైనను దాటని పదునెనిమిది సంవత్సారాల వయసులో ఆమె అక్క ఇరువదేండ్ల ప్రాయమున మరణించుట జరిగినది. ఈ రెండు మృతులు ఆమె లేత యెడద మీద సమ్మెట పోటులైనవి.

ఆమె తండ్రి ఉదార భావాలు కలిగిన సజ్జనుడు; మంచి విద్వాంసుడు; ఆయన తనకూతురును అల్లారు ముద్దుగా పెంచి ఆమె విద్యాభ్యాసానికి సకల సౌకర్యాలు కలుగజేసి, విదుషీమణిగా పెంచి పెద్ద జేసినాడు. తండ్రిగారి సుందరమైన ఆరామములో ఆమె తన శైశవము నంతయును ఆటపాటలతో వెళ్ళబుచ్చినది. విద్యాబుద్ధులు నేర్చి, సాహితీ వ్యాసంగమున నిమగ్నయైన యౌవనదశలో ఆమె తన చిన్నప్పటి అనుభవాలను, బాల్య స్నేహితులను, ప్రకృతి దృశ్యాలను

తలంచుకొని ఉత్తేజితయై వానిని తన కవితా సౌధమున సుందరముగా చిత్రించి అక్షరములను గావించినది.

ఆధునిక వాతావరణములో పుట్టి పెరిగి, పాశ్చాత్య సంస్కృతి పరిపూర్ణముగా ఆకళించు కొన్నప్పటికిని, తోరూదత్ రచనలను పరిశీలించి నప్పుడు వానిలో ప్రతి పదమున భారత జాతీయతా ముద్ర స్పష్టముగా కనుపించుచుండును. ధృవుడు, ప్రహ్లాదుడు, లక్ష్మణుడు, సీతమ్మ. సావిత్రి మొదలైన పౌరాణిక వ్యక్తులను, వారి శీలమును అత్యంత అభిమానముతో ఆమె తనరచనల యందు చిత్రించినది. సాధారణముగా హిందూ కుటుంబాలలో చిన్నప్పుడు పసిపిల్లలకు ఇంటిలోని స్త్రీలు పౌరాణిక కథలను వీనులవిందుగా చెప్పుట జరుగును, బహుశా, చిన్ననాటి ఈ మధుర స్మృతులే తరువాత తోరూదత్ కవితా దర్పణమున ప్రతిఫలించినవేమో.

పదమూడు సంవత్సరాల బాలికగా నున్నప్పుడు, తండ్రి ఆమెను ఇంగ్లీషు ఫ్రెంచి భాషలను చదివించుట కొరకు అయిరోపాఖండమునకు తీసికొని వెళ్ళెను. ఆమె ఉన్నత విద్యాభ్యాసమంతయు పాశ్చాత్య దేశాలలోనే జరిగినది. ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలను ఆమె కూలంకషముగా పఠించినది. అందులోను ఇంగ్లీషుకన్న యెక్కువ వైదుష్యము ఆమె ఫ్రెంచి భాషలోనే సంపాదించినది; రచనా ప్రావీణ్యమున గూడ ఇంగ్లీషుకన్న యెక్కువ ప్రతిభ ఫ్రెంచిలో ఆమె ప్రకటించినదని సుప్రసిద్ధ విమర్శకుల అభిప్రాయము. నాలుగు సంవత్సరాలు విదేశాలలో విద్యాభ్యాసము గావించిన తరువాత ఆమె స్వదేశానికి, స్వరాష్ట్రానికి వచ్చినది; పాపము; తరువాత ఆమె జీవించినది నాలుగేండ్లు మాత్రమే. ఇరువది మూడు సంవత్సరాలు నిండీనిండని వయస్సులో ఆమెతనను విడిచి వెళ్ళిన సోదరీ సోదరులను కలుసుకొనుట కొరకు పరలోకమున కేగినది. భగవంతుని సృష్టిలోని విచిత్రమేమోకానీ, ఆ ముగ్గురు సోదరీ సోద

రులు, నిండు జవ్వనము గూడ దాటని వయసులో తమకుటుంబమును, వృద్ధ జనకుని దుఃఖ సముద్రములో ముంచి వేసినారు.

ఆమె తన జీవితపు చివరలోని నాలుగు సంవత్సరాలు కలకత్తా నగరములోని సుందరవనాంతరము నందలి సౌధములో గడిపినది. ఆమెది బక్క పలుచని సుకుమారమైన విగ్రహము. వయసుకు మించిన పాండిత్యభారముతో, నిరంతర సాహితీ వ్యాసంగపు బరువుతో, లేదీగ వంటి ఆనాజూకు శరీరము కృంగి పోయినదేమో! స్వదేశములో కొంత సంస్కృతము గూడ ఆమె అభ్యసించినది; సంస్కృత వాఙ్మయమునందలి ఉత్తమ కావ్యామృతమును తగినంత ఆమె తన కడుపార గ్రోలినది.

మాతృభాషయైన వంగభాషలో ఆమె యేమియును వ్రాసినట్లు కనపడదు; అందులో ఆమె నేర్పుకూడ యెక్కువ కాదేమో! ఇంచు మించుగా ఆమె రచనలన్నియును ఇంగ్లీషు ఫ్రెంచి భాషలలోనే జరిగి నవి. ఆంగ్ల ఫ్రెంచి భాషల యందలి ప్రాచీనుల రచనలకన్న ఆధునికుల రచనలే ఆమె యెక్కువగా అభిమానించినదని ఆమె రచనలు చాటు చున్నవి.

రచనలను చాల గావించినప్పటికి, జీవిత కాలమున పుస్తక రూప ముగా ఆమె ప్రకటించినది ఒక్కటి మాత్రమే. అదియే (*Sheafs gleaned in French Fields*) అను గ్రంథము. ఛందో వ్యాకరణాది దోషాలు కొన్ని ఉన్నప్పటికిని. భావనాశక్తి సహజ ప్రతిభ ఇందులో ప్రముఖముగా కనుపించుచున్నవి. ఆమె మరణించిన తరువాత ఈ గ్రంథమును ఆమె వృద్ధ జనకుడు పునర్ముద్రణము చేయించెను. ఈ రచన ఫ్రెంచి సమాజము చిత్రించుటకు ఉద్దేశించినది. కాని ఇందులో స్పష్టముగా కనుపించినది భారతీయ మనస్తత్వమేనని ఆంగ్ల సారస్వత విమర్శకుల అభిప్రాయము. ఈ రచనలోని వాతావరణమునందు పాత్ర పోషణయందు ఫ్రెంచి తత్వముకన్న భారతీయత యెక్కువగా కను పడుటయే ఇందుకు కారణము.

*Mlle. D' Averes* అనునది ఆమె మరొక రచన–ఇద్దరు సోదరులు ఒక సుందరాంగికై పోరాడి పరస్పరము హత్యగావించుకొనుట, ఈ రచనకు ఇతివృత్తము. సాహితీ దృష్టితో ఈ రచన విలువగలది. ఆమె రచనలలో శాశ్వతమైన విలువ గలవి ఆమె ఆంగ్ల ఖండకావ్యాలు. ఈ ఖండ కావ్యాలలో కొన్ని ఆమె జీవిత కాలమునందే కలకత్తా రెవ్యూ బెంగాల్ మ్యాగజీన్‌లలో ప్రకటితమై ఆమె మరణానంతరము పుస్తక రూపముగా ముద్రితమైనవి. ఇందులో ప్రహ్లాదుడు. సావిత్రి మొదలైన పౌరాణిక కథలుగలవు. ఈ రచనలు భావగాంభీర్యానికి, భాషా సారళ్యానికి ఆటపట్టులు. కొన్ని సందర్భాలలో భాషయొక్క దౌర్బల్యము, విశేషించి భావోద్వేగముతో పరుగెత్తలేని శబ్దజాలము ఆమె రచనలలో కనుపించుచుండును. భావము, భాష ఈ రెండింటి దృష్ట్యాకూడ అత్యుదాత్తములైన కొన్ని రచనలుకూడ యీామె ఖండకావ్యాలలో కలవు. *Our Casurina tree* అనునది ఎంతటి గొప్ప కవికైనను కీర్తిని సంపాదించి పెట్టగలిగిన మనోహర ఖండకావ్యము. భావిచరిత్రకారుడు ఆంగ్ల వాఙ్మయ చరిత్రను రచించు నప్పుడు అందులో తోరూదత్ కొకపుటను యీాయక తప్పదని, సుప్రసిద్ధ కవయిత్రియైన సరోజనీదేవి ఆంగ్ల రచనలను ప్రపంచానికి పరిచయము గావించిన ఆంగ్లేయ సాహిత్య విమర్శకుడు యీామె పుస్తకానికి వ్రాసిన ఉపోద్ఘాతములో ఉద్ఘాటించి యున్నాడు.

(రేడియో ప్రసంగము 1954)

# లజపత్ రాయ్

భారతదేశ స్వాతంత్ర్యము నాలుగైదు తరాలకు చెందిన మహనీయులు, త్యాగమూర్తులు చేసిన అపార కృషి ఫలితము. ఒక్కమారు ఈ కృషిని సమీక్షించుకొన్నప్పుడు ఇందులో కొన్ని దశలను స్థూలముగా మనము నిర్ణయించవచ్చును. ఈ దశలో ఒక్కొక్క దానికి ఒక్కొక్కరు నాయకత్వము వహించి నప్పటికిని మేధా శక్తిలోను, త్యాగ సంపదలోను ఆ నాయకునికి తీసిపోనటువంటి నాయకమణులు ప్రతిదశలోను కనుపించుచున్నారు. ఈ నాయక శ్రేణిలో లాలాలజపత్ రాయ్ విశిష్ట వ్యక్తిత్వము కలిగిన మహనీయుడు.

కాంగ్రెస్ స్థాపన తరువాత మొదటి దశకు నాయకత్వము వహించిన త్యాగమూర్తి దాదాభాయి నౌరోజీ. మొదటిదశ నౌరోజి యుగమైనచో; రెండవదశ లోకమాన్యుని యుగము; మూడవదశ గాంధీజీ యుగము; నాలుగవదశ జవాహర్లాల్ యుగము. కాంగ్రెస్ చరిత్రను మనము ఈ నాలుగు యుగాలుగా విభజించవచ్చును. దాదాభాయి ప్రభృతులు గావించిన ప్రబోధము దేశములో మంచి జాతీయ వాతావరణము సృజించినది; ఈ వాతావరణములో లోకమాన్యుడు స్వరాజ్యము నా జన్మ హక్కని ఉద్ఘాటించినాడు. లోకమాన్యుని పిలుపు నందుకొని. గాంధిజీ భారత జాతీయ కాంగ్రెస్‌కు స్పష్టమైన రూపు రేఖలు దిద్ది; తదాశయములను అసందిగ్ధముగా ఉద్ఘాటించి నాడు. గాంధీజి మార్గదర్శకత్వమున సత్యాహింసల ద్వారా పూర్ణస్వరాజ్యము సాధింపవలెనని నిర్ణయించుకొనిన కాంగ్రెస్, జవాహర్లాల్ నేతృత్వమున, పార్లమెంటరీ ప్రజాస్వామికము, లోకశ్రేయస్సుకు అనుగుణమైన విదేశాంగ విధానము, సామ్యవాదము అను ఆశయాలను నిర్వచించి. వానిసాధనకొరకు కృషిచేయవలెనని తీర్మానించినది. ఈనాలుగు

దశలలో రెండవదశరైన లోకమాన్యుని యుగానికి చెందిన పురుష సింహము పాంచాల కేసరి లాలాలజపత్‌రాయ్.

లోకమాన్యుని యుగమున ఆసేతుహిమాచల పర్యంతమైన భారతదేశమున ముగ్గురి నామములు ప్రతిధ్వనించినవి. లాల్, బాల్, పాల్ అనునవియే ఈ మూడు నామములు. లాల్ అనగా లాలాలజపత్‌రాయ్, బాల్ అనగా బాలగంగాధర్ తిలక్, పాల్ అనగా బిపినచంద్రపాల్, త్రిమూర్తులవలె ఆనాడు భారతజాతీయ రంగమున, ఈ ముగ్గురు శోభిల్లిన సంఘటన ఈనాటికి ఆ రోజులు చూచిన వృద్ధమూర్తులు మహోత్సాహముతో జ్ఞప్తి చేసికొనుచుందురు.

లాలాజీ పాంచాలకేసరియని ప్రసిద్ధిగాంచినారు. ఈ బిరుదు సర్వవిధాల ఆయనకు సార్థకమైనది. ఆయన ఆకారము, విజ్ఞానము, పరాక్రమము ఆయనకు నాటి నాయకమణులలో సింహమను పేరును సంపాదించినవి. లాలాజీ తన రాజకీయాభిప్రాయాలను యెన్నడును దాచుకొనలేదు; సింహమువలె యెలుగెత్తి ఈ అభిప్రాయాలను చాటుటకు ఆయన వెనుదీయలేదు. సహజముగా ఆనాటి ఆంగ్లప్రభుత్వానికి కంటకప్రాయమైనది . కావున నిరంతరము గూఢచారుల బాధను ఆయన యెదుర్కొనవసివచ్చుచుండెను. ఈ బాధ సహింపరానిదిగా విజృంభించినప్పుడు. లాలాజీ అమెరికాకు కొంతకాలము ప్రవాసము వెళ్ళుటగూడ జరిగినది. అమెరికాలో గూడ లాలాజీ నిరంతరము భారత స్వాతంత్ర్యమును గూర్చి కలలు గాంచుచు కృషి గావించినారు.

కాంగ్రెస్ చరిత్రను అవలోకించినప్పుడు, అధ్యక్ష పీఠము నలంకరించిన మహనీయులలో కొందరికి ఈ గౌరవము చాల తొందరగా లభించినదనియు, మరికొందరికి ఈ గౌరవము చాల ఆలస్యముగా లభించినదనియు వెల్లడియగుచున్నది. సర్వవిధములైన అర్హతలను హక్కును కలిగి యుండియు కొన్ని కారణాల వలన కాంగ్రెస్ అధ్యక్ష

పీఠము నలంకరింపజాలని నిదర్శనాలు గూడ మనకు గోచరించు చున్నవి. ఈ నిదర్శనాలలో లోకమాన్య బాలగంగాధర్ తిలక్‌గారి పేరు ప్రత్యేకముగా చెప్పవలసియున్నది. కాకలు దీరిన కాంగ్రెస్ వాదియై నప్పటికిని, లాలాలజపత్‌రాయ్‌కు కాంగ్రెస్ అధ్యక్ష పదవి నలంకరించు గౌరవము 1920వ సంవత్సరము వరకు లభించలేదు. అంతకు ముందు రెండు మూడు పర్యాయములు కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పాంచాలకేసరి పేరు ప్రతిపాదించబడినప్పటికిని, లోకమాన్యుడు ఇందుకొరకు కృషి గావించినప్పటికిని, లాలాజికి ఈ గౌరవము లభించ లేదు. 1920వ సంవత్సరమున లాలాజి ప్రథమ పర్యాయము జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికయైనారు.

లాలాజి తమ రాజకీయ జీవిత ప్రారంభములో అతివాదులుగా ప్రఖ్యాతిగాంచినప్పటికిని, చివర దశలో వీరి అభిప్రాయాలయందు కొంత మార్పు గోచరించినది. చివర దశలో లాలాజి శాసన సభలలో కాంగ్రెసు వాదుల ప్రవేశానికి సుముఖులుగా నుండిరి. ఇది రాజకీయ వర్గాలలో అసంతృప్తికి కారణభూతమైనది; లాలాజి నాయకత్వమునకు వ్యతిరేకముగా స్వరాష్ట్రమైన పంజాబులోనే, ఉడుకు రక్తముగల యువకులు తిరుగుబాటు చేసినట్లు కాంగ్రెస్ చరిత్ర మనకు తెలుపు చున్నది. లాలాజి తన రాజకీయ జీవితములో తీవ్రమైన వ్యతిరేకతను కూడ యెదుర్కొనవలసివచ్చినది. పాంచాల రాష్ట్రస్థాయిలోనే కాక, అఖిల భారత స్థాయిలో గూడ సింహామువలె విక్రమించిన లాలాలజపత్ రాయ్, స్వరాష్ట్రములో ప్రబల ప్రతిపక్షము యొక్క ప్రతిఘటనను రుచి జూచినారు. లాలాజి తన జీవితములో బలవంతులైన శత్రువులను కూడ కలిగియుండిరి. ప్రపంచములో శక్తివంతులైన మహాపురుషుల జీవి తాలన్నిటియందును ఈ సత్యము గోచరించుచున్నది.

లాలాజి గొప్ప విద్వాంసుడు. నిజానికి ఆనాటితరము రాజకీయ నాయ కుల ప్రత్యేకత ఇది; అది, అతిరథమహారథుల యుగము.శారీరకముగానే

కాక, మానసికముగాను వామన మూర్తులైనవారి యుగము కాదది. లోకమాన్యుని వంటి విజ్ఞానమూర్తికి సర్వవిధాల యోగ్యుడైన అంత రంగమిత్రుడు లాలాలజపత్‌రాయ్. సంస్కృతము, ఉర్దూ భాషలయందు లాలాలజపత్‌రాయ్ కూలంకషమైన పాండిత్యము కలిగియుండిరి. రుచుల యందు, అభిరుచులయందు లాలలజపత్‌రాయ్‌కు లోకమాన్యునికి మధ్య పోలికలు కనిపించుచున్నవి. ఉభయులు ప్రాచ్యవిజ్ఞానమునందు, సంస్కృత భాషయందును అపారమైన ఆసక్తితో పాటు గాఢమైన ప్రవేశము కలిగియుండిరి.

ఆనాటి కాంగ్రెస్ నాయకులనేకులవలె లాలాలజపత్‌రాయ్ మంచివక్తయై యుండిరి. నిద్రాణమైన జాతిని మేలుకొలుపుటకు, స్వాతంత్ర్య ప్రబోధముగావించి, చైతన్యము కలుగజేయుటకు, వక్తృత్వశక్తి రచనాశక్తి అత్యంత ఉపయుక్తమైన సాధనములు. లాలాలజ పత్‌రాయ్ రెండు సాధనములను మిక్కిలి ప్రావీణ్యముతో ఉపయో గించిరి. ఉర్దూభాషలో లజపత్‌రాయ్ ఉత్కృష్టమైన వక్తగా ప్రఖ్యాతి గాంచిరి.

ఉర్దూ సంస్కృతాలతో పాటు లాలాలజపత్‌రాయ్ ఆంగ్లభాష యందు చక్కని వైదుష్యము సంపాదించియుండిరి. ఆంగ్లభాషలో వారు కొన్ని ఉద్గ్రంథములను రచించినారు. ఈ సందర్భమున వానిలో రెండింటిని గూర్చి ప్రత్యేకముగా పేర్కొనవలసి యున్నది. ఈ రెండింటిలో మొదటిది (*The causes of India'n Revolt*). ఈ గ్రంథములో భారతీయులు తిరుగుబాటు చేయుటకుగల కారణాలు. భారత స్వాతంత్ర్య ఆవశ్యకతను వారు చక్కగా వివరించినారు. రెం డవ గ్రంథము (*Unhappy India*) దురదృష్టవంతమైన భారతదేశము. ఆ రోజులలో అమెరికా దేశీయురాలైన మిస్ మేయో కొందరి ప్రోత్సా హము వలన భారతదేశమును గూర్చి ఒక గ్రంథము వ్రాసినది. ఈ

గ్రంథములో భారతీయులను గూర్చి, భారతదేశమును, గూర్చి చాల అసభ్యముగాను, అవమానకరముగాను చిత్రించుట జరిగినది. అతిశయోక్తులతో అశ్లీలములతో, అసత్యాలతో నిండిన ఈ గ్రంథమును సమస్త భారతదేశానికి ఏవగింపు కలుగ జేసినది. శమము, దమము, కలిగిన గాంధీ మహాత్ముని యంతవారు ఈ గ్రంథమును గూర్చి వ్యాఖ్యానించుచు ఇది మురికి కూపాలను మాత్రమే పరిశీలించిన మ్యునిసిపల్ అధికారినివేదిక యని తెలిపినారు. దీనికి సమాధానముగా భారతీయులు కొందరు ప్రత్యేక గ్రంథాలను వ్రాసియున్నారు. ఇందులో లాలాలజపత్‌రాయ్ గారి గ్రంథము అగ్రగణ్యమైనది. ఈ గ్రంథములో మిస్ మేయో ఆరోపణలు, అసత్యాలు ఖండించి భారతదేశ స్వరూపమును వెల్లడి చేయుట జరిగినది. ఇంచుమించుగా వేయిపుటలు కలిగిన పెద్ద గ్రంథమిది.

లాలాలజపత్‌రాయ్ వ్యక్తిత్వము బహుముఖమైనది. ఆయన భావాలలో అతివాదము కనిపించినప్పటికిని, ఇంగ్లీషు ప్రభుత్వము ఆయనను సర్వదా అనుమానించినప్పటికిని, ఆయన ప్రభుత్వముతో సహాయ నిరాకరణము చేయవలెనను విధానమును యెన్నడు గూడ నూటికి నూరుపాళ్ళు బలపరచలేదు. నిజానికి ఆయనను సహాయ నిరాకరణ విధానానికి వ్యతిరేకియని చెప్పినప్పటికిని అతిశయోక్తి కాజాలదు. 1920వ సంవత్సరమున నాగపురమున జరిగిన కాంగ్రెస్ మహాసభలో గాంధీజీ చేత ప్రభావితుడై, మోతిలాల్ నెహ్రూ ప్రతిపాదించిన సహాయ నిరాకరణ తీర్మానమును ఆయన బలపరచి యుండెను. ఈ కాంగ్రెస్ సమావేశము తరువాత గాంధీయుగము ప్రారంభమై గాంధీరాజకీయాలు దేశములో వ్యాప్తినొందగా, లాలాజి కొంతకాలము భారత శాసన సభలో పనిజేసెను. కానీ మోతి లాల్ నెహ్రూతో అభిప్రాయ భేదము కలిగి, స్వరాజ్య వాదులు శాసన సభ నుండి నిష్క్రమించుట హిందువులకు ప్రయోజనకారి కాదని గట్టిగా

విశ్వసించి, కాంగ్రెస్ శాసన సభా పక్షమునుండి రాజీనామా నిచ్చి యుండెను.

స్వామీ శ్రద్ధానందునికి సమకాలికుడైన లాలాజీ, పాంచాల రాష్ట్రమున సర్వవిధాల స్వామీజీతో సమానస్థానము నాక్రమించెను. సంఘ సంస్కర్త, విద్యా సంస్కర్త, లాలాజి దయానంద ఆంగ్లో వేద కళాశాల అభివృద్ధికి ముఖ్యకారణ భూతుడైనాడు.

లాలాజి ఆర్య సంస్కృతి యందు, అపారమైన ఆదరాభి మానాలు కలిగిన విద్వాంసుడు. భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనము కావలెనని గాఢముగా వాంఛించి కృషి చేసిన మనీషి. పాంచాల రాష్ట్రములో ఆర్యసమాజానికి లజపత్ రాయ్ పెట్టనికోటగా నుండిరి. ఆర్య సంస్కృతి ప్రచారము కొరకు, ప్రబోధముకొరకు వారు తమ వాక్కును, కలమును వినియోగించియుండిరి.

మహనీయులనేకులకు తుది దశలో కష్టాలు తప్పలేదు. లాలాజి జీవితము గూడ ఇందుకు అపవాదము కాజాలదు. చివరి రోజులలో లాలాజీ జీవితము సుఖవంతముగా గడిచినట్లు కనిపించదు. మహాత్ములైన వారి నిర్యాణములు విషాదాంతమైన సంఘటనలు ప్రపంచ చరిత్రలో కనుపించుచున్నవి. ఇటువంటి మహనీయుల శ్రేణిలో లాలాజిని గూడ చేర్చవచ్చును. సంకుచిత దృష్టి దురభిమానాలు కలిగి, విద్వేషమునకు ప్రతినిధియైన ఒక ఘాతుకుని లాఠీదెబ్బ లాలాజి మరణమునకు కారణభూతమైనది. ఆ లాఠీ దెబ్బతిని రోగగ్రస్తుడై కొద్ది రోజులలో లాలాజి పరలోకగతులైనారు. తన యావజ్జీవితము భారత మాత సేవకొరకు అర్పించిన లాలాలజపత్ రాయ్ నిష్కళంకమైన జాతీయవాది; గొప్ప విద్వాంసుడు, మంచి రచయిత; వక్త; త్యాగ మూర్తి; ధన్యజీవి. ఈనాటి తరమునకు సర్వవిధాల మార్గదర్శకమైనది లాలాలజపత్ రాయ్ జీవితము.

(రేడియో ప్రసంగము 1959)

# మౌలానా అబుల్ కలాం ఆజాద్

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను తలచుకొన్నపుడు రాజఠీవి ఉట్టిపడు ఆ విగ్రహము, పాదుషాలను స్మరింపజేయు ఆ గంభీరమూర్తి మన మనోదర్పణములందు ప్రతిబింబించుచున్నవి. ఆ రాజఠీవి, ఆ గాంభీర్యము ఆయన బాహ్యస్వరూపమునకే కాక అంతరంగిక స్వరూపమునకును విలక్షణమైన ప్రత్యేకతలని చెప్పవచ్చును. శక్తివంతమైన ఆయన లేఖినీ విన్యాసము నందు, వచోవిలాసము నందు, యీ రెండు గుణములు విశిష్టముగా కనుపించుచుండును. దూషణ భూషణములకు రాగద్వేషములకు అతీతముగా కర్తవ్య నిర్వహణము గావించిన ఉదార చరితుడు మౌలానా సాహెబ్.

చండశాసనుడైన మౌలానా దయార్ద్రహృదయుడు. ఒకొక్క సారి ఆయన మాటలు దారుణాఖండల శస్త్రతుల్యములైనప్పటికిని, హృదయము మాత్రము నవ్యనవనీత సమానము. ఇస్లాం మత సంస్కృతులను గూర్చి మౌలానా సాహేబ్‌ది తుదిమాట. సకల ప్రపంచము లోని అరబ్బీ, ఫార్సీ విద్వాంసుల యందు ఆయనది అగ్రస్థానము. పదు నాలుగు సంవత్సరాల చిరుత ప్రాయముననే భారతదేశములో లభించ గల అరబ్బీ వాఙ్మయమున పారంగతుడైన మౌలానా, ఈజిప్టు వెళ్ళి *Al Azhar* విశ్వవిద్యాలయమున విద్యాభ్యాసమును రెండు సంవత్సరా లలో ముగించిన కుశాగ్రబుద్ధి; తరువాత కొన్ని అయిరోపా భాషలను కూడ నేర్చుకొని విశ్వసంస్కృతిని సంపూర్ణముగా ఆకళించు కొనినాడు.

ఉర్దూ వాఙ్మయమున రచయితగా మౌలానా సాహెబ్‌కు మహోన్నత స్థానము కలదు. ఖురాన్‌కు ఆయన వ్రాసిన భాష్యము. తజ్కిరా అను గ్రంథరూపమున ఆయన ప్రకటించిన రచనలు సర్వదా

నిలిచి యుండగలవు. మౌలానా శైలి, ఆయన వ్యక్తిత్వమువలె ప్రత్యేకమైనది. కలకత్తా నుండి 'ఆల్‌హిలాల్' వారపత్రికను ప్రకటించి ఖిలాఫత్ ఉద్యమానికి, భారత జాతీయోద్యమానికి, హిందూ ముస్లిం ఐక్యతకు పట్టుగొమ్మగా నిలిచిన మౌలానా, తరువాత భారత జాతీయ కాంగ్రెసుకు ముమ్మారు మూర్ధాభిషిక్తులై, దేశస్వాతంత్ర్యోద్యమానికి విజయవంతముగా నాయకత్వము వహించినారు. జాన్‌గంథర్ మౌలానా సాహెబ్‌ను భారత జాతీయ కాంగ్రెస్ మేధానిధిగా వర్ణించినారు. మౌలానా సంపాదకీయాలు, తెలుగువారికిముట్నూరి కృష్ణారావుగారి సంపాదకీయాలను జ్ఞప్తికి తెచ్చుచుండును. క్రిప్సురాయబార తరుణమున ఇంగ్లండు మంత్రివర్గ ప్రతినిధులతో సంప్రదింపుల సందర్భమున మౌలానా ప్రదర్శించిన రాజనీతి కౌశల్యము నిరుపమానమైనది. అత్యంత కఠినమైన అగ్ని పరీక్షలలో అమోఘ విజయాలను సాధించిన నిష్కళంక జాతీయవాది మౌలానా సాహెబ్.

మౌలానాలోని రాజనీతి. గాంభీర్యములు మోతీలాల్‌ను జ్ఞప్తి చేయుచుండును; త్యాగము ఔదార్యము చిత్తరంజనదాస్‌ను తలపింప జేయును; ప్రాచ్యవిజ్ఞానము; పారమార్థిక చింతనము లోకమాన్యుని స్మరింపజేయును; మేరు సమాన ధైర్యము, పట్టుదలతో కూడిన సాహసము సర్దార్ పటేల్‌ను స్మృతికి తెచ్చుచున్నవి. కేసరియను బిరుదము. లజపత్‌రాయ్ యందువలె, మౌలానా యందు కూడ సంపూర్ణముగా సార్థకము. జవాహర్లాల్ యందువలె మౌలానాలో సాహిత్య విజ్ఞానముల సరస, సమన్వయము గోచరించుచుండును. ఈ మహనీయులందరివలె, మౌలానా గూడ జాతిపిత గాంధీమహాత్మునిచే ప్రభావితులైన శేముషీ సింధువు, త్యాగమూర్తి.

ఆజన్మాంతము మౌలానా వ్యక్తిత్వము నందువలె,అవసాన సమయమున గూడ ఒక విలక్షణమైన ప్రత్యేకత గోచరించుచున్నది. గీతా శ్లోకములను పఠించుచు పరమపదించిన లోకమాన్యునివలె, వైద్యుల

పరిచర్యలను ఔషధాలను నిషేధించి, ''నన్ను అల్లాకు వదిలివేయుము''ని చెప్పుచు, పరమేశ్వర ధ్యానమున లగ్నమైన హృదయముతో మౌలానా సాహెబ్ పరలోకగతుడైనాడు. దైన్యములేని జీవనము గడిపినమౌలానా ఆయాసము లేని మరణమునే పొందినారని చెప్పవచ్చును. "బలము నీవ నాకు, భక్తుండ నీ యెడ; ఆలుబిడ్డలేని యట్టివాడ; కావునన్ను అధిక, కారుణ్యమున; ఇమ్మనుజ్ఞ కమల దళ మనోజ్ఞ నయన'' యని యోగీశ్వరుడైన శ్రీకృష్ణమూర్తిని స్మరించి కనులు మూసికొనిన భీష్ముని నిర్యాణమును, మౌలానా అవసానము జ్ఞప్తికి తెచ్చుచున్నది.

(రేడియో ప్రసంగము - మౌలానాసాహెబ్ కీర్తిశేషులైనప్పుడు)

—(•)—

# కళ

మానవునికి సౌందర్య సంవీక్షణమువలనకలుగు ఆనందము ప్రకృతి సిద్ధమైనది. నిండు పున్నమనాడు పడమటి కాంత యొడిలోన పవళించి యుండు నెలబాలుని తిలకించినప్పుడు కాని, ఆకులు రాలక పూలు వాడని ఆరామమందు "చిలుకపోటులచేత జెరగిన సహకార ఫలముల" నుండి స్రవియించు పచ్చి తేనెను పరికించినప్పుడు కాని. మరియెట్టి మనోహర దృశ్యమును గాంచినప్పుడు కాని, మన హృదయములందు సౌందర్య సాక్షాత్కార మగుచుండును. విద్యాధికులకు విజ్ఞానులకు, విద్యావిహీనులకు, అజ్ఞానులకు, శ్రీమంతులకు. నిరుపేదలకు స్త్రీలకు పురుషులకు, బాలురకు అందరికిని కొలదియో, గొప్పయో సౌందర్య రక్తి యుండితీరును. మానవునకు సౌందర్యము నందున్న సహజమగు ప్రేమయే అతడు లలితకళల నారాధించుటకు ప్రోత్సాహ కారణమని చెప్పవచ్చును. మానవుని హృదయమున యెచ్చటనో దాగియున్న సృష్టిశక్తి పైకుబికి వచ్చి ఏదో యొకరూపముదాల్చుటయే లలితకళ ఆవిర్భావమని చెప్పవచ్చును. లలితకళలు సౌందర్యపు భావచిత్రములు కావున కళ స్వభావమును గుర్తించినప్పుడే మనము సౌందర్య దర్శనము చేయగలుగుదుము.

ప్రపంచము నందలి ఏ గొప్పకళనైన తిలకించుడు; అది ఒక ప్రత్యేక వ్యక్తి నిర్మాణమని విశదమగును. అట్లగుటచే ఒక కావ్యము గాని ఒక చిత్రము కాని ఒక భంగిమకాని సరిగా పూర్వ సంప్రదాయ మునే అనుసరించి, ఇదివరకున్న వాని వలెనే యుండి, ఒకే యంత్రము నుండి తయారుచేసిన నాణెములవలె నుండుట సంభవముకాదు—ఒక క్రొత్తభావము, ఒక క్రొత్త జీవకళ, ఒక క్రొత్తచైతన్యము కలిగినదే నిక్కమగు కళయని చెప్పవలసియుండును. పాతపాటలే తిరిగి పాడిన రోతగా నుండదా! ఉద్రేకము కవిత్వమునకే కాదు—సౌందర్య ప్రధాన

ములగు కళలన్నింటికిని జన్మస్థానమని చెప్పవచ్చును. కవివలె చిత్రకారుడు కూడ భావనావీధులందలి తన యనుభవములను వర్ణముల రూపమున ప్రదర్శించుచుండును.

లలితకళల లక్షణములను వివరించుచు సిద్ధాంతములను ప్రతిపాదించు గ్రంథను లనేకము కలవు. కాని ఈ సిద్ధాంతములను మాత్రమే నమిలి మ్రింగుట వలన యెవరికిని నవనవోన్మేష శాలినియగు ప్రజ్ఞ లభింపజాలదు. సహజ ప్రతిభ పరిపూర్ణముగా అభివృద్ధి నొందుటకు దోహదము మాత్రమే కావించునవి లక్షణ గ్రంథములు-సంప్రదాయము. కళను సమకాలిక సాంఘిక పరస్థితులతో సమన్వయించి ఆ రెండింటికి సమరసభావము కలిగించునది మాత్రమే! ఒకకాలమునఅత్యుత్తమముగా పరిగణింపబడినసంప్రదాయముమరియొక కాలమునపనికిరాకపోవచ్చును. కావుననే కాలముతోపాటు సంప్రదాయములు మారి జాతీయయ పునర్వికాసము జరుగుచుండును. కళా సౌందర్యమును ప్రతిపాదించుయే యొక్క సిద్ధాంతమునుగాని మనము ఆ విషయమున తుదిమాటగా అంగీకరించుట పొసగదు. సర్వకాల సర్వావస్థలయందు కళాసౌందర్యమును ప్రతిపాదించు ఆదర్శమిది యొక్కటేయని యెవ్వరును వ్రేలెత్తి చూపజాలరు. అట్లయినచో అభివృద్ధియను మాటయే మన శబ్దకోశమునుండి అంతరించవలసి యుండును. ఒక కాలమునందు ఒక గొప్ప కళోపాసకుడు నిర్మించిన కళాశకలమును అచ్చుగ్రుద్దినట్లు మరల మనము తయారు చేయజాలము. అట్లు చేయుట కళకాదు; చేసినను అది యొక నమూనా మాత్రమే యగును. అందు కళాసౌందర్యము లోపించితీరును. ప్రత్యేక వ్యక్తిత్వము వైలక్షణ్యము కలిగిన నిర్మాణమే కళోపాసకుల ఆదర్శము. బింబములను ప్రతిబింబములను తయారు చేయుట కళోపాసకుల పనికాదు.

కవిత్వము లలితకళలలో ప్రధాన స్థానము నాక్రమించును—కవిత్వమునకువలె ఇతర లలితకళలకును కారణభూతములగు విషయ

ములు రెండు—మొదటిది భావచిత్రము, రెండవది భావచిత్రములను హృదయ ఫలకములందు ప్రదర్శించు మనోవికారము. కావ్య ప్రపంచ మున వ్యక్తుల భావ చిత్రములు, వివిధ వస్తువుల దృశ్యముల భావచిత్ర ములు, మానవుని సుఖదుఃఖముల భావచిత్రములు, మున్నగునవి ప్రద ర్శితము లగుచున్నవి. ఈ భావ చిత్రముల వెనుక కవి యొక్కనివే కాదు. పాఠకుల మనోవికారములు కూడ గోచరించు చుండును. దుస్సహ దుఃఖానుభవములు, కంటికి నీరుదెచ్చి హృదయ మును కరగించు కరుణ రస ప్రపూర్ణములగు ఘట్టములు, పరమాత్మతో లీనమగుటకు అంతరాత్మపడు ఆవేదన మున్నగు మనోవికారములతో పాటు "దాటిపోయిన యుగముల" నాటి చరిత్ర యొక్క భావచిత్రము లను లలిత కళలు మనయెదుట ప్రదర్శించుచున్నవి. కార్యకారణ క్రమ మున వివరింపరాని అనిర్వచనీయ మాధుర్యము సౌందర్యానుభూతి కవిత్వము మన కొసగు చున్నది. భావచిత్రములను, మనోవికారములను కళా ప్రపంచమున వేరుపరచుటకు వీలులేదు. ఈ రెండు శక్తుల సరస సమ్మేళనమే కళా సౌందర్యము. ఈ రెండు శక్తులుగాక కళా ప్రపంచ మున అనేక యితర విషయములు కూడ సౌందర్య దర్శనమునకు సహా కారులు కావచ్చును. ఈ సందర్భమున కళావస్తువు చారిత్రకముగా గాని ఇతరత్రముగా గాని యథార్థము కావలసిన యవసరములేదని మనవి చేయుట ఆవశ్యకము.

ఒక ఛాయా చిత్రమును పరికించుడు-అది ప్రపంచమునందలి యొక మానవుని యొక్కగాని వస్తువుయొక్కగాని ప్రతిబింబము. ఈ ప్రతిబింబము కళాశకలము గాజాలదు. కేవలము వివిధవర్ణముల విచిత్ర సమ్మేళనము కళ కాజాలదు. అట్లే వివిధ ధ్వనుల సమ్మే ళణము కూడ సంగీతము కాజాలదు. అదియే సంగీతమైనచో గాయ కుడు కానివాడుకూడసంగీతమును రచింపవచ్చును. తుట్టతుదకు వివిధ ధ్వనులను సాధ్యమైనన్ని విధములుగా సమ్మేళనము జేసిన తరు

వాత, వివిధ శబ్దములను సాధ్యమైనన్ని విధములుగా సమ్మేళనము జేసిన తరువాత సంగీతము. కవిత్వము ఈ ప్రపంచమునుండి శాశ్వతముగా నిష్క్రమించవలసి వచ్చును. కావున బాహ్యస్వరూపమునుగాంచి. శబ్దవర్ణ ధ్వనుల సమ్మేళనము గాంచి; అదియే నిక్కమగు కళయని భ్రమించుట ప్రమాదము. కళా సౌందర్యమును ప్రతిపాదించు భావచిత్రములు, మనో వికారములు లేనిది అది కళ యెన్నటికిని కాజాలదు. కవితా రసపిపాసువగు పాఠకుడొక గ్రంథమును పఠించునపుడు శబ్దజాలము యొక్క ఇంద్రజాలముతో సంతృప్తిపడక అందలి కావ్య సౌందర్యమును తనివిదీర యనుభవించును. మేధాసంపద. యుక్తివాదము, వివిధ విషయ పరిజ్ఞానము ప్రపంచమునకు పరమోపకార మొనరించుట నిస్సంశయమే. కాని రసపిపాసునకు సౌందర్య సాక్షాత్కారము కలిగించుశక్తి మాత్రము వానికి లేదు." హృదయ శక్తిలేని మేధాశక్తి, సౌందర్యములేని విజ్ఞానము, భార్యలేని భర్త సంసారము వంటివి. ఈ సత్యమును కళా సౌందర్యమును తృణీకరించు శుష్క హృదయులు గ్రహింపవలెను.

కళ తత్వ శాస్త్రము కాదు; కళ చరిత్రకాదు; కళ భౌతిక శాస్త్రము కాదు. గాలిలో మేడలు కట్టుట కళగాదు. భౌతిక శాస్త్ర తత్వశాస్త్రములవలె యుక్తి వాదముపై ఆధారపడకున్నను, చరిత్ర వలె గతకాలములో జరిగిన సంగతులను గ్రహించునది కాకపోయినను, కళ యందుకూడ ఒక ప్రత్యేకమగు క్రమము, విలక్షణమగు సత్యము గోచరించుచుండును. అస్పష్టమై, క్రమబద్ధముగాక చెల్లాచెదరై యున్న మనోవికారములకు విశిష్టము క్రమబద్ధమునగు స్వరూపము నొసంగుటయే కళ ప్రత్యేకత; ఆకాశ హార్మ్యములను నిర్మించునది గాక ప్రతిభావంతమగు సృష్టిని గావించునది కళ యని మనము గ్రహింప వలెను.

మన యందరికిని మనోవికారములు కలుగుచుండును. మనము సంతోషించెదము; దుఃఖించెదము; కోపించెదము; దయార్ద్రహృదయుల మగుదుము. ఆ సందర్భములందు అప్రయత్నముగా మననోటి నుండి శబ్దజాలము ఉబికి వచ్చును. కాని యీ మాటలు కవిత్వము కాజాలవు. 'వియగువాడు తన మనోవికారములను ఏకముఖము గావించి క్రమ బద్ధముగా వ్యక్తీకరించునప్పుడే అది కవిత్వమగును; అందుసౌందర్యము ప్రతిఫలించును. కాని నోటికి వచ్చిన మాటలన్నియు కవిత్వము కాజాలవు. ప్రతిభా శాలియగు వ్యక్తిచే ప్రశాంత సమయమున సంస్మరణము నొంది వ్యక్తమైన భావములే కళాసౌందర్యానకు ఆటపట్టులని యొక విమర్శకుని అభిప్రాయము. కావుననే మన యందలి హృదయములందు కలుగు మనోవికారములు తాత్కాలికములే. కవిత్వము నందలి మనో వికారములు విశ్వజనీనములై, యొప్పుచుండును. అనేకులు పుత్ర శోకము ననుభవించుచున్నారు. ఆ సందర్భములందు మనోవికారము లెన్నియో రీతుల ప్రదర్శించుచున్నారు. ఈ ప్రదర్శనములు, ఈ ప్రలా పములు తాత్కాలికములు మాత్రమే. కాని కళయందలి శోకమట్టిది కాదు; దానికొక శాశ్వతత్వము కలదు. దీనినే కళకు సంబంధించిన విశ్వజనీత యని చెప్పవచ్చును కావుననే కవి వ్యక్తీకరించిన శోకము, సంతోషము, కరుణ, వేడుక, వేదనలు ప్రత్యేక వ్యక్తిత్వము కలిగి విశ్వజనీనములై యొప్పుచున్నవి. ఒకేయొక భావమును ప్రదర్శించు కళ కొంత వెగటు కలిగించవచ్చును. వైవిధ్యము కళ అందమును ద్విగు ణీకృత మొనరించును. కావుననే కాబోలు మన వారు కావ్యమునందు అష్టాదశ వర్ణనాదులుండవలెనని విధించి కావ్యవస్తువును విశాల పరచినారు.

' కళ ముఖ్య కర్తవ్యము ఉపదేశము. ప్రచారము అనుశాసన ములు కావు. ఉపదేశము, ప్రచారము, అనుశాసనము అంతర్వాహిను లుగా నుండవచ్చును. కవిత్వమును కాంతా సమ్మితముగా గ్రహించిన

మన ప్రాచీనులు యీ సత్యమును చక్కగా విశదీకరించినారు. మానవ జీవిత విమర్శనమే కళకు ముఖ్య ప్రతిపాదకమగు విషయము.

కళా సౌందర్యమునకు కేంద్రస్థాన మేదియను ప్రశ్న స్వాభావికముగా కలుగుచున్నది. ఒక చక్కని అజంతా చిత్తరువును తిలకింపుడు- ఆ చిత్రము ఒక్కొక్క మానవునియందు అతని సంస్కృతి ననుసరించి ఒక్కొక్క విధముగా సౌందర్యానుభూతి కలిగించును. కొందరిని రవి వర్మపటములే యెక్కువగా ఆకర్షించుట జూచుచున్నాము. కావున కళా సౌందర్యమునకు ఆటపట్టులు మనహృదయములేయని చెప్పుట మిక్కిలి సమంజసము.

పటమునందలి వర్ణములు, రేఖలు మున్నగు సాధన సామగ్రి మాత్రమే కళాసౌందర్యమున కాటపట్టులు గావు. అర్థశాస్త్ర ప్రపంచమున ఇవి యుపయోగకరములగు వస్తువులు-ఇవి కావు-అని స్పష్టముగ నిర్దేశించలేని విధముగనే కళా ప్రపంచమున గూడ "ఇవి సుందరమగు వస్తువులని" మనమొక కచ్చిత నిర్ణయము చేయజాలము. అర్థశాస్త్రమున అవసరము. సరఫరా మున్నగు విషయాలు వస్తువుల యుపయోగమును నిర్ణయించిన విధముగనే రసికుల మనోవృత్తి కళా ప్రపంచమున సౌందర్య నిర్ణయము గావించుచుండును.

మనము కావ్యములను శృంగార కావ్యములు, వీర కావ్యములు అని వివిధములుగా విభజించుచున్నాము. ఇది మన సౌలభ్యమునకై చేసికొనిన విభజనమే కాని కావ్యసౌందర్యమును కొలిచి చూపు కొలబద్దము కాదు. శాస్త్ర ప్రకారముగా ఒక కావ్యము సర్వలక్షణ సమన్వితమై యుండవచ్చును; కాని సౌందర్యము సంపూర్ణముగా లోపించవచ్చును. వ్యాకరణము, అలంకార శాస్త్రము, సాహిత్య శాస్త్రము, మున్నగువి రచనా సూత్రములను బోధించి భాషా సంప్రదాయములను తెలుపుటకు సహకారము చేయును గాని కళ అంతరాత్మను చూపించజాలవు, కళా సౌందర్యమునకు పరమ ప్రమాణములు రసికుల హృదయములు మాత్రమే.

(1945 నల్లగొండ సారస్వత పరిషత్తు వార్షిక సమావేశములో చదివిన ప్రసంగము)

# మన కళా సంపద సాహిత్యము

భారతదేశానికి మహోజ్వలమైన కళాసంపదకలదు. ఈ కళా సంపద యీనాటిదికాదు. దానికి అనేక సహస్రాబ్దాల వయస్సు కలదు. ప్రపంచములోని అనేక దేశాలు, అత్యధిగ భాగము, విజ్ఞాన జగతిలో అడుగు పెట్టక ముందు, ప్రపంచ నాగరికత శైశవదశలో నున్నప్పుడే, భారతదేశము నందు కళలు, శిల్పము, విజ్ఞానము, సాహిత్యము జగజ్జేగీయమానముగా అభివృద్ధిచెంది, మానవసభ్యతకు, సంస్కృతికి శాశ్వతమైన పెన్నిధిగా ప్రకాశించినవి. ఈ కళాసంపదలో సాహిత్యమునకు విశిష్టస్థానము కలదు. భారతీయ సాహిత్యము ప్రపంచ వాఙ్మయమునకు తలమానికమై, సత్యమై, శివమై, సుందరమై, ప్రకాశించుచున్నది.

భాతరదేశము బహు భాషలకు పుట్టినిల్లు. ఈ భాషలన్నింటికిని, ఉదాత్తమైన వాఙ్మయము కలదు. భారతదేశములోని భాషలు ఒక మహావృక్షము యొక్క శాఖోపశాఖలని చెప్పవచ్చును. సనాతనమైన యీ వృక్షపు కొమ్మలు నేటికిని, పూలతో, పండ్లతో, కనుల పండువు గావించు చున్నవి. "జనని సమస్త భాషలకు సంస్కృతభాష" యని ఆర్యోక్తి. స్థూల దృష్టికి, విభిన్నముగా కన్పట్టు యీ భాషలయందు, ఈ వాఙ్మయములందు కొంచెము పరిశీలించినచో యేకత్వము స్పష్టముగా గోచరించు చున్నది. భారత జాతీయతతోపాటు సంస్కృత భాష ఈ భిన్న వాఙ్మయముల యేకత్వమునకు మూల ప్రాతిపదిక అదియే మన సాహిత్యసంపద ప్రత్యేక ఉత్కృష్టత. మన దేశములోని వివిధ సారస్వతములను ఒకచోట కూర్చినచో అది యొక మంచి ముత్యాలహారముగా శోభిల్లగలదు. ఈ ముత్యాలహారమును కూర్చు సూత్రమే భారత జాతీయత, భారతీయ సంస్కృతి; సంస్కృత భాష. సంస్కృత మహా సముద్రమునుండి మనదేశ భాషలలో ప్రతియొక భాషయు, కొద్దియో గొప్పయో జలమును కొని తెచ్చుకొనుట

జరిగినది. మనదేశీయ భాషల సాహిత్య వికాసము ఈ సత్యమును ఋజువు చేయుచున్నది.

సంస్కృత, ప్రాకృత, దేశీయభాషావాఙ్మయముల సంపదను గూర్చి ప్రస్తావించుటకు ముందు మన భిన్న భాషా వాఙ్మయాల ఆదర్శమును గూర్చి రెండు మాటలు చెప్పుట అత్యావసరము. ఈ ఆదర్శమును దేశములోని అన్ని భాషలకును సమానమైనదని నిస్సందేహముగా చెప్పవచ్చును. ఈ ఆదర్శమును గూర్చి మనదేశములో చర్చలు బహుళముగా జరిగినవి. అలంకారికులు వివిధ సిద్ధాంతములను ప్రతిపాదించి యున్నారు. భరత, భామహ, దండి, వామన, ఆనంద వర్ధన, అభినవగుప్త, కుంతక, లొల్లట, మమ్మట, శంకుక, మహిమ భట్ట, హేమచంద్ర, విశ్వనాథ, విద్యానాథ సర్వజ్ఞ, సింగన, అప్పయదీక్షిత జగన్నాథాదులు, సాహిత్య శాస్త్రమును మథించి, ఉద్గ్రంథములను రచించి, సిద్ధాంత ప్రతిపాదనము గావించి యున్నారు. ఈ గ్రంథాలను ఈ సిద్ధాంతాలను, యీ చర్చలను, పరిశీలించినప్పుడు, విశ్వశ్రేయస్సు మన వాఙ్మయముల పరమలక్ష్యమని స్పష్టము కాగలదు. జగత్కల్యాణ మను మహోన్నతాదర్శముచే ప్రభావితులైన మహనీయులు మన వాఙ్మయ స్రష్టలు. ఋషికానివాడు కావ్యము వ్రాయజాలడని మన వారు ఉద్ఘాటించినారు. మన సాహిత్యసంపద ఉదాత్తతకు ఈ ఉద్ఘాటన మంచి నిదర్శనము.

సకల భాషలకు జననియైన సంస్కృతభాష మహాసముద్రము అగాధమైనది. అందలి వాఙ్మయము మహోన్నతమైనది. మన వేదములు, పురాణములు విజ్ఞానభాండారములు, సాహిత్యనిక్షేపములు. వ్యాస వాల్మీకులు ఆచంద్ర తారార్కము ప్రపంచ వాఙ్మయమునకు నాయక మణులైన కవీంద్రులు, ఋషీంద్రులు కాళిదాసాదుల రచనల చేత విశ్వ సాహిత్యము నందు సంస్కృతము అగ్రస్థానము నలంకరించుచున్నది. సంస్కృతములో లేని వాఙ్మయ విశేషములేదు.

మన దేశీయ వాఙ్మయము లన్నింటి మీద సంస్కృతము తన ముద్ర వేసినది.

భారత వాఙ్మయరంగమున ప్రాకృత భాష మహావీర గౌతమ బుద్ధుల కాలమున ప్రవేశించినది. మొట్టమొదట ఈ భాషకు అర్ధమాగధి యని పేరు. ఈ భాషయే మానవుల మూల భాషయని బౌద్ధులు అభిప్రాయ పడుచున్నారు. బౌద్ధ వాఙ్మయానికి ఈ ప్రాకృత భాష ఆలవాలమైనది బుద్ధుని వచనాల రచన ఈ భాషలోనే జరిగినది. ధమ్మపదము ప్రాకృత భాషా గ్రంథము. గౌతమ బుద్ధుని వచనాలను క్రోడీకరించిన గ్రంథజాలము భాషకు పాలీ యను పేరు తరువాత కలిగినదని కొందరి అభిప్రాయమై యున్నది. పాలీ ప్రత్యేక భాష కాదని కొందరి అభిప్రాయము. ఈ పాలీ భాషయను పేరు పదవ శతాబ్దము తరువాత కలిగినట్లు చెప్పబడుచున్నది. పాలీ సాహిత్యము మన దేశ సాహిత్య సంపదలో ప్రత్యేకముగా పేర్కొన దగినది.

మన దేశీయ భాషలు కూడ అనేక శతాబ్దాల వయసు కలిగి, అపారమైన ఉత్తమ వాఙ్మయమునకు ఆటపట్టులుగా నున్నవి. ఉత్తర దేశమున హిందీ, మైథిలీ, బీహారి భాషలు ముఖ్యమైనవి. ఈ భాషలలో వాఙ్మయము పన్నెండవ శతాబ్దములో ప్రారంభమైనది. అనగా కొన్ని దక్షిణ దేశ భాషలు వీనికన్న ప్రాచీనమైన వన్నమాట. మహమ్మదీయ పరిపాలన వలన, ఈ భాషల వాఙ్మయములకు ఫార్సీభాషతో సంబంధము కలిగి తత్ప్రభావము వీనిపైన కనబడుచున్నది. ఇటువంటి ప్రభావము కొంచెము ముందుగనో, వెనుకనో, మన దేశీయ భాషల యందన్నింటి మీద కనబడుచున్నది. ఫార్సీ, అరబ్బీ శబ్దజాలము కొంత ఈ భాషలలో ప్రవేశించినది.

ఉత్తర దేశమున పై భాషలకు ఫార్సీ సంపర్కమువలన, హిందీ భాష ఉద్భవించినది. ఈనాడు మనదేశములో అత్యధిక సంఖ్యాకులు అర్థము చేసుకొనగలిగిన భాష హిందీ భాషయే. ఇందుకు చారిత్రక

కారణాలు కలవు. హిందీ భాషలో మంచి వాఙ్మయము కలదు. నానక్, కబీర్ తులసీదాసుల నామములు యావద్భారతానికి పరిచితమైనవి. ఈ కవీశ్వరులు వ్రాసిన వాఙ్మయము హిందీ భాషకు అమూల్యాలంకారమైన సాహిత్య సంపద, హిందీ భాషలో మహమ్మద్ జైసీ అను విద్వాంసుడు వ్రాసిన పద్మావతి యను కావ్యము సుప్రసిద్ధమైనది. హిందీకి ఉర్దూ భాష తోబుట్టువు. 17, 18 శతాబ్దాలలో బహమనీ రాజుల ఆదరణతో ఈ ఉర్దూభాష అభివృద్ధి పొందినది. తరువాత ఈ భాష మన దేశములో వ్యాప్తి చెందినది ఢిల్లీ, లక్నో, లాహోర్, హైద్రాబాదు నగరాలు ఉర్దూ భాషాభివృద్ధికి ముఖ్య కేంద్రములైనవి.

మన దేశ సాహిత్యమున వంగ వాఙ్మయము ప్రత్యేకమైనది. ఈ వాఙ్మయము పదునొకండవ శతాబ్దమున బౌద్ధుల నుండి ప్రారంభమైనట్లు కొందరి ఊహ. వంగభాషలో పదునొకండు నుండి పదునెనిమిదవ శతాబ్దము వరకు అనగా ఏడునూర్ల సంవత్సరాల కాలమున, బౌద్ధ శాక్తేయ, వైష్ణవ మత గ్రంథాలు కొన్ని వచ్చినవి. ఈ కాలమున మనదేశమందలి వాఙ్మయ సంపదమీద మతప్రభావము సర్వసాధారణముగా కనవచ్చుచున్నది. పదునెనిమిదవ శతాబ్దము తరువాత వంగ వాఙ్మయమున నవీన యుగము ప్రారంభమైనది. రామమోహనరాయ్ బంకించంద్రచటర్జీ, ద్విజేంద్రలాల్ రాయ్, మైకేల్ మధుసూదనదత్తు, రవీంద్రనాథటాగోర్, శరశ్చంద్రచటర్జీ మొదలైన రచయితలు వంగ సాహిత్యమున క్రొత్త రీతులను ప్రవేశపెట్టి, ఆధునిక యుగమునకు మార్గదర్శకులైనారు.

గుజరాతీభాషలో మనకు గ్రంథరచన పదునైదవ శతాబ్దము నుండి కనిపించుచున్నది. వల్లభాచార్యుల వైష్ణవము ప్రభావము గుజరాతీ వాఙ్మయము మీద కలదు. కీర్తన సాహిత్యము మీద ఈ విధమైన ప్రభావము స్పష్టముగా కనుపించుచున్నది. గుజరాతీ సాహిత్యమును అభివృద్ధి గావించిన వారిలో జైనులకు, పారసీకులకు ముఖ్యస్థానము

కలదు. శ్రీ కె. యం. మున్షీ ప్రభృతులు నవీన గుజరాతి వాఙ్మయమున పేర్కొనదగినవారు.

అస్సామీ భాషలో మొట్టమొదటి గ్రంథము బురాంజీ. ఇది చారిత్రక గ్రంథము. అస్సామీలో శాక్తేయ, వైష్ణవ, బౌద్ధమతస్థులు వాఙ్మయ నిర్మాణము కావించిరి. ఆధునిక అస్సామీ వాఙ్మయముమీద వంగ వాఙ్మయ ప్రభావము కనుపించుచున్నది.

మహారాష్ట్ర భాషలో వాఙ్మయము పన్నెండవ శతాబ్దము నుండి కనుపించుచున్నది. విజ్ఞానేశ్వరీయ గ్రంథకర్తయైన విజ్ఞానేశ్వరాది మహానుభావ పంథా, అనుయాయులు మహారాష్ట్రములో తొలిగ్రంథ రచన గావించిరి. ఈ భాషలో మోడీ లిపిని వాడుకలోనికి తీసికొని వచ్చిన విద్వాంసుడు హేమాద్రి పండితుడు. ఈ భాషలో భక్తిపంథా అనుయాయులైన నామదేవ్, తుకారామ్, రామదాసుల రచనలు తరువాత వెలసినవి. ఈ ముగ్గురి నామములు సకల భారతమునకు పరిచితములు. మహారాష్ట్ర సామ్రాజ్య విస్తరణ మహారాష్ట్ర వాఙ్మయములో నూతన మార్గాలను ప్రోత్సహించినది. ఈ నూతన మార్గాలలో బఖేరులు, చరిత్రలు, పేర్కొనదగినవి. ఈ వాఙ్మయమున ఆధునిక యుగము 19వ శతాబ్దమున ఆరంభమైనది. బాలగంగాధర్ తిలక్, కేల్కార్, సవర్కర్ మొదలైన విజ్ఞానులు ఆధునిక వాఙ్మయమును అభివృద్ధి గావించి మహారాష్ట్ర సరస్వతిని నూతన ఆభరణాలతో అలంకరించిరి.

దాక్షిణాత్య భాషలలో తమిళము చాల ప్రాచీనమైనది. ఈ భాషలో వాఙ్మయము రెండవ శతాబ్దముననే ప్రారంభమైనది. ఈభాషలో పేర్కొనదగిన ఆదిగ్రంథాలు మణిమేఖల, శిలప్పధికారము మొదలైనవి. ఈ గ్రంథనామములు సంస్కృత భాషాప్రభావమును సూచించుచున్నవి. తొల్కాప్పియమ్ (తొలికావ్యము) తమిళ భాషలో ప్రసిద్ధమైన ఆది

గ్రంథాలలో నొకటి. తమిళ వాఙ్మయమునందు ఆరవ శతాబ్దమున శైవ వైష్ణవ భక్తుల రచనలు విరివిగా కనుపించుచున్నవి. పన్నెండవ శతాబ్దమున కంబరామాయణ రచన జరిగినది. ఇది సకల భారత ప్రసిద్ధి పొందిన గ్రంథము. పదునారవ శతాబ్దమున జెసూట్ పాదరీలు క్రైస్తవ మత ప్రచార గ్రంథాలను రచించిరి. భారతదేశమునందలి ఇతర వాఙ్మయములలో వలె తమిళ సారస్వతమునగూడ నూతన యుగము ప్రారంభమైనది. ఈ యుగమున తమిళ సాహిత్య రంగమున దేదీప్యమానముగా ప్రకాశించు తార సుబ్రహ్మణ్య భారతి.

క్రీ. శ. అయిదు ఆరు శతాబ్దాలలో శాసనాల యందు ప్రాచీన కన్నడము మొట్టమొదటిసారి కనపడుచున్నది. కన్నడములోని మొట్ట మొదటి గ్రంథము 9వ శతాబ్దమునందలి కవిరాజమార్గము. ఇది లక్షణ గ్రంథము. అందుచేత కర్ణాటక భాషలో ఇంతకుముందు వాఙ్మయ గ్రంథాలు రచింపబడెనని నిస్సందేహముగా చెప్పవచ్చును. ఈ వాఙ్మయాభివృద్ధికి పనిచేసిన వారిలో జైనులు ప్రథములు; నృపతుంగుడు జైనుడు. కర్ణాటక సాహిత్యమున రత్నత్రయ మని ప్రసిద్ధిగాంచిన పంప, పొన్న, రన్నలు జైన వాఙ్మయ నిర్మాతలు. 11వ శతాబ్దమున రుద్రాభట్, దేవకవి మొదలైన బ్రాహ్మణ కవులు. పన్నెండవ శతాబ్దమున బసవేశ్వరుడు, చెన్నబసవడు, అక్కమహాదేవి మొదలైన వీరశైవ కవులు రచనలను గావించిరి. పదమూడవ శతాబ్దమున వైష్ణవ మత ప్రభావము ఈ సాహిత్యాభివృద్ధిమీద కనుపించుచున్నది. విజయనగర రాజుల కాలమున కర్ణాటక సాహిత్యమునకు గొప్ప పోషణ లభించినది. కన్నడ భారతమున యుద్ధపంచకము తరువాత భాగాలు, తిమ్మణ్ణ కవి పూర్తి గావించి, శ్రీకృష్ణరాయలకు అంకితము గావించినాడు. ఇతర దేశీయ భాషలవలె ఆధునిక యుగమున కర్ణాటక భాషలో వివిధ వాఙ్మయ వీధులందు నవ్య రచనలు జరిగినవి. ఈ యుగారంభకుడు కన్నడ పితామహుడు ఆలూరు వెంకట్రాయుడు.

తెలుగు భాష అతి తీయనిది; పాశ్చాత్యులచేత ప్రాచ్య ఇటాలియన్ అని ప్రశంసితమై ప్రసిద్ధి చెందినది. దేశభాషలందు తెలుగు లెస్స అని కృష్ణరాయలు ప్రశంసించినాడు. ఆంధ్రభాషలో ఏడవ శతాబ్దము నందలి మాలెపాడు, విప్పర్ల శాసనాదుల యందు పూర్తి తెలుగు రచన కనుపించుచున్నది. రేనాటి చోళుల శాసనాలలోని తెలుగు వచనము విశిష్టమైనది. తరువాత వేంగిచాళుక్యులు ఆంధ్రభాషాభివృద్ధికి కృషిచేసిరి.

పదునొకండవ శతాబ్దమున నన్నయార్యుడు భారత రచనకు శ్రీకారము చుట్టి మూడు పర్వాలు ముగించెను. పన్నెండవ శతాబ్దమున ప్రతాపరుద్రుని కాలమున శైవవైష్ణవ వాఙ్మయములు వ్యాప్తి నొందినవి. బసవపురాణ, రంగనాథ రామాయణాదులు ఈ తరగతిలో చేరినవి. పదమూడవ శతాబ్దమున కవిబ్రహ్మయైన తిక్కన శైవ వైష్ణవాలకు సమన్వయము గావించి అద్వైతము ప్రతిపాదించి తెలుగు భారతమును పూర్తి చేసెను. తరువాత నాచన సోముని హరివంశము వచ్చినది. ఇమ్మడి దేవరాయల, మరియు రెడ్డిరాజుల కాలమున ఎఱ్ఱన శ్రీనాథ బమ్మెర పోతనలు ఆంధ్ర సరస్వతికి అమూల్యాలంకారాలను సమకూర్చిరి. తరువాత శ్రీ వీరేశలింగం పంతులుగారు ఆంధ్రసాహితీ పునరుద్ధరణ ప్రవక్తలైనారు.

మళయాళ వాఙ్మయమునకు 15వ శతాబ్దము తరువాత రూపు రేఖలు దిద్దబడినవి. అనగా కొంచెము ఆలస్యముగా ఈ భాషలో వాఙ్మయ నిర్మాణము ప్రారంభ మైనదన్న మాట. ఆధునిక మళయాళ సారస్వతమును ప్రకాశింప జేసిన మహాకవి వల్లత్తోల్ సకల భారతము నందు కీర్తి గాంచిన సాహితీ పరుడు.

ఈ విధముగా మన దేశము నందు వివిధ భాషలలో వాఙ్మయము వ్యాప్తి నొందినది. ఈ వాఙ్మయమంతయును సకల భారత దేశ సాహిత్య సంపద.

(రేడియో ప్రసంగము 1957)

# వాఙ్మయము-జాతీయోద్యమ ప్రభావము

నిద్రాణమైయున్న జాతిని మేలుకొలుపుటకు సాహిత్యముకన్న మహత్తరమైన సాధనము మరొక్కటిలేదు. ఒక దేశము కష్టసుఖములు, మంచి చెడ్డలు, ఒడుదుడుకులు, ఆ వాఙ్మయములో ప్రతిబింబించుచుండును. ఒక జాతి చరిత్రను నిర్మించుటలో రచయితలకు గల ప్రభావము అమోఘమైనది. రూసోవాల్టేరుల రచనలు ఫ్రెంచి విప్లవమునకు కారణ భూతములైనవి.

టాల్‌స్టాయి, మాక్సింగోర్కి, డాస్టావొస్కి ప్రభృతులు రష్యన్ వాఙ్మయముద్వారా ఆదేశీయులలో అద్భుతమైన ప్రబోధము గలుగజేసిరి. శ్రీకృష్ణదేవరాయల నిర్యాణానంతరము శత్రురాజొకడు విజయనగరము మీద దండెత్తి వచ్చినప్పుడు అల్లసాని పెద్దన చెప్పిన పద్యము విని సిగ్గిల్లి ఆ రాజు తన సైన్యముతో పలాయనము చిత్తగించినాడట. ఖడ్గతిక్కన రణరంగమున వెన్నిచ్చి, యింటికి మరలి వచ్చినప్పుడు, ఆతని తల్లియు భార్యయు చెప్పిన చాటుపద్యములు ఆతనిలో పరాక్రమము విజృంభింపజేసి, యుద్ధభూమికి పంపినవట. ఇవన్నియు రచయితలకు, వాఙ్మయమునకు, దేశచరిత్రలను దిద్ది తీర్చుటలో గల ప్రభావమునకు స్థాలీపులాకముగా పేర్కొనిన నిదర్శనాలు మాత్రమే.

బ్రిటిష్ పరిపాలన క్రింద అణగిపోయిన భారతీయులను, తమ విద్యుక్తధర్మములను పాలింపవలసినదని ప్రబోధించి, మేలుకొలిపినది వాఙ్మయమే యని చెప్పిన అతిశయోక్తి కాజాలదు. ఒక యుద్యమము చక్కగా వ్యాప్తి చెందుటకు వాఙ్మయము మిక్కిలి శక్తివంతమైన సాధనమని స్వాతంత్ర్యోద్యమ చరిత్ర నిరూపించుచున్నది. ప్రబుద్ధ భారతమునకు తొలి వైతాళికులు రచయితలేనని చెప్పవలెను.

మన దేశీయులను మేలుకొలిపిన ప్రప్రథములలో స్వామీ దయానంద సరస్వతి ముఖ్యుడు. ఆయన వ్రాసిన సత్యార్థ ప్రకాశిక బహు భాషలలో పరివర్తితమై అసంఖ్యాకులగు ప్రజల హృదయాలలో జాతీయ ఆత్మగౌరవ బీజములను చల్లి, వారి చేత స్వదేశపు గొప్పదనమును గుర్తింపజేసినది. తమకొక ప్రత్యేక సంస్కృతి, భాస్వంతమైన చరిత్ర కలదనియు, అందుకనుగుణముగా తమ భవిష్యత్తును నిర్మించుకోవలెననియు సత్యార్థ ప్రకాశిక ప్రబోధించినది. రాజా రామమోహన రాయ్‌చే ప్రబోధితమైన వంగదేశమున, ఈశ్వరచంద్ర విద్యాసాగర ప్రభృతులు స్వదేశీయులలో తమ రచనలద్వారా చైతన్యమును కలుగజేసిరి.

తరువాత స్వామీ వివేకానందుని రచనలు.ఉపన్యాసములు ఆసేతు హిమాచల పర్యంత ప్రదేశమున ఉద్బోధము చైతన్యము కలుగజేసినవి. ముఖ్యముగా విదేశాలలో వివేకానందుని వలన భారతదేశ వ్యక్తిత్వము ప్రపంచమునకు బోధపడినది. పాశ్చాత్యదేశాలలో భారతీయులు అనాగరికులు, అడవి మనుష్యులను అపోహలను వివేకానందుడు తొలగించెను. వంగదేశములో క్రమక్రమముగా వ్యాపించుచున్న క్రీస్తుమత ప్రచారమును అరికట్టుటకు మరొకవంక నుండి బ్రహ్మసమాజము ఉద్భవించినది. రఘుపతి వేంకటరత్నమునాయుడు, వీరేశలింగము పంతులు గారలద్వారా ఆంధ్రదేశము మీద బ్రహ్మ సమాజ ప్రభావము ఎక్కువగా పడినదని చెప్పవచ్చును. కేశవ చంద్రసేనుని రచనలు వంగదేశమునందలి యువకులను ఊపి ఉత్సాహతరంగితులను జేసినవి. ఈవిధముగా దేశములో సంచలనము కలుగజేసి, ప్రజలలో చైతన్యము వ్యాపింపజేయుటకై ఉద్యమములు క్రమక్రమముగా తలయెత్తినవి. ఈయుద్యమాల ప్రచారము భారతదేశమునందలి వివిధ భాషలలో విరివిగా జరిగినది.

భారత రాజకీయాలలో డాక్టరు అనీబిసెంటు ప్రవేశము ఒక చరిత్రాత్మక ఘట్టము. ఆమె మన జాతీయోద్యమమునకు తొలిసారి విప్లవ దృక్పథము నిచ్చిన వీరనారీమణి, త్యాగశీల. హోంరూలు ఉద్యమము ద్వారా శాసనోల్లంఘనము జేసి చెరసాల కరిగి, ప్రజలలో చెర సాల భయము తొలగించిన గౌరవము డాక్టర్ అనీబిసెంటుకు చెందుచున్నది. భారతీయ సంస్కృతి, నాగరికతా విజ్ఞానములమీద ఆమెకు అత్యంత గౌరవము, భగవద్గీతను ఇంగ్లీషులోనికి అనువదించి, యువకులలో గీతా ప్రచారముగావించి, భారతీయులలో దేశాభిమానము ప్రచారము జేయుటకు ఆమె జేసిన సేవ అత్యంత ప్రశంసనీయమైనది; దివ్యజ్ఞాన సమాజ ఉద్యమముద్వారా, దివ్యజ్ఞాన సమాజ సంఘమును స్థాపించి ఉపన్యాసములతో భారతదేశమును ప్రబుద్ధముగావించినది, డాక్టర్ అనిబిసెంటు. విద్యాధికులు, విద్యార్థులు యువకులు డాక్టర్ అనీబిసెంటుకు అనుచరులుగా చేరిరి.

మరొక ప్రక్కనుండి మహారాష్ట్రములో వీరసావర్కర్ విప్లవ ధ్వజమును ఎగురవేసి. సోదరదేశీయులలో గన పుస్తకముల ద్వారా ప్రబోధము సాగించెను. మహారాష్ట్ర సామ్రాజ్య స్థాపన, ఉన్నతి. పతనములగూర్చి వివరించుచు.సావర్కర్ వ్రాసిన హిందూపథ్ పాదుపాహి గ్రంథము మహారాష్ట్రులలో స్వతంత్ర భావములను కలుగ జేసెను.

1857 సంవత్సరములో మన దేశమున బ్రిటీషు పరిపాలనమీద ప్రకటింపబడిన స్వాతంత్ర్య యుద్ధమును, బ్రిటీష్ ప్రభుత్వము కొందరు విద్రోహుల సహాయముతో అణచివేసి, దానిని ఒక తిరుగుబాటుగ మాత్రమే చిత్రించినది. వీర సావర్కర్ ఈ 1857 విప్లవమునుగూర్చి "భారత స్వాతంత్ర్య సమరము" అను ఉద్గ్రంథమును రచించెను. మహోజ్వలమగు ఈ గ్రంథమును బ్రిటీష్ ప్రభుత్వము నిషేధించినను రహస్యముగా ఎందరో యువకులు పఠించి, సోదర దేశీయులలో

స్వాతంత్రోద్యమ ప్రచారము చేసిరి. ఈ గ్రంథమును పఠించినారను నేరముమీద ఎందరో యువకులు నిర్బంధితులైనారు. "భారత స్వతంత్ర్యసమరము" దేశీయుల రక్తమును ఉడుకెత్తించి, స్వాతంత్ర్య కాంక్షలు చెలరేగజేసినది. లోకమాన్య బాలగంగాధర్ తిలక్, మరాఠా కేసరి పత్రికలలో సంపాదకీయాలద్వారా దేశములో ప్రబోధము సాగించెను. స్వాతంత్ర్య భావ గ్రపూర్ణములగు ఆ సంపాదకీయాలకు భీతిల్లి ఆయనను బ్రిటీషు ప్రభుత్వము నిర్బంధించినది. జెయిలును శ్రీ కృష్ణ జన్మస్థానమని భావించి, తిలక్ మహాశయుడు తన నిర్బంధకాలమున గీతా భాష్యమును కర్మయోగమను పేరుతో రచించెను. తిలక్ కర్మ యోగమునకు, భారతదేశములో విశాల వ్యాప్తి కలిగినది. కర్మ యోగము ద్వారా భారతీయులు తమ ధర్మమును గుర్తించి, పరదేశ ప్రభుత్వ దాస్య బంధములను తెంచివేయవలెననియు. శ్రీకృష్ణునిబోధల లోని రహస్య మిదయేననియు బాలగంగాధరుడు ప్రబోధించెను. తిలక్ కర్మయోగము భారతదేశములోని అన్ని భాషలయందు అనువదింప బడినది. స్వాతంత్ర్యము నా జన్మహక్కని బాలగంగాధరుడు గర్జించెను. గోఖలే, దాదాభాయి నౌరోజి, రమేశచంద్రదత్తులు ఆంగ్ల రచనలద్వారా, విద్యాధిక ప్రపంచమునకు, బ్రిటీష్ పరిపాలన వలన నష్టములను సకారణముగా నిరూపించి, స్వపరిపాలన ఆవశ్యకతను ఋజువు చేసిరి. కానినారి రచనలు ఆంగ్లవిద్యాధికులకు మాత్రమే ఉపకరించినవి. ఇవి ఇతర భాషలలోనికి అనువదింపబడలేదు.

మహారాష్ట్ర దేశమున లోకమాన్య బాలగంగాధర తిలక్‌తో పాటు తన కలమును జాతీయోద్యమ ప్రచారమునకు వినియోగించిన విద్వాంసుడు శ్రీ చింతామణి కేల్కర్. తిలక్ తరువాత కేసరి పత్రికకు సంపాదకుడుగా పనిజేసి ఆయన మహారాష్ట్ర దేశములో జాగృతిని కలిగించెను. మహారాష్ట్ర భాషలో జాతీయోద్యమ వ్యాప్తికి తోడ్ప

డిన రచయితలలో సానేగురూజీ ప్రముఖులు—ఈయన తన రచనలలో ప్రాచీన సంస్కృతిని, పురాణములను, భారతీయ సాంఘిక పద్ధతులను సామ్యవాద సూత్రములతో సమన్వయించినాడు — మామావరేర్కర్ తన లేఖినిద్వారా. మన విద్యాధికులను క్రైస్తవ మిషనరీల వలె దేశాభ్యుదయమునకై జీవితాలను అంకితము చేయవలెనని, ధర్మాదాయములను జాతీయము చేయవలెనని ప్రబోధించెను. ఈయన రచనలో హాస్యము చమత్కారము ఉట్టిపడుచుండును. మహారాష్ట్ర దేశములో ఖాండేకర్, హిందీలో ప్రేమ్‌చందులవలె, తెలుగులో చింతా దీక్షితులు చిన్న కథలద్వారా జాతీయోద్యమ ఘట్టములను చక్కగా చిత్రించిరి. నారాయణ సీతారాం ఫడ్కే సుప్రసిద్ధ నవలా రచయిత సమకాలీన సమస్యలు, యీయన నవలలకు యితివృత్తములు, తిలక్ కాలమునందలి రాజకీయాలను ప్రవాసియను నవలయందును, 1942 విప్లవమును జంఝా మారుతము అను నవలయందును ఫడ్కేగారు చక్కగా వివరించిరి. చీకటి బజారును, ప్రజాహిత జీవనములోని అవినీతిని నిర్దాక్షిణ్యముగా యీయన తన రచనలో ప్రకటించి, సంఘమునకు దారి జూపినాడు. ఈయన కాశ్మీరు సమస్యనుగూర్చి కూడ ఒక్క చక్కని నవలను వ్రాసినాడు. మహారాష్ట్ర దేశములో గాంధీ రాజకీయాలను, గాంధీ వాఙ్మయమును వ్యాప్తిలోనికి దెచ్చిన పండితులు, రచయితలు ఆచార్య వినోబా భావే, కాకా కలేల్కరుగార్లు. ఆచార్య అత్రే సంఘములోని చాదస్తములనన్నింటిని తూర్పారబట్టిన విమర్శకుడు. హాస్యమునకు ఆటపట్టులగు యీయన రచనలు మహారాష్ట్ర దేశమున మంచి ప్రబోధము కలిగించినవి. మహారాష్ట్ర జాతీయ కవులలో గోవింద అగ్రజ్, తాంబేగార్లు ప్రముఖులు.

హిందీ భాషలో జాతీయోద్యమ ఘట్టములకు వాఙ్మయములో స్థానమొసంగిన కథకులు మున్షీ ప్రేమచంద్, సుదర్శన్‌గార్లు. మున్షీ ప్రేమచంద్ కథలు అన్ని భాషలలోనికి ముఖ్యముగా తెలుగుభాష

లోనికి చాలవరకు పరివర్తితమైనవి. బెంగాలు కాటకమునుగూర్చి, క్రిష్ణ చంద్ర వ్రాసిన అన్నదాతయను గ్రంథము సుప్రసిద్ధమైనది. హిందీ జాతీయ కవులలో సుమిత్రా నందన్‌పంత్ మైథిలీశరణగుప్త, మహాదేవీ వర్మగార్లు ముఖ్యులు. క్షితీంద్ర మోహనసేన్, దేవేంద్ర సత్యార్థిగార్లు హిందీ భాషలో జాతీయ వాఙ్మయమును బహుళముగా సృష్టించిరి. భారత రాజ్యాంగ పరిషత్తు సభ్యులు బాలకృష్ణ శర్మగారు హిందీ భాషలో మంచి రచయితలు. ఆధునిక హిందీ రచయితలలో రాహుల్ సాంకృత్యాయన్ ప్రముఖులు. ఈయన రచనలయందు విప్లవ దృక్పథము ప్రముఖముగా నుండును. "వాల్గానుండి గంగా తీరము వరకు" అను రాహుల్ సాంకృత్యాయన్ గ్రంథము సుప్రసిద్ధమైనది.

కర్ణాటక సాహిత్యములో గూడ ఇట్టి పరిణామము మనకు కనుపించుచున్నది. ఆలూరి వెంకటరావుగారు గాంధీ రాజకీయాల కన్నముందే కర్ణాటక దేశములో దేశభక్తిని ప్రబోధించు రచనలు గావించిరి. కర్ణాటక భాషలో కృష్ణశర్మగారు జాతీయ సమస్యలను ప్రజలకు విప్పి చెప్పు రచనలను విరివిగా చేసినారు. అంబికాతనయదత్తు. మన (శ్రీ)(శ్రీ) వలె, కర్ణాటకభాషలో విప్లవ ధ్వజము నెత్తిన రచయిత. దివాకర్ గారు కర్ణాటక భాషలో గాంధి రాజకీయాలకు గాంధీ వాఙ్మయమునకు చక్కని సమీక్షలను వ్రాసిరి. వీరిని మనము ముట్నూరి కృష్ణారావు గారితో పోల్చవచ్చును. ఆచార్యగోకాక్ జాతీయ వాఙ్మయసమీక్షకులలో ఎన్నదగినవారు. రాజరత్నం, పుట్టప్పగార్లు ఉత్తేజకరమైన జాతీయ గేయములను రచించిరి.

స్వాతంత్ర్యజ్యోతిని మారుమూల పల్లెలలోనికి దీసికొని వెళ్ళి, ఇంటింట వెలిగించి చీకటిలోనున్న ప్రజా సామాన్యమునకు వెలుతురు జూపించి, భారతీయ జాతీయోద్యమమును నిజమైన ప్రజల ఉద్యమముగా జేసిన సంపూర్ణ గౌరవము గాంధీ మహాత్మునికే చెందు

చున్నది. గుజరాతీలో - నవజీవన్; ఇంగ్లీషులో - యంగ్ ఇండియా; మున్నగు పత్రికలద్వారా గాంధీమహాత్ముడు ప్రజలలో జాతీయ భావాలను ప్రజ్వరిల్ల జేసెను. ఇంగ్లీషు భాషయందును, గుజరాతీ యందును, గాంధిమహాత్ముని కలము అత్యంత శక్తివంతమైనది. పూవు వలె మృదువేగాక, వజ్రమువలె కఠోరమైనదిగూడ ఆయన రచన. గాంధీ మహాత్ముని వ్యాసములు ఆసేతు హిమాచలపర్యంతము ప్రజలను పులకాంకిత గాత్రులను జేసి, స్వాతంత్ర్య సమరములో వారు నడుముకట్టి ముందుకు దూకుటకు ఉపయోగపడినవి. క్విట్ ఇండియా సందర్భమునందును, అంతకు ముందును, ఆయన నిర్వహించిన వివిధ ఉద్యమాల సందర్భమున ఆయన వ్రాసిన వ్యాసములకు ప్రపంచ వాఙ్మయమున అత్యున్నత స్థానము కలదు. రస్కిన్, టాల్‌స్టాయిల రచనల ప్రభావము గాంధీమహాత్ముని జీవితముమీద యెక్కువగా పడినదని చెప్పవచ్చును. మహాత్మునివలెనే జవాహర్లాల్ కూడ రచనల ద్వారా, భారత దేశమును ప్రబోధించెను.

ఈ సందర్భములో భారత స్వాతంత్ర్య ఉద్యమమునకు తోడ్పడిన విదేశీయుల రచనలను గూర్చి కూడ ప్రస్తావించుట అవసరము. సండర్ లాండువ్రాసిన ఇండియా ఇన్‌బాండేజి (దాస్యబంధాలలో జిక్కుకొనిన భారతదేశము), రామ్సే మాక్డోనాల్డు రచనలుమున్నగునవి భారత జాతీయోద్యమ ప్రచారమునకు బాగుగా తోడ్పడినవి. మనదేశములో అమృతబజారు పత్రిక; ప్రకాశం పంతులుగారి స్వరాజ్య బొంబాయి క్రానికల్; చింతామణిగారి లీడర్; ట్రిబ్యూన్ మున్నగు ఆంగ్ల పత్రికలు నిర్భయ విమర్శలద్వారా, దేశములో చైతన్యము ప్రబోధము కలుగజేసినవి. భారత జాతీయోద్యమమును గూర్చి వ్రాసిన విదేశీయులలో బ్రెయిల్స్‌ఫర్డు గారికి ఉన్నత స్థానము గలదు. భారత జాతీయ కాంగ్రెస్ ఆశయాలను ధైర్యముతో తమ రచనలద్వారా సమర్థించిన వారిలో బ్రెయిల్స్‌ఫర్డుగారు ముఖ్యులు. 1942 సంవత్సరమున గాంధీ,

నెహ్రూ, పటేలు మున్నగు నాయకులు చెరసాలలో బంధింపబడిన తరువాత, భారతజాతీయోద్యమమును, దౌర్జన్యపద్ధతులద్వారా అణచివేయుటకు బ్రిటీషు ప్రభుత్వము ప్రయత్నించిన సందర్భమున, సుప్రసిద్ధ పత్రికా రచయిత లూయీఫిషర్ భారత జాతీయ కాంగ్రెసును గూర్చియు, మన జాతీయోద్యమమును గూర్చియు, వ్రాసిన వ్యాసములు ప్రపంచమును దిగ్భ్రాంత మొనరించి, భారతీయుల హక్కులు న్యాయమైనవని ఋజువు చేసినవి. భారత జాతీయోద్యమ చరిత్రలో లూయీఫిషర్ రచనలు చిరస్మరణీయములు.

వందేమాతరం గేయము భారతీయులను ప్రబోధించుటలో చేసిన సేవను గూర్చి యెంత ప్రశంసించిన తక్కువయే. బంకించంద్రుని జీవిత కాలమున ఆయన నవలలు వంగదేశమును ప్రబోధించినవి. కాని, తరువాత క్రమక్రమముగా జాతీయోద్యమ విస్తరణతో, రాజకీయాలలో గాంధీమహాత్ముని అవతరణతో, జాతీయోద్యమము దాల్చిన విప్లవ పరిణామముతో, వందేమాతరం గీతము సకల భారతీయుల హృదయాలను ఉత్సాహతరంగితము జేసి, వారి నెత్తురును ఉడుకెత్తించి, ఉత్తేజితులను గావించినది. ఈగీతముపాడుచు ప్రాణములనైన నబడ్డుటకు యువకులు సంసిద్ధులైరి. వందేమాతరమనగా జాతీయోద్యమమునకు, భారత స్వాతంత్ర్యజ్యోతికి పర్యాయపదమైనది భారతదేశములో వందేమాతరంవలె ప్రజల హృదయాలమీద ఆధిపత్యము వహించిన గేయము మరొక్కటి లేదనిన సత్యమునకు తలవంపులు వాటిల్లవు. జాతీయకవి రవీంద్రుడు శక్తివంతమైన ఒక మహాసంస్థగా అవతరించి భారతీయులలో ప్రబోధము గావించెను. రవీంద్రుని 'జనగణమన' భారతజాతీయ గేయముగా అంగీకరింపబడినది. వంగ భాషలో శరత్‌చంద్ర ప్రభృతులు తమ రచనలద్వారా, సోదర దేశీయులను ప్రబోధించిరి. మహర్షి అరవిందునికి రవీంద్రునితో సమానమైన స్థానము వంగదేశమున కలదు. గాంధీమహాత్ముడు, రాజకీయ రంగమున ప్రాధాన్యము వహించకముందే

ఆయన గీతా ఉపన్యాసములు వంగదేశమును ఉత్తేజిత మొనరించినవి. ఆ దినాలలోని వంగదేశము నందలి విప్లవోద్యమ నాయకులందరును అరవిందుని గీతా ఉపన్యాసములను విని, ప్రబోధితులై, భారతమాత సేవకు జీవితములను అంకితముజేయుటకు నిశ్చయించి ముందుకువచ్చిన వారేనని చెప్పవచ్చును. ఇంగ్లీషులో కె. యస్. వెంకటరమణిమున్నగు వారు రచించిన గ్రంథములు విద్యాధికులను, విద్యార్థులను ప్రబోధితులను జేసినవి. వెంకటరమణిగారి గ్రంథములు — తెలుగులో పరివర్తితమైనవి.

తెలుగు దేశమున వాఙ్మయము ద్వారా ప్రజలను మేలుకొల్పిన వైతాళికుడు వీరేశలింగం పంతులు. వీరేశలింగం పంతులు తమ రచనలద్వారా సంఘములోని కుళ్ళును బయట పెట్టి, సంస్కరణోద్యమమును, మాటలతో ప్రచారము జేసి సంతృప్తి జెందక, ఆచరణలోనికి దెచ్చిరి. వీరేశలింగము గారిది సంస్కరణ దృక్పథము. రాజకీయముగా వీరేశలింగముగారు ప్రజాప్రబోధము చేయకపోయినప్పటికి వారి సంఘ సంస్కరణోద్యమము ఆంధ్రుల కన్నులు తెరిపించి, జాతీయోద్యమ వ్యాప్తికి ఆంధ్రదేశములో మంచి అవకాశము కలుగజేసినది. ఆంధ్ర పత్రికను స్థాపించిన కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు ఆంధ్ర దేశమున రాజకీయ చైతన్యమును కలుగజేయుటకు అద్వితీయమైన కృషి చేసిరి. ఆంధ్రుల ఏకైక దినపత్రికగా ఆంధ్రపత్రిక స్వాతంత్ర్యోద్యమ బీజాలను ప్రజాహృదయ క్షేత్రాలలో చల్లి, చిరస్మరణీయమగు సేవగావించినది. ఆంధ్రదేశములోని రాజకీయ ప్రబోధము కావించిన పత్రికలలో కృష్ణాపత్రికది అగ్రతాంబూలము. ఒకమారు ముట్నూరి కృష్ణారావుగారు తమ పత్రికలో యెక్కువగా వార్తల ప్రకటన జరుగుటలేదను ఆరోపణకు ప్రత్యుత్తరమిచ్చుచు, కృష్ణాపత్రిక వార్తా పత్రిక కాదనియు (*News paper*), అది అభిప్రాయాల పత్రిక యనియు (*Views paper*) తెలిపిరి. భారతజాతీయ కాంగ్రెసు ఆద

ర్యాలను గూర్చి, కాంగ్రెసు అధ్యక్షోపన్యాసాలనుగూర్చి జాతీయ భావ ప్రబోధకములగు కృష్ణాపత్రిక సంపాదకీయములు ఆంధ్రదేశములో అపూర్వమగు సంచలనము కలుగజేసినవి. మారుమూలలనున్న ప్రజలు కృష్ణాపత్రిక సంపాదకీయములను చదివి రాజకీయముగా చైతన్యవంతులైరి. నాయకులను, విద్యార్థికులను, ప్రజాసామాన్యమును అందరిని ఒక్కుమ్మడిగా ఊపి, ఉత్సాహతరంగితులను జేసినవి కృష్ణాపత్రిక సంపాదకీయాలు. వేదాంతవేత్తలనేకాక పల్లెటూరి ప్రజానీకమునుగూడ కృష్ణా సంపాదకీయాలు ఉత్తేజితులను గావించినవి. నాయకులు, కార్యకర్తలు, సామాన్యప్రజలు ఆ పత్రికా సంపాదకీయాలను చదివి, ప్రబోధితులగుచుండెడివారు.

ఆంధ్ర, కృష్ణా పత్రికల ననుసరించి యితర పత్రికలు బయలుదేరి ఆంధ్రదేశ రాజకీయ వాతావరణమును చైతన్యపూరితము జేసినవి. యువకులు భావగేయములద్వారా, ప్రజానీకమును మాతృదేశసేవకై, ముందుకు వచ్చునట్లు చేసినారు. గురుజాడ, రాయప్రోలు కవీంద్రులు ఇట్టి యువకులకు మార్గదర్శకులైరి. దువ్వూరి, విశ్వనాథ, జాషువ, తుమ్మల కవీశ్వరుల రచనలు ఆంధ్రదేశములో దేశభక్తి, త్యాగదీక్షను ప్రబోధించినవి. గరిమెళ్ళ సత్యనారాయణగారు కృష్ణాపత్రికలో తమ గేయములద్వారా, సత్యాగ్రహోద్యమ ప్రబోధమును జేసిరి. "మా కొద్దీ తెల్ల దొరతనము," "అంటరాని వారెవ్వరో కాదు, మావెంట రానివారె." "దండాలు దండాలు భరతమాత" అను గేయాలు అపారమైన చైతన్యము కలుగ జేసినవి. ఆధునికాంధ్ర కవి శేఖరుల రచనలోని "చావలేదు చావలేదు, ఆంధ్రుల మహోజ్వల చరిత్ర," "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్." "వీరగంధము తెచ్చినారము, వీరులెవ్వరొచెప్పుడీ." "కొల్లాయిగట్టితేనేమి మాగాంధి కోమటైపుట్టితేనేమి" అను కవితలు ఆంధ్ర ప్రజల నాలుకల మీద నాట్యము జేసినవి. భరతఖండము చక్కనిపాడియావువంటి పద్యములు

ప్రజాసామాన్యములో బ్రిటిష్ పరిపాలనాస్వరూపమును బాగుగా చిత్రించినవి. రాయప్రోలు, గురజాడ విశ్వనాథ, జాషువా, తుమ్మల, దువ్వూరి మున్నగు ఆధునిక కవి శేఖరుల రచనలు బహిరంగ సభలలో వేదికలమీద, శ్రావ్యముగా పఠితమై ప్రజలను చైతన్యవంతులనుగా జేసినవి. సభలలో దేశభక్తి ప్రబోధములగు గేయాలు, పద్యాలు అద్భుతమైన జాగృతిని కలుగ జేసినవి.

ఈ జాతీయోద్యమ వాఙ్మయ ప్రభావఫలితముగా తెలుగులో వీరకావ్యములు గూడబయలుదేరి పరదేశ పాలనా బంధములను త్రెంచుకొనుటకై ప్రబోధము జేసినవి. ఆధునిక కవులలో శివశంకర శాస్త్రి అడవి బాపిరాజు, కొడాలి ఆంజనేయులు మున్నగువారు త్యాగ సమయములందు ముందుకువచ్చి చెరసాలల నలంకరించినారు. ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'మాలపల్లి' అను నవల ప్రజలలో చాల ప్రబోధము కలుగ జేసినది.

(1954)

—(o)—

# ఆంధ్రదేశములోని రైతు-
# సాంస్కృతిక జీవనము

ఆంధ్రప్రదేశ్‌లోని పల్లెపట్టులు అందాల దీవులు. భారతావని లోని అన్ని ప్రాంతాలవలెనే తెలుగు సీమ జనాభాలోని మిక్కిలి యెక్కువ భాగము గ్రామ ప్రాంతాలలో నివసిస్తున్నది. ఈ పల్లెటూరి ప్రజలలో నూటికి తొంబది వంతులకు పైగా ప్రత్యక్షముగనో పరోక్షముగనో వ్యవసాయముమీద ఆధారపడివున్నారు. అందుచేత తెలుగు సీమకు రైతు ఆయువు పట్టని నిస్సందేహంగా చెప్పవచ్చును.

తెలుగు దేశములోని రైతు జీవితము విశిష్టమైనది. సంవత్సరం పొడుగునా, పన్నెండు నెలలు, మూడునూర్ల అరువది రోజులు. రైతు గడియారమువలె పనిచేస్తుంటాడు. ప్రొద్దున మేల్కొన్నప్పటి నుంచి రాత్రి నిద్రపోయేవరకు రైతు కార్యక్రమము నిర్ణీతమై వుంటుంది. ఈ విధముగా క్రమశిక్షణతో కష్టపడి పనిజేసే రైతు జీవితంలోకి కొంచెం తొంగిచూస్తే అందులో కళాసౌందర్యానికి ఆటపట్టయిన ఘట్టాలు గోచరం కాగలవు. ఈ ఘట్టాలు రైతు సాంస్కృతిక జీవితానికి ప్రతిబింబాలు. మతము, కళ రెండూ రైతు సాంస్కృతిక జీవితానికి ప్రధాన ప్రాతిపదికలు.

రైతు జీవితము శుష్కమైనదికాదు; అది రసహీనము కాదు; హృదయాన్ని కదలించే సంఘటనలు, మనస్సును ఆకర్షించే దృశ్యాలు. ఆధునిక నాగరికతచేత కలుషితము కాని ఉదాత్త భారతీయ సంస్కృతి రైతు జీవితములో అడుగడుగునా చూడవచ్చును. నూటికి పన్నెండు కన్న మించని అక్షరాస్యులు మాత్రమేవున్న మన దేశములో రైతులు వ్రాయను, చదువను, నేర్చినవారు కారని ప్రత్యేకముగా చెప్పవలసిన పనిలేదు. కాని ఒకసారి యేపల్లెటూరికైనా వెళ్ళి మనము కొందరు రైతులతో సంభాషిస్తే, మన భారతీయ పురాణాలను గూర్చి రైతులకు తగినంత విజ్ఞానము వున్నట్లు స్పష్టంగా గ్రహించ వచ్చును.

రామాయణ భారతాలు రైతుకు బాగా పరిచితమైనవి; శృతపాండిత్య ఫలితమైన విజ్ఞానము రైతుకు తగినంత వున్నది. పశువుల వ్యాధులకు చికిత్స రైతు విజ్ఞానములో ఒక ముఖ్యమైన భాగము. పాముకాటుకు, తేలుకుట్టుకు, చేయవలసిన చికిత్సలో రైతు మంచి నేర్పరి.

మన రైతు విజ్ఞానములో; సంస్కృతిలో ఒక ముఖ్య భాగము పరంపరాగతముగా ఆతనికి సంక్రమించినటువంటిది. తరతరాల నుండి వచ్చిన సంప్రదాయాల, ఆచారాల ప్రభావము, తాతముత్తాతల నుండి, అమ్మమ్మ నాయనమ్మల నుండి నేర్చు కొనిన సంగతులు తెలుగు సీమలోని రైతు సాంస్కృతిక జీవితానికి ప్రత్యేకతలు. మనదేశములో మొట్టమొదటిసారి 1952 సంవత్సరంలో వయోజన వోటింగ్ పద్ధతిపైన జరిగిన సాధారణ యెన్నికలను జూచి, పాశ్చాత్యదేశాలలో కొందరు, "ఇంత పెద్ద దేశములో, ఇన్నికోట్ల సంఖ్యలో మొట్టమొదటి సారి ప్రజలు వోటు చేసినప్పటికినీ, యే విధమైన రక్తపాతము జరుగలేదే" యని ఆశ్చర్యపడిన వారికి సమాధానము చెపుతూ, శ్రీ సి. పి. రామస్వామి అయ్యర్ గారు "ఇది మాదేశములోని పల్లె పట్టుల యందు నివసిస్తున్న రైతు జీవితపు ఉదాత్త సంస్కృతికి నిదర్శన" మని చెప్పివుండిరి. మంచి చెడ్డల విచక్షణతో నేర్పు, ఓర్పు, పరమత సహనము, రైతుకు ఉగ్గుపాలతో అలవడినటు వంటి మంచి గుణాలు. ఈ సద్గుణాలే రైతు సాంస్కృతిక జీవితానికి శోభను చేకూరుస్తున్నవి.

రైతు సాంస్కృతిక జీవితములో మతానికి ప్రత్యేక ప్రాధాన్యము వున్నది. మన రైతులో మత విశ్వాసము ప్రగాఢంగా కనుపిస్తుంటుంది. దైవభక్తి, పాపభీతి, రైతులో మిక్కుటము, రైతు ఇంటిలో యే శుభకార్యము జరిగినా ఇలవేలువు పూజతో అది ప్రారంభము కావలసి వుంటుంది. మత విశ్వాసము రైతు నిత్య జీవితములో అడుగడుగునా గోచరిస్తుంటుంది. బొట్టు, జుట్టూ, రెండూ రైతుకు అనివార్య మైన బాహ్యాలక్షణాలు. పంచాంగములో రైతుకు పరి

పూర్ణ మైన నమ్మకము వున్నది. కొత్త బట్టలు కట్టుకొనడానికి మంచి దినము కావాలె; ప్రయాణానికి మంచిరోజు కావాలె; క్షౌరానికి మంచిదినము కావలె; దుర్ముహూర్తమూ, వర్జమూ రైతు బాగా పాటించే సంప్రదాయాలు. ఈ సందర్భాలలో రైతు మంచిపనిని దేనినీ చేయడానికి యిష్టపడడు. పున్నమ అమావాస్యలు, గ్రహణాలు, రైతుకు సుపరిచితమైన సందర్భాలు.

సాంస్కృతిక జీవతములో గమనించదగిన విశేషాలలో వేష భాషలు ప్రధానమైనవి. మన పల్లెటూరి రైతు వేష భాషలలో ప్రత్యే కత వుంటుంది. పల్లెటూరి సామెతలు, లోకోక్తులు, మనకు తెలియని చక్కని తెలుగు మాటలు ఎన్నింటినో రైతు సంభాషణలో మనము బాగా పోల్చుకోవచ్చును. తెలుగు దేశములోని రైతును తలుచు కోగానే, అతని కోరమీసాలు మన యెదుట ప్రత్యక్షమౌతవి; అతని దండకడియాలు మనకు కనుపిస్తవి; అతని చెవుల పోగులు, వ్రేలి ఉంగరాలు మన కండ్లముందు గోచరిస్తవి; అతని తలపాగా మనకు జ్ఞప్తికి వస్తుంది. ఆ తలపాగా చుట్టేపద్ధతిలో రైతు జూపించే నేర్పు మనము చక్కగా పరిశీలించ వచ్చును. రైతు కట్టేధోవతులు. ఆ ధోవతులు అంచులు, రంగులు, రైతు అభిరుచికి మంచి నిదర్శనాలు.

కోడికూత, రైతును ప్రొద్దున్నే మేలుకొలిపే అలారం గడి యారం. కోడి, కుంపటీ, యీ రెండూ రైతుల యిండ్లలో మనకు ప్రత్యేకంగా కనపడుతుంటవి. కోడికూతతో లేచే రైతు ప్రతిరోజు తనదైనందిన కార్యక్రమాన్ని సక్రమముగా నిర్వహించుకుంటాడు. సోమరితనము అనే మాట రైతు నిఘంటువులో లేదు. వాతావర ణాన్ని బాగా గమనించి, కాలమూ, సమయమూ నిర్ణయించుకొని తన పనులు నెరవేర్చుకోవడం రైతుకు అలవాటు. ఇందుకు కార్తులు రైతుకు మార్గదర్శకంగా వుంటవి. రోహిణీ కార్తెలో వర్షాలుపడి చెరువులు నిండితే, అది ఆ సంవత్సరము రైతు అదృష్టానికి మంచి

సూచన. తరువాత ప్రతి కార్తెను గమనిస్తూవుండే రైతు, యే కార్తెలో దుక్కి దున్న వలెనో, యే కార్తెలో విత్తనాలు వేయవలెనో, ఏ కార్తెలో నారుపోయవలెనో, వరికి యే కార్తె అనుకూలమో, మొక్క జొన్నకు యే కార్తె మంచిదో తెలుసుకొని వ్యవసాయ కార్య కలాపాలు దిద్దుకొనడంలో మంచి ప్రవీణుడు. ఈ ప్రావీణ్యమే రైతు వ్యవసాయములో సాధించగల విజయానికి ముఖ్య కారణము వ్యవసాయాన్ని కళగా, శాస్త్రంగా ఆరాధించే రైతు దేశ శ్రేయస్సుకు వెన్నెముక.

తెలుగు సీమలో దేవాలయములేని ఊరులేదు. హనుమదాలయము, శివాలయము, రామాలయము మొదలైన దేవాలయాలు రైతు సాంస్కృతిక జీవితానికి మార్గదర్శకాలు. ఈ దేవాలయాల నిర్వహణకు రైతు ముఖ్యపోషకుడు. పంటలు పండిన తరువాత కళ్ళముమీదనే తన వంతుభాగమును రైతు దేవాలయానికి సమర్పించడము, గ్రామీణ జీవనముతో పరిచయము ఉన్న వారందరికి తెలిసిన సంగతే. ప్రతి రైతు కుటుంబానికి ఒక ఇలవేలుపు అనివార్యంగా ఉండడం ప్రతి వారికి తెలిసిన సత్యమే. ఈ ఇలవేలుపుకు ముడుపులు, మొక్కుబడులు చెల్లించడం తరుచుగా జరుగుతుంటుంది. పౌరాణిక దేవతలతో పాటు శాక్తేయమైన దేవతలను గూడ ఆరాధించడం రైతు జీవితంలో మనకు కనుపిస్తుంది. ఈ దేవతలకు కోళ్ళను, గొర్రెలను బలియీయడం. కనకదుర్గ, కాళి, ఎల్లమ్మ, మరిడమ్మ మొదలైన పేళ్ళతో, ఈ శక్తిపూజ చేయడం పల్లెటూళ్ళలోని రైతులకు పరిపాటి. ప్రతిసంవత్సరము ఈ దేవాలయాల ఉత్సవాలు, దేవతల జాతరలు జరుగుతుంటవి. వీటన్నిటికి రైతు సహాయము, ప్రోత్సాహము, పూర్తిగా లభిస్తవి. తెలుగు సీమలో కొన్ని జాతరలు చాల ప్రసిద్ధమైనవి. కొత్తకొండ కొరివి, అయ్యనవోలు మొదలైన చోట్లలో ప్రతి సంవత్సరము జరిగే జాతరలకు రైతు బండికట్టుకొని, ఆ బండిని, చక్కగా అలంకరించుకొని కుటుంబముతోపాటు తీర్థము పోవడం జరుగుతూ వుంటుంది.

రైతుకు పండుగలను చేసుకోవడంలో చాల ప్రీతి. కొన్ని పండుగలు ప్రత్యేకంగా రైతుకు సంబంధించినవే. ఏరువాకపున్నమ ఇందులో మొట్టమొదలు చెప్పదగింది. ఈ పండుగనాడు రైతులు ఎడ్లను పూజిస్తారు. ఆనాడు ఎద్దులను కట్టివేసి కొట్టాన్ని అలికి, శుభ్ర పరచి, ఎద్దులను కడిగి, కొమ్ములకు రంగులువేసి, ఒంటిమీద చిత్ర విచిత్రమైన ముద్రలువేసి, గజ్జెలు, గంటలుకట్టి, కనులపండువుగా అలంకరించి ఊరేగుట ముఖ్య కార్యక్రమము. ఉగాదినాడు రైతులు సాయంకాలము దేవాలయములో సమావేశమై, ఆ సంవత్సరము కాలమాన పరిస్థితులను, తమ అదృష్టాలను తెలుసుకోవడం జరుగును. దసరా నాడు జమ్మిని తీసుకొనుటకు వెళ్లే రైతుల సమూహము, ఈ సందర్భములో మనకు కనుల గట్టినట్లుండే మరొక దృశ్యము. శ్రీరామ నవమినాడు బండ్లు కట్టుకొని ఊరేగుటకూడ ఇటువంటి దృశ్యమే దీపావళి మొదలైన పండుగలను రైతులు అత్యంత ఉత్సాహముతో జరుపుకుంటారు. సంక్రాంతి అచ్చంగా రైతుల పండుగే. సంక్రాంతి పండుగ సమయాన పల్లెటూళ్ళ సౌందర్యము ప్రత్యేకంగా చూడతగింది. కంది చేలతో, బంతిపూలతో, దోసపండ్లతో శోభించే ప్రకృతిమధ్య అప్పటి వరకే పంట చాలమట్టుకు చేతికి అందిన రైతు తన కుటుంబంతో పాటు సంతోషముతో, సంతృప్తితో వుంటాడు.

రైతులకు ప్రత్యేకమైన వినోదాలు వున్నవి. తోలుబొమ్మలాటలు, వీధినాటకాలు, ఈ వినోదాలలో చాల ముఖ్యమైనవి. తీరిక దినాలలో రాత్రంతా తోలుబొమ్మలాటలను చూస్తూఆనందించే రైతులు ఈ ఆటగాళ్ళను చాలకాలము నుండి పోషిస్తూవచ్చినారు. ఇదేవిధంగా తీరిక సమయాలలో పగటిపూట కథలు చెప్పించుకొని, విని ఆనందించడం సుప్రసిద్ధ మైనసంగతి. ఈ కథల్లో బాలనాగమ్మ, బొబ్బిలి కథ మొదలైనవిపేర్కొనదగినవి. పురాణకాలక్షేపాలకు హాజరుకావడం రైతుల సరదాలలో వొకటి. వర్షాలు సకాలంలో పడకపోతే, విరాటపర్వము పురాణము చెప్పిస్తే, వానలు కురియగలవని రైతు

విశ్వాసము. ఈ విధంగా విరాటపర్వము పురాణం చెప్పించడం పల్లెటూళ్లలో జరుగుతుంటుంది. సంక్రాంతి పండుగ సమయాలలో కోడి పందెములు తెలుగు దేశములో సుప్రసిద్ధమైనవి. ఈ మధ్య ఈ కోడి పందెములు వేయు ఆచారము కొంత అంతరించినట్లు కనబడుతున్నది.

రైతుకు ప్రత్యేకమైన వినోదాలు, విలాసాలతో పాటు, ఆటలు కూడా ఎన్నోవున్నవి. పులిజూదము పల్లెటూళ్ళలోని రైతు కుటుంబాలు మక్కువతో ఆదరించే ఆట. పాచికల ఆట, చదరంగము, పచ్చీసు మొదలైన ఆటలు కూడ రైతుకు ప్రియమైనవి. హాయిగా పాడుకోవడం రైతు మనస్సుకు ఉల్లాసము కలిగించే మధురసన్నివేశము. సాయంకాలముపూట పశువులను తోలుకొని ఇంటికి వెళ్ళే సందర్భాలలో పాటలు పాడుకునే రైతులు మనకు పల్లెటూళ్ళలో కనుపిస్తారు. వడిగల యెద్దులు కట్టుకొని బండిని వేగముగా తోలుకొని పోయేటప్పుడు. ఆనందముతో పాడుకునే రైతులు మనకు పల్లెటూళ్ళలో కనుపించుతారు. సుందరులైన ప్రేయసులను జూచినప్పుడు, హృదయము ఉప్పొంగగా, ప్రేమగీతాలు ఆలపించే రసికులు మనకు రైతుల్లో కనుపిస్తారు. మంచెమీద గూర్చుండి వడిసెలను రువ్వుతూ పాటపాడే ఆర్ద్ర హృదయులను మనము రైతులో చూడ వచ్చును. కోతల సమయాలలో, కలుపుదీసే సమయాలలో, పొలాలలో వినిపించే రాగాలు, రైతుకు గానము మీదగల అభిమానానికి తార్కాణములు.

ఈ విధంగా తెలుగు సీమలోని రైతు జీవితాన్ని పరిశీలించినప్పుడు అందులో ఒక ప్రత్యేకమైన సంస్కృతీ వైభవము మనకు గోచరిస్తుంది. ఈ సంస్కృతి బహుముఖమైనది. ఈ సంస్కృతిలో విజ్ఞానము, వినోదము, రెండూ సమ్మిశ్రితమై వున్నవి. చెమటయోడ్చి, కష్టపడి పనిజేసి, దేశ సంపదను అభివృద్ధి చేయడానికి కృషి జేసే రైతు కుటుంబాల కష్టసుఖాలు, ఒడుదొడుకులు, ఆర్థిక సామాజిక జీవనము ఈ సంస్కృతిలో మనకు కనుపించుతవి.

(రేడియో ప్రసంగము - 1959)

–0–

# గ్రామాలలోని వేడుకలు : క్రీడా వినోదాలు

గౌతమీ కృష్ణవేణులకు ఆవాసమై పాడిపంటలకు నిలయమైన తెలుగుసీమలోని పల్లెపట్టులలో కళాసౌందర్యము అడుగడుగున గోచరిస్తున్నది. తెలుగువారి భాష యెంత మధురమైనదో, సామాజిక జీవనమంత సుందరమైనదని చెప్పితే అతిశయోక్తి ఆవంతయునుగాదు. భారతదేశ మంతటిలో నున్నట్లే తెలుగుసీమలో గూడ నూటికి తొంబది పాళ్ళు జనులు పల్లెటూళ్ళలో నివసిస్తున్నారు. ఈ పల్లెటూళ్ళలో తరతరాల నుండి వ్యాప్తిలో నున్న వేడుకలు, క్రీడా వినోదాలు ఎన్నియో ఉన్నవి. ఈ క్రీడా వినోదాలలో తెలుగువారి సుకుమార అభిరుచి ప్రతిబింబిస్తున్నది.

స్త్రీలకు, పురుషులకు, బాలబాలికలకు ప్రత్యేకంగా కొన్ని వినోదాలు, ఆటపాటలు వున్నవి. వీనితోపాటు స్త్రీ పురుషులకు సమానముగా ఆదరణీయములైన వినోదాలు క్రీడలు కూడ కొన్ని ఉన్నవి ఈ క్రీడలలోను, ఈ వినోదాలలోను తెలుగు ప్రజల స్వభావాను గుణమైన సౌందర్యరక్తి మనకు స్పష్టంగా కనుపిస్తుంది. ఇందులో కొన్ని విశ్రాంతి సమయాలలో ఆటవిడుపు కొరకు ఉద్దేశించిన క్రీడా వినోదాలు; మరికొన్ని పండుగ పబ్బాలలో సర్వజనులు సమానముగా ప్రోత్సహించి, ఆనందించే వినోదాలు; ఇంకొక కొన్ని పెండ్లిండ్లు మొదలైన శుభకార్యాల సందర్భాలలో నిర్వహించే వేడుకలు. కొన్ని క్రీడలు, వినోదాలు శ్రీమంతులకు మాత్రమే అందుబాటులో నుండునవి. వేరొక కొన్ని క్రీడలు సార్వజనికమైనవి; అన్ని తరగతుల ప్రజలకు అందుబాటులో నుండునవి. ఈ విధంగా జనుల ఆర్థిక స్థితిని అనుసరించి, వయస్సును అనుసరించి, విజ్ఞానమును అనుసరించి మనోరంజనము గావించు క్రీడలు, వినోదాలు తెలుగు సీమలో పుష్కలంగా వున్నవి.

ఈ వినోదాలలోను, వేడుకలలోను, పాటలను మొట్ట మొదలు పేర్కొనవలసి వుంటుంది. పొలములో కలుపుదీసే పడుచులు, ఎద్దులను గాసే బాలకులు, సంపన్నుల యిండ్లలో కావలసినంత తీరికవున్న స్త్రీలు, బాలికలు, ఈ పాటలను పాడుతూ వుంటారు. పూర్వకాలంలో తుమ్మెద పదాలు, పర్వత పదాలు, శంకరపదాలు, నివాళిపదాలు మన దేశములో అధిక వ్యాప్తిలో వున్నట్లు తెలుస్తున్నది. కాని యీ నాడు యీ పాటలు యించుమించుగా నశించినవనే చెప్పవలసి వున్నది. సేద్యముచేస్తూ కూలీలుపాడే జాజరపాటలు యీనాటికిని కొన్ని ప్రాంతాలలో విశేష వ్యాప్తిలో వున్నవి. హైదరాబాదు నగరానికి నూరుమైళ్ళలోనున్న వరంగల్ జిల్లా మానుకోట తాలూకాలో యీ పాటలను రైతు యువకులు మక్కువతో యీ నాటికీ పాడుకుంటున్నారు. ప్రత్యేకంగా స్త్రీలు పాడుకొనే పాటలు గూడ యెన్నో వున్నవి. ఇందులో పెండ్లి పాటలు, కూతురును అత్తమామలకు అప్పగించే సందర్భంలో పాడే అప్పగింతపాటలు, మంగళహారతులు, ముఖ్యంగా పేర్కొనదగినవున్నవి. తెల్లవారకముందే లేచి, మేలు కొలుపులు ఆలపించే అలవాటు, యీ నాటికిని మన పల్లెటూళ్ళలోని పూర్వ పద్ధతి కుటుంబాలలో కనుపిస్తున్నది. పసిపిల్లలను ఉయ్యాలలో నిద్ర బుచ్చుట కొరకు పాడే జోలపాటలను, మనదేశంలో వినని వారు వుండరని చెప్ప వచ్చును. ఈ విధంగా వివిధములైన పాటలు, వివిధ సందర్భాలలో మన పల్లెటూళ్ళలో వీనులకు విందు జేస్తుంటవి;

ఆటలకూ పాటలకు వీడరాని చుట్టరికమున్నది. తెలుగు పల్లెలలో రకరకాలైన ఆటలను మనము చూడవచ్చును. ఈ ఆటలు, మనస్సుకు ఉల్లాసము కలిగించే వేడుకలు, ఇందులో సమస్త జనులను ఆకర్షించే తోలు బొమ్మలాట సుప్రసిద్ధమైనది. ఈ తోలుబొమ్మలాట తెలుగువారి ప్రత్యేకత. వారు అనేక సంవత్సరాల నుండి ఉపాసించిన కళ. ఒక సన్నని బట్టను తెరగా గట్టి ఆ తెరవెనుక పెద్ద దివిటీలు

వెలిగింతురు. తెరవెనుక తోలుబొమ్మల కాళ్ళకూ, చేతులకూ, దారాలుగట్టి బొమ్మలను నిలబెట్టి దారాలను లాగుతూ దివిటీల వెలుగులో వానివి ఆడింతురు. ఈ ఆటను ఆడించే నిపుణులైనవారు కొందరు మన పల్లెటూళ్ళలో తిరుగుతూ వుంటారు. ఈ తోలుబొమ్మలాటలు యెక్కువ రామాయణ భారత కథలకు సంబంధించినవి. నిజానికి రామాయణమూ, భారతమూ, మన దేశీయులలో ప్రతిరక్తకణమునందును జీర్ణించిన కథలు, ఈ తోలుబొమ్మలాటలు ఉపయోగించే హాస్యము అప్పుడప్పుడు కొంత హద్దుమీరుతూ, కొంత అసభ్యంగా వుండే ఘట్టాలు గూడ మనకు కనుపించును.

ఈ తోలుబొమ్మలాటవలెనే బహుళ ప్రచారము పొందినవి యక్షగానాలు అనే వీధినాటకాలు. ఈ నాటకాలను ఆడేవారిని జక్కులు అని పిలుస్తుంటారు. భాగవతములోని కృష్ణలీలలు మొదలైన వానిని ఆడేవారిని భాగోతులని గూడ పిలుస్తుంటారు. కొన్ని సంవత్సరాల క్రిందటి వరకు మన పల్లెటూళ్ళలో ఈ భాగోతుల ఆటలు విరివిగా జరుగుతూ వుండేవి. ఎన్నోనూర్ల సంవత్సరాలనుంచి యక్షగానాలు, తోలుబొమ్మలాటలతోపాటు, భాగోతాలు మన పల్లెటూళ్ళ ప్రజలను రంజింపజేస్తున్న వినోదాలు, వేడుకలు. ఇవన్నీ తెలుగువారి కళాభిరుచికి మంచి నిదర్శనాలు, భజనమండలులను స్థాపించి, వారాని కొకసారి ప్రజలొక చోట సమావేశమై భజనలు గావించుట మన పల్లెటూళ్ళలోని వినోదాలలో ఒక ప్రత్యేకమైన వినోదము. ఇతరులు ఆడుతుండగా చూచి వినోదించే ఆటపాటలలో చేరే వినోదాలు బొబ్బిలికథ, బాలనాగమ్మ కథ మొదలైనవి. ఈ కథలను చెప్పేవారు గంటల తరబబడి, ఒక్కొక్కసారి ప్రొద్దంతా, పల్లెటూరిప్రజలను ఆకర్షించి, వినోదింప జేస్తుంటారు. కానీ ఈనాటి మారిన పరిస్థితులలో వీటికన్నింటికీ వ్యాప్తి తగ్గిపోతున్నది. ఈ కథలను జెప్పేవారి నేర్పు చాలగొప్పది; వినేవారి రక్తము ఉడుకెత్తునట్లుగా వీర గాథలను చెప్పుచుందురు.

స్వయంగా పాల్గొని ఆనందించే ఆటలు పాటలు, మన పల్లెటూళ్ళలో చాలా కనుపిస్తున్నవి. రంకురాట్నము, ఈవిధమైన వేడుకలలో ఒకటి. ఈ రంకురాట్నము యెక్కి గిర్రున తిరుగుట అందరికీ బాగాగా తెలిసిన వినోదమే. హైద్రాబాదు నగరంలో ప్రతి సంవత్సరము జరిగే అఖిల భారత ప్రదర్శనపు ఆవరణలోపల ఈ వినోదాన్ని చూడవచ్చును. మన పల్లెటూళ్ళకు ప్రత్యేకమైనది గిల్లీదండ అనే ఆట. ఈ ఆట చాల పురాతనమైనది. తెలంగాణపు పల్లెటూళ్ళలో దీనిని చిర్రగోనె అని కూడ అంటారు. మన కవులు వ్రాసిన పుస్తకాలలో ఈ ఆట మనోహరంగా వర్ణింపబడింది. పల్నాటి వీరచరిత్రలో బాల చంద్రుడు ఈ ఆట ఆడినట్లు పేర్కొనబడింది. భారతంలో కౌరవ పాండవులు ఈ ఆటను ఆడినారంటే, యిదియెంతపురాతనమైనదో తెలుస్తుంది. ఒక చిన్న కర్రముక్కను పెద్దకర్రతో కొట్టుతూ, ఈ ఆటను ఆడుతుంటారు. ఈ ఆటను క్రికెట్టుతో పోల్చవచ్చును, కొందరు దీనిని స్వదేశీ క్రికెటు అని మెచ్చుకోవడం కలదు. కోడి పందెములు తెలుగు దేశీయులు ప్రత్యేకంగా కొన్ని సంవత్సరాల క్రిందటి వరకు అభిమానించిన ఆట. ముఖ్యంగా సంక్రాంతిసందర్భములో, ఈ ఆటను అత్యంత ఆసక్తితో ఆడేవారు. ఈ ఆట గూడ పలనాటి వీరచరిత్రలో చక్కగా వర్ణితమైనది. బొంగరాల ఆట మన గ్రామాలలో మిక్కిలి ప్రచారములోనున్న క్రీడ; పిల్లలకు ఈ ఆటలో మిక్కిలి ఆసక్తి. ఇవన్నీ గృహాల వెలుపల బహిరంగ ప్రదేశాలలో ఆడే ఆటలు. ఈ ఆటలు ఆడుతూ వుంటే జనులు యెంతో ఉత్సాహంతో వీనిని తిలకించుతుంటారు.

ఈ ఆటలతోపాటు కాలక్షేపము కొరకు, యిండ్లలో కూర్చుండి ఆడే ఆటలు ప్రత్యేకమైనవి కొన్ని వున్నవి. ఈ ఆటలలో చదరంగము మిక్కిలి ముఖ్యమైనదే కాక చాల ప్రసిద్ధి చెందినది. అసలు ఈ ఆట మొట్టమొదలు మనదేశములోనే ప్రారంభమైనదని కొందరు చెప్పుతు

తుంటారు. ఏమైనప్పటికి, ఈఆటకు మన పల్లెటూళ్ళలోని కుటుంబాలలో మంచి ప్రచారము వున్నది. ఈ ఆట ఆడటంలో కొందరు సాటిలేని నైపుణ్యము కలిగి వుంటారు. చదరంగము వంటి ఆట యింకొకటి పులి జూదము. ఈ పులి మూడురకాలుగా వున్నది. ఒక పటము మీద, చిన్న రాళ్ళనో లేక చింతగింజలనో తీసికొని, కొన్నింటిని పులులుగాను, మరికొన్నింటిని మేకలుగాను భావించి, ఆడే ఆట యిది. పుళ్ళసంఖ్య మూడింటికన్న మించదు. మేకల సంఖ్య పదహారింటి వరకు వుంటుంది. ఒకరు పులులను తీసికొని, యింకొకరు మేకలను తీసికొని ఈ ఆటను ఆడుచుందురు. ఇప్పుడు ప్రచారము తగ్గిపోయినా, యిటీవల వరకు, మన పల్లెటూళ్ళలోని ఉన్నత కుటుంబాలలో విశేష ఆసక్తితో ఆడిన ఆట పాచికల ఆట; దీనికి అక్షక్రీడ అని మరొక పేరు వున్నది. ఈ ఆట గూడ తరతరాల నుండి మనదేశములోని ప్రజలను ఆకర్షించినది. మన ప్రబంధాలలో ఈ ఆటను రమణీయంగా మన కవులు వర్ణించినారు. రుక్మిణీ కృష్ణులు ఈ ఆటను ఆడినట్లు ఉత్తర హరివంశములో మనోహరముగా వర్ణింపబడినది. ఈ తరగతికి చెందిన యింకొక ఆట పచ్చీసు. ఈ ఆటలో స్త్రీలకు ఆసక్తి ఎక్కువ. రంగుగుడ్డతో అందముగా పచ్చీసును కుట్టించి. దానిమీద పూసలతో యిండ్లను యేర్పాటు చేసి, గవ్వలను వేస్తు ఈ ఆటను ఆడే దృశ్యము పల్లెటూళ్ళతో యేమాత్రము కొద్దిపరిచయము కలిగిన వారికైనా బాగా పరిచితమైనదే. ఈ ఆటలు మన గ్రామీణ సంస్కృతి శోభకు మంచి ప్రతిబింబాలు.

జనులను వినోదిప జేయడానికి ప్రత్యేకంగా ఉద్దేశించిన వేడుకలు యింకా యెన్నో మన పల్లెటూళ్ళలో చూడవచ్చును. వినోదాలే వృత్తిగా కలిగినవారు గూడ కొందరున్నారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రోత్సాహము లేనందువలన జీవనోపాధి కొరకు వీరు యితర వృత్తులను అవలంబించడం చేత వీరి సంఖ్య తగ్గిపోతున్నది. బొబ్బిలి, బాల నాగమ్మ కథలు చెప్పేవారిని గూర్చి యింతకుముందే ప్రస్తావించినాను.

గంగిరెద్దులను అలంకరించి, యిల్లిల్లు తిరిగేవారు ఈ శ్రేణికి చెందిన వారే. పగటి వేషాలను వేసి, ప్రజలను వినోదింప జేసేవారు మనకు కనుపిస్తుంటారు. వీరిని పగటి వేషాల వారనీ, బహురూపులవారనీ పిలుస్తుంటారు. విప్రవినోదులనే వారు గారడీ విద్యలో ప్రవీణులు. వీరు అనేక ఇంద్రజాల ప్రదర్శనలు చేస్తుంటారు. వీరందరూ, జనుల పోషణ మీద ఆధారపడి ఈ పనులను వృత్తిగా తీసికొని, అందులో గొప్ప నైపుణ్యం సంపాదించినటువంటివారు.

పల్లెటూళ్ళలో ఉయ్యాల లూగుట బాలబాలికలలే గాక పెద్దలు గూడ మిక్కిలి మక్కువ జూపించే క్రీడ. ఏదో విధమైన ఉయ్యాలను అనేక గృహాలలో చూడవచ్చును. ఈ మధ్య యితర క్రీడల వలెనే, సన్నగిల్లిపోతున్నప్పటికినీ గుర్రపుస్వారీ, మన గ్రామాలలో బాగుగా అభిమానించిన క్రీడ, మల్లయుద్ధాలు, కుస్తీలు మొదలైనవి తరతరాల నుండి మన వారు అభిమానించి, ప్రోత్సహించిన క్రీడలు. తెలుగు దేశంలోని జమీందార్లు యిందులో ప్రవీణులైన వారిని తమ ఆస్థానాల లోనికి చేరదీసి వారిని పోషించిరి. దసరా పండుగ సందర్భాలలో ప్రజల సమక్షాన యీ మల్లయుద్ధ ప్రదర్శనాలు, కుస్తీలు జరిపించి వారిని బహూకరించే ఆచారము యిటీవలివరకు మన పల్లెటూళ్ళలో చూడవచ్చును.

కొన్ని వేడుకలు, వినోదాలు, క్రీడలు ప్రత్యేకమైన సందర్భాలలో జరుగుతుంటవి. దసరా పండుగకు ముందు, తొమ్మిది దినాలు బాణసంచాలను కాల్చడం జనుపకట్టలను కాల్చడం ఈ తరగతికి చెందిన వినోదము. పిల్లలు ఈ తొమ్మిది రోజులు ప్రతిరోజూ ఈవేడుకను జరుపుకుంటూ ఆనందిస్తారు. హోళీ పండుగ సందర్భంలో ఒకరిమీద మరొకరు రంగులు చల్లుకోవడం కూడ యిటువంటి వేడుకయే, ఏరువాక పున్నమ అనగా జేష్టపున్నమ. రైతులకు మిక్కిలి సంతోషకరమైన పబ్బము.

ఆనాడు వారు తమ యెడ్లను కడిగి, వాటిని రంగు రంగులతో అలంక రించి, తమ నాగళ్ళమీద ఎర్రమన్నుతోను, సున్నముతోను పట్టెలను వేసి, ఆ నాగళ్ళను బుజాలమీద వేసికొని, యెడ్లతోపాటు ఊరేగి, పొలాలకు వెళ్ళి దుక్కి దున్ని ఆ సంవత్సరపు వ్యవసాయపు పనులను అత్యంత ఉత్సాహముతో ప్రారంభింతురు. శ్రీరామనవమినాడు బండ్లను గట్టుకొని ఊరేగుట పల్లెటూళ్ళలో మనము గమనించే మరొక వేడుక. సంక్రాంతికి తీర్థాలకు వెళ్ళే ఆచారము తెలంగాణపు పల్లెటూ ళ్ళలో ప్రజలకు మిక్కిలి ప్రేమపాత్రమైన వేడుక. బండ్లను గట్టుకొని తమ తమ కుటుంబాలతో సంక్రాంతి నుండి శివరాత్రి మధ్య జరిగే ఈ జాతరలలో వీరు పాల్గొంటారు. ఇటువంటి జాతరలలో ప్రసిద్ధమైనవి కొరివి జాతర, ఐనవోలు జాతర, మేడారము జాతర మొదలైనవి. ఈ జాతరలలో అసంఖ్యాకముగా జనులు పాల్గొంటారు దేవాలయాలలో సీతాకల్యాణము మొదలైన ఉత్సవాలు జరిపించడం పల్లెటూరు ప్రజ లకు అభిమానస్పదమైన వేడుక. శక్తిపూజలు పల్లెటూరి ప్రజానీక ములో చాల ప్రచారంలో వున్నవి. దుర్గ, కాళి, ఎల్లమ్మ మొదలైన దేవతలకు మేకపోతులను బలియిచ్చే వేడుక చాల ప్రసిద్ధమైనది.

ఈ విధంగా అన్ని తరగతుల వారికి అభిమానాస్పదమైన వేడు కలు, వినోదాలు మన పల్లెటూళ్ళలో పుష్కలముగా వున్నవి. కొన్ని వినోదాలు, క్రీడలు స్త్రీలకు మాత్రమే ప్రత్యేకమైనవి. ఇందులో కోలాటము ముఖ్యంగా పేర్కొనదగినది. కామునిపున్నమునకు ముందు వెన్నెల రాత్రులలో యువతులు ఈ కోలాటము వేసే పద్ధతి తెలంగా ణపు పల్లెటూళ్ళలో బాగా ప్రచారంలో వున్నది. పురుషులు గూడ కోలాటము వేయడం, ఆ సందర్భాలలో పాటలు పాడడం కొన్ని ప్రాంతాలలో కనుపిస్తుంది. అందుచేత దీనిని స్త్రీ పురుషులకు సమాన ఆదరణీయమైన క్రీడ యని కూడ చెప్పవచ్చును.

ప్రత్యేకంగా బాలికలు అభిమానించే ఆట చెమ్మచెక్క ఆట. తెలుగు సీమలో ఏ పల్లెటూరికి వెళ్ళినా చూడవచ్చును. అచ్చనగండ్ల ఆట మన పల్లెటూళ్ళ బాలికలు అభిమానించే మరొక రమ్యమైన క్రీడ. కచ్చకాయలను ఎగురవేస్తూ, ఆడపిల్లలు ఈ ఆటను ఆడే దృశ్యము మిక్కిలి సుందరమైనది. ఓమన గుంటల ఆట ఆంధ్ర బాలికలకు, యువతులకు అభిమానాస్పదమైన క్రీడ. ఒక కట్టె దిమ్మెలో పద్నాలుగు గుంటలు చెక్కించి, వాటిలో చింత గింజలు పోసి ఈ ఆటను ఆడుతుంటారు. ఈ విధమైన కట్టె దిమ్మెలు పల్లెటూళ్ళకు వెళ్ళి చూస్తే అనేక కుటుంబాలలో కనిపిస్తుంటవి. గుజ్జనగూళ్ళ ఆట గూడ బాలికలకు ప్రత్యేకమైనది. రుక్మిణీదేవి చిన్నప్పుడు ఈ ఆట ఆడినట్లు భాగవతంలో పోతనగారు తెలిపినారు. బొమ్మరిండ్లలో గూర్చుండి బాలికలు గురుగులలో రకరకాల పిండివంటలు వండి వడ్డించునట్లుగా వినోదించే ఈ ఆట ఆడపిల్లలకు మిక్కిలి ప్రియమైనది. గీరన గింజల ఆట ఆంధ్ర బాలికలు అభిమానించే మరొక క్రీడా విశేషము. ముగ్గులు వేయడం పల్లెటూరి బాలికలకు, యువతులకు మిక్కిలి ఆహ్లాదకరమైన వేడుక. రకరకాల ముగ్గులను వేయడంలో నైపుణ్యము ప్రదర్శించే స్త్రీలు మన పల్లెటూళ్ళయందు పుష్కలముగా కనుపిస్తుంటారు. ఈ ముగ్గులు తెలుగు పడతుల సౌందర్యారక్తికీ, కళాభిరుచికీ, మేలి ఉదాహరణాలు. ఈ నాడు యెక్కువగా వ్యాప్తిలో లేకపోయినా చిలుకలను పెంచి, వానికి బుద్ధులు చెప్పి వినోదించుట తెలుగుసీమలోని పల్లెటూళ్ళయందలి సంపన్న గృహాలలోని సుందరాంగుల వేడుకలలో బహు రమ్యమైనది.

బతకమ్మ పండుగ, బొడ్డెమ్మ పండుగ స్త్రీలకు ఆనందకరమైన క్రీడలు; వేడుకలు. ఈ రెండింటిలోను వారు గౌరీ దేవిని పూజించుచుందురు. మహాలయామవాస్యకు ముందుగా బొడ్డెమ్మలను, అమావాస్యనాటి నుండి బతకమ్మను ఆడుట పల్లెటూళ్ళలో ఆచారంగా

వున్నది. బొడ్డెమ్మను ఒక పీటమీద మన్నుతో నిర్మించుదురు. బతకమ్మను తంగేడుబూవులతో, గుమ్మడి బూవులతో, గోరంటపూవులతో సుందరముగా కూర్చి పేర్చుతారు. సాయంకాలపు పూట బొడ్డెమ్మకు, బతకమ్మకు చుట్టు బాలికలు, యువతులు, ముత్తైదువలు చేరి, పాటలు పాడుతూ వినోదిస్తుంటారు.

ఈ విధంగా మన పల్లెటూళ్ళ జీవితాన్ని పరిశీలించితే, క్రీడలకు, వినోధాలకు మనవారు యెంత ముఖ్యమైన స్థానాన్ని యిచ్చినారో వెల్లడి కాగలదు. క్రీడాభిరామమైన పల్లెటూరి జీవితములోని ఉత్తమ సంస్కృతిని ఈ క్రీడలు, వేడుకలు వినోదాలు మనకు వెల్లడి జేస్తున్నవి.

(రేడియో ప్రసంగము 1959)

-( : o : )-

# జానపద నృత్య సంగీతాలు

పుస్తకాలు, చదివి సంపాదించిన విజ్ఞానము లేక ఆధునిక నాగరికతతో సంపర్కము లేక పల్లెపట్టులలో నివసించే ప్రజానీకాన్ని మనము జానపదులమని పిలువవచ్చును. ఈ జానపదుల జీవితాన్ని కొంచెము పరిశీలిస్తే అందులో సారస్వతానికి, కళలకు, విశేషించి నృత్యానికి సంగీతానికి సముచిత ప్రాధాన్యము కలదని వెల్లడి యౌతుంది. పాటలు, గేయాలు, కథలు మొదలైన అపారమైన సారస్వతము వీరి నాలుకల మీద నాట్యమాడే దృశ్యాలను ఎన్నింటినైనా మనము పల్లెటూళ్ళలో పరికించవచ్చును. కాని ఈ శతాబ్దంలో కొన్నాళ్ళ నుండి అనేక కారణాలవల్ల ప్రజాసారస్వత మని చెప్పదగిన ఈ పాటలు, గేయాలు, జానపదుల పలుకుబళ్ళలో ప్రాధాన్యాన్ని కోల్పోతున్నట్లు కనుపిస్తున్నది.

జానపదుల సారస్వతములోనే కాక వారి నృత్య సంగీతాలలో కూడ ప్రత్యేకత. విశిష్టత కనుపిస్తున్నవి. అలంకార శాస్త్రాలు, లక్షణ గ్రంథాలు నిర్ణయించిన ప్రమాణాలకు పట్టుపడని వారి సాహిత్యము వలెనే. వారి నృత్య సంగీతాలు గూడ లాక్షణిక గ్రంథాలకు అతీతమై యున్నవి. భరతుడు తన నాట్య శాస్త్రములో ఈ జానపదుల నృత్యాన్ని గూర్చి కొంత ప్రస్తావించి నప్పటికిని, తరువాత, అలంకారికులు వాని ఉనికినే గమనించినట్లు కానరాదు. జానపదుల సారస్వతములో మనదేశ సంస్కృతి ప్రతిబింబించినట్లే వారి నృత్య సంగీతాలలో కూడ మన దేశీయ సంప్రదాయాలు ప్రతిఫలించుచున్నవి. జానపదుల రుచులను, అభిరుచులను తెలియజేసే అద్దము వంటివి, ఈ నృత్య సంగీతాలని నిస్సందేహంగా చెప్పవచ్చును. సారంగపాణి పదాలవంటివి జానపద వాఙ్మయానికి, నృత్య సంగీతాలకు గూడ ఆటపట్టులు- జానపద వాఙ్మయంలో వలెనే. నృత్య సంగీతాలలో కూడా భారత భాగవత

రామాయణాల ప్రభావము ప్రముఖంగా కనుపిస్తుంది. పురాణ గాథల పరిచయము అడుగడుగునా తొంగి చూస్తుంటుంది.

తెలుగు సీమలో యక్షగానాలు క్రమక్రమంగా నాటకాలుగా పరిణమించి వ్యాప్తిలోకి వచ్చినవి. ఈ యక్షగానాలను మొట్టమొదలు జనులు వీధులలో వేషాలుగట్టి వినిపించేవారు. కేవలము వినిపించడమే కాదు పాడుతూ ఆడేవారని కూడ తెలుస్తున్నది. ఈ విధంగా జానపదుల నృత్య సంగీతాలే ఈ యక్షగానాలకు జన్మస్థానాలని తోస్తున్నది. పగటివేషాలలో, బొమ్మలలో, యక్షగానాలలో, నాటకాల క్రమపరిణామము మనకు కనిపిస్తున్నది.

కురువంజి అనే నృత్యసాంప్రదాయాన్ని జానపద నృత్యమనే చెప్పవచ్చును. కురువలు అనే ఆటవికజాతి వారు తిరుపతి, శ్రీశైలము మొదలైన పుణ్యక్షేత్రాలలో యాత్రికుల వినోదము కోసము నృత్యము చేస్తుండేవారు. జానపదులు వర్ధిల్ల జేసిన ఈ నృత్యానికి మొదలు కురవంజులనే పేరు కలిగినది. గ్రామప్రాంతాలలో ఇటీవలవరకు కథలు చెప్పించే అలవాటు ఉండేది. ఈ కథలలో బొబ్బిలికథ, బాలనాగమ్మ కథ మొదలైనవి సుప్రసిద్ధాలు. రసాత్మకాలయిన ఈ కథలను చెప్పే సందర్భంలో జానపద నృత్య సంగీతాలకు ప్రత్యేక ప్రాధాన్యము పల్లెటూళ్ళలో కోలాటము, చెమ్మచెక్కలు, మొదలైనవి బాలికలకు అత్యంత ప్రియమయిన ఆటలు. ఈ ఆటలలో భజన కీర్తనలు పాడుతూ —

"గొల్లవారి వాడలకు కృష్ణమూర్తి నీవు
యేమి పనులు కొచ్చినావు కృష్ణమూర్తి
పాలకొరకు వచ్చినానే గొల్లభామా మంచి
పాలుబోసి నన్నుబంపు గొల్లభామా"

అని నృత్యము చేస్తున్న దృశ్యము మిక్కిలి మనోహరమైనది. ఇదే విధంగా ఒప్పులకుప్పా, ఒయ్యారిభామా మొదలైన ఆటలలో జానపద

నృత్యం ప్రతిబింబిస్తుంది. వెన్నెల రాత్రులలో కామునిపున్నమకు ముందు పలెటూళ్ళలో యువతీయువకులు వేసే కోలాటాలు, నృత్య సంగీతాలకు ఆటపట్టులు.

జానపదులు సంగీత ప్రియులు. తోటలలో, పొలాలలో, చెలక కలలో, మంచెలమీద కూర్చుండి రాగమాలాపించే రైతు, సాయం కాలము గోధూళి సమయాన ఇంటికి పశువులను తీసికొని పోతూ పాట పాడే యువకుడూ, పొలములో విత్తనాలు వేస్తూ, కలుపుదీస్తూ, కోతలుకోస్తూ, ఇండ్లలో పిండి విసురుతూ, వడ్లు దంచుతూ, రకరకాల పాటలు పాడే ఆడపడచులూ, జానపదుల జీవితంలో సంగీతము యే విధంగా చొచ్చుకొని పోయిందో ఋజువు చేస్తున్నారు. పండుగ పబ్బాల సందర్భంలో వరసగలవారితో పరిహాసాలు ఆడే వేళలలో, మంగళహారతులు యిచ్చే సమయాలలో, తొట్లెలో పసిపాపను ఊపుతూ నిద్రబుచ్చే సందర్భాలలో హృదయాలు కదలి శ్రావ్యంగా ఆలపించేపాటలు జానపదుల సంగీతంలో ముఖ్యభాగం కాక యింకేమి ? జానపదుల సంగీతాన్ని దేశీ సంగీతమని చెప్పడం కలదు. ఈ దేశీ సంగీ సంగీతము జనసామాన్యానికి మిక్కిలి హృదయంగమమైనది. గుణ ములో ఉత్తమశ్రేణికి చెందిన జానపదుల పాటలలో వైవిధ్యము చాల యెక్కువగా కనిపిస్తున్నది. జీవితంలో అనేక సన్నివేశాలను ఈ పాటలు చిత్రించుతున్నవి. ఈ పాటలను, పదాలు. మంగళహారతులు, పాటలు అని మనము స్థూలముగా విభజించవచ్చును. పదాలలో ప్రభాత పదాలు, వెన్నెలపదాలు, కోకిలపదాలు, చిలుక పదాలు, గొబ్బిపదాలు మొదలైన వానిని లెక్కించవచ్చును. పాటలలో లాలిపాటలు, జోల పాటలు, ఏలపాటలు దరువులు సుద్దులు అప్పగింతపాటలు మొదలైన వానిని చేర్చ వచ్చును; గొల్లసుద్దులు ప్రఖ్యాతి గాంచిన పాటలు.

ఈ విధంగా ఇవన్నీ జానపదుల సరస జీవితానికి చాల మంచి ప్రతిబింబాలు, తోలుబొమ్మలాటలు, భాగవతాలు, జానపదులు ప్రేమతో పోషించి వర్ధిల్లజేసిన కళాసంప్రదాయాలు.

ఈ పాటలుపాడే పద్ధతి గూడ ప్రత్యేకమైనది. జానపదుల సంగీతానికి శాస్త్రీయమైన నియమాలు కల్పించడం కష్టసాధ్యము; వీనికి రాగతాళాలను నిర్ణయించడం మిక్కిలి ప్రయాసతో కూడుకొని సంగీత శాస్త్రంలో నిష్ణాతులైన ప్రజ్ఞావంతులు చేయవలసిన పని. బొబ్బిలికథ, పల్నాటివీరుల కథలను చెప్పడంలో, వివిధ సంగీతరీతులను అనుసరిస్తుంటారు. వీనిని బాగుగా పరిశీలించవలసి వున్నది.

ఈ జానపద సంగీతాన్ని, నృత్యాన్ని తమసొమ్ముగా చేసికొనిన తెగలవారు తెలుగుసీమలో కొందరున్నారు. కాని క్రమక్రమంగా వీరి సంఖ్య తగ్గిపోతున్నది. ఈ విధంగా ఈ పాటలు పాడే వారికి తగిన ప్రోత్సాహమూ, పోషణా లేకపోయినందువలన కాబోలు, భిక్షాటనము చేయవలసిన దుస్థితికి వీరు గురియౌతున్నారు. వీరికి బిచ్చముగూడ తగినంత దొరకని దుస్థితి మిక్కిలి దుస్సహమైనది. దేశద్రిమ్మరులై, ఊరూరు తిరుగుచూ, జీవనోపాధిని కల్పించుకుంటున్న వీరిని ఆశ్రయించివున్న సంగీత నృత్యాలు నశించిపోకుండా కాపాడవలసిన అవసరము ఎంతో వున్నది. బాలసంతులు, బుడబుడకలవారు, జంగములు దాసరులు, భాగవతులు, పిచ్చుక గుంటులు, వీరముష్టులు మొదలైన ఈ తెగలవారు యీనాడు చాల తక్కువగా కనిపిస్తున్నారన్న విచారకరమైన సత్యాన్ని మనము గమనించవలసి వున్నది. ఈ తెగలలో అజ్ఞాతవాసము చేస్తున్న సాహిత్యాన్ని, సంగీత నృత్యాలను సకాలములో కాపాడకపోతే, కొంతకాలము తరువాత అదృశ్యంకాగల ప్రమాదము గోచరిస్తున్నది.

ఈ జానపదులు సంగీత నృత్యాలలో ఉపయోగించే సాధనాలు, వాద్యాలు కొన్ని ప్రత్యేకమైనవి వున్నవి. వీని ఉపయోగం కూడా యీ రోజు చాలా తక్కువగా కనుపిస్తున్నది. గజ్జెలు కట్టుకొని నృత్యము చేయడం, కొమ్ము ఊదడం, పిల్లనగ్రోవి పాడడం, నాగస్వరము వాయించడం మొదలైనవి జానపదుల ప్రత్యేకతలు. చిరుతలు

చేతులలో నుంచుకొని, తాంబూర పట్టుకొని, ఇంటింటికి వచ్చే హరి దాసు, యీనాడు పల్లెటూళ్ళలో చాల తక్కువగా కనిపిస్తుంటాడు. అందెలు, తాళాలు,కొమ్ము జమిడికలు, గజ్జెలు, కోలలు మొదలైన సాధ నాలు జానపదుల నృత్యసంగీతాలలో కనుపిస్తుంటవి. లంబాడీలుకోయలు మొదలైన వారిలో ప్రత్యేకమైన నృత్య సంగీతాలు గోచరిస్తున్నవి.

ఈ విధంగా జానపదుల ప్రత్యేకసారస్వతము, సంగీత నృత్యాలు తత్సంబంధమైన సంప్రదాయాలు అపారంగా వున్నవి. వీనిని సాధించే వారు కూడ ప్రత్యేకమైన తెగలకు, కులాలకు చెందినవారై వున్నారు. ఈ సాధనలో రకరకాల వాద్యాలను ఉపయోగించడం గమనింపవలసి వున్నది.

చదువు సంధ్యలు రాకపోయినంత మాత్రాన వ్రాతపూతలు తెలియనంత మాత్రాన, ఆధునిక అభిరుచులను కలిగిలేనంత మాత్రాన, నేటి నాగరికతా ప్రభావానికి లోనుగాకపోయినంత మాత్రాన జాన పదుల జీవితాలు రసహీనమై, శుష్కమైనవి కావు. ఉన్నతవిద్యావంతుల హృదయాలవలెనే జానపదుల హృదయాలు గూడ, వివిధ సన్నివేశా లలో రసార్ద్రములు కావడం జరుగుతుండును, ఈ విధంగా జరిగినప్పుడు మెరుపును చూచి ఫించము విప్పే నెమలివలే, మామిడి చివుళ్ళు తిని మత్తిల్లిపాడే కోకిలవలె, సంగీత నృత్యాలతో వారిజీవితాలు ఉప్పొంగు తుండును. కళా సౌందర్యానికి ఆటపట్టయిన సందర్భాలు జానపదుల జీవితాలలో పుష్కలంగా వున్నవి. దానిని చక్కగా ఆకళించుకొని, అందులోని ఉత్తమ కళా సంప్రదాయాలు చిరస్థాయిగా చేయవలసిన కర్తవ్యాన్ని మనము మరచిపోగూడదు.

(రేడియో ప్రసంగము — 1959)

—:•:—

# గాలిబ్ గీతాలు

భారతదేశ చరిత్రలో మొగలులు పరిపాలించిన కాల మొక ప్రత్యేక అధ్యాయము. ఈ అధ్యాయమును గూర్చి యెవరు యేమి అభిప్రాయాలు ప్రకటించనప్పటికిని, ఈ యుగము ప్రత్యేకతలలో రెండుమాత్రము నిర్వివాదాస్పద మైనవని సర్వజనులు అంగీకరించి యున్నారు. ఈ రెండింటిలో మొదటిది ప్రపంచప్రఖ్యాతిగాంచిన సౌందర్యనిలయము తాజ్‌మహాల్; రెండవది మనగాలిబ్ మహా కవీంద్రుడు. ఇందు వలన గాలిబ్ మహాకవి వ్యక్తిత్వమును ఆంధ్రపాఠక మహాశయులు ఊహించుకొనవచ్చును. మహామేధావి, గొప్ప విజ్ఞాని, సాహితీసార్వభౌముడునైన కీర్తిశేషుడు మౌలానా అబుల్‌కలాం ఆజాద్ ఒక పర్యాయము ఆత్మ పరీక్షా దృక్పథముతో ప్రసంగించుచు తన అభిప్రాయాలమీద తన జీవిత దృక్పథము మీద గాలిబ్ కవి శేఖరుని ప్రభావము గోచరించునని చెప్పిన మాటలను యీ సందర్భమున పేర్కొన వలసియుండును.

గాలిబ్ మహాకవి ఆంధ్రమహాజనులకు - విశేషించి పూర్వపు హైదరాబాదు రాష్ట్రమున నివసించినవారికి - క్రొత్త వాడుకాడు. ఉర్దూపరిచయము గలిగిన ప్రతివారికిని గాలిబ్ సుపరిచితుడు. కాని చిత్రమేమనగా ఆ గాలిబ్ కవిత్వమును తెలుగు లోనికి తీసుకొని వచ్చుటకు యీనాటి వరకును సరియైన ప్రయత్నము జరుగలేదు. అరబ్బీ, ఫారసీ, ఉర్దూ, భాషలలో ప్రవీణులైనవారు, రచనాశక్తి, గలిగినవారు ఎవరును తమ దృష్టిని యీవంక ప్రసరించలేదు. ఉమర్ ఖయ్యాం మన వారిని చాల మందిని ఆకర్షించినాడు. బహుశా గాలిబ్ అనువాదము శ్రీదాశరథికి వదలివేయుట విధి విధానమేమో! మహా పురుషులకువలె మహా కవులకుగూడ ప్రకృతికొన్ని కర్తవ్యములను నియమించుచుండును. భారత రామాయణాలను ఆంధ్రీకరించిన పూర్వ

కవులు భాగవతమును తనకు విడిచిపెట్టినారేమో యని పోతనా మాత్యుడు చెప్పుకొనినాడు. శ్రీ దాశరథి కవీంద్రుడే గాలిబ్ కవిత్వమును ఆంధ్రీకరించుటకు తగిన సమర్థుడని పూర్వకవులెవరును ఇందుకు ప్రయత్నించలేదేమో ! ఈ యాలస్యము ఆంధ్రభాషకు లాభదాయకమైనదని శ్రీ దాశరథి అనువాదము రుజువు చేయు చున్నది. ఈనాడు మనదేశములో ఒక భాషలోని మహాకవులను ఇతరభాషలకు పరిచయము గావించుటకు బ్రహ్మాండమైన కృషి జరుగు చున్నది. భారతస్థాయిలో జాతీయ దృక్పథమును పెంపొందించుటకు విద్వాంసులు రచయితలు కంకణము కట్టుకొని ముందడుగు వేయు చున్నారు. ఈ తరుణమున గాలిబ్ కవీశ్వరుడు తెలుగు సీమకు పరిచితు డగుట సర్వవిధాల సముచితముగా నున్నది. శ్రీ దాశరథి లేఖిని ద్వారా యీపని జరుగుటవలన బంగారమునకు పరిమళమబ్బినది...

ఉర్దూసాహితీ ప్రపంచమునకు గాలిబ్ కవీశ్వరుడు సూర్యుని వంటి వాడు. ఉర్దూ సారస్వతమున గాలిబ్ మహాకవిది ఉన్నతోన్నత మైన స్థానమని సాహిత్యచరిత్రకారులు, విమర్శకులు ఏకకంఠముగా అంగీకరించియున్నారు. మన శ్రీనాథుని వలె గాలిబ్ విద్వాంసుడైన కవిసార్వభౌముడు. కొంచెము పరిశీలించినచో ఉభయులయందు కొన్ని పోలికలుగూడ గోచరించగలవు. శ్రీనాథునివలె గాలిబ్ కూడ భోగము లందు ఆసక్తిని, ప్రీతినికలిగి, వానిని నిర్భయముగా ప్రకటించిన స్వైరవిహారధీరుడు; స్వతంత్రుడు; కావుననే ఈ యిద్దరి రచనలయందు శక్తిమంతము, ప్రతిభావంతము నైనవారి వ్యక్తిత్వము అడుగడుగున ప్రత్యక్షమగుచుండును. చరమదశలోఅనేక కష్టాల పాలైనప్పటికిని శ్రీనాథుడు తన జీవితములోని అత్యధిక భాగమును రాజాశ్రయము సంపాదించినాడు భోగకాంక్షలను నెరవేర్చుకొనవలెనని ఎంత ఉత్కంఠ కలిగి యుండి నప్పటికిని, అందుకొనుటకు ఎంత ప్రయత్నము గావించి నప్పటికిని గాలిబ్ మాత్రము కృతార్థుడు కాలేదు. కావున శ్రీనాథుని

తుదిదశ విషాదాంతమైనట్లుగా గాలిబ్ జీవిత మంతయును విషాద గాథయై యున్నది. శ్రీనాథుని భాషా ప్రౌఢిమ, వైదుష్యము- భావ గాంభీర్యము, గాలిబ్ రచనలలో కూడ పుష్కలముగా కనిపించు చుండును.

విలాసములందు ఎంత అనురక్తుడై నప్పటికిని విషాద జీవితమునే గడుపవలసివచ్చిన గాలిబ్ మహాకవి మరొక విధముగా చాల అదృష్ట వంతుడని చెప్పవలసి యున్నది. అందరు కవులవలెనే గాలిబ్ మహా కవికి గూడసమకాలికులమెప్పు సంపూర్ణముగా లభించక పోయినప్పటికిని మరణాంతరము ఉర్దూ కవులందరిలో నిర్వివాదాస్పదమైన అగ్ర గణ్యత ఆయ నకు లభించినది. గాలిబ్ రచనలకు "చొఘ్తాయి" వంటి ఉత్తమ చిత్రకారునికుంచె ప్రతిభావంతమైన వ్యాఖ్యానము గావించినది. ఎఖ్బాల్ మొదలైన మహాకవుల రచనలకుగూడ "చొఘ్తాయి" చిత్ర రూపము కల్పించినాడు. కాని గాలిబ్ కవిత్వమునకు వ్రాసిన చిత్రములేఅన్నిటికన్న యెక్కువగణ్యతనుపొందినవి. బహుశా ఈచిత్ర కారుడు గాలిబ్ వంటి చిత్తవృత్తి కలిగిన ప్రతిభావంతుడై నందువలన కాబోలు, గాలిబ్ కవిత్వమునకు సంబంధించిన చిత్రాలు సర్వోత్తమ మైనవిగా కీర్తిగాంచినవి. సైగల్ వంటి గొప్పగాయకుడు గాలిబ్ గీతాలను గానముచేసి ఉర్దూ భాషా ప్రియులకు హృదయాహ్లాదకరమైన వీనులవిందు గావించినాడు. గాలిబ్ జీవిత చరిత్రను వ్రాయుటకు హాలీవంటి గొప్ప పండితుడు, ఉత్తమ రచయిత లభించినాడు. హాలీ రచించిన గాలిబ్ జీవిత చరిత్ర ఉరుదూ వాఙ్మయములో గొప్పరచన. ఈ విధముగా చరిత్రకారుడు, గాయకుడు, చరిత్రకారుడు——ముగ్గురు గాలిబ్ కవీంద్రుని అజరామరుని గావించినారు.

గాలిబ్ వ్యక్తిత్వము సర్వవిధాల విశిష్టమైనది ఆచార విచారము లందు, ఆహారవిహారములందును, ఆయన విశిష్టత గోచరించు చుండును. గాలిబ్ శైలిని తరువాతి కవులు కొందరు అనుకరించుటకు ప్రయత్నించి

విఫలులైన సత్యమిందులకు నిదర్శనము. గాలిబ్ కవితను పరిశీలించినప్పుడు ఆయన తన వ్యక్తిత్వమునకు అత్యంత ప్రాధాన్యము నిచ్చినట్లు వెల్లడి కాగలదు. ప్రేమకవిత్వము వ్రాసిన ఉరుదూకవీశ్వరులది సాధారణముగా స్త్రీ దృక్పథము. కాని గాలిబ్ కవీశ్వరునిది మాత్రము పురుష దృక్పథము. గాలిబ్‌లో అహం చాలయెక్కువ. ఆయన ప్రత్యేకతకు ప్రధానకారణములలో ఇదియొకటి. ఈ ప్రత్యేకతకు గాలిబ్ రచనలన్నియును ఉదాహరణములే.

ఉర్దూభాషలో 'గజల్' సుప్రసిద్ధమైనది. ఉర్దూకవులలో అనేకులు యీ పద్ధతినే అనుసరించినారు. గాలిబ్ 'గజల్' రీతిలోనేగాక ఇతర రీతులలో గూడ కవనము అల్లినప్పటికినీ, గజల్ రీతికి గాలిబ్ సార్వభౌముడై యీ మార్గమున ఇతరులను మించి అగ్రగణ్యుడైనాడు. గజల్ కవితా రీతిని అనుసరించిన ఉర్దూకవులు రెండు విషయాలకు మాత్రమే హెచ్చు ప్రాధాన్యము నిచ్చినారు. మొదటిది ప్రేమ, రెండవది సూఫీతత్వము; కాని వీరందరివలెగాక గాలిబ్ మానవ జీవితమును సమగ్రముగా తన కావ్యదర్పణమున ప్రతిఫలింప జేసినాడు. జీవితమును దాని భిన్న దృక్పథములను చిత్రించిన మొట్టమొదటి ఉర్దూకవి గాలిబే యని చెప్పవచ్చును. జీవితరంగము, అందలివిలాసము, విషాదము, తీపి, చేదు, ఒడుదుడుకులు గాలిబ్ తన గజల్ కవిత్వంలో ప్రదర్శించి ఉర్దూకవులలో అద్వితీయమైన స్థానము నాక్రమించినాడు.

గాలిబ్ కవిమాత్రమేకాదు. గొప్ప వచన రచయిత గూడ. ఉత్తమ వచనమును వ్రాయవలెనని ఆయన ఉద్దేశించలేదు. తనకు మిత్రులు, ఆప్తులు, శిష్యులునైన వారికి వ్రాసిన లేఖాపరంపరలో గాలిబ్ వచనశైలిని మనము రుచిచూచుచున్నాము. ఈలేఖాపరంపరలోని శైలి, ఉర్దూ వాఙ్మయములో నూతన యుగానికి దారితీయగలదనికాని ఆధునిక ఉర్దూ వచన వాఙ్మయానికి ఆదర్శపాత్రము కాగలదని కాని ఆనాడు గాలిబ్ భావించియుండలేదు. ఉర్దూ భాషలో ఉత్తమ

వచన రచయితలుగా వన్నె కెక్కిన హాలీ, షిబ్లీ, సర్ సయ్యద్, అహమద్ ఖాన్. నజీర్ అహ్మద్ ప్రభృతులకు గాలిబ్ శైలి ఒరవడియైనది. వీరి రచనలు ఆధునిక ఉర్దూ వచన వాఙ్మయానికి ఆచార్య పీఠములైనవి. సారస్వతములో అనేక మార్గాలను త్రొక్కినప్పటికిని, గాలిబ్‌కు ఆచంద్ర తారార్కమైన కీర్తిని కలిగించి ఉర్దూ వాఙ్మయములో ఆయనకు అగ్రగణ్యత్వమును ప్రసాదించినది, ఆయన గజల్‌తోపాటు ఆయన లేఖలలోని వచనశైలి. లేఖారూపమున గాలిబ్ వచనరచనలలో ఆయన శక్తివంతమైన వ్యక్తిత్వము. సర్వతోముఖమైన ప్రతిభ మనకు కనిపించుచున్నవి. ఆధునిక కాలములో ఉర్దూ వాఙ్మయమున ఇటువంటి వ్యక్తి నిజానికి కీర్తిశేషులైన మౌలానా అబుల్‌కలాం ఆజాద్ ఒక్కరే.

తెలంగాణా మహాకవి-కాదు సకలాంధ్ర మహాకవి- శ్రీ దాశరథి గాలిబ్ కవిత్వమును ఆంధ్రీకరించుట మిక్కిలి సంతోషకరమైన సంఘటన. శ్రీ దాశరథిని తెలుగు పాఠకలోకానికి పరిచయము చేయవలసిన ఆవశ్యకతలేదు. జగమెరిగిన బ్రాహ్మణునికి జంధ్యమేల? ముంజేతి కంకణానికి అద్దమెందుకు? మన జాతీయోద్యమాలన్నింటి యందును పాల్గొని ఆధునికాంధ్రావని ఆశయాలకు. మనోరథాలకు ప్రాతినిధ్యము వహించిన శ్రీ దాశరథి మహాకవి అనువాదమును మిక్కిలి ప్రతిభావంతముగా నిర్వహించినారు; అనువాదధోరణి చాల సరసముగానున్నది. అనువాదమునకు స్వీకరించిన ఛందస్సు, భాష ఔచిత్య శోభితములై యున్నవి. శ్రీ దాశరథి అనుసరించిన ఛందస్సు గజల్ పోకడకు అనుగుణముగా నున్నది. అనువాదకునికి మూల గ్రంథకర్తతో సమానమైన భావనాశక్తి అవసరమై యుండును. ఆ భావనాశక్తి శ్రీ దాశరథికి సంపూర్ణముగా కలదని ఈ అనువాదములోని ప్రతిపంక్తి నిరూపించుచున్నది. అనువాదము చేయుటలో శ్రీ దాశరథి చూపించిన నేర్పు అనన్యము. గాలిబ్ కవిత్వములోని హైందవేతర వాతావరణమును హైందవ వాతావరణముగా పరివర్తించుటలో దాశరథి ప్రత్యేక ప్రతిభ చూపించినాడు.

"ఏడి మాంధాత ? పురుకుత్సుడేడి నేడు ?"

"గుడిని శివుడు దొరుకకున్న కాశికిగాని
పరుగులెత్తి నేను బడయగలను."

"లోకమందు సుఖము, శోకమ్ము గలవండ్రు
శోక మొకటె యిచ్చె నాకు బ్రహ్మ".

ఈ పద్యపాదములు దాశరథికి ఉరుదూ, ఫారసీ భాషలలోగల ప్రావీణ్యమునకు, ఆ సంప్రదాయములతోగల పరిచయమునకు, దానిని మన వాతావరణములోనికి తీసికొని వచ్చుటలోగల శక్తిసామర్థ్యాలకు మంచి తార్కాణములుగా నున్నవి. ఉమర్ ఖయ్యాంను జీర్ణించుకొని ఆంగ్లభాషలో పరివర్తించిన ఫిట్జుజీరాల్డువలె దాశరథి గాలిబ్ కవిత్వమును హృద్గతము గావించుకొని అనన్య సాధ్యమైనరీతిని ఆంధ్రీకరించినాడు. మూలమునకు అనువాదము ఇంత సన్నిహితముగా నుండుట కష్ట సాధ్యము. ఈ అనువాదము కడు సరసముగా సాగినది. పూర్వజన్మలో దాశరథియే గాలిబేమో; లేక ఈజన్మలో గాలిబే దాశరథియై అవతరించెనేమో !

ఉరుదూ కవులలో ఎవరును తమ రచనలను తామే యేరి కూర్చి ప్రకటించి యుండలేదు. కాని గాలిబ్ మాత్రము ఆ పనిని గావించినాడు. తన జీవితకాలములో స్వయముగా తానే యేరి కూర్చి ప్రకటించిన కావ్యభాగములు వాస్తవముగా ఆయన కవిత్వములో ఉత్తమోత్తమమైనవి. ఈ గ్రంథము దాశరథికి ఎంతవరకు ఉపయోగించినదో తెలియదు. ఎందుకనగా ఆ సంపుటపు ప్రతులు నేడు లభ్యమగుటలేదు. గాలిబ్ గజల్‌ను ఒక్కొక్క దానిని తీసికొని ఆమూలాగ్రముగా దాశరథి అనువదించలేదు. గజల్‌లో కొన్ని 'షేర్' లనే తీసికొని ఆంధ్రీకరించినాడు. ఈ పద్ధతి మిక్కిలి ఔచిత్యవంతముగా సరసముగా నున్నది. గాలిబ్ గజళ్ళలోని ఉత్తమ విభాగములను ఎన్నుకొనుటలో దాశరథి కవితా హృదయము, ప్రతిభ ప్రతిబింబించుచున్నది.

దాశరథి యేరి కూర్చిన ఈ ఖండ కృతులలో గాలిబ్ కవి ప్రేమార్ద్రి హృదయము తొంగి చూచుచున్నది. గాలిబ్ ప్రేయసి ఒక మారు ప్రసన్నురాలు; మరియొకమారు పరాఙ్ముఖురాలు; 'తుణ తుణ ముల్ జవరాంద్ర చిత్తముల్' అన్నట్లుగా నున్నది ఆమెకథ. ఆమెకు గాలిబ్ ఏకైకప్రియుడుకాడు. ఆ పద్మముమీద మరికొన్ని భృంగములు ఝుంకరించుచున్నవి. కాని గాలిబ్ క్రోధపూరితుడు కాలేదు. ఆయన ప్రేమ ఆవంతయు తగ్గలేదు. ఇది నిరూపమానమైన ఘటన.

ఒరులకొసగలేదె ఉవిద ! నీ యధరమ్ము
నాకు గూడ నోరు లేకపోదు.

అనియు,

ఉవిద గోష్ఠిలోనేనుండ కుండుటమేలు
నన్ను గూర్చిన ప్రస్తావనమ్మె చాలు,

అనియు గాలిబ్ తన హృదయమును ప్రకటించి యున్నాడు. తుదకు.

నాదు చిన్ని గూడు, నా జీవితపుగోడు
నా విషాదగాధ నాదెకాదె !

అని ఆవేదన చెందినాడు. నిజముగా గాలిబ్ జీవితము విషాద గాథ. గాలిబ్ ప్రేమ స్వార్థ రహితమైనది.

"నాకు నిష్కామకర్మ యెంతయు ప్రియమ్ము" అని ఆయ నయే స్వయముగా చెప్పుకొనినాడు. ఆయన ప్రతిపాదించిన ప్రేమ సిద్ధాంతమే మోఇది! ఒకమారుప్రమోదము, మరొకమారువిషాదము, ఒక మారుఆశ ఇంకొకమారు నిరాశ, వేరొకపర్యాయము వేదాంతము గాలిబ్ ప్రేమోపాసనలో గోచరించుచున్నవి. ఈ ప్రేమ తరంగము లన్నియు ఈ కావ్యమున చక్కగా కనుపించుచున్నవి.

మానవ జీవితమును ప్రతిబింబించు గీతములున్నను ఎక్కువగా ప్రేయసికి ప్రేమకు సంబంధించినవే, యీ కావ్య సంపుటములో అనువదించుట జరిగినది-గాలిబ్ కవిత్వములో మానవ జీవితము సమగ్రముగా ప్రదర్శితమైనదని మొదటనే మనవి చేసినాను. కావున ఆయా భాగాలను కూడ మరికొంత విపులముగా అనువదించి ప్రకటించుట సమంజసముగా నుండగలదు. అప్పుడే గాలిబ్ కవిత్వము, వ్యక్తిత్వము తెలుగు సీమకు సంపూర్ణముగా వెల్లడికాగలవు.

(శ్రీ దాశరథి అనువదించిన గాలిబ్ గీతాలకు
1961లో వ్రాసిన పీఠిక.)

# సారస్వత నవనీతము

ఈ శతాబ్దంలో వెలువడిన సాహిత్యాన్ని తరచి కూడబెట్టిన భావ నవనీతాన్ని నేడు గ్రంథ రూపంగా ప్రకటించారు.

ఈ రచయిత పెక్కు సాహిత్య విషయములపై సునిశితమైన కూలంకషమైన విమర్శ కావించారు. ఇందలి ప్రతి వ్యాసమున్నూ వీరి రసజ్ఞతకు ప్రామాణ్యంగా వున్నది.

మొత్తంమీద ఒక శతాబ్దంలోని ఆంధ్ర సాహిత్య పరిణామాన్ని ప్రతిబింబించే ఆదర్శ సమీక్షగా ఈ గ్రంథం ఆంధ్రసారస్వతేయులకు ఆవశ్య పఠనీయమని ఘంటా పథంగా చెప్పవచ్చు.

—కృష్ణాపత్రిక ౧౯౫౫ ఏప్రిల్, ౩౦

ఈ నవనీత మిచ్చే కరగి హృదయమునకు ఓజము కలిగించినది.

— శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు ౨౮-౧౦-౧౯౫౭.

నవనీతము మీ హృదయ సౌకుమార్యమును లోతును ప్రకటించుచున్నది. గుణమును గ్రహించి చెప్పుటయందు మీకు గల పక్షపాతము విమర్శకులు నేడనుకరింపవలసిన విషయము. తెలంగాణమునందు ఇంత గొప్ప తెలుగు జీవితవర్చస్సున్నదని మేమెఱుంగము. దానిని ఇంత సానుభూతితో వెలువరించి మీరు చేసిన యుపకృతి మరువరానిది.

—శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు ౩-౧౨-౧౯౫౬